17-06Pg1exHMNWJQE.qxd:17-06Pg1exHMNWJQE.qxd 1/1/02 6:46 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విశాఖపట్నం
: fb.com/vaartha Digital
Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
17-6-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 137 పేజీలు: 16 వెల: 6.50

## టైమ్స్ మేగజైన్ జాబితాలో క్రికెటర్ స్మృతి మంధాన

**న్యూఢిల్లీ,జూన్ 16:** భారత మహిళా క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని సొంతం చేసుకుంది. ప్రఖ్యాత టైమ్ మ్యాగజైన్ 2026 సంవత్సరానికి గాను ప్రకటించిన క్రీడారంగంలో 100 మంది అత్యంత ప్రభావశీల వ్యక్తుల జాబితాలో ఆమెకు చోటు దక్కింది.

# భారత్‌కు ఆర్థిక శక్తి ఎపి

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఎపిదే పేటెంట్

గ్రీన్ రాజధానిగా అమరావతి అభివృద్ధి

అమరావతిని అడ్రస్‌గా మార్చుకోండి

సింగపూర్ పారిశ్రామికవేత్తలకు సిఎం చంద్రబాబు పిలుపు

సిఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో ప్రసంగించిన సిఎం

మంగళవారం సింగపూర్‌లో సిఐఐ పార్టనర్‌షిప్ సదస్సులో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు. హాజరైన పారిశ్రామికవేత్తలు

**విజయవాడ జూన్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** భూమి, నీరు, మౌలిక వసతులు, అత్యుత్తమ పాలసీలతో పెట్టుబడులకు ఎపి అత్యంత అనుకూల స్థానమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడు అన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఎపిదే పేటెంట్ అని, పెట్టుబడులకు ఎంతో సురక్షితమని స్పష్టం చేశారు. ఈ ఏడాది విశాఖలో తలపెట్టిన పార్టనర్షిప్ సమ్మిట్‌కు సన్నాహకంగా సింగపూర్‌లో సిఐఐ నిర్వహించిన బిజినెస్ రోడ్ షోలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ... 'సింగపూర్‌తో భారత్‌కు, ప్రత్యేకించి ఎపికి మంచి సంబంధాలున్నాయి. సింగపూర్ నిర్మాత లీ క్వాన్ యూ అంటే నాకు చాలా అభిమానం. 3 దశాబ్దాలుగా సింగపూర్‌తో కలిసి పనిచేస్తున్నాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హైదరాబాద్‌లో సింగపూర్ టౌన్‌షిప్‌నే నిర్మించాం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత కొత్త రాజధాని నిర్మాణం కోసం సింగపూర్ మాస్టర్ ప్లాన్ తయారు చేసి ఇచ్చింది. బ్లూ, గ్రీన్ రాజధానిగా ఓ అద్భుతమైన బృహత్ ప్రణాళికను సింగపూర్ రూపొందించి అందించింది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతితో పాటు రాష్ట్రంలోని పట్టణాల అభివృద్ధి తదితర అంశాల్లో సింగపూర్ ప్రభుత్వంతో కలిసిపనిచేస్తున్నాం. పెట్టుబడులకు ఎపి అత్యుత్తమ ప్రాంతం అని స్పష్టం చేస్తున్నా. సింగపూర్ పారిశ్రామికవేత్తలు అమరావతిని, ఆంధ్రప్రదేశ్‌ను రెండోనివాసంగా ఎంచుకోవాలి' అన్నారు.

**స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు**

ఎపిలో పరిశ్రమలకు భూమి కేటాయింపు, అనుమతులను వేగంగా జారీ చేస్తున్నాం. >>2

మంగళవారం ఫ్రాన్స్‌లోని ఎవిఎన్‌లో జి-7 సమ్మిట్ సందర్భంగా కలుసుకున్న ట్రంప్, మోడీ

# చేయిచేయి కలిపిన ట్రంప్, మోడీ

● జి-7 సమ్మిట్‌లో ఉభయుల భేటీ ● 16 నెలల తర్వాత ఇద్దరు అధినేతలు ముఖాముఖి ● నేడు ఇద్దరి మధ్య ద్వైపాక్షిక సమావేశం

**పారిస్, జూన్ 16:** ఫ్రాన్స్‌లోని ఎవియన్‌లో జరుగుతున్న జీ7 సదస్సు సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ మరియు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌లు మంగళవారం పరస్పరం కలుసుకుని మాట్లాడారు. గత 16 నెలల తర్వాత ఈ ఇద్దరునేతలు ముఖాముఖిగా సమావేశమవడం విశేషం. ఇద్దరు నేతలు చివరిసారిగా 2025 ఫిబ్రవరిలో అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలోని వైట్ హౌస్‌లో భేటీ అయ్యారు. ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన అనంతరం జరిగిన ఆ సమావేశం తర్వాత ఇదే తొలి ప్రత్యక్షసమావేశం. జీ7 సదస్సు >>2

మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో డి.సిఎం పవన్ సమావేశమైన దృశ్యం

# గోదావరి పుష్కరాలకు కేంద్రం సహకారం

విబి జి రాం జి ద్వారా పుష్కర పంచాయితీల అభివృద్ధి

మ్యాజిక్ డ్రైయిన్‌ను ప్రశంసించిన కేంద్రమంత్రి, దేశవ్యాప్త అమలుకు ఆసక్తి

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో డి.సిఎం పవన్ భేటీ

**విజయవాడ, జూన్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** గోదావరి పుష్కరాల నిర్వహణ నిమిత్తం ఎంపిక చేసిన 260 మోడల్ పంచాయతీలకు విబి జి రాం జి కార్యక్రమం కింద అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక సహకారం అంది స్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ముందుకు రావడం శుభపరిణామం అని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలను నిర్వహిస్తున్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మంత్రి పవన్ కల్యాణ్‌అన్నారు. విబి జి రాం జి నిధుల కేటాయింపులో రాష్ట్రానికిచ్చిన ప్రాధాన్యతకు కృతజ్ఞతలు తెలిపారు. మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ, మురుగునీటి శుద్ధి తదితర కార్యక్రమాల ద్వారా కాలుష్యరహిత గ్రామాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. కాలుష్యరహిత గోదావరి పుష్కరాల నిర్వహణలో ఇది ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పారదర్శకత, జవాబుదారీతనంతో రాష్ట్ర గ్రామీణా >>2

# జులై మూడోవారంలో మెగా పిటిఎం

మంగళవారం విద్యాశాఖ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి లోకేష్

## 'తల్లికి వందనం' కూడా అప్పుడే..

ప్రభుత్వ బడుల్లో ప్రవేశాల పెంపునకు ప్రత్యేక చర్యలు

రాష్ట్రానికి ఎన్‌సిసి స్టేట్ యూనిట్ మంజూరు

29న 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమం

విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష

**విజయవాడ, జూన్ 16, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం కింద ఆర్థిక సాయం త్వరితగతిన అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో పాఠశాల విద్య, ఉన్నత విద్య అధికారులతో మంత్రి లోకేష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లికి వందనం పథకం, బడిపిలుస్తోంది, షైనింగ్ స్టార్స్, మెగా పిటిఎం, యోగాంధ్ర, టెట్ నిర్వహణ అంశాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల చేరికపై ఈ సందర్భంగా మంత్రి లోకేష్ ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలల్లోకి విద్యార్థుల ప్రవేశాల పెంపుపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి.. తల్లుల ఆధార్ వెరిఫికేషన్ ప్రక్రియ త్వరలోనే పూర్తవుతుందని, జులై 3వ >>2

# కోట్లల్లో టోకరా

## చీరాలలో భారీ గోల్డ్ స్కాం

ప్రజలను నట్టేట ముంచిన బంగారం వ్యాపారి

**చీరాల టౌన్, జూన్ 16, ప్రభాతవార్త:** చీరాల పట్టణంలో సంచలనం సృష్టించిన భారీ మోసం వెలుగులోకి వచ్చింది. స్థానిక బ్రహ్మంగారి చెట్టు వద్ద నగల వ్యాపారం నిర్వహిస్తున్న బిట్రా రాఘవేంద్రరావు అనే వ్యాపారి కోట్ల రూపాయల విలువైన బంగారం, నగదు సేకరించి రాత్రికి రాత్రే పరారైన ఘటన బాధితులను కన్నీటి పర్యంతం చేస్తోంది. యేళ్లుగా నమ్మకంగా వ్యాపారం చేస్తూ వచ్చిన బిట్రా రాఘవేంద్రరావు, కష్టమర్ల విశ్వసాన్ని ఆసరాగా చేసుకుని భారీ ఎత్తున డబ్బులు, బంగారం సేకరించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు బంగారు నగలు తయారు చేయించుకోవడానికి తమ వద్ద ఉన్న బంగారాన్ని అప్పగించగా, మరికొందరు కొత్త నగల కోసం లక్షల రూపాయలు ముందస్తుగా చెల్లించినట్లు బాధితులు వాపోతున్నారు. అయితే 4 రోజు >>2

# ఎపి రైల్వేకు 10,144 కోట్లు

- కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి

**విజయవాడ, జూన్ 16 (ప్రభాతవార్త):** దేశంలో రైల్వే రంగం విప్లవాత్మక మార్పులను చవి చూస్తోందని, వికసిత భారత్ లక్ష్య సాధనలో రైల్వేలు కీలక శక్తిగా మారాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. మంగళవారం విజయవాడలో సుడిగాలి పర్యటన జరిపి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి ప్రహ్లాద్ జోషి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరిలతో కలిసి విజయవాడ సమీపంలోని రాయనపాడు శాటిలైట్ రైల్వే స్టేషన్‌ను సందర్శించిస్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధికి 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.10,144 కోట్లను కేటాయించినట్లుఈ సందర్భంగా కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషి వెల్లడించారు. రాష్ట్రంలో కొత్త రైల్వే లైన్లు, స్టేషన్‌ల ఆధునికీకరణ, ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదల, సరుకు రవాణా సామర్థ్యాల పెంపు వంటి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. అమరావతిని దేశ ప్రధాన నగరాలతో అను సంధానం చేస్తామని, ఇందులో భాగంగా అమరావతికి కొత్త రైల్వే లైను మంజూరు చేసి నిధులు విడుదల చేసినట్లు చెప్పారు. రాయనపాడు శాటిలైట్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.35 >>2

మంగళవారం ఏలూరులో మాట్లాడుతున్న మంత్రి నాదెళ్ల

# రూ. 400 కోట్లతో డయాఫ్రం వాల్

పుష్కరాలకు ముందే పోలవరం పూర్తి: మంత్రులు నాదెండ్ల, పార్థసారథి

**ఏలూరు, జూన్, 16 : ప్రభాతవార్త:** రైతాంగ సంక్షేమమే కూటమి ప్రభుత్వ మొదటి ప్రాధాన్యతని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. స్థానిక ఇండోర్ స్టేడియంలో మంగళవారం రెండేళ్ల నమ్మకం.. అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగింది. రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధితో కలిసి జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు, డా. కామినేని శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, ప్రభృతులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ దేశానికీ వెన్నుముకఐన రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతను ఇస్తున్నదన్నారు. విత్తనం నాటిన దగ్గరనుండి పండిన పంటకు గిట్టుబాటు దార కల్పించే వరకు రైతుకు అన్ని విధాలా తమ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. గత ప్రభుత్వం చివరిలో 4.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని, 6.30 లక్షల మంది రైతుల నుండి 9132 కోట్ల రూపాయల ధాన్యాన్ని కొనుగోలు చేస్తే, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యవసాయ సీజన్లో కూటమి ప్రభుత్వం 7. 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 10.27 లక్షల మంది రైతుల నుండి కొనుగోలు చేసి 17వేల 455 కోట్ల రూపాయలను రైతులకు చెల్లించామన్నారు. గత ప్రభుత్వం రైతులను మోసం చేసి 6 నెలలలకు పైగా బకాయిలు పెట్టిన ధాన్యం కొనుగోలు సొమ్ము 1674 కోట్ల రూపాయలను, నెల రోజుల్లోనే రైతుల ఖాతాలకు జమచేసి చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటలలోగా రైతుల ఖాతాలకు సొమ్మును జమచేస్తున్నామని మంత్రి చెప్పారు. టిడిపి ప్రభుత్వంలో పోలవరం ప్రాజెక్టు 70 శాతం పూర్తిచేస్తే, గత ప్రభుత్వం 10 శాతం కూడా పూర్తి చేయలేదని అన్నారు. వీళ్ళు నిర్వాహం వలన రూ 400 కోట్లు విలువచేసే డయాఫ్రమ్ వాల్ డామేజీ అయినను పట్టించు కోలేదని, కూటమి ప్రభుత్వం రాగానే ప్రపంచ నిపుణులను రప్పించి మరలా రూ 400 కోట్లు వెచ్చించి డయాఫ్రమ్ వాల్ ను నిర్మించామని అన్నారు. వచ్చే సంవత్సరం గోదావరి పుష్కరాలకు ముందుగానే పోలవరం పూర్తి చేస్తామని అన్నారు. కూటమి ప్రభుత్వం గత రెండేళ్ల కాలంలో ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధి లక్ష్యాలుతో అనేక కీలక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసిందని తెలిపారు.

మంగళవారం బ్రాటిస్లావాలో స్లోవేకియా అత్యున్నత పురస్కారం ది ఆర్డర్ ఆఫ్ ది వైట్ డబుల్ క్రాస్‌ను ప్రధాని మోడీకి ప్రదానం చేస్తున్న స్లోవేకియా అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రిని

# ప్రధాని మోడీకి స్లోవేకియా అత్యున్నత పురస్కారం

**బ్రాటిస్లావా, జూన్ 16:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీని మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పురస్కారం వరించింది.భారత ప్రధానికి స్లోవేకియా దేశ అత్యున్నత జాతీయ పురస్కారమైన ది ఆర్డర్ ఆఫ్ ది వైట్ డబుల్ క్రాస్ (ఫస్ట్ క్లాస్)ను ప్రదానం చేశారు. బ్రాటిస్లావాలో జరిగిన ఒక కార్యక్రమంలో స్లోవేకియా అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రిని ఈ అవార్డును మోదీకి అందజేశారు. ప్రధాని మోదీ అందుకున్న 33వ అంతర్జాతీయ పురస్కారంఇది. ఈ గౌరవంపై ప్రధాని మోడీ స్పందిస్తూ ఈ పురస్కారం 140 కోట్ల మంది భారతీయులకు చెందిందని అన్నారు. ఈ సాయంత్రం ది ఆర్డర్ ఆఫ్ ది వైట్ డబుల్ క్రాస్ అందుకోవడం గౌరవంగా ఉంది. ఈ గౌరవానికి స్లోవేకియా ప్రజలకు, ప్రభుత్వానికి నా కృతజ్ఞతలు. భారత్, స్లోవేకియా మధ్య శాశ్వత స్నేహానికి ఈ అవార్డును అంకితం చేస్తున్నానని ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ది ఆర్డర్ ఆఫ్ ది వైట్ డబుల్ క్రాస్ అనేది విదేశీ పౌరులకు మాత్రమే స్లోవేకియా ప్రభుత్వం అందించే అత్యున్నత పౌర, సైనిక పురస్కారం. యూరప్ పర్యటనలో భాగంగా మోడీ స్లోవేకియాలో పర్యటిస్తున్నారు. ఒక భారతప్రధాని ఈ దేశాన్ని సందర్శించడం ఇదే మొదటిసారి. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య వలసలు, డిజిటల్ టెక్నాలజీ, రక్షణ వంటి రంగాల్లో సహకారాన్ని విస్తరించేందుకు 11ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. రెండు దేశాల మధ్య సంబంధాలను సమగ్ర భాగస్వామ్య స్థాయికి పెంచినట్టు అధికారులు తెలిపారు.

# 'నీట్' ముగిసేదాకా 'టెలిగ్రామ్'పై బ్యాన్

**న్యూఢిల్లీ,జూన్ 16:** కేంద్ర సర్కారు కీలక నిర్ణయం తీసుకున్నది. నీట్ రీఎగ్జామ్ నేపథ్యంలో టెలిగ్రాంయాప్‌ను ఇండియా బ్లాక్ చేసింది. ఈనెల 22వ తేదీ వరకు టెలిగ్రాం యాప్ అందుబాటులో ఉండదు. ఈనెల 21వ తేదీన దేశవ్యాప్తంగా నీట్ రీఎగ్జామ్‌ను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇక జూన్ 30వ తేదీ వరకు టెలిగ్రాం యాప్‌లో ఉన్న మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను కూడా ప్రభుత్వం డిజైబుల్ చేసింది. ఎగ్జామ్ మెటీరియల్‌ను లీకేజీ చేయకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ చర్యలకు చేపట్టింది. మెసేజింగ్ ఫ్లాట్‌ఫామ్‌కు చెందిన యాప్‌ను తక్షణమే బ్లాక్ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.
నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఇచ్చిన మార్గదర్శకాల ఆధారంగా ఈ చర్య చేపట్టారు. కేవలం ఎగ్జామినేషన్ పీరియడ్‌ను దృష్టిలో పెట్టుకుని ఆ యాప్‌ను రద్దు చేశారు. పేపర్ లీక్ ఘటనలను తగ్గించేందుకు ఎడిటింగ్ ఫీచర్లను డిజైబుల్ చేశారు. గతంలో పోస్టు చేసిన మెసేజ్‌లను ఎడిట్ చేసే ఆప్షన్ ప్రస్తుతం 30వ తేదీ వరకు బ్లాక్ చేశారు. పేపర్ లీకేజీలకు పాల్పడుతున్న చీటింగ్ ముఠాలు టెలిగ్రాం యాప్‌ను విరివిగా వాడుతున్నట్లు ప్రభుత్వం గుర్తిం చింది. నీట్ పరీక్షరాస్తున్న అభ్యర్థులను ఆ చీటింగ్ ముఠా టార్గెట్ చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించింది. పేపర్ లీకేలకు చెందిన అనేక ఛానళ్లను, గ్రూపులను ఇప్పటికే ప్రభుత్వం తొలగించింది.

# కోట్లల్లో టోకరా

>> లుగా వ్యాపారి కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన కస్టమర్లు అతని ఇంటికి వెళ్లగా, ఇంటిని పూర్తిగా ఖాళీ చేసి కుటుంబంతో సహా పరారైనట్లుగుర్తించారు. దీంతో ఒక్క సారిగా మోసపోయినట్లు గ్రహించిన బాధితులు షాక్‌కు గురయ్యారు. బాధితుల కథనాల ప్రకారం, ఈ వ్యవహారం ముందస్తు ప్రణాళికతోనే జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నమ్మకాన్ని పెట్టుబడిగా మార్చుకున్న వ్యాపారి, కస్టమర్ల కళ్లల్లో కారం చల్లి కోట్ల రూపాయల విలువైన బంగారం, నగదుతో ఉడాయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం బాధితులు ఒక్కొక్కరుగా పోలీసులను ఆశ్రయిస్తూ ఫిర్యాదులు నమోదు చేస్తున్నారు. మోసపోయిన వారిసంఖ్య, నష్టపోయిన మొత్తం రోజు రోజుకు పెరుగుతున్నట్లు సమాచారం. కొందరు జీవితకాల పొదుపులను కోల్పోగా, మరికొందరు పెళ్లిళ్లు, శుభకార్యాల కోసం దాచుకున్న బంగారాన్ని అప్పగించి ఇప్పుడు ఆందోళనలో మునిగిపోయారు. బాధితులు ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, పారారీలో ఉన్న వ్యాపారిని వెంటనే అరెస్టు చేసి తమ సొమ్ము, బంగారం తిరిగి ఇప్పించాలని ప్రభుత్వాన్ని, పోలీసు అధికారులను వేడుకుంటున్నారు.

# ఎపి రైల్వేకు 10,144 కోట్లు

>> కోట్లను ఖర్చు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తూ రైల్వే మౌలిక వసతులను దేశవ్యాప్తంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. గత 12 సంవత్సరాలుగా ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని పేర్కొన్నారు. దేశంలో ప్రస్తుతం 1.05 లక్షల కిలోమీటర్లకు పైగా రైల్వే నెట్‌వర్క్‌ఉందని, దీనిని పూర్తిస్థాయిలో విద్యుదీకరించే కార్యక్రమం వేగంగాసాగుతోందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. విద్యుదీకరణ చేపట్టకపోతే దేశం లక్షల కోట్ల లీటర్ల డీజిల్ దిగుమతులపై ఆధారపడాల్సి వచ్చేదని తెలిపారు. పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెంచుతూ సౌరశక్తిని సమర్థవంతంగా వినియోగించడంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు.

# నీట్ రాసే విద్యార్థిని,విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

**విజయవాడ, జూన్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** జూన్ 21న దేశవ్యాప్తంగా జరగబోయే నీట్ రీఎగ్జామినేషన్ జరగబోతోంది. ఈ నేపథ్యంలో ఈ పరీక్ష రాస్తున్న ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఎగ్జామ్ సెంటర్ల దూరభారం, ప్రయాణ ఖర్చులతో టెన్షన్ పడుతున్న విద్యార్థులకు ఊరటనిస్తూ ఎపిఎస్‌ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పిస్తూ కీలక నిర్ణయం తీసు కుంది. నీట్ పరీక్షకు వెళ్లే విద్యార్దులకు టికెట్ ఫ్రీ సౌకర్యం కల్పించింది.హాల్ టికెట్ ఉంటేచాలు బస్సులో ఉచితంగా వెళ్ళ వచ్చు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు బస్సు కండక్టర్‌కు తమ నీట్ హాల్ టికెట్ చూపిస్తే సరిపోతుంది. రద్దీ రూట్లలో స్పెషల్ బస్సులు ఏర్పాటు చేసింది.

# భారత్‌కు ఆర్థిక శక్తి ఎపి

>> ప్రపంచ దిగ్గజ స్టీల్ కంపెనీ అయిన ఆర్సెలార్ మిట్టల్‌కు అనతికాలంలోనే అన్ని అనుమతులు వేగంగా ఇచ్చాం. 2028 నాటికి ఆర్సెలార్ మిట్టల్ ఉత్పత్తి కూడా ప్రారంభించి ఎపి నుంచి ఎగుమతులు చేస్తుంది. గూగుల్ క్లౌడ్ ఎఐ డేటా హబ్ కూడా ఏర్పాటు అవుతోంది. ఆ సంస్థకు గ్రీన్ ఎనర్జీని సరఫరా చేయాలని నిర్ణయించాం. పెట్టుబడులు వచ్చిన మరుక్షణం నుంచే పరిశ్రమలు ప్రారంభించేలా ఓ నిర్దిష్టమైన కాలవ్యవధిని నిర్ణయిస్తున్నాం. గూగుల్‌తో పాటు దాదాపు 10 గిగావాట్ల సామర్థ్యం ఉన్న డేటా సెంటర్లను వివిధ కంపెనీలు ఏర్పాటు చేయబోతున్నాయి. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కూడా రూ.7 వేల కోట్లతో శ్రీసిటీలో గృహోపకరణాల తయారీ యూనిట్‌ను ప్రారంభించనుంది. నైపుణ్యం ఉన్న మానవ వనరులను తయారు చేసేందుకు ఆపరేషనల్ స్కిల్ యూనివర్సిటీని కూడా ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా టెక్నాలజీ విస్తృతి పెరిగింది. దీని ఆధారంగానే నిర్ణయాలు ఉంటున్నాయి. ఏపీలోనూ అదే తరహాలో డేటా డ్రివెన్ నిర్ణయాలను తీసుకుని పౌరసేవల్ని అందిస్తున్నామని అన్నారు.

**గ్లోబల్ నగరాలకు ఎపి కనెక్టివిటీ**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి ఒక్కరినీ వ్యాపారవేత్తలుగా మార్చేందుకు వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ అనే విధానం తెచ్చాం. అలాగే ఎంఎస్ఎంఈ సహా వివిధ పరిశ్రమల్లో తయారయ్యే ఉత్పత్తుల నాణ్యతపై కూడా దృష్టి పెట్టాం. రియల్ టైమ్ గవర్నెన్సు ద్వారా ఎక్కడా జాప్యం లేకుండా అనుమతులు వేగంగా వచ్చేలా చూస్తున్నాం. ఏపీకి ఉన్న వెయ్యి కిలోమీటర్లకు పైగా తీర ప్రాంతంలో 6 ఆపరేషనల్ పోర్టులు ఉన్నాయి. ఈ పోర్టులను దేశంలోని వివిధ ప్రాంతాలకు, విదేశీ పోర్టులకు కనెక్టు చేసేలా ప్రయత్నాలు చేస్తున్నాం. 7 ఆపరేషనల్ ఎయిర్ పోర్టులు ఎపిలో ఉన్నాయి. భోగాపురం లాంటి అంతర్జాతీయ విమానాశ్రయంతో గ్లోబల్ నగరాలకు కనెక్టివిటీ ఏర్పడుతుంది. లాజిస్టిక్స్, అగ్రికల్చర్, సివిల్ ఏవియేషన్, ఎనర్జీ లాంటి వివిధ అంశాల్లో ఫంక్షనల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తున్నాం. ఎపిలో ఉన్న పోర్టులను దేశంలోని ఇతర ప్రాంతాలు అనుసంధానించేలా రహదారి, రైల్ నెట్వర్క్‌ను కూడా పెద్ద ఎత్తున నిర్మిస్తున్నాం. ఎలక్ట్రానిక్స్, స్పేస్, ఏరోస్పేస్, డ్రోన్, డిఫెన్స్ క్లస్టర్లతో పాటు రాష్ట్రంలోని 175 చోట్ల నియోజకవర్గ ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. ఈ పారిశ్రామిక పార్కులకు నీరు, విద్యుత్ లాంటి మౌలిక సదుపాయాలు కూడా సిద్ధంగా ఉన్నాయి. రాయలసీమలోని పుట్టపర్తి వద్ద 5వ తరం ఫైటర్ జెట్ తయారీ, టెస్టింగ్ ఫెసిలిటీ కూడా వస్తోంది. ఇవిల వినియోగం పెంచటం ద్వారా కాలుష్యాన్ని తగ్గించేలా ప్రయత్నాలు చేస్తున్నాం అని ముఖ్యమంత్రి అన్నారు.

**నాలెడ్జ్ హబ్‌గా అమరావతి**

అమరావతిని ఎడ్యుకేషన్, నాలెడ్జ్ హబ్‌గా తయారు చేయటంతో పాటు దేశంలోని ప్రధాన నగరాలను కనెక్ట్ చేస్తాం. హైస్పీడ్ రైల్ నెట్వర్క్ కూడా అమరావతిని హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై లాంటి నగరాలను కనెక్టు చేస్తుంది. అమరావతిలోనే ఐబిఎం, టిసిఎస్, ఎల్ అండ్ టీ సంస్థలు 133 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ ను ఏర్పాటు చేస్తున్నాయి. ఈ ఏడాది డిసెంబరు నాటికల్లా క్వాంటం అమరావతిలో కంప్యూటర్ పనిచేయటం ప్రారంభిస్తుంది. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఆవిష్కరణల్ని, స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నాం. ప్రాజెక్టులు పెట్టే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా మా ప్రభుత్వం సహకారం అందిస్తుంది. త్వరలోనే విశాఖ సమీపంలో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది. ఎపిలో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు కూడా ఉన్నాయి. దేవాలయాలు, పర్యాటక, బుద్దిస్ట్ సర్క్యూట్‌లు ఉన్నాయి. అక్వా, వ్యవసాయం, హార్టికల్చర్‌లో ఎపి అగ్రస్థానంలో ఉంది. పెద్ద ఎత్తున ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు అవకాశం ఉంది. పెద్దఎత్తున ప్రకృతి సేద్యం ద్వారా వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను పండిస్తున్నాం. ఎపికి వచ్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను పరీక్షించి అప్పుడు పెట్టుబడులు పెట్టాలని పిలుపునిస్తున్నాను. పెట్టుబడులు పెట్టడానికి ఇది సువర్ణ అవకాశం. ఇండియా గ్రోత్ స్టోరీలో భాగస్వాములు కావాలని కోరుతున్నాన్న అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మంత్రి పి.నారాయణ, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఇడిబి సిఇఒ షన్మోహన్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ ఇండియా పోలీసు క్రీడల్లో ఎపి పోలీసులకు పతకాల పంట

## వెయిట్‌లిఫ్టింగ్ క్లస్టర్, బ్యాడ్మింటన్ క్లస్టర్, పోలీస్ డ్యూటీ మీట్, జూడో క్లస్టర్లో పతకాలు

**విజయవాడ, జూన్ 16, ప్రభాతవార్తప్రతినిధి:** జాతీయ స్థాయిలో నిర్వహించిన ఆల్ ఇండియా పోలీసు క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ పోలీసు క్రీడాకారులు విశేష ప్రతిభ కనబర్చి రాష్ట్ర ఖ్యాతిని మరోసారి దేశవ్యాప్తంగా చాటారు. బ్యాడ్మింటన్ క్లస్టర్, వెయిట్‌లిఫ్టింగ్ క్లస్టర్, జూడో క్లస్టర్, పోలీస్ డ్యూటీ మీట్‌లో మొత్తం 39 పతకాలు సాధించి పోలీసు శాఖకు గర్వకారణంగా నిలిచారు.

**పోలీసు వెయిట్‌లిఫ్టింగ్ క్లస్టర్ 2026- 27:** హర్యానా పోలీసు ఆధ్వర్యంలో హర్యానా రాష్ట్రం మధుబన్‌లో మే 23 నుంచి 27 వరకు నిర్వహించిన 3వ ఆల్ ఇండియా పోలీసు వెయిట్‌లిఫ్టింగ్ క్లస్టర్202627 (యోగ, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్) పోటీల్లో ఏపీ పోలీసు క్రీడాకారులు 4 స్వర్ణ, 12 రజత, 1 కాంస్య పతకంతో మొత్తం 17 పతకాలు సాధించి సత్తా చాటారు. పైన సాధించిన పతకాలన్నీ యోగా విభాగంలో లబించాయి,

**పోలీసు బ్యాడ్మింటన్ క్లస్టర్2025- 26:** ఉత్తరప్రదేశ్ పోలీసు ఆధ్వర్యంలో లక్నోలో మే నెల 9 నుంచి 13 వరకు నిర్వహించిన 2వ ఆల్ ఇండియా పోలీసు బ్యాడ్మింటన్ క్లస్టర్2025- 26 (బాడ్మింటన్ + టేబుల్ టెన్నిస్) పోటీల్లో ఏపీ పోలీసు జట్టు 2 స్వర్ణ, 2 రజత, 6 కాంస్య పతకాలతో మొత్తం 10 పతకాలు కైవసం చేసుకుంది. (టేబుల్ టెన్నిస్ లో 4 కాంస్య పతకాలు... బ్యాడ్మింటన్ లో రెండు బంగారు, రెండు రజిత, రెండు కాంస్య పతకాలను మొత్తం 10 పతకాలు) దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొన్న ప్రతిభావంతులైన క్రీడాకారుల మధ్య జరిగిన ఈ పోటీల్లో ఎపి జట్టు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి పతకాలను సాధించింది. జాతీయ స్థాయి పోలీసు డ్యూటీ మీట్ 2025 -26.... మార్చి 29, 2026 నుండి ఏప్రిల్ 3, 2026 వరకు నాగపూర్ లో జరిగిన జాతీయస్థాయి పోలీసు డ్యూటీ మీట్ లో 4 రజిత పతకాలు సాధించారు.

**జూడో క్లస్టర్ 2025- 26:** అక్టోబర్ 8, 2025 నుంచి 16 అక్టోబర్ 2025 వరకు జమ్మూ కాశ్మీర్ లో జరిగిన జూడో క్లస్టర్ లో (తైక్వాండో, కరాటే, పెన్కాక్సిలాట్) 2 బంగారు, 2 రజిత, 4 కాంస్య పతకాలను సాధించి ఏపీ పోలీసులు రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు ఈ విజయాల నేపథ్యంలో పతక విజేతలు మంగళవారం మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ పోలీసు ప్రధాన కార్యాలయంలో డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీజీపీ హరీష్ కుమార్ గుప్తా క్రీడాకారులను అభినందించారు. జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ పోలీసు ప్రతిష్ఠను ఇనుమడింపజేసినందుకు ప్రశంసించారు.క్రీడా స్ఫూర్తితో భవిష్యత్తులో జరిగే జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ఎపిపిఇసెట్ 2026 ఫలితాలు విడుదల

**విజయవాడ,జూన్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎపిపిఇసెట్2026) ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ఈ ఫలితాలను మంగళవారం ప్రకటించారు. ఈ ఏడాది పిఇసెట్‌లో మొత్తం 89.76 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఆయన తెలిపారు.ఫలితాల వివరాల్లోకి వెళితే, పిఇసెట్2026 కోసం మొత్తం 4,037 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, 2,958 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 2,655 మంది అర్హత సాధించారు. అర్హత సాధించిన వారిలో పురుషులు అధికంగా ఉన్నారు. పరీక్షకు హాజరైన పురుషుల్లో 92.91 శాతం (1,993 మంది) ఉత్తీర్ణులు కాగా, మహిళల్లో 81.43 శాతం (662 మంది) ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ, ఫిజికల్ ఎడ్యుకేషన్, క్రీడల రంగంలో కెరీర్‌ను ఎంచుకునే దిశగా ముందడుగు వేసిన అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. వారి భవిష్యత్ ప్రయత్నాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అభ్యర్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. ర్యాంక్ కార్డులను కూడా ఇదే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అదనంగా, 'మన మిత్ర' వాట్సాప్ నంబర్ 9552300009 ద్వారా కూడా ఫలితాలను తెలుసుకునే సౌకర్యాన్ని కల్పించారు.

# బాలల సంక్షేమం, ఆరోగ్య సేవలపై ప్రత్యేక దృష్టి

## ఎపిఎస్సిపిసిఆర్ చైర్‌పర్సన్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూన్ 16,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కులపరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ వేటుకూరి ఏవీఎస్ సూర్యనారాయణ రాజు డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించి అమలాపురంలోని పలు ప్రభుత్వ, సంక్షేమ, ఆరోగ్య సంస్థలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి, స్కానింగ్ కేంద్రాలు, శిశు గృహం, వన్ స్టాప్ సెంటర్, ఆనంద నిలయం ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్‌లలో అందుతున్న సేవలను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. బాలలు, మహిళలకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు బాలల హక్కుల పరిరక్షణ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.

# రొయ్యల ఫీడ్ ధరల పెంపును నిలిపివేసిన కూటమి ప్రభుత్వం

**విజయవాడ,జూన్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వం రొయ్యల ఫీడ్ ధరల పెంపును నిలిపివేసింది. ఫీడ్ ధరల నియంత్రణకు ప్రత్యేక రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ సిఫార్సు మేరకు ఇకపై ఫీడ్ ధరల నిర్ణయం ఉంటుందన్నారు. జోన్, నాన్‌జోన్, 10 ఎకరాల పరిమితి నిబంధనలు తొలగించినట్లు వివరించారు. రైతులు, ఫీడ్ తయారీదారులతో 6 గంటలపాటు సుదీర్ఘ సమావేశం నిర్వహించగా, రొయ్యల ఫీడ్‌ధరలు పెంచితే ఊరుకోబోమని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. సోయాబీన్, ఫిష్ ఆయిల్ ధరలు పెరిగిన మాట వాస్తవమే అయినప్పటికీ ముడి పదార్థాల ధరల భారం రైతులపై మోపడానికి వీల్లేదన్నారు.

## వారం - వర్జ్యం

17-06-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, మృగశిర కార్తె
తదియ రా.9.43, పునర్వసు మ.1.41,
వర్జ్యం : రా.2.58-తె.4.24,
దు. ఉ.8.11-ఉ.9.03, 2)రా.11.56-రా.12.48
శుభసమయం : ఉ.7.00-8.00
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** యోగాక్షేమాల పట్ల అధిక శ్రద్ధ కనబరుస్తారు. తద్వారా లాభపడతారు. ప్రయాణాలు లభిస్తాయి. వస్త్రాలు కొనుగోలు.

**వృషభం:** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఆస్తి వివాదాలు పరిష్కరించుకుంటారు.

**మిథునం:** పొదుపు పథకాలలో వైఫల్యం చెందకుండా జాగ్రత్తలు పాటించండి. అప్రయత్నంగా కార్యక్రమాలు పూర్తికాగలవు.

**కర్కాటకం :** చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. దూరప్రాంతాల నుండి శుభ వర్తమానాలు అందుకుంటారు.

**సింహం:** నిర్మాణాత్మక, వ్యూహాత్మక విషయ వ్యవహారాలలో ఆచి తూచి నిర్ణయాలు తీసుకోండి.వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**కన్య :** ఏదయినా ఒక అద్భుత కార్యక్రమం చేసి నలుగురిలో అఖండ ఖ్యాతిని ఆర్జించాలనే కోరిక బలపడుతుంది.

**తుల :** కళారంగాల వారికి సన్మాన, సత్కారాలు పొందుతారు. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. ఆస్తి లాభం.

**వృశ్చికం:** సంతానం పేరు మీద స్థిరాస్తులు బదిలీ చేయడం లేక కొనుగోలు చేయడం జరుగుతుంది. విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**ధనుస్సు:** కార్యాలయంలో మీ ప్రతిపాదనలను అందరూ ఏకగ్రీవం ఆమోదిస్తారు. శ్రమ తగిన ప్రతిఫలాలు అందుకుంటారు.

**మకరం:** ఈ రోజు తనఖాలో ఉన్న వస్తువులను విడిపించుకుంటారు. ఆర్థికంగా ఎటువంటి ఒడిదుడుకులు ఉండవు.

**కుంభం:** ఆహారపు అలవాట్లలో కొద్దిపాటి మార్పు చేస్తారు. అహంభావం ధోరణి విడనాడడం వలన లాభపడతారు.

**మీనం :** కృత్రిమముగా, ప్రభుత్వ సంబంధమైన ఇబ్బందులు రావచ్చును. శుభవార్తలు అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

మంగళవారం సింగపూర్‌లో సిఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో సాంకేతిక పరికరాలను తిలకిస్తున్న సిఎం చంద్రబాబు

# మూడోవారంలో మెగా పిటిఎం

>> వారంలో పథకం అమలుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వివరించారు. జూన్ 29న షైనింగ్ స్టార్స్ కార్యక్రమం, జులై మూడో వారంలో మెగా పీటీఎం నిర్వహణకు సమావేశంలో నిర్ణయించారు. మిగులు ఉపాధ్యాయుల పని సర్దుబాటుపైనా సమావేశంలో చర్చించారు.

**ఉన్నత విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష**

రాష్ట్రంలో ఎప్ సెట్, పాలిసెట్, ఆర్ సెట్ వంటి 12రకాల కామన్ ఎంట్రన్స్ టెస్టలకు ఎటువంటి జాప్యం లేకుండా సాధ్యమైనంత త్వరగా నోటిఫికేషన్లు విడుదల చేసి, నిర్ణీత సమయంలో అడ్మిషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే సెట్స్, పొరుగు రాష్ట్రాల కామన్ ఎంట్రన్స్ టెస్టల తేదీలను కూడా గమనంలోకి తీసుకొని విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా రాష్ట్రంలోని వివిధ సెట్‌ల తేదీలను ఖరారు చేయాలని అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్ల పెంపును పరిశీలించాలని సూచించారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో మెకానికల్, సివిల్ విభాగాల సీట్లకు డిమాండ్ ఉందని అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. రాష్ట్రంలో ఇంజనీరింగ్‌కు సంబంధించి 254 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 1.88లక్షల సీట్ల భర్తీకిగాను ఎప్ సెట్ నోటిఫికేషన్‌కు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో యూనివర్సిటీల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్న థాపర్ ఇనిస్టిట్యూట్, జేమ్స్‌కుక్ యూనివర్సిటీ, మెల్ బోర్న్ యూనివర్సిటీ, మేధావి స్కిల్ యూనివర్సిటీ, జెఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ వంటి జాతీయ, అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలతో చర్చల పురోగతిపై మంత్రి సమీక్షి ంచారు. జిఎంఆర్ మాన్సాస్ ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటును వేగవంతం చేయాల్సిందిగా మంత్రి లోకేష్ ఆదేశించారు. రాష్ట్రంలో ఎన్‌సిసి కార్యకలాపాలు, శిక్షణ, క్యాంపులు సమన్వయం చేయడానికి ఎన్‌సిసి స్టేట్ డైరెక్టరేట్‌ను మంజూరు చేసిన కేంద్రప్రభుత్వానికి మంత్రి లోకేష్ ధన్యవాదాలు తెలిపారు. దేశంలో ఎన్‌సిసి వ్యవస్థను బలోపేతం చేయడానికి, ఆంధ్రప్రదేశ్ యువతకు మరింత సైనిక శిక్షణ, ప్రోత్సాహం అందించడానికి ఈ ప్రత్యేక కేంద్రం ఉపకరించగలదని అన్నారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి జె.శ్యామలరావు, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా, ఉన్నతవిద్య కమిషనర్ నారాయణ్ భరత్ గుప్తా, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# పుష్కరాలకు కేంద్రం సహకారం

>> భివృద్ధి శాఖలో అమలు చేస్తున్న కార్యక్రమాలను పవన్ కల్యాణ్ కేంద్ర మంత్రివర్యులకు వివరించారు. అనంతరం మీడియాతో పవన్ మాట్లాడుతూ 'విబి జి రాం జి కార్యక్రమం కింద ఆంధ్రప్రదేశ్‌కు దేశంలో మూడవ అత్యధిక నిధుల కేటాయింపు కేంద్ర ప్రభుత్వ సహకారానికి నిదర్శనం. ఆంధ్రప్రదేశ్ అన్ని విధాల అభివృద్ధి చెందడానికి గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం చూపుతున్న చొరవ ఎనలేనిది. రాష్ట్రానికి అత్యధిక నిధులు కేటాయించడంలో తమ వంతు సహాయ సహకారాలు అందించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రితో సమావేశం అయ్యి రాష్ట్రం తరఫున కృతజ్ఞతలు తెలియజేశాం. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, జీవనోపాధి అకాశాలు మెరుగుపర్చేందుకు, సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను మరింత బలోపేతం చేసేందుకు ఈ నిధులు ఉపయోగపడతాయి. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై కేంద్ర మంత్రివర్యులతో సుదీర్ఘంగా చర్చించాం. ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధి రంగంలో ఆంధ్రప్రదేశ్ సాధించిన విజయాలను శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రశంసించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతుగా అమలు చేయడంలో రాష్ట్రం చూపుతున్న నిబద్ధతను కేంద్ర మంత్రి అభినందించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలు, సోషల్ ఆడిట్ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయడం తదితర అంశాల్లో ఆంధ్రప్రదేశ్ జాతీయ స్థాయిలో ఆదర్శంగా నిలిచింది. ఈ విజయాల కారణంగానే 2026 జూలై 1న నిర్వహించనున్నవిబి జి రాం జి ప్రారంభోత్సవ కార్యక్రమానికి, జాతీయ గ్రామ వికాస్ సమ్మేళనం నిర్వహణకు ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో వేసవి కాలంలో పశువులకు తాగునీటి కొరత తలెత్తకుండా చేపట్టిన నీటి తొట్టెల నిర్మాణాన్ని కేంద్ర మంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు.
పెదపెంకి గ్రామంలో అమలు చేసిన మ్యాజిక్ డ్రెయిన్స్ కార్యక్రమం విజయవంతం అయిన విషయాన్ని వివరించాం. ఈ కార్యక్రమం ద్వారా పారిశుధ్యం, గ్రామీణ జీవన ప్రమాణాల మెరుగుదలలో సాధించిన ఫలితాల పట్ల కేంద్రవర్యులు ఆకర్షితులయ్యారు. ఈ నమూనాను మధ్యప్రదేశ్ లోని తన పార్లమెంటరీ నియోజకవర్గంలో అమలు చేయడానికి ఆసక్తిని వ్యక్తం చేశారు. గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం సిద్ధం చేస్తున్న 260 మోడల్ పంచాయతీల అభివృద్ధికి విబి జి రాం జి కార్యక్రమం కింద ప్రత్యేక సహకారం అందించాలని కోరగా చౌహాన్ సుముఖత వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధికి నిరంతర ప్రోత్సాహం అందిస్తున్న శివరాజ్ సింగ్ చౌహాన్ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. కేంద్ర సంకల్పంతో గ్రామీణ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు.
గ్రామీణాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ సాధించిన విజయాలను కేంద్ర మంత్రి శివ రాజ్ సింగ్ చౌహాన్ ప్రస్తావించి ప్రత్యేక అభినందించినట్టు తెలిపారు. జులై 1న కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం వికసిత్ భారత్ - గ్రామ గౌరవ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ వేదికగా మొదలు పెట్టాలని కేంద్రం నిర్ణయించడం ఎంతో సంతోషాన్నిచ్చిందని అన్నారు.

# కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌తో పవన్ భేటీ

**విజయవాడ, జూన్ 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఢిల్లీ పర్యటనలో బిజీగా ఉన్నారు. మంగళవారం ఆయన కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలోని మంచినీటి ఎద్దడి, కలుషితమవుతున్న నదుల పరిరక్షణ, జల్ జీవన్ మిషన్ అమలు వంటి కీలక అంశాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ఎపిలోని కొన్ని ప్రాంతాల్లో ఇంకా నీటి కొరత తీరలేదని పవన్ కల్యాణ్ కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ భేటీ విశేషాలను పవన్ కల్యాణ్ "ఎక్స్" వేదికగా వెల్లడించారు.
ఈ సందర్భంగా ఆయన ప్రజలకు స్థిరమైన మంచినీటి సరఫరా అందించడానికి గుజరాత్‌లోని సూరత్ నమూనాను అధ్యయనం చేయాలని అధికారులకు పవన్ సూచించారు. సూరత్‌లో పారిశ్రామిక వ్యర్థ జలాలను శుద్ధి చేసి మళ్లీ ఎలా విజయవంతంగా వినియోగిస్తున్నారో, అదే విధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని అన్నారు.గోదావరి పుష్కరాలు సమీపిస్తున్న నేపథ్యంలో నదీ జలాల స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పవన్ స్పష్టం చేశారు. పారిశ్రామిక కాలుష్యం వల్ల ఎపిలోని నదులు, జలవనరులు దారుణంగా దెబ్బతింటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమలు వదిలే వ్యర్థాల వల్ల నదులు కలుషితం కాకుండా జీరో లిక్విడ్ డిశ్చార్జ్ విధానాన్ని కఠినంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.

# చేయిచేయి కలిపిన ట్రంప్, మోడీ

>> వేదికపై ఒకరినొకరు పలకరించుకున్న మోడీ, ట్రంప్ కొద్దిసేపు చర్చించారు. సదస్సు సందర్భంగా బుధవారం ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సమావేశం జరగనున్నట్లు సమాచారం. జీ7 సదస్సులో పాల్గొనేందుకు ఫ్రాన్స్ చేరుకున్న ప్రధాని మోడీ, ప్రపంచ నాయకులతో కీలక అంతర్జాతీయ అంశాలపై అభిప్రాయాలు పంచుకోవాలని ఎదురుచూస్తున్నానని తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్‌మీడియా వేదికగా సందేశం విడుదల చేశారు. ట్రంప్ ప్రభుత్వం భారతదేశంపై అదనపు సుంకాలు విధించడం, 2025 మే నెలలో భారత్-పాకిస్థాన్ మధ్య జరిగిన సైనిక ఉద్రిక్తతలను తగ్గించడంలో తన పాత్ర ఉందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలతో ఇరుదేశాల సంబంధాల్లో కొంత ఉద్రిక్తత నెలకొంది.అయితే గత నెలలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో భారత పర్యటన అనంతరం ఇరుదేశాలు సంబంధాల పునరుద్ధరణ దిశగా చర్యలు ప్రారంభించాయి. ఒమాన్ తీరంలో జరిగిన అమెరికా దాడుల్లో ముగ్గురు భారత నావికులు మరణించిన ఘటన తర్వాత కూడా ఇరుదేశాల మధ్య చర్చలు కొనసాగాయి. ఈ నేపథ్యంలో రుబియో, ప్రధాని మోడీతో సమావేశమై అధ్యక్షుడు ట్రంప్ తరఫున త్వరలో వైట్ హౌస్‌ను సందర్శించాలని ఆహ్వానించారు. ఇండోపసిఫిక్ ప్రాంతంలో అమెరికా వ్యూహానికి భారత్ కీలక స్తంభమని రుబియో పేర్కొన్నారు.ఇతర ప్రపంచ నేతలతోనూ సమావేశాలుజీ7 సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ పలు దేశాల అధినేతలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించనున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, భద్రత, వాణిజ్యం, ఇంధన సరఫరాలు తదితర కీలక అంశాలపై చర్చలు జరగనున్నాయి.

# ప్రపంచ స్థాయి క్రీడా హాబ్‌గా ఆంధ్రప్రదేశ్

**• మంత్రి నారా లోకేష్ • దక్షిణాఫ్రికా లెజెండరీ క్రికెటర్ జాంటీ రోడ్స్ మంత్రితో ప్రత్యేకంగా భేటీ**

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోందని రాష్ట్ర విద్యా, ఐటీ, యువజన సర్వీసుల శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేసారు. ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ స్థాయి క్రీడా హబ్‌గా తీర్చిదిద్దేందుకు వడివడిగా అడుగులు వేస్తోందని వివరించారు. రాష్ట్ర విద్యా, ఐటీ, యువజన సర్వీసుల శాఖ మంత్రి నారా లోకేశ్ ఒక కీలక సమావేశం నిర్వహించారు. ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ఫీల్డర్‌గా చెరగని ముద్రవేసిన దక్షిణాఫ్రికా లెజెండరీ క్రికెటర్ జాంటీ రోడ్స్ మంత్రి నారా లోకేశ్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మంత్రి నారా లోకేశ్‌ను జాంటీ రోడ్స్ మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిద్దరి మధ్య సమావేశం చాలా ఆత్మీయ వాతావరణంలో సాగింది. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధిపై ఇరువురు తమ ఆలోచనలను పంచుకున్నారు. యువతను క్రీడల వైపు ఏ విధంగా ప్రోత్సహించాలన్న దానిపై సుదీర్ఘంగా చర్చించారు. క్రీడా రంగంలో అద్భుతాలు సృష్టించడం ఎలాగో లోతుగా విశ్లేషించారు. క్రీడల ద్వారా యువతలో సానుకూల దృక్పథాన్ని పెంచే మార్గాలను అన్వేషించారు. ఈ భేటీ అనంతరం మంత్రి నారా లోకేశ్, జాంటీ రోడ్స్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. క్రికెట్ దిగ్గజం జాంటీ రోడ్స్‌ను కలవడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. క్రికెట్‌లో ఫీల్డింగ్ అంటేనే ప్రపంచవ్యాప్తంగా ముందుగా జాంటీ రోడ్స్ గుర్తుకు వస్తారని కొనియాడారు. ఆయన ఆటపట్ల చూపించే అభిరుచి ఎంతో అద్భుతమని లోకేశ్ అన్నారు.

దక్షిణాఫ్రికా లెజెండరీ క్రికెటర్ జాంటీ రోడ్స్ మంత్రి లోకేష్

జాంటీ రోడ్స్ క్రమశిక్షణ ఎందరికో ఆదర్శం అని ఆయన కితాబిచ్చారు. ఎప్పుడూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలనే తపన జాంటీ రోడ్స్‌లో కనిపిస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది యువ క్రీడాకారులకు ఆయన నిజమైన స్ఫూర్తిగా నిలిచారని ప్రశంసించారు. రాష్ట్రంలో భవిష్యత్ ఛాంపియన్లను తీర్చిదిద్దాలని లోకేశ్ లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికోసం ప్రపంచంలోనే అత్యుత్తమ పద్ధతులను రాష్ట్రంలో అమలు చేయనున్నారు. అంతర్జాతీయ క్రీడా ప్రమాణాలను కూడా తీసుకురానున్నారు. ప్రపంచ స్థాయి శిక్షకులతో మన రాష్ట్ర క్రీడాకారులకు శిక్షణ ఇప్పించనున్నారు. ఈ దిశగా జాంటీ రోడ్స్ లాంటి దిగ్గజాల సలహాలు, సూచనలు ఎంతగానో ఉప యోగపడనున్నాయి. ఆధునిక సాంకేతికతను జోడించి క్రీడాకారుల నైపుణ్యాలను మెరుగు పరచనున్నారు.

# సిబిఎన్ 361 డిగ్రీస్ పుస్తకం ఆవిష్కరణ

**• దార్శనిక నేతగా చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలను విశ్లేషిస్తూ పుస్తకం**

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** సిబిన్ ఏట్‌దా రేట్ ఆఫ్ 361 డిగ్రీస్.. పాలీమ్యాథ్ పుస్తకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్‌లో ఆవిష్కరించారు. కాకతీయ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి ఈ పుస్తకాన్ని విడుదల చేశారు. పుస్తకం తొలి ప్రతులను సింగపూర్‌లోని భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే, మంత్రి పి.నారాయణ, కాకతీయ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులకు అందించారు. ఈ పుస్తకాన్ని సీనియర్ పాత్రికేయుడు శాఖమూరు శ్రీనివాస ప్రసాద్ రచించారు. దీనిని విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ సత్యనారాయణ ఆంగ్లంలో అనువదించారు. దార్శనిక నేతగా ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ సందర్భాల్లో తీసుకున్న నిర్ణయాలను విశ్లేషిస్తూ ఈ పుస్తకాన్ని రచించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ పాలకులుగా గుర్తింపు ఉన్న సింగపూర్, న్యూజిల్యాండ్ మాజీ ప్రధానులు లీ క్వాన్ యూ, జేసిందా ఆర్డ్నాడ్ లాంటి అంతర్జాతీయ దిగ్గజ నేతల తరహాలోనే సిఎం చంద్రబాబు నిర్ణయాలు తీసుకొంటున్నారని, ఎపి అభివృద్ధికి విజన్‌ల రూపకల్పనతో పాటు అమరావతి రాజధాని నిర్మాణంలో తీసుకుంటోన్న శ్రద్ధ దీనికి ప్రత్యక్ష ఉదాహరణ

అని రచయిత శాఖమూరు శ్రీనివాస ప్రసాద్ వివరించారు. ఎపి రెరా మాజీ చైర్మన్ రామనాథ్ వివిధ సందర్భాల్లో వ్యక్తపరిచిన అభిప్రాయాల్లో బాహ్య ప్రపంచానికి తెలియని అంశాలను సిబిఎన్ 361 డిగ్రీస్ పుస్తకంలో ఆవిష్కరించినట్టు తెలిపారు. సింగపూర్ రూపకర్త లీ క్వాన్ యూ శతజయంతిని పురస్కరించుకుని విడుదల చేసిన వెండి నాణేన్ని సిఎం చంద్రబాబుకు అసోసియేషన్ ప్రతినిధులు బహూకరించారు. త్వరలోనే ఈ పుస్తకం తెలుగు, హిందీ సహా వివిధ భారతీయ భాషల్లో విడుదల చేయనున్నట్టు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. గతంలో వెలువడిన చంద్రబాబు ఎక్స్.0 పుస్తకం సాఫ్ట్ కాపీ 8 మిలియన్ల మేర డౌన్‌లోడ్ అయ్యిందని తెలిపారు. ఈ పుస్తకంలో పొందుపరచిన అంశాలు రాజకీయ పరిశోధకులు, నాయకత్వ లక్షణాలపై అధ్యయనం చేస్తున్న వారికి, మేనేజ్మెంట్ విద్య అభ్యసించే వారికి ఉపయుక్తంగా ఉందని నిర్వాహకులు వివరించారు. ఈ కార్యక్రమంలో రెరా మాజీ చైర్మన్ రామనాథ్, కెవి సత్యనారాయణ, శంకరప్రసాద్, సింగపూర్‌లోని తెలుగు ప్రముఖులు పాల్గొన్నారు.

## కూటమి విజయాలను ప్రతి గడపకు చేర్చాల్సిన

# బాధ్యత టిడిపి కేడర్ దే

**• మంత్రి నుంచి బూత్ స్థాయి నాయకుడి వరకు ప్రతి ఒక్కరూ జనంలోకి వెళ్లాల్సిందే**

**• ఈనెల 25నుంచి ఆగస్టు 10వరకు ప్రతిగడపకు వెళ్లి చేసిన మంచిని చెబుదాం**

**• సర్ ప్రక్రియలో ఒక్క ఓటు కూడా పోకుండా చూడాల్సిన బాధ్యత నాయకులదే**

**• టిడిపి ఎంపీ, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో యువనేత లోకేష్ వీడియో కాన్ఫరెన్స్**

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** గత రెండేళ్లుగా కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలపై ప్రతిగడపకు వెళ్లి ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత పార్టీ కేడర్‌పై ఉందని తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం కేంద్ర కార్యాలయం నుంచి టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో లోకేష్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ఈనెల 25నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు 45రోజులపాటు ఎంపీ, ఎమ్మెల్యేల నుంచి బూత్ స్థాయి వరకు నాయకులంతా రాష్ట్రంలోని ప్రతిగడపకు వెళ్లి చేసిన మంచిని చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేసిన మంచి పనులు ప్రజలకు తెలిసేలా ప్రతి ఇంటికి కరపత్రాలు, బుక్ లెట్లు అందించాలన్నారు. కూటమిలోని జనసేన, బీజేపీ కేడర్ ను కలుపుకొని వెళ్లి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఇది అధినేత చంద్రబాబు ఆదేశంగా ఆయన చెప్పారు. చంద్రబాబునాయుడు అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్, దీంతోపాటు గత రెండేళ్లలో పెద్దఎత్తున చేపట్టిన సంక్షేమాన్ని జనంలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కేడర్‌పై ఉందన్నారు. తల్లికి వందనం, దీపం 2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు, దేశంలో మరేరాష్ట్రంలో లేనివిధంగా రూ.4 వేల ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, ఆటో డ్రైవర్ల సేవలో, అన్నదాత సుఖీభవ వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశామన్నారు. చేసిన మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతే మనం చేసిన కష్టం బూడిదలో పోసిన పన్నీరుగానే మిగిలిపోతుందని తెలిపారు.

2014-19 నడుమ చేసిన మంచిపనులను చెప్పుకోలేక పోవడం, ప్రత్యర్థుల విషప్రచారం వల్లే ఓటమి పాలయ్యామని లోకేష్ గుర్తుచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా ప్రతిగడపకు వెళతామని తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో విజయోత్సవ సభలు నిర్వహించి కూటమి ప్రభుత్వ విజయాలపై ప్రజలను జాగృతం చేయాలన్నారు.

ఇప్పటికే ప్రారంభమైన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై ప్రతి కార్యకర్త అప్రమత్తంగా వ్యవహరించాలి, దీనిపై ఇప్పటికే కేడర్‌కు శిక్షణా తరగతులు నిర్వహించడంతోపాటు బీఎల్ఏలను కూడా నియమించామని తెలిపారు. ఒక్క ఓటు కూడా పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత నాయకులదేనని స్పష్టం చేశారు. శాసనసభ్యులు బీఎల్ఏలతో టచ్‌లో ఉండి, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించాలి, ఎక్కడైనా సమస్య తీవ్రంగా ఉంటే పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఓటర్ వెరిఫికేషన్ సెల్‌ను సంప్రదించాలని లోకేష్ చెప్పారు.

ప్రజా దర్బారులో నేరుగా అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేష్

# ప్రజల అర్జీలన్నీ పరిష్కరిస్తాం

**• ఎపి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్**

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** అర్జీలు స్వీకరించి, హామీలతో సరిపెట్టే తత్వం కూటమి ప్రభుత్వానికి లేదని ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేసారు. స్వీకరించిన ప్రతి అర్జీని పరిశీలిస్తామన్నారు. వాటిని వెనువెంటనే పరిష్కరించే దిశలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి లోకేష్ 90వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. పల్నాడు జిల్లాకు అత్యంత ముఖ్యమైన వరికపూడిశెల ఎత్తిపోతల ప్రాజెక్ట్ నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని వరికపూడిశెల జలసాధన సమితి ప్రతినిధులు మంత్రి లోకేష్‌కి విజ్ఞప్తి చేశారు. బుద్ధ యోగా ఫౌండేషన్ ద్వారా మోసపోయిన 1056 మంది యోగా ఇన్‌స్ట్రక్టర్స్‌కు తగిన న్యాయం చేయాలని బాధితులు కోరారు. మూడేళ్లుగా తాము చేసిన సేవలను గుర్తించి తగిన న్యాయం చేయడంతో పాటు భవిష్యత్‌లో కూడా ఈ సేవలు ప్రభుత్వ పర్యవేక్షణలో కొనసాగించేలా చొరవ చూపాలని అభ్యర్థించారు. జంగారెడ్డిగూడెంలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో జరిగిన గోల్డ్‌లోన్ అవతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని బాధితులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. తాము కుదవ పెట్టిన బంగారం వస్తువుతో పాటు తూకంలో తేడాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడిన చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గర్భిణీల ఆరోగ్య సంరక్షణకు నగదు బదిలీ పథకం ప్రవేశపెట్టడంతో పాటు మహిళల ఆత్మరక్షణకు ప్రతి నియోజకవర్గంలో మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటుచేయాలని ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. యర్రగొండపాలెం మండలం వెంకటాద్రిపాలెం పంచాయతీ సమగ్ర అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎన్.మల్లికార్జున నాయుడు కోరారు. ఆయా వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.

## పుంగనూరు టిడిపి నేతలతో మంత్రి లోకేష్ భేటీ

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గ టిడిపి నేతలు, కార్యకర్తలతో మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్(సర్) ప్రక్రియపై మంత్రి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపైనా సమావేశంలో చర్చించారు. త్వరలోనే పార్టీ సంస్థాగత కమిటీలను పూర్తిచేస్తామని చెప్పారు. కార్యకర్తలపై నమోదైన అక్రమ కేసుల ఎత్తివేతకు చర్యలు చేపడతామన్నారు. నియోజకవర్గంలో పార్టీ పరంగా తలెత్తుతున్న సమస్యలను ఈ సందర్భంగా నేతలు, కార్యకర్తలు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు. జోనల్ ఇంఛార్జ్, నియోజకవర్గ పరిశీలకులను పంపి సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. అనంతరం పార్టీ కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరించారు.

## పదోన్నతి పొందిన అదనపు ఎస్పీలకు పోస్టింగ్‌లు

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** పదోన్నతి పొందిన పలువురు అదనపు ఎస్పీలకు పోస్టింగ్‌లు ఇచ్చారు. ఆ మేరకు డిజిపి కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. అనకాపల్లి అదనపు ఎస్పీ కె.వి.మహేశ్, అదనపు ఎస్పీ ఈగల్‌గా చొక్కా శ్రీనివాసరావు, విశాఖ అదనపు డిసిపిగా పి.రామచంద్రరావు, అనంతపురం అడ్మిన్ అదనపు ఎస్పీగా ముత్యాల నాగభూషణం, తిరుపతి అదనపు ఎస్పీ శాంతి భద్రతలుగా జె.బాబు ప్రసాద్, తిరుపతి అదనపు ఎస్పీ అడ్మిన్‌గా ఆర్ల శ్రీనివాసులు, తిరుపతి క్రైమ్ అదనపు ఎస్పీగా డి.బాలచంద్రారెడ్డిని నియమించారు. పదోన్నతి పొందిన పోలీసు అధికారులు వెంటనే విధుల్లో చేరవలసి ఉంటుంది.

## రేరా ట్రైబ్యునల్ సభ్యురాలిగా విద్యుల్లత

### పట్టణాభివృద్ధి రంగ అనుభవానికి మరో గౌరవం

**విశాఖపట్నం, జూన్ 16 ప్రభాతవార్త:** పట్టణ ప్రణాళిక, నగరాభివృద్ధి రంగాల్లో విశేష అనుభవం కలిగిన సీనియర్ అధికారి విద్యుల్లతకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక బాధ్యత అప్పగించనున్నట్లు సమాచారం. రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రేరా) ట్రైబ్యునల్ టెక్నికల్ సభ్యురాలిగా ఆమెను నియమించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ)గా పనిచేస్తున్న విద్యుల్లత స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) తీసుకున్నట్లు తెలిసింది. తన సుదీర్ఘ ప్రభుత్వ సేవా కాలంలో ఆమె పట్టణాభివృద్ధి, నగర ప్రణాళిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి కీలక విభాగాల్లో వివిధ హోదాల్లో పనిచేసి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా రాజకీయాలకు అతీతంగా విధి నిర్వహణలో నిబద్ధత, పనితీరు, ఫలితాలపై దృష్టి సారించే అధికారిగా విద్యుల్లతకు మంచి పేరు ఉంది. క్లిష్టమైన పట్టణాభివృద్ధి ప్రాజెక్టులు, ప్రణాళికా అంశాల్లో ఆమె చూపిన చొరవకు సహచర అధికారులు, ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు లభించాయి. రేరా ట్రైబ్యునల్‌లో టెక్నికల్ సభ్యురాలిగా ఆమె నియామకం జరిగితే, రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించిన వివాదాల పరిష్కారం, సాంకేతిక అంశాల పరిశీలన, పట్టణ ప్రణాళికకు సంబంధించిన కేసుల్లో ఆమె అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ పరిపాలనలో సమర్థత, వృత్తిపరమైన నైపుణ్యానికి ప్రతీకగా నిలిచిన విద్యుల్లతకు ఈ బాధ్యత దక్కడం ఆమె సేవలకు లభించిన మరో గౌరవంగా భావిస్తున్నారు. రేరా ట్రైబ్యునల్ పనితీరు మరింత సమర్థవంతంగా మారడంలో ఆమె పాత్ర కీలకంగా ఉండనుందని అధికార వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## జనసేన జాయినింగ్స్ కమిటీ నియామకం

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** జనసేన పార్టీలో కొత్తగా చేరేవారిని సమన్వయం చేసుకునేం దుకు ప్రత్యేకంగా జాయినింగ్స్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు అధినేత పవన్ కల్యాణ్ తెలిపారు. 14 మంది సభ్యులతో ఆంధ్రప్రదేశ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కమిటీలో కొత్తగా రాజ్యసభకు ఎంపికైన లింగమనేని రమేశ్‌తో పాటు ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, వంశీకృష్ణ శ్రీనివాస్, పంతం నానాజీ, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కిలారి రోశయ్య, సామినేని ఉదయభాను, సీనియర్ నతేలు కొటికలపూడి చినబాబు హరిప్రసాద్, పెదపూడి విజయ్ కుమార్ , కొరికాన రవికుమార్, వంపూరు గంగులయ్య టీసీ వరుణ్, ఆరణ మదన్ సభ్యులుగా ఉంటారు. జనసేన పార్టీలో చేరుందకు ఆసక్తి కబనరుస్తున్న విద్యావంతులు, సామాజికవేత్తలు ఇతర పార్టీల నేతలతో పాటు తటస్థులను ఆహ్వానించేందుకు ఈ కమిటీ పని చేస్తుందన్నారు.

# మధురవాడకు మహర్దశ

**రూ.725 కోట్లతో తాగునీటి ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్**

**24 గంటల తాగునీటి సరఫరా దిశగా కీలక అడుగు.. లక్షలాది మందికి ప్రయోజనం**

**విశాఖపట్నం, జూన్ 16 ప్రభాతవార్త:** విశాఖ నగర పరిధిలో వేగంగా అభివృద్ధి చెందుతున్న మధురవాడ (జోన్II), పరిసర ప్రాంతాల ప్రజలకు శాశ్వత తాగునీటి భద్రత కల్పించేందుకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం భారీ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాంతానికి 24 గంటల పాటు నిరంతరాయంగా తాగునీటిని సరఫరా చేసే లక్ష్యంతో రూపొందిం చిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.725.18 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. దీంతో ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఆధునిక తాగునీటి వ్యవస్థకు మార్గం సుగమమైంది. మధురవాడ, కొమ్మాది, ఎండాడ, కారాపాక, పరిసర ప్రాంతాల్లో జనాభా వేగంగా పెరుగుతుండటంతో తాగునీటి అవసరాలు కూడా గణనీయంగా పెరిగాయి. ప్రస్తుతం కొన్ని ప్రాంతా ల్లో నీటి సరఫరా అంతరాయాలు, తక్కువ ఒత్తిడితో నీటి పంపిణీ సమస్యలు ఎదురవు తున్నాయి. కొత్త ప్రాజెక్టు అమలులోకి వస్తే ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక సాంకేతికతతో నీటి నిల్వ, శుద్ధి, పంపిణీ వ్యవస్థలను అభివృద్ధి చేయనున్నారు. ఈ మెగా ప్రాజెక్టు కోసం నిధులను మూడు వేర్వేరు వనరుల ద్వారా సమీకరించనున్నారు. కేంద్ర ప్రభుత్వ అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూ సీ ఎఫ్) నుంచి రూ.172.37 కోట్లు అందనున్నాయి. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ తన వాటాగా రూ.190.21 కోట్లు భరిస్తుంది. మిగిలిన రూ.362.60 కోట్లను గ్రేటర్ విశాఖపట్నం స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ టర్మ్ లోన్ రూపంలో సమకూర్చనుంది. ఈ ప్రాజెక్టు అమలుతో మధురవాడ ప్రాంత ప్రజలకు రోజంతా స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రానుంది. నీటి కోసం నిల్వ చేసుకోవాల్సిన అవసరం తగ్గడంతో పాటు ప్రజల జీవన ప్రమా ణాలు మెరుగుపడనున్నాయి. అలాగే వేగంగా విస్తరిస్తున్న నివాస కాలనీలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల అవసరాలకు కూడా ఈ ప్రాజెక్టు అండగా నిలవనుంది. నగర అభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపడుతున్న కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో ఇది ఒకటిగా నిలవనుంది. విశాఖను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక నగరంగా తీర్చిదిద్దే క్రమంలో ఈ తాగునీటి ప్రాజెక్టు ముఖ్యమైన మైలురాయిగా భావిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత లక్షలాది మంది ప్రజలు నాణ్యమైన తాగునీటి సేవలను నిరంతరాయంగా పొందే అవకాశం కలగనుంది.

# రెండేళ్లలో శాంతి భద్రతలు, మహిళా రక్షణ, డ్రగ్స్ నియంత్రణలో గణనీయ పురోగతి

**హోం మంత్రి వంగలపూడి అనిత**

**సచివాలయం, జూన్ 16 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం గత రెండేళ్ళ కాలంలో శాంతిభద్రతల పరిరక్షణ, మహిళల రక్షణ, డ్రగ్స్ నియంత్రణ, సైబర్ నేరాలను అరికట్టడం, విపత్తుల నిర్వహణ, జైళ్ళ సంస్కరణలు, పోలీసు సంక్షేమం వంటి అన్ని రంగాల్లో సమగ్ర సంస్కరణలను చేపట్టి విశేష ఫలితాలు సాధించిందని రాష్ట్ర హోం వ్యవహారాలు మరియు విపత్తు నిర్వహణ శాఖ మంత్రి అనిత వంగలపూడి తెలిపారు.

మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాజకీయ ప్రయోజనాలకు పరిమితమైన వ్యవస్థలను ప్రజా సేవా దృక్పదంతో పునర్నిస్తూ ప్రజలకు జవాబుదారీగా పనిచేసే పరిపాలన వ్యవస్థను ప్రభుత్వం నెలకొల్పిందన్నారు. నేరం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, నేరం జరగకుండా ముందుగానే నిరోధించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజల భద్రత, మహిళల గౌరవం, యువత భవిష్యత్తు, సమాజ శాంతి కోసం రాజీపడకుండా తమ ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి స్పష్టంచేశారు. సాంకేతిక పరిజ్ఞానం, సమర్థవంతమైన నిఘా వ్యవస్థలు, శాస్త్రీయ దర్యాప్తు పద్ధతులు, అంతర్‌శాఖ సమన్వయాన్ని మెరుగుపర్చడం ద్వారా రాష్ట్రంలో మొత్తం నేరాల శాతం సమారు 14.1శాతం మేర తగ్గిందన్నారు. శక్తియాప్ ద్వారా అత్యవసర సహాయం, మహిళలపై నేరాలకు ప్రత్యేక పర్యవేక్షణ అమలు చేయబడుతుందన్నారు. శక్తియాప్ ద్వారా ఇప్పటివరకు 11.15 లక్షలకు పైగా అత్యవసర ఎస్ఓఎస్ కాల్స్ అందాయని వాటిపై తక్షణ చర్యలు కూడా తీసుకోవడం జరిగిందని మంత్రి తెలిపారు. తప్పిపోయిన చిన్నారులు, మహిళలు, వృద్దులను గుర్తించి కుటుంబాలకు చేర్చేందుకు చేపట్టిన ఆపరేష్ ముస్కాన్ అత్యంతగా విజయవంతమైందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 8,396మంది తప్పిపోయిన వ్యక్తులను గుర్తించి, వారి కుటుంబాలకు తిరగి చేర్చడం జరిగిందన్నారు. అదనపు డిజి మధుసూధనరెడ్డి, హోంశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్, ఎస్‌పిఎఫ్ డిజి డాక్టర్ త్రివిక్రమ వర్మ, హోంశాఖ స్పెషల్ సెక్రటరీ విజయ్‌కుమార్, ఈగల్ చీఫ్ ఐజి రవికృష్ణ, ఐజీలు శ్రీకాంత్, రాజకుమారి, విపత్తుల నిర్వహణ శాఖ ఎండి ప్రకర్‌జైన్, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ వెంకట రమణ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# ఏనుగులు వ్యధ.. ఎన్నాళ్లు అనుభవించాలి

**• ఎన్నో ప్రాణాలు బలిగొన్నాయి • పంట పొలాలకు తీవ్రనష్టం • రైతులను ఆదుకునే వారేరీ?**

**విజయనగరం, జూన్ 16 ప్రభాతవార్త:** గత కొన్ని సంవత్సరాలుగా అడవిలో ఉండవలసిన గజరాజులు సాధారణ గ్రామాలలో సంచరించడంతో ప్రజలు భయాందోళనలో కొట్టుమిట్టాడుతున్నారు. దీంతో ప్రాణ నష్టంతో పాటు ఆస్తి నష్టం ఏర్పడుతుంది. అరకొర ఫారెస్ట్ సిబ్బందితో గజరాజు ప్రజల బార్ కి రాకుండా కాపాడటం కష్టంగా తయారయింది. వన్యప్రాణులు పంట పొలాలలో సంచరించడంతో నోటి దగ్గరకొచ్చిన పంట బుగ్గిపాలవుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల పార్వతీపురం జిల్లా మక్కువ మండలంలో సుమారు పది గజరాజులు ధ్వంసం చేస్తూ పొలాల్లో అమర్చిన నీరు పంపుసెట్‌లు కూడా చెల్లాచెదురుచేస్తూ విధ్వంసం సృష్టించుతున్నాయి. అరకొరగా ఉన్న ఫారెస్టు సిబ్బంది గజరాజుల నుంచి వచ్చిన ధ్వజాన్ని వెనక్కి మళ్ళించడంలో నిమగ్నమైన వారు కూడా మనుషులే కదా దీనిపై ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుంటుందో ఏమి తెలియ రాలేదు. ఎన్నాలిలా గజరాజులు దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవలసి వస్తున్న ఉప ముఖ్య మంత్రి ప్రత్యేక శ్రద్ధతో వీటినుంచి ప్రజలను కాపాడే చర్యలు చేపట్టాలని ఉభయజిల్లాలకు చెందిన ప్రజలు ఏకరువు పెడుతున్నారు. రెండు వారాలుగా డబ్బగడ్డ, సి బిల్లి పెద్దవలస పార్వతీపురం మన్యం జిల్లాలో ఏనుగులు గుంపు రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది. గత వారం రోజులుగా మక్కువ మండలం కాముడువలస సిబిల్లి, గైసీల తదితర ప్రాంతాల్లో 8 ఏనుగులు గుంపు పామాయిల్, అరటి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. పొలాల్లో ఉన్న వ్యవసాయ బోర్లను, డ్రిప్ ఇరిగేషన్ పైపులను ధ్వంసం చేయడంతో రైతులు తీవ్ర నష్టాలను చదివిచూస్తున్నారు అప్పులు చేసి వ్యవసాయంపై పెట్టుబడులు పెడితే ఈ ఏనుగులు ఎలా పాడు చేయడంతో జీర్ణించుకోలేక పోతున్నామని వాపోతున్నారు మరోవైపు పాడైన పంటల నష్టాలను అంచనా వేసేందుకు కూడా అధికారులు ముందుకు రావడంలేదని వాపోయారు. ఒకరిపై ఒకరు అధికారులు నెట్టుకుంటూ వస్తున్నారే తప్ప రైతులకు న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల కిందట కాముడవలసకు చెందిన రైతు జీ.పోలినాయుడు వ్యవసాయ పొలంలో ఉన్న రెండు బోర్లను ధ్వంసం చేశాయి. పామాయిల్ చెట్లను పీకేయడంతో రైతుకు సుమారు లక్ష వరకు నష్టం జరిగి ఉంటుందని వాపోతున్నాడు. సిబిల్లి, ఘైసిల, పెద్దవలస తదితరప్రాంతాల్లో అరటి తోటలు ధ్వంసమయ్యాయి. ఏనుగులు గుంపును ఒడిశాలోకి పంపించేందుకు అటవీ శాఖ అధికారులు విశ్వప్రయత్నం చేస్తున్న అవి కదలడం లేదు. అలాగే గిరిజన ప్రాంతాల్లో ఉన్న వారంతా రాత్రిపూట గుంపు గ్రామంలోకి వస్తుందేమోనని భయంతో వణికిపోతున్నారు. ఏనుగులను ఇక్కడి నుంచి అడవుల్లోకి తరలించాలని గిరిజనులు కోరుతున్నారు. అలాగే పాడైన పంటలకు నష్ట పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ విభాగం
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన

నిట్ నం. 01/23% ZP Grant/EEPIUVSP/2026-27, తేది: 11.06.2026
విశాఖపట్నం జిల్లాలో ఆనందపురం మండలం వద్ద 23% ZP గ్రాంట్ క్రింద. అంచనా ధర: రూ.20.00 లక్షలకు డ్రైన్‌లకు నిర్మాణం మరియు మరమ్మతులు. బిడ్ డౌన్‌లోడ్: 22.06.2026 నుండి. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా http://www.apeprocurement.gov.in వద్ద చూడవచ్చును. ఫోన్: 9490543902.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, PIU డివిజన్, విశాఖపట్నం
DIPR.No.20650/CL/Advt/1/1/2022-23, తేది: 16.06.2026

ANANTAPURAMU MUNICIPAL CORPORATION
e-PROCUREMENT - Tender Notice

| | | |
|---|---|---|
| 1. | Tender Notice No | 101 to 116/NCAP and 15th FC and GF/2026-27/TO |
| 2. | Scope of work | Providing of BT Rods , Road Improvement, CC Road |
| 3. | No. of Works | 16 Nos |
| 4. | Estimate Cost | Rs. 4.00 to 200 Lakhs |

Note : The details of tender may be seen on e - procurement market Place available @ https://tender.apeprocurement.gov.in.

sd/- Commissioner, Municipal Corporation, Anantapuramu

17-6Pg7exHMNWJQE.qxdo/p:17-6Pg7exHMNWJQE.qxd 1/1/02 6:57 AM Page 1



# మహిళలపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు: ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

**కోవూరు, (నెల్లూరు), జూన్ 16 ప్రభాతవార్త:** రాష్ట్రంలో మహిళల రాజకీయ సాధికారతకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా ప్రాధాన్యత ఇస్తుంటే ఒక హోం మంత్రిగా పనిచేస్తున్న మహిళపై వైసిపి నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం అత్యంత నీచమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. విపిఆర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలు రాజకీయంగా మరింత ముందుకు రావాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ బాబులు 33శాతం రిజర్వేషన్ కల్పించి వారి ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో రాజకీయంగా ఎన్నో పోరాటాలు చేసి రాష్ట్ర హోం మంత్రిగా ఎదిగిన వంగలపూడి అనితపై వైసీపీ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలు దారుణమన్నారు. రాజకీయంగా ప్రత్యర్థులను ఎదుర్కోలేక వ్యక్తిగత అంశాలు, దుస్తులు, మేకప్ వంటి విషయాలను ప్రస్తావించడం మంచిది కాదన్నారు. రాజకీయాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ తల్లి చెల్లి భార్య వంటి మహిళా బంధువులు ఉంటారని, ఇటువంటి పరిస్థితుల్లో మహిళలను కించపరిచే వ్యాఖ్యలు చేయడం సమాజానికి మంచిది కాదన్నారు. రాజకీయ నాయకుల విధానాలు, నిర్ణయాలపై విమర్శలు చేయవచ్చు గానీ, వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదని స్పష్టం చేశారు. రాష్ట్ర హోం మంత్రి హోదాలో ఉన్న ఒక దళిత మహిళ ఆత్మ విశ్వాసంతో గౌరవప్రదంగా ఉండకూడదా అని ప్రశ్నించారు. సాధారణ కుటుంబం నుంచి ఉపాధ్యాయినిగా ఉద్యోగం ప్రారంభించి కష్టపడి హోం మంత్రి స్థాయికి చేరుకున్న అనితపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. ఇటువంటి అనుచిత వ్యాఖ్యలు చేసే వారిని ఆయా పార్టీల నాయకత్వం నియంత్రించాలన్నారు.

# మామిడి రైతు బేజారు

- తోతాపురి ధర కేజీ రూ.4కు పతనం
- దిక్కుతోచని స్థితిలో తోతాపురి రైతు

**చిత్తూరు, జూన్ 16 ప్రభాతవార్త:** జిల్లాలో మామిడి రైతు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. మామిడి సీజన్‌పై ఆశలు పెట్టుకున్న రైతుకు సీజన్ ప్రారంభం నుండి మామిడి ధర పతనం కావడంతో ఈ సీజన్ తమను నష్టాల ఊబిలోకి నెట్టివేస్తుందని మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా అధికార యంత్రాంగం మామిడి పల్ప్ ఫ్యాక్టరీలు రైతుల నుండి తోతాపురి రకం మామిడి కేజీ రూ.7కు కొనుగోలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ పల్ప్ ఫ్యాక్టరీలు, ర్యాంపుల వద్ద పరిస్థితులు మాత్రం ఇందుకు భిన్నంగా వుండటంతో రైతులు నట్టేట మునిగిపోతున్నారు. జిల్లాలో ప్రస్తుతం తోతాపురి రకం మామిడిని పల్ప్ ఫ్యాక్టరీలు రూ.4 నుండి రూ.5 వరకు రైతులకు చెల్లిస్తుండగా ర్యాంపుల వద్ద మాత్రం కేజీ తోతాపురి రూ.4 కంటే ఎక్కువకు ఎవరు కొనుగోలు చేయడం లేదు. జిల్లాలో మామిడి సీజన్ ప్రారంభం కాకముందు నుండి ఇటు జిల్లా అధికార యంత్రాంగం, మామిడి రైతులు, అటు పల్ప్ ఫ్యాక్టరీల యాజమనులు పలుమార్లు సమావేశమై చర్చలు జరిపినప్పటికీ సీజన్ ప్రారంభమైన అనంతరం మామిడి ధర మాత్రం ఏ మాత్రం పెరుగలేదు. ఈ సీజన్‌లో తోతాపురి మామిడి కేజీకి రూ.18 చెల్లించాలని మామిడి రైతు సంఘాలు ఆందోళనలు నిర్వహించి డిమాండ్ చేస్తున్నప్పటికీ ఫలితం మాత్రం కన్పించడం లేదు. గత సీజన్‌లో సైతం మామిడికి గిట్టుబాటు ధర లేకపోవడంతో ప్రభుత్వం స్పందించి మామిడికి ప్రోత్సాహక ధర నిర్ణయించి మామిడి రైతుకు కేజీకి రూ.4 చెల్లించింది. అలాగే పల్ప్ ఫ్యాక్టరీలు తోతాపురి రకం మామిడి కేజీకి రూ.4 చెల్లించడంతో గత సీజన్‌లో తోతాపురి రైతుకు కేజీ మామిడికి రూ.8 లభించింది. జిల్లాలో 79 వేల హెక్టార్ల నుండి 97 వేల హెక్టార్ల విస్తీర్ణంలో మామిడి పంట సాగు అవుతోంది. ఇందులో 55 వేల హెక్టార్ల విస్తీర్ణంలో తోతాపురి రకం మామిడిని అత్యధిక రైతులు సాగు చేస్తున్నారు. జిల్లాలో తోతాపురి మామిడి పండ్ల నుండి పల్ప్ తయారు చేసి ఇతర దేశాలకు శీతలన పానీయ ఫ్యాక్టరీలు, ఇతర దేశాలకు ఎగుమతి చేయడానికి 31 పల్ప్ ఫ్యాక్టరీలు వున్నాయి. ఈ సీజన్ ప్రారంభంలో కేవలం 5 ఫ్యాక్టరీలు మాత్రమే పల్ప్ చేయడానికి సిద్ధమై ప్రారంభమైనప్పటికీ రాను రాను 28 ఫ్యాక్టరీలు మామిడి పల్ప్‌ను తయారు చేయడానికి సిద్ధం అయ్యాయి. ఇందులో ప్రస్తుతం కేవలం 14 పల్ప్ ఫ్యాక్టరీలు మాత్రమే తోతాపురి మామిడిని కొనుగోలు చేసి పల్ప్‌ను తయారు చేస్తున్నాయి. మిగిలిన ఫ్యాక్టరీలు తోతాపురి మామిడిని ఇప్పటి వరకు కొనుగోలు చేయలేదు. జిల్లాలో తోతాపురి మామిడి ఉత్పత్తి అధికంగా వుండటం, పల్ప్ ఫ్యాక్టరీలు తక్కువగా వుండటంతో మామిడికి గిట్టుబాటు ధర లేకపోయినప్పటికీ రైతులు తమ తోటల్లోని తోతాపురి మామిడిని పల్ప్ ఫ్యాక్టరీలకు తరలించడానికి సిద్దమవున్నారు. అయితే ఫ్యాక్టరీలకు తోతాపురి మామిడి అధికంగా వస్తుండటం, ఫ్యాక్టరీల్లో పల్ప్ తక్కువగా ఉత్పత్తి చేయాల్సి వుండటంతో అత్యధిక రైతులు ఫ్యాక్టరీలకు తీసుకెళ్ళిన మామిడి ఆన్‌లోడ్ చేయడానికి రెండు రోజుల సమయం పడుతున్నది. మామిడి సీజన్ జులై నెలాఖరు వరకు కొనసాగనుండటంతో జిల్లాలో వున్న అన్ని పల్ప్ ఫ్యాక్టరీలను తోతాపురి మామిడి పల్ప్‌ను తయారు చేయడానికి సిద్ధం చేస్తే మామిడి రైతులకు మామిడికి గిట్టుబాటు ధర లేకపోయినా తమ తోటల్లో ఉత్పత్తి అయిన మామిడిని సకాలంలో పల్ప్ ఫ్యాక్టరీలకు తరలించి ఎంతో కొంత మొత్తం రైతులు దక్కించుకునే అవకాశం వుంది. గత ఏడాది మామిడి సీజన్‌లో గిట్టుబాటు ధర లేకపోవడంతో ప్రభుత్వం స్పందించి కేజీ తోతాపురి మామిడిపై రూ.4 ప్రోత్సాహక ధర చెల్లించింది. మామిడి సీజన్ పూర్తయిన రెండు నెలల్లో మామిడి రైతుకు ప్రభుత్వం నుండి రావాల్సిన కేజీపై రూ.4 ప్రోత్సాహక ధర వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యింది. ఈ సీజన్‌లో సైతం తోతాపురి మామిడి రైతులు గత సీజన్ కంటే ఎక్కువ గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటుండటంతో ప్రభుత్వం స్పందించి తోతాపురి రైతును ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

**మామిడి ధరపై సిఎం సమక్షంలో సమావేశం:** జిల్లాలో మామిడి ధర పెంచడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమక్షంలో ఒక వారం రోజుల్లో సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకునే అవకాశం కన్పిస్తుంది. ముఖ్యమంత్రి స్థాయిలో సమావేశం జరిగిన అనంతరం తోతాపురి మామిడి ధర పెరిగే అవకాశం కన్పిస్తుంది. జిల్లాలో అత్యధిక రైతులు మామిడి పంటపై ఆధారపడి జీవిస్తుండటంతో వారి ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని తోతాపురి మామిడి ధర పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించి ఇప్పటికే చర్చించడం జరిగింది.

## జై చిరంజీవ ఆర్ట్స్ క్రియేషన్స్ బ్యానర్‌పై 5 స్టార్ ఫ్యామిలీ నూతన చిత్రం

**తిరుపతి, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** జై చిరంజీవ ఆర్ట్స్ క్రియేషన్స్ బ్యానర్‌పై ఫైవ్ స్టార్ కుటుంబ చిత్రం పోస్టర్ ను సినీ నిర్మాత ఎన్ వి ప్రసాద్ ఆవిష్కరించారు. నటీనటులుగా వాసుదేవ్ ,నితిన్ శ్రీకర్, కార్తిక్ , దిలీప్, తిలక్, లక్ష్మణ్, కుసుమ కుమారి నటించారు. నటుడు భానుచందర్ ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. దర్శకుడు వాసుదేవ్ ఆధ్వర్యంలో ఈ చిత్రం తిరుపతి పరిసర ప్రాంతాలలో షూటింగ్ నిర్వహించుకున్నందున ఆ తిరుపతి వెంకటేశ్వర స్వామి ఆశీర్వాదాలు తోడై సినిమా మంచి విజయం సాధిస్తుందని నిర్మాత ఎన్ వి ప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చిత్రానికి మనిరామ్ కదలి ఎడిటింగ్, అనిల్ కుమార్ సంగీతం చాలా ప్లస్ అవుతుందని డాక్టర్ కరుణానిధి తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మాత ఎన్వి ప్రసాద్, డాక్టర్ కరుణానిధి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఓంకార్, డైరెక్టర్ వాసుదేవ్, కుసుమ కుమారి, నితిన్ శ్రీకర్, కార్తీక్, తిలక్, లక్ష్మణ్, మురళి తమ్మిశెట్టి, వంశీ, నాని, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ అస్త్రా విజువల్ స్టూడియోస్‌లో శరవేగంగా జరుగుతోంది ఇటీవలే కన్యాకుమారి లో పాటల చిత్రీకరణ పూర్తి చేసుకుంది.

## హోంమంత్రి అనితపై అనుచిత వ్యాఖ్యలపై రాష్ట్ర మహిళా కమిషన్ ఆగ్రహం

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** హోంమంత్రి వంగలపూడి అనితను ఉద్దేశించి వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది. మహిళా మంత్రిని మేకప్ మంత్రి అని సంబోధిస్తూ అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలను మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ తీవ్రంగా ఖండించారు. రాజకీయాల్లో విధానాలపై విమర్శలుండాలి గానీ, ఒక మహిళా ప్రజాప్రతినిధి రూపం, దుస్తులు, మేకప్ గురించి మాట్లాడటం ఏమాత్రం సమర్థనీయం కాదని శైలజ స్పష్టం చేశారు. ఇది హోంమంత్రిని మాత్రమే కాకుండా మొత్తం మహిళా సమాజాన్ని కించపరచడమేనని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా మహిళా రిజర్వేషన్లపై చర్చ జరుగుతున్న వేళ, ఇలాంటి బాధ్యతారాహిత్య వ్యాఖ్యలు మహిళలు రాజకీయాల్లోకి రాకుండా నిరుత్సాహపరుస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. నైతిక విలువలు లేనివారు నాయకులు కాలేరని హితవు పలికారు. ఈ వ్యవహారాన్ని మహిళా కమిషన్ తీవ్రంగా పరిగణిస్తోంది. కేవలం వ్యాఖ్యలు చేయడమే కాకుండా, వాటిని సమర్థించుకునేలా అమర్‌నాథ్ మాట్లాడటంపై కమిషన్‌కు ఫిర్యాదులు అందాయి. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ డీజీపీకి లేఖ రాయాలని నిర్ణయించింది. అలాగే గుడివాడ అమర్‌నాథ్‌కు సమన్లు జారీ చేయనుంది.

## జూనియర్ కళాశాలలో 329 మంది పార్ట్‌టైమ్ సిబ్బంది సేవలు మరో ఏడాది కొనసాగింపు

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 329 మంది పార్ట్‌టైమ్ సిబ్బందికి 2026-27 విద్యా సంవత్సరానికి కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పార్ట్‌టైమ్ జూనియర్ లెక్చరర్లు, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్లు, కంప్యూటర్ టెక్నీషియన్లు, ల్యాబ్ అటెండర్లు, కన్సాలిడేటెడ్ పే సిబ్బంది వీరి సేవలు 01 జూన్ 2026 నుండి 30 ఏప్రిల్ 2027 వరకు కొనసాగిస్తామన్నారు.

# కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం రెండు చక్రాలు

విజయోత్సవ సంబరాల్లో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**నెల్లూరు(వైద్యం), జూన్ 16 ప్రభాతవార్త:** కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం రెండు చక్రాలు అని, రాష్ట్రంలోని 111 దేవాలయాలలో నిత్యాన్నదానం అమలు చేస్తున్నామని, అలాగే 808 కోట్ల రూపాయలతో 684 దేవాలయాల అభివృద్ధి, పునః నిర్మాణం చేస్తున్నామని, మరో 73 కోట్ల 99 లక్షలతో 6,116 దేవాలయాలలో దీప,దూప నైవేద్యం పథకం, 2500 కోట్ల రూపాయలతో దత్తులూరులో డిఫెన్స్ పరిశ్రమ ఏర్పాటు చేశామని, సోమశిల కండలేరు రిజర్వాయర్ ద్వారా జిల్లా రైతాంగానికి తొలి విడతగా ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని, మరో నాలుగు లక్షల ఎకరాలకు త్వరలో సాగునీరు అందిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. మంగళవారం నెల్లూరు కస్తూరిదేవి గార్డెన్స్‌లో కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి అయిన సందర్భాన్ని పురస్కరించుకొని విజయోత్సవ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ గత రెండేళ్లలో ప్రజలకు కల్పించిన నమ్మకం, అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించేలా విజయోత్సవాలని నిర్వహిస్తున్నా మన్నారు. నెల్లూరు జిల్లా సమగ్ర అభివృద్ధికి అందరి సహాయ సహకారాలతో కలిసి ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. సూపర్ సిక్స్ పథకం సూపర్ హిట్ అయిందని, 16 వేలమంది ఉపాధ్యాయులకు మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగ కల్పన, 6000 కానిస్టేబుల్ ఉద్యోగాలను ప్రత్యక్షంగా నియమించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో దేవాదాయ శాఖ చాలా చిన్నదని,అయినను దానిని ముందు వరుసలో నిలిపే విధంగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రం మొత్తం మీద 684 దేవాలయాల అభివృద్ధి పునర్నిర్మాణానికి రూ.808 కోట్లు వెచ్చించడం జరుగుతున్నదని తెలిపారు. ధూప దీప నైవేద్యం కార్యక్రమం కింద 6,116 దేవాలయాలలో 73 కోట్ల 99 లక్షల రూపాయలు వెచ్చించడం జరుగుతున్నదని, శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 5000 గుడిలలో భజనలు ఆలయాలు నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని 111 దేవాలయాలలో నిత్యాన్నదానం జరుగుతున్నదని సుమారుగా సంవత్సరానికి మూడు కోట్ల మందికి అన్న ప్రసాదం జరుగుతున్నదని తెలిపారు. జిల్లాలో పరిశ్రమలు రావడం ఆనందదాయకమని నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల అభివృద్ధి ముఖ్యమని అన్నారు. ఎం ఎస్ ఎం ఈ పార్కును రాష్ట్రంలోనే తొలిసారిగా ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రారంభించడం జరిగిందన్నారు. అనంతరం పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక విజినరీ లీడర్ అని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంచి డిస్నోయిన్ ఉన్న వ్యక్తి అని, నారా లోకేష్ బాబు డిసిప్లిన్, పట్టుదల గల వ్యక్తి అని వారి అడుగుజాడలలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళ్ళవలసిన అవసరం ఉందన్నారు. నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ విధివిధానాలతో రాష్ట్రం చాలా నష్టపోయిందని ప్రధానమంత్రి మోడీ, సిఎం చంద్రబాబుల కృషితో రాష్ట్రాన్ని ముందుకు తీసుకుని వెళ్లడం జరుగుతున్నదని తెలిపారు. కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ రెండు సంవత్సరాల నమ్మకం 12 సంవత్సరాల మోడీ పాలన అమోఘమన్నారు. చంద్రబాబు నాయుడు చెప్పినవన్నీ చేయడం జరిగిందన్నారు. కావలి నియోజకవర్గం శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి, ఉదయగిరి నియోజకవర్గం శాసనసభ్యులు కాకర్ల సురేష్, గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, గోపాలపురం శాసనసభ్యులు, జోనల్ ప్రెసిడెంట్ వెంకట రాజు, శాసన మండల సభ్యులు బీద రవిచంద్ర, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి ప్రసంగించారు. ఈ కార్యక్రమం అనంతరం డిఆర్డిఏ శాఖ ద్వారా పలువురు లబ్ధిదారులకు ట్రాక్టర్లు, ఆటోలను మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, శాసనసభ్యులతో కలిసి అందజేశారు.

## హత్య కేసులో నలుగురికి జీవిత ఖైదు

### - 2015లో జరిగిన హత్య కేసులో కోర్టు తీర్పు

**మార్కాపురం, జూన్ 16 ప్రభాతవార్త:** కొమరోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో 2015లో జరిగిన హత్య కేసులో నలుగురు నిందితులకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.1,000 జరిమానా విధిస్తూ మార్కాపురం 6వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి వేల్పుల భవాని మంగళవారం తీర్పు వెలువరించారు. పోలీసుల వివరాల ప్రకారం, టేకులపెంట గ్రామానికి చెందిన కొండమల్ల శివ (25) గ్రామంలో జరుగుతున్న తప్పులను ప్రశ్నిస్తూ ఉండేవాడు. ఇదే గ్రామానికి చెందిన వీర్నేని లింగయ్య తరచూ గ్రామస్తులతో వివాదాలు సృష్టిస్తూ ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నించేవాడు. తనకు ఎదురునిలుస్తున్న శివపై లింగయ్య కక్ష పెంచుకుని, ఇతర నిందితులతో కలిసి 2015 సెప్టెంబర్ 27న శివ ఇంటి వద్ద మారణాయుధాలతో దాడి చేశాడు. ఈ దాడిలో శివ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై శివ తల్లి కొండమల్ల ఆదిలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కొమరోలు పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.77/2015 కింద కేసు నమోదు చేశారు. అప్పటి గిద్దలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు ఎండీ ఫిరోజ్, వి. శ్రీరామ్ దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం విజయలక్ష్మి వాదనలు వినిపించారు. మార్కాపురం జిల్లా ఎస్పీ వి.హార్షవర్ధన్ రాజు మార్గదర్శకత్వంలో పోలీసు సిబ్బంది సాక్షులను సమయానుసారం కోర్టులో హాజరుపరుస్తూ పటిష్టమైన ట్రయల్ మానిటరింగ్ నిర్వహించారు. సమర్పించిన సాక్ష్యాధారాల ఆధారంగా నిందితులపై నేరం రుజువైనట్లు కోర్టు నిర్ధారించి నలుగురు నిందితులకు జీవిత ఖైదు విధించింది.

## ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌పై విచారణ

- 4గంటల పాటు ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించిన అధికారులు
- త్వరలోనే ఉన్నతాధికారులకు నివేదిక సమర్పణ

**తిరుపతి(విద్య), జూన్ 16 ప్రభాతవార్త:** తిరుపతిలోని ప్రముఖ విద్యాసంస్థ అయిన ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌పై వచ్చిన వేధింపుల ఆరోపణల వ్యవహారం ఇప్పుడు తీవ్ర సంచలనంగా మారింది. అదే కళాశాలలో పనిచేస్తున్న ఓ మహిళా అధ్యాపకురాలు, ప్రిన్సిపాల్ తనను మానసికంగా, వృత్తిపరంగా వేధింపులకు గురిచేస్తున్నారంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. న్యాయం చేయాలంటూ ఆమె ఏకకాలంలో టీటీడీ విజిలెన్స్ విభాగానికి మరియు విజయవాడలోని రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదులు పంపడంతో ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు అత్యంత ప్రాధాన్యతతో స్పందించారు.ఈ ఫిర్యాదుల నేపథ్యంలో మంగళవారం తిరుపతిలో హైడ్రామా నడిచింది. విజయవాడ నుంచి ప్రత్యేకంగా విచ్చేసిన రాష్ట్ర మహిళా కమిషన్‌కు చెందిన ముగ్గురు సభ్యుల ఉన్నత స్థాయి బృందం, టీటీడీ విజిలెన్స్ అధికారులతో కలిసి కళాశాలలో నేరుగా రంగంలోకి దిగింది. ఉదయం నుంచే కళాశాల ప్రాంగణంలో విచారణ ప్రక్రియను ముమ్మరం చేశారు. తొలుత ఫిర్యాదు చేసిన బాధితురాలైన మహిళా అధ్యాపకురాలితో విడిగా సమావేశమై, ఆమె పడుతున్న ఇబ్బందులు, ప్రిన్సిపాల్ అనుచిత ప్రవర్తనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించారు.అనంతరం ఈ వేధింపుల వ్యవహారంపై నిజానిజాలు తెలుసుకునేందుకు కళాశాలలోని ఇతర మహిళా, పురుష అధ్యాపకులను, ల్యాబ్ మరియు కార్యాలయ సిబ్బందిని విచారణ కమిటీ ఒక్కొక్కరిగా పిలిచి ఆరా తీసింది. ఈ క్రమంలో కళాశాల అంతర్గత వాతావరణంపై భిన్న కోణాల్లో సమాచారాన్ని సేకరించినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కళాశాలలో జరుగుతున్న కొన్ని పరిణామాలపై కొందరు అధ్యాపకులు ,సిబ్బంది తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, వారు విచారణ కమిటీకి, టీటీడీ విజిలెన్స్ అధికారులకు తమకు తెలిసిన వివరాలను లిఖితపూర్వకంగా (లిఖితపూర్వక స్టేట్‌మెంట్లు) అందజేసినట్లు సమాచారం. ఇది ఈ కేసులో కీలక ఆధారంగా మారే అవకాశం ఉంది.కళాశాలలో ప్రాథమిక సమాచారం, ఆధారాలు సేకరించిన అనంతరం, విచారణ బృందం తమ ఫోకస్‌ను ప్రిన్సిపాల్‌పైకి మళ్లించింది. టీటీడీ పరిపాలనా భవనానికి చేరుకున్న మహిళా కమిషన్ బృందం, టీటీడీ విజిలెన్స్ ఉన్నతాధికారులు ప్రిన్సిపాల్‌ను గదిలోకి పిలిపించి విచారించారు.

# ఆగస్టు నాటికి వెలిగొండ పూర్తి చేస్తాం

- టన్నెల్ లైనింగ్, టిబిఎం తొలగింపు పనులు వేగవంతం
- మంత్రి రామానాయుడు, ఎమ్మెల్యే నారాయణరెడ్డి

**కొత్తూరు, జూన్ 16 ప్రభాతవార్త:** వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, ఆగస్టు చివరి నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే లక్ష్యంతో ప్రభుత్వం వేగంగా పనులు చేపడుతోందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ ఎం. విజయసునీత, జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్సన్‌బాబుతో కలిసి వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్లు, ఫీడర్ కెనాల్ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మరోసారి టన్నెల్‌లలోకి వెళ్లి లైనింగ్ పనులు, టన్నెల్ బోరింగ్ మెషిన్ (టిబిఎం) తొలగింపు పనుల పురోగతిని పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించి మిగిలిన పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.మంత్రి మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటర్లకు సంబంధించిన రిటైనింగ్ వాల్, వింగ్స్, రిటర్న్స్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. కొల్లంవాగు నుంచి ఒక టీఎంసీ నీరు టన్నెల్‌లలోకి చేరేలా 1.80 లక్షల క్యూబిక్ మీటర్ల మక్ తొలగించాల్సి ఉండగా, ఇప్పటివరకు 58 వేల క్యూబిక్ మీటర్ల మక్ తొలగించినట్లు చెప్పారు. టన్నెల్1లో అడ్డుగా ఉన్న 1.2 లక్షల క్యూబిక్ మీటర్ల మక్‌లో 40 వేల క్యూబిక్ మీటర్లను ఇప్పటికే తొలగించినట్లు వివరించారు.టన్నెల్ 2లో మొత్తం 7 కిలోమీటర్ల లైనింగ్ పనులకు గాను 5.5 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయని, మిగిలిన 1.5 కిలోమీటర్ల పనులను జూలై చివరి నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు నిలిచిపోయిన టిబిఎం వెలికితీత పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయని, యంత్రంలోని ఏడు కంపార్ట్‌మెంట్లలో మూడు ఇప్పటికే బయటకు తీసుకొచ్చినట్లు వెల్లడించారు. క్లిష్టమైన హెడ్ భాగాన్ని టన్నెల్‌లోనే పూడ్చిపెట్టే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు.ఫీడర్ కెనాల్‌లో 5.3 కిలోమీటర్ల రిటైనింగ్ వాల్ పనులను ఐదు నెలల్లో పూర్తి చేశామని, ప్రస్తుతం కొనసాగుతున్న 21 కిలోమీటర్ల లైనింగ్ పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులను ఆదేశించినట్లు తెలిపారు. మేఘా తుఫాన్ కారణంగా ఫీడర్ కెనాల్‌లో ఏర్పడిన భారీ గండిని సీసీ వాల్ నిర్మాణం ద్వారా పునరుద్ధరిస్తున్నట్లు పేర్కొన్నారు.తీగలేరు, ఈస్టర్న్ మెయిన్ కెనాల్ పనులతో పాటు శాశ్వత డైవర్షన్ రోడ్డు నిర్మాణాన్ని జూన్ నెలాఖరులోగా పూర్తి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సాగు సీజన్ ప్రారంభానికి ముందే నల్లమలసాగర్ రిజర్వాయర్‌ను నీటితో నింపేలా పనులు ముమ్మరంగాకొనసాగుతున్నాయని చెప్పారు.అదేవిధంగా వెలిగొండ నిర్వాసితులకు ఈ నెలలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆర్అండ్ఆర్ పరిహారం అందజేయనున్నట్లు తెలిపారు. నల్లమలసాగర్ రిజర్వాయర్‌లో నీటి నిల్వకు అవసరమైన పునరావాస కార్యక్రమాల కోసం అదనపు బడ్జెట్‌లో రూ.905 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎసిబికి పట్టుబడ్డ వెల్దుర్తి ఇఒ

**వెల్దుర్తి, జూన్ 16 ప్రభాతవార్త:** ఇంటి నిర్మాణం అప్రూవల్ కోసం వెల్దుర్తి పట్టణానికి చెందిన సతీష్ అనే వ్యక్తి వద్ద నగదు తీసుకుంటున్న వెల్దుర్తి గ్రామపంచాయతీ ఇఒ లక్ష్మినాథ్ మంగళవారం ఎసిబి అధికారులకు పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళితే బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ముందు ఉన్న వీధిలో ఇతనికి ప్రభుత్వ స్థలం ఉంది. ఈ స్థలానికి సంబంధించి ఉన్న డి పట్టాతో గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లి తను ఇంటి నిర్మాణం చేపడతానని అప్రూవల్ అనుమతులు మంజూరు చేయాలని ఇఒకు విన్నవించుకున్నాడు. అనుమతులు మంజూరు చేయాలంటే రూ.50 వేల ఇవ్వాలని ఇఒ డిమాండ్ చేశారు. దీంతో ఒప్పందం కుదుర్చుకున్న సతీష్ ముందస్తుగా ఇఒకు రూ.40 వేలు ఇచ్చేందుకు సిద్ధమై ఎసిబికి సమాచారం అందించాడు. వెల్దుర్తి పట్టణ సమీపంలోని జాతీయ రహదారి ప్రక్కన హనుమాన్ సర్కిల్ ఎదురుగా ఉన్న ఓ టీ స్టాల్ వద్ద నగదు ఇస్తుండగా అప్పటికే వ్యక్తి నిర్వహిస్తున్న ఎసిబి అధికారులు వల్లపన్ని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

## రూ.15లక్షలతో ఉడాయింపు

### పోలీసులకు ఫిర్యాదు... కేసు నమోదు

**ఏర్పేడు, జూన్ 16 ప్రభాతవార్త:** రూ.లక్షకు మూడు లక్షలు అంటూ ఓ సామాన్యునికి ఆశ చూపి రూ.15 లక్షలతో ఉడాయించిన సంఘటన మంగళవారం తిరుపతి జిల్లా ఏర్పేడు మండల కేంద్ర సమీపంలో చోటుచేసుకుంది. ఓ సామాన్యుడు అత్యాసకు పోయి మొదటికి మోసపోయిన ఘటన గురించి పోలీసులకు ఫిర్యాదు అందింది. మంగళవారం శ్రీకాళహస్తి తిరుపతి హైవేలో చోటు చేసుకున్న సంటనపై ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు అందింది. అంజిమేడు గ్రామ సమీపంలోని ఓ ప్రైవేటు డాబా వద్ద తిరుపతి జిల్లా తడ మండలం వెండ్లూరు గ్రామానికి చెందిన కె.రవిచంద్రారెడ్డి అనే వేణు ఆతనికి కొందరు వ్యక్తులు లక్షకు మూడు లక్షలు డబ్బు ఇస్తామని ఆశ చూపారు. దాంతో రవిచంద్రరెడ్డిని ప్రైవేటు డాబా వద్ద సిట్టింగ్ ఏర్పాటు చేసారు. ఒప్పందం మేరకు అతనిని బెదిరించి ఆతని వద్ద ఉన్న రూ.15 లక్షలు తీసుకొని కారులో పలాయనం చిత్తగించినట్లు బాధితుడు ఫిర్యాదు చేసారు. ఈ మేరకు సిఐ శ్రీకాంత్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కదిరి కూటమిలో కుంపట్లు మొదలయ్యాయా?

- ఎమ్మెల్యే కందికుంట, బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి మధ్య సైలెంట్ వార్ నడుస్తున్నదా?
- అంతు పట్టని కదిరి రాజకీయం

**అనంతపురం, జూన్ 16 ప్రభాతవార్త బ్యూరో:** శ్రీ సత్యసాయి జిల్లా కదిరి శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్ తెలుగుదేశం పార్టీని బలోపేతం చేశారు. ఎన్నికల్లో గెలిచినా ఓడినా పార్టీలోనే వ్యూహాత్మకంగా తనదైన శైలిలో పావులు వెతుకుతుంటాడు. ఇప్పటివరకు రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లయిన నేపథ్యంలో రాబోయే ఆరు నెలల్లో మంత్రివర్గ విస్తరణ జరిగితే తన సీనియార్టీని గుర్తిస్తే మంత్రి కావాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆశతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా కదిరిలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి మధ్య అంతర్గతంగా సైలెంట్ వార్ నడుస్తోందని, ఎందుకు ఏమిటి అన్నది తిరిగి రావటం లేదని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది. అయితే బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి పలు విషయాలపై ఎమ్మెల్యే పేరు ప్రస్తావించకుండా కదిరి ప్రాంతంలో అవినీతిపై స్పందిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాత్రం బహిరంగంగా ఎక్కడ మాట్లాడకుండా మౌనంగా ఉన్నాడని, కొందరు కదిరి టౌన్ టిడిపి నాయకులు మాత్రం బహిరంగంగా బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి వైసీపీకి ఏజెంట్ గా ఉన్నాడని, కుటుంబ ప్రభుత్వంపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. తాజా సంఘటనతో ఆధారంగా కదిరిలో కూటమిలో కుంపట్లు మొదలయ్యాయని రాజకీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తాజాగా సోమవారం అనంతపురంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కదిరి బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి డీఎస్సీ విషయంలో వైసీపీ నేతలు అనవసర ఆరోపణలు చేస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అదే సమయంలో విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా తనకు ప్రాణహాని ఉందని, కొందరు వ్యక్తులు ఫోన్ చేసి తనతో మాట్లాడిన వ్యవహారంపై కదిరి పోలీసులకు ఫిర్యాదు చేశారని, ఆ ఫిర్యాదుపై కదిరి పోలీసులు స్పందించకపోతే జిల్లా ఎస్పీని కలుస్తానని చెప్పడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గత మార్చి నుంచి కూటమిలో చిన్నపాటి వివాదాలు పట్టింపుకుపోవడంతో పెరుగుతూ వచ్చాయి. గతంలో కదిరి ఎమ్మెల్యేగా బిజెపి తరపున ఎమ్మెస్ పార్థసారధి ఉండేవారు. టిడిపి, బిజెపి పొత్తులో భాగంగానే అప్పట్లో టిడిపి అండతో ఎమ్మెల్యే అయ్యారు. ఆ సమయంలో ఎమ్మెస్ పార్థసారధి కలిసి కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు జరిగినప్పుడు విష్ణువర్ధన్ రెడ్డి కూడా తీరే ఎక్కేవారు. అలా కదిరి తీరు లాగినప్పుడల్లా పార్థసారధితో పాటు విష్ణువర్ధన్ రెడ్డి తీరే ఎక్కే వారిని చెబుతుంటారు. అయితే గత మార్చిలో ప్రముఖ కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు జరిగినప్పుడు బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి తేరు ఎక్కకుండా పోలీసులు హౌస్ అరెస్టు చేశారని, దీని వెనుక ఎమ్మెల్యే ఉన్నాడని బిజెపి వర్గీయుల అనుమానం. ఈ విషయంపై అప్పట్లో టిడిపి పెద్దలకు, బిజెపి పెద్దలకు విష్ణువర్ధన్ రెడ్డి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.. ఆ తర్వాత కాలక్రమమైన కదిరి పట్టణంలో జరుగుతున్న కొన్ని విషయాలపై బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి ప్రత్యక్షంగా పరోక్షంగా పావులు కలిగినట్లు తెలుస్తోంది. ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని కదిరి మున్సిపల్ కమిషనర్ పైన, కదిరి సబ్ రిజిస్టర్ ఆఫీస్‌పైన రాష్ట్ర మంత్రి నారాయణ, ఇతర ఉన్నతాధికారులకు బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి ఫిర్యాదులు చేసినట్లు తెలియ వచ్చింది. అదేసమయంలో కదిరి లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో టెంకాయల టెండర్ల వ్యవహారంలో అవినీతి జరిగిందని ఫిర్యాదు చేసి టెండర్లు నిలుపుదల వెనుక బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా సోమవారం (15వ తేదీ) పలువురు బిజెపి జిల్లా నేతలతో అనంతపురంలో విలేకరుల సమావేశానికి బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి సన్నద్ధమయ్యారు. ఆ మేరకు వాట్సాప్ గ్రూపుల ద్వారా విలేకరులకు చేరవేశారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల ఉత్సవాల జరుగుతున్న నేపథ్యంలో కదిరి వివాదం పైన బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి ఏదైనా మాట్లాడతారని అనుకున్నారా ఏమోగానీ రాష్ట్ర మంత్రి ఒకరు విష్ణువర్ధన్ రెడ్డికి ఫోన్ చేసి వివాదాలు మాట్లాడవద్దని చెప్పడంతో, డీఎస్సీ పై వైసీపీ చేస్తున్న ఆరోపణలపై స్పందిస్తానని విష్ణువర్ధన్ రెడ్డి సమాధానం ఇచ్చి అమెరికా విలేకరులతో మాట్లాడినట్లు విశ్వసనీయ వర్గాల బోగట్టా. బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి పార్టీ తరఫున వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తూ పార్టీ అప్పగించిన పనులు చేస్తుంటారు. ఇన్నాళ్లు వన్ ప్లస్ వన్ గన్మెన్ల భద్రత ఉంది. తాజా పరిణామాలతో కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు ఆ గన్మెన్ల భద్రతను ఇంకా ఎక్కువగా పెంచినట్లు తెలియ వచ్చింది. విష్ణువర్ధన్ రెడ్డి వ్యవహారంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట ఎక్కడ బహిరంగంగా స్పందించకపోవడం కొసమెరుపుగా చెప్పొచ్చు.

17-6Pg5.qxd:17-6Pg5.qxd 1/1/02 6:25 AM Page 1



# రూ.75వేల సహకార రుణాలు మాఫీ

## తమిళ సీఎం విజయ్ సంచలన నిర్ణయం
## పంటరుణాలు తీసుకొన్న రైతులకు భారీ ఊరట

**చెన్నై,జూన్ 16:** తమిళనాడు రైతాంగానికి ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వం భారీ తీపి కబురు అందించింది. సహకార బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకున్న అన్నదాతలకు పెద్ద ఎత్తున ఊరటనిస్తూ రుణమాఫీ పథకంలో సవరణలు చేస్తూ మంగళవారం ప్రకటించింది. గతంలో ప్రకటించిన నిబంధనలపై రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలు, నిరసనలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం అందరికీ ప్రయోజనం చేకూరేలా ఈ పథకం పరిధిని మరింతగా విస్తరించింది. తాజా మార్పుల ప్రకారం సహకార బ్యాంకుల నుంచి రూ. 75,000 వరకు పంట రుణాలు తీసుకున్న సన్న, చిన్న, పెద్ద రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ వర్తింపజేయనున్నారు. రూ. 75,000 కంటే ఎక్కువ మొత్తంలో రుణాలు కలిగి ఉన్న రైతులకు సైతం ప్రభుత్వం అండగా నిలిచింది. అలాంటి రైతులకు ఒక్కొక్కరికి రూ. 35,000 చొప్పున రుణ విముక్తి కల్పించనున్నట్లు ముఖ్యమంత్రి విజయ్ స్పష్టం చేశారు. నిజానికి గత నెలలోనే విజయ్ ప్రభుత్వం రుణమాఫీపై ప్రాథమిక ప్రకటన చేసింది. ఆ నిబంధనల ప్రకారం సన్నకారు రైతులకు రూ. 50 వేల వరకు పూర్తి మాఫీ, చిన్న రైతులకు రూ. 50 వేల లోపు రుణాలపై 50 శాతం మాత్రమే మాఫీ ఇవ్వాలని భావించారు. అలాగే రూ. లక్ష వరకు రుణాలున్న పెద్ద రైతులకు కేవలం రూ.5వేల వరకు మాత్రమే రాయితీ ఇస్తామన్నారు. అయితే ఈ అరకొర మాఫీపై రాష్ట్రవ్యాప్తంగా రైతాంగం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిరసనలకు దిగింది. రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో ముఖ్యమంత్రి విజయ్ సోమవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రైతుల డిమాండ్లపై సుదీర్ఘంగా చర్చించిన అనంతరం పాత నిబంధనలను పక్కనబెట్టి మరింత ఉదారంగా కొత్త మార్గదర్శకాలను ఖరారు చేశారు. ఈ తాజా సవరణల నిర్ణయం వల్ల తమిళనాడు వ్యాప్తంగా దాదాపు 14.43 లక్షల మంది రైతు కుటుంబాలకు అపారమైన ఆర్థిక లబ్ధి చేకూరనుంది. కాగా ఈ నిర్ణయంతో రాష్ట్రప్రభుత్వ ఖజానాపై రూ. 5,932కోట్ల మేర అదనపు ఆర్థిక భారం పడనుంది. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను క్షుణ్ణంగా అంచనా వేసిన తర్వాతే రైతుల సంక్షేమాన్ని కాంక్షించి ఈ సాహసోపేత నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. మరోవైపు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలకు ఎక్కడా విఘాతం కలగకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. రుణమాఫీకి సంబంధించి సహకార బ్యాంకులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పూర్తి మొత్తాన్ని రాబోయే 45 నుంచి 60 రోజుల్లోగా పూర్తిగా చెల్లిస్తామని అధికారికంగా ప్రకటించింది. ప్రభుత్వ తాజా నిర్ణయంపై తమిళనాడు రైతు సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

### విడాకుల కేసు ఆగస్టు 7కు వాయిదా

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, ఆయన భార్య సంగీత స్వర్ణలింగంల విడాకుల వ్యవహారంలో న్యాయస్థానంలో మరోసారి ప్రతిష్టంభన ఎదురైంది. వీరిద్దరి వివాహ రద్దు పిటిషన్‌పై సోమవారం చెంగల్పట్టు కుటుంబ న్యాయస్థానం లో జరగాల్సిన విచారణ మళ్లీ వాయిదా పడింది. ఈ విచారణకు అటు ముఖ్యమంత్రి విజయ్ కానీ, ఇటు సంగీత కానీ వ్యక్తిగతంగా హాజరు కాకపోవడంతో న్యాయమూర్తి తదుపరి విచారణను ఆగస్టు 7వ తేదీకి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం నాటి కోర్టు విచారణకు విజయ్, సంగీత ఇద్దరూ రాలేదు. వారి తరఫు న్యాయవాదులు మాత్రమే కోర్టుకు హాజరై ప్రస్తుత పరిస్థితులను న్యాయమూర్తికి వివరించారు. ఇరుపక్షాల ముఖ్య వ్యక్తులు అందుబాటులో లేకపోవడంతో విచారణ ప్రక్రియ ఆశించిన విధంగా ముందుకు సాగలేదు. దీంతో అసంతృప్తి వ్యక్తం చేసిన న్యాయమూర్తి కేసు తదుపరి విచారణను ఆగస్టు నెలకు పొడిగించారు. ఈ కేసులో ఇలాంటి ఆలస్యం జరగడం ఇదే మొదటిసారి కాదు. గత కొన్ని నెలలుగా ఈ విడాకుల పిటిషన్ వరుస వాయిదాలతో నలుగు తోంది. అంతకుముందు జరిగిన పలు విచారణల సందర్భాల్లోనూ విజయ్, సంగీత కోర్టుకు రాలేదు. ప్రతిసారీ వారి లీగల్ రిప్రజెంటేటివ్స్ మాత్రమే హాజరవుతూ వస్తున్నారు. అంతకుముందు ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం కేసును జూన్ 15వ తేదీ అంటే సోమవారం రోజుకు వాయిదా వేసింది. అయితే ఈసారి కూడా వారిద్దరూ రాకపోవడంతో కేసు మరింత కాలం ముందుకు పడేలా చేసింది.

# హార్ముజ్‌ను దాటిన ఐదు నౌకలు

## జలసంధిపై పట్టు సడలించిన అమెరికా
## అంతర్జాతీయ జలాల్లోకి రాకపోకలు

**వాషింగ్టన్, జూన్ 16:** అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందం అధికారికంగా ఖరారు కానున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇంతకాలం హార్ముజ్ జలసంధిని దిగ్బంధించిన అమెరికా పట్టు సడలించింది. దాంతో కనీసం ఐదు ఇరాన్ నౌకలు ఆ జలసంధిని దాటి, అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాయని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించిన తర్వాత ఆ ప్రభావం హార్ముజ్ జలసంధిలో రాకపోకలపై పడింది. అమెరికా, దాని మిత్ర దేశాల నౌకలను ఇరాన్ అడ్డుకోగా ఇరాన్ పోర్టుల నుంచి రాకపోకలు సాగించే నౌకలను అడ్డగిస్తూ అమెరికా దిగ్బంధనం ప్రకటించింది. అటు ఇరాన్, ఇటు అమెరికా హార్ముజ్‌ను దిగ్బంధించడంతో ప్రపంచ దేశాలు ఇంధన సంక్షోభంలో చిక్కుకుపోయాయి. ఇప్పుడు శాంతి ఒప్పందానికి సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, ఇరాన్ బృందానికి నాయకత్వం వహించిన ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాగేర్ ఘాలిబఫ్ సంతకాలు చేశారు. డిజిటల్ రూపంలో ఈ సంతకాలు జరగ్గా, శుక్రవారం స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో అధికారిక కార్యక్రమం ఉంటుంది. ఈ వరుస పరిణామాలు వేళ ఇరాన్ నౌకలు హార్ముజ్‌ను దాటాయి. శాంతి ఒప్పందంపై ప్రకటన చేసినప్పుడే హార్ముజ్ దిగ్బంధనాన్ని ఎత్తివేస్తున్నట్లు ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇప్పుడది వాస్తవ రూపం దాల్చినట్లు కనిపిస్తోంది.

**రెండు దశలుగా అమెరికా-ఇరాన్ చర్చలు..**

అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు రెండు దశల్లో జరుగుతాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వెల్లడించారు. తొలి దశలో ప్రధాశాంశం హార్ముజ్ జలసంధి అని వెల్లడించారు. దాంతో పాటు అమెరికా దిగ్బంధనం, ఇరాన్ పునర్నిర్మాణం గురించి చర్చలు ఉంటాయని చెప్పారు. అణు సంబంధిత అంశాలు, ఆంక్షల నుంచి ఉపశమనం వంటివి రెండో దఫాలో చర్చిస్తామని పేర్కొన్నారు. అయితే, లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనిక కార్యకలాపాలే ఈ ఒప్పంద చర్చలు ఎటు వెళ్లాలో నిర్ణయిస్తాయని, ఈ విషయం ట్రంప్ యంత్రాంగానికి బాగా తెలుసునని అన్నారు. ఇజ్రాయెల్‌ను కట్టడి చేయాల్సిన బాధ్యత అమెరికాపైనే ఉందని, అది ట్రంప్‌నకు పెద్ద సవాల్‌గా మారబోతోందని వ్యాఖ్యలు చేశారు.

# శాంతి చర్చల్లో ఇద్దరు ఇరాన్ సైకాలజిస్టులు!

**ఇరాన్, జూన్ 16:** పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించే లక్ష్యంతో జరిగిన శాంతి చర్చల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యవహారశైలిని ఎదుర్కోవడానికి ఇరాన్ ఒక అసాధారణమైన మార్గాన్ని అనుస రించినట్లు సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ట్రంప్ మానసిక స్థితిని అంచనా వేయ డానికి, ఆయన ప్రవర్తనను అర్థం చేసుకోవడానికి ఇరాన్ ఇద్దరు సీనియర్ సైకాలజిస్టుల సహాయం తీసుకున్నట్లు ఒక కథనం వెల్లడించింది. ట్రంప్ ఎప్పటికప్పుడు మారే స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని, చర్చల ప్రక్రియను సులభతరం చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఇరాన్‌కు చెందిన ఒక అధికారి మాట్లాడుతూ ట్రంప్ ప్రవర్తనలో మానసిక రుగ్మత ధోరణులు ఉన్నాయని మేము భావించాము. అందుకే చర్చలకు సంబంధించిన సలహాదారుల బృందంలో ఇద్దరు సీనియర్ సైకాలజిస్టులను చేర్చాము. వారి సహాయంతో ట్రంప్‌నకు పంపే సందేశాలను జాగ్రత్తగా రూపొందించాము అని పేర్కొన్నారు. ఏప్రిల్‌లో ఇస్లామాబాద్‌లో తొలి విడత చర్చలు ముగిసిన తర్వాత ఇరాన్ ఈ మానసిక నిపుణుల సలహాలు తీసుకోవడం ప్రారంభించినట్లు సమాచారం. ఈ వ్యూహం ఫలించిందని, తమ సలహాదారుల సిఫార్సులను పాటించడం మొదలుపెట్టినప్పటి నుంచి ట్రంప్ స్పందనలో స్పష్టమైన మెరుగుదల కనిపించిందని ఆ అధికారి వివరించారు. భవిష్యత్తులో ఈ చర్చల వివరాలు బయటకు వస్తే, తమ పద్ధతులు ఎంత పకడ్బందీగా ఉన్నాయో స్పష్టమవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ట్రంప్ ప్రవర్తనపై అమెరికాలోనూ భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఈ ఏడాది మొదట్లో ఇప్సోస్ నిర్వహించిన ఒక సర్వేలో 10 మంది అమెరికన్లలో 6 మంది ట్రంప్ వయసు పెరిగేకొద్దీ ఆయన ప్రవర్తన అస్థిరంగా మారిందని అభిప్రాయపడ్డారు. వీరిలో 89 డెమోక్రాట్లు, 30 రిపబ్లికన్లు ఉండటం గమనార్హం.

# పార్టీని వీడే వారు నిశ్చింతగా వెళ్లిపోవచ్చు

## శివసేన చీఫ్ ఉద్ధవ్‌థాకరే

**ముంబయి,జూన్ 16:** పార్టీని వీడాలనుకునే వారిని తాను బలవంతం చేయబోనని శివసేన అధినేత ఉద్ధవ్‌థాకరే స్పష్టం చేశారు. శివసేనను వీడాలనుకునే వారు నిశ్చింతగా వెళ్లిపోవచ్చన్న స్పష్టం చేశారు. పార్టీలో ఉండమని ఎవరిపైనా ఒత్తిడి చేయొద్దని నిర్ణయించు కున్నానని ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో జరిగిన చీలిక గురించి ప్రస్తావిస్తూ బాలాసాహెబ్ థాకరే స్థాపించిన పార్టీని వీడిన వారు తమ నిర్ణయం పట్ల చివరికి పశ్చాత్తాపపడతారని థాకరే అన్నారు. ఈ రోజు నాది కాకపోవచ్చు, కానీ రేపు కచ్చితంగా నాదే. అప్పటి వరకు మనం ఇలాంటివి భరించాల్సి ఉంటుందని థాకరే అన్నారు. మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఉద్ధవ్ థాక్రే వర్గానికి చెందిన శివసేన ఎంపీలు షిండే వర్గంలో చేరబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు ఏడుగురు ఎంపీలు షిండేతో సంప్రదింపులు జరుపుతున్నారని, వచ్చే వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లోపు వారంతా షిండే వర్గంలో చేరే అవకాశం ఉందని శివసేనకు చెందిన మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే క్రిపాలు మానె వెల్లడించారు. ఈ నేపథ్యంలో కొంత మంది పార్టీ ఎంపీల విధేయతపై వస్తున్న ఊహాగానాలపై శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ థాకరే మౌనం వీడారు.

# అది ట్రంప్ తీసుకొన్న నిర్ణయం

## మా ప్రయోజనాలు వేరు..
## శాంతి ఒప్పందంపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు

**జెరుసలేం, జూన్ 16:** అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో తనకు కొన్నిసార్లు విభేదాలు వస్తుంటాయని అంగీకరించారు. ఓ పత్రికా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందానికి సంబంధించి ఎదురైన ప్రశ్నకు నెతన్యాహు బదులిస్తూ.. 'నాకు, ట్రంప్‌నకు మధ్య కొన్నిసార్లు విభేదాలు వస్తుంటాయి. అమెరికాతో సంబంధాల విషయంలో ఇజ్రాయెల్ తన సొంత ప్రయోజనాలకు కట్టుబడి ఉంది. ఇరాన్‌తో శాంతి ఒప్పందాన్ని ట్రంప్ కుదుర్చుకున్నారు. అది ఆయన నిర్ణయం. మాకు మా సొంత ప్రయోజనాలు ఉన్నాయి' అని వ్యాఖ్యానించరు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు లేకుండా చూడటమే తన లక్ష్యమన్నారు. తాను అధికారంలో ఉన్నంత కాలం అది జరుగుతుందన్నారు. శాంతి ఒప్పందం ఉన్నా.. లేకున్నా ఇరాన్ వద్ద అణ్వాయుధాలు మాత్రం ఉండవని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన సైనిక ఘర్షణల్లో ఇరాన్ ఆర్థిక వ్యవస్థ పతనమైందని నెతన్యాహు పేర్కొన్నారు. దాని సైనికులకు, వ్యూహాత్మక మౌలిక సదుపాయాలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఈ నష్టం విలువ వందల బిలియన్ డాలర్ల వరకు ఉంటుందని అంచనా వేశారు. ఈ సందర్భంగా ఘర్షణ ఇంకా ముగియలేదంటూ నెతన్యాహు హెచ్చరికలు చేశారు. ఇరాన్ దాని మిత్ర దేశాల నుంచి ఎదురయ్యే ముప్పులను సమర్థవంతంగా ఎదుర్కొంటూనే ఉంటామన్నారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ రక్షణ వ్యయానికి అదనంగా 350 బిలియన్ షెకెళ్లను (ఇజ్రాయెల్ కరెన్సీ) కేటాయిస్తున్నట్లు నెతన్యాహు ప్రకటించారు.

# రెండుకోట్ల బీమా కోసం భర్తను చంపిన భార్య

**బెళగావి,జూన్ 16:** కర్ణాటకలోని బెళగావి జిల్లాలో జరిగిన ఒక మాజీ సైనికుడి మృతి కేసు సంచలనం సృష్టిస్తోంది. సాధారణ బైక్ ప్రమాదంగా భావించిన ఈ ఘటన రూ.2 కోట్ల ఇన్సూరెన్స్ డబ్బుకోసం భార్య, ఆమె ప్రియుడు కలిసి పన్నిన దారుణ హత్యగా పోలీసులు స్పష్టం చేశారు. ఈ కేసులో మృతుడి భార్య, ఆమె ప్రియుడితో పాటు వైద్యులు, ఫోరెన్సిక్ సిబ్బంది సహా మొత్తం 9 మందిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. మాజీ సైనికుడు సందీప్ మంజర్గి మార్చి 13న బైక్‌పై నుంచి జారిపడి స్వల్పంగా గాయపడ్డారు. దీంతో అతని భార్య సుమ మంజర్గి, మొదట హుక్కేరి ప్రభుత్వ ఆసుపత్రికి, ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం ఘటప్రభలోని జేజీ ఆసుపత్రికి మార్చింది. మార్చి 15న సందీప్ గుండెపోటుతో మరణించి నట్లు వైద్యులు ప్రకటించారు. పోస్టుమార్టం నిమి త్తం మృతదేహాన్ని బీఐఎంఎస్ ఆసుపత్రికి తర లించగా, ప్రాథమిక ఫోరెన్సిక్ నివేదికలో కూడా ఎలాంటి విష ప్రయోగం జరగలేదని, గుండె పోటు వల్లే మరణం సంభవించిందని పేర్కొన్నారు.ప్రమాదంలో తీవ్రగాయాలు కాకపోవడం ఆరోగ్యంగా ఉన్న సందీప్ అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించడంపై పోలీసులకు అనుమానం కలిగింది. ఈ క్రమంలో సుమ ప్రియుడుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న పుండలీక్ దొంబార్ పెట్టిన ఒక సోషల్ మీడియా పోస్ట్ ఈ కేసును కీలక మలుపు తిప్పింది. ప్రమాదానికి గురైన వ్యక్తి అకస్మాత్తుగా ఎలా చనిపోయాడు. అంటూ తనకు అంతా తెలిసినట్లుగా అతను పోస్ట్ పెట్టాడు. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా, అసలు కుట్ర మొత్తం బయట పడింది. పోలీసుల కథనం ప్రకారం సందీప్, పుండలీక్ గతంలో కలిసి హోటల్ వ్యాపారం చేశారు. ఈ క్రమంలోనే సందీప్ భార్య సుమతో పుండలీక్‌కు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇదే సమయంలో సందీప్ పేరు మీద మూడు వేర్వేరు కంపెనీల నుంచి సుమారు రూ.2కోట్ల విలువైన ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకున్నారు. ఆ డబ్బును కాజేయాలనే దురుద్దేశంతోనే ఈ హత్యకు పథకం పన్నినట్లు పోలీసులు గుర్తిం చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమ యంలో సుమ, పుండలీక్ కలిసి సెలైన్ బాటిల్ ద్వారా విషాన్ని, నిద్రమాత్రలను ఇచ్చి సందీప్‌ను హత్య చేశారు. అనంతరం ఈ హత్యను గుండెపోటుగా చిత్రీకరించేందుకు వైద్య, ఫోరెన్సిక్ సిబ్బందికి రూ.3లక్షలకు పైగా లంచం ఇచ్చి నివేదికలను తారుమారు చేయించారు. నిందితుల నుంచి విషం సీసాలు, సిరంజిలు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో సందీప్ భార్య సుమ, ప్రియుడు పుండలీక్‌తో పాటు డాక్టర్ బసవరాజ్, ఎఫ్‌డీఏ అధికారి అశోక్, ఎఫ్‌ఎస్‌ఎల్ క్లర్క్ అప్పాసాహెబ్ సహా మొత్తం 9 మందిని అరెస్ట్ చేశారు.

# రాహుల్ గాంధీ వెన్నుపోటుదారుడు: డిఎంకె ఫైర్

**చెన్నై, జూన్ 16:** లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీపై డిఎంకె ఐటీ సెల్ తీవ్ర విమర్శలు గుప్పించింది. తమిళనాడులో కాంగ్రెస్, డిఎంకె కూటమి విడిపోవడంతో విమర్శలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకుడిని 'ఎ బిగ్ జోక్' అని అభివర్ణించింది. కాంగ్రెస్ అవసరాల కోసం తమను వాడుకుని, ఆ తర్వాత కొత్త పొత్తుల కోసం వెళ్లిపోయారని విమర్శించింది. కాంగ్రెస్ రాజకీయ మనుగడ కోసం పోరాడుతున్నప్పుడు తాము వారిని భుజాలపై మోసాము, కానీ కొత్త మెరిసే బొమ్మను

చూడగానే వారు పడవ నుండి దూకేశారని మండిపడ్డారు. ఇదే సమయంలో డిఎంకె పత్రిక 'మురసోలి'లో తన సంపాదకీ యంలో ఇండియా కూటమి సమావేశం తర్వాత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను తప్పుబ ట్టింది. ప్రతిపక్ష పార్టీల మధ్య చీలికలకు కాంగ్రెస్ నాయకుడే కారణమని ఆరోపించింది. అయితే ఇండియా కూటమిలోని ఇతర ప్రతిపక్ష పార్టీలు లేవనెత్తిన అంశాలకు తాము మద్దతు కొనసాగిస్తామని స్పష్టం చేసింది. రాహుల్ గాంధీ ప్రతిపక్షాల ఐక్యత గురించి బోధిస్తూనే, దానిని బలహీనపరుస్తున్నారని మండిపడింది. ప్రభుత్వాలు ఏర్పాటు చేసే తమ అవకాశాలను దెబ్బతీస్తోందని కూటమి భాగస్వాములే ఆరోపించినప్పుడు, కాంగ్రెస్ ఇప్పుడు ప్రతిపక్షాల ఐక్యత గురించి ఎలా మాట్లాడగలదని ప్రశ్నించింది. ఇండియా కూటమి సమావేశంలో వామపక్షాలు, సమాజ్‌వాదీ పార్టీ సహా పలు ఇం డియా బ్లాక్ భాగస్వామ్య పార్టీలు కాంగ్రెస్‌ను విమర్శించాయని పేర్కొంది. రాహుల్ గాంధీ రాజకీయ వైఖరి ప్రతిపక్ష కూటమిలో పదేపదే ఘర్షణలకు దారితీసిందని వాదించింది.

# సంక్షిప్త వార్తలు

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే: ఖర్గే

**న్యూఢిల్లీ, జూన్ 16:** నీట్ పేపర్ల లీకేజీ, సిబిఎస్‌ఇ పరీక్షల అక్రమాలు జరిగినప్పటికీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోవడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. సదరు మంత్రిని రాజీనామా చేయమని కోరకపోవడం ద్వారా మోడీ సర్కార్ జవాబుదారీతనం అనే పరీక్షలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈ మేరకు ఖర్గే మంగళవారం సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఎన్‌డియే సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. జూన్ 21న జరగనున్న నీట్ యూజీ 2026 రీఎగ్జామ్‌కు ముందు టెలిగ్రామ్ మెసేజింగ్ యాప్ పై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడాన్ని కూడా ఖర్గే తప్పుపట్టారు. పరీక్షల్లో జరిగిన అక్రమాల వల్ల దాదాపు అరడజను మంది యువకులు ప్రాణాలు తీసుకున్నారని ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు.

## భవానీపూర్ ఫలితాలపై హైకోర్టులో మమత పిటిషన్

**కోల్‌కతా, జూన్ 16:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో భవానీపూర్ నియోజకవర్గంలో బిజెపి నేత సువేందు అధికారి చేతిలో ఓటమి పాలైన మమతా బెనర్జీ, ఆ ఫలితాలను సవాల్ చేస్తూ కోల్‌కత్తా హైకోర్టును ఆశ్రయించారు. ఎన్నికల కౌంటింగ్‌లో అక్రమాలు జరిగాయని ఆమె ఆరోపిస్తున్నారు. దీనిపై న్యాయవిచారణ జరపాలని, సంబంధిత ఎన్నికల రికార్డులను భద్రపరచాలని కోరుతూ మమతా బెనర్జీ మంగళవారం హైకోర్టులో స్వయంగా పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత మమతా బెనర్జీ నేరుగా కోల్‌కతా హైకోర్టుకు హాజరవడం ఇది రెండోసారి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భవానిపూర్ నియోజకవర్గం నుంచి సువేందు అధికారి మమతా బెనర్జీపై 15,105 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ ఫలితంపై మమత అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

## చర్చించాకే టిఎంసి రెబెల్ ఎంపిల విలీనంపై నిర్ణయం

**న్యూఢిల్లీ, జూన్ 16:** తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ వర్గీయులతో చర్చించాకే ఆ పార్టీ రెబల్ ఎంపిలు విలీనంపై లోక్‌సభ స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. టిఎంసి రెబల్ ఎంపిలు తాము ఎన్‌సిపిఐలో విలీనమయ్యామంటూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఇటీవల లేఖ అందించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్పీకర్ నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. తిరుగుబాటు చేసిన 20 మంది తృణమూల్ కాంగ్రెస్ ఎంపిల స్థితిగతులను లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా పరిశీలిస్తున్నారని, రెండు వర్గాల వాదనలు విన్న తర్వాతే నిర్ణయం తీసుకుంటారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే లోక్‌సభ స్పీకర్ కార్యాలయం మమతా బెనర్జీ నేతృత్వంలోని టిఎంసి ఎంపిల బృందానికి అధికారిక సమావేశం కోసం ఆహ్వానిస్తూ ఇ-మెయిల్ పంపిందని స్పష్టం చేశాయి. తిరుగుబాటు వర్గం కోరిన విలీన అభ్యర్థనపై, పార్టీ అధికారిక నాయకత్వంతో చర్చించిన తర్వాతే స్పీకర్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని వెల్లడించాయి.

## ఎయిరిండియా విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్



**న్యూఢిల్లీ, జూన్ 16:** కన్నూర్‌నుంచి జెడ్డా బయలుదేరిన ఎయిరిండియా విమానంలో సాంకేతికలోపం తలెత్తింది. టేకాఫ్ అయిన కాసేపటికే ఇంజిన్‌లో సమస్య ఉన్నట్లు వార్నింగ్ లైట్స్ వెలగడంతో పైలట్లు వెంటనే అప్రమత్తమయ్యారు. ముందుజాగ్రత్త గా గాల్లోనే రెండుగంటల పాటు చక్కెర్లు కొట్టించి ఇంధనాన్ని పూర్తిగా ఖర్చు చేశారు. తర్వాత కన్నూర్ ఎయిర్ పోర్టులోనే ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు.దీంతో అందులోని 180 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఇంజిన్ ఫ్యూయల్ ఫిల్టర్‌లో లోపమే దీనికి కారణమని అధికారులు గుర్తించారు.

## జస్పాల్ రాణా తల్లి కన్నుమూత



**న్యూఢిల్లీ, జూన్ 16:** దివంగత భారత షూటింగ్ దిగ్గజం, కోచ్ జస్పాల్ రాణా తల్లి శ్యామా దేవి రాణా కన్నుమూశారు. జస్పాల్ రాణా మరణించిన నాలుగు రోజులకే ఆయన తల్లి కూడా మరణిం చటంతో వారి కుటుంబంలో విషాదఛా యలు అలుముకున్నాయి. కుమారుడి ఆకస్మిక మరణాన్ని శ్యామా దేవి తట్టుకోలేక తీవ్ర మనోవేదనకు గురైనట్టు వారి కుటుంబసభ్యులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఢిల్లీలోని ఆర్మీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె తుది శ్వాస విడిచారు.

# చైనా, జపాన్, ఇండోనేసియాల్లో భూకంపం

## డ్రాగన్ కంట్రీలో ఒకరి మృతి, నలుగురికి గాయాలు

**న్యూఢిల్లీ/బీజింగ్, జూన్ 16:** చైనా, జపాన్, ఇండోనేషియాలోని కొన్ని ప్రాంతాల్లో మంగళవారం భూకంపాలు సంభవించాయి. అత్యధికంగా 6.7 తీవ్రతతో ఇండోనేషియాలోని సులవేసి ద్వీపంలో భూకంపం సంభవించగా, ఆ తర్వాత చైనాలోని క్వింగ్‌హైలోని హైక్సీ ప్రిఫెక్చర్‌లో 6.3 తీవ్రతతో, జపాన్‌లోని హోన్షు తూర్పు తీరానికి సమీపంలో 6 తీవ్రతతో ప్రకంపనలు సంభవించాయి. చైనాలో భూకంపం కారణంగా ఒక వ్యక్తి మరణించగా, మరో నలుగురు గాయపడ్డారు. ఇండోనేషియాలో ఎనిమిది మంది



గాయపడ్డారు. జపాన్‌లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. స్థానిక మీడియా కథనం ప్రకారం, ఇండోనేషియాలోని పాలుకు తూర్పు ఆగ్నేయంగా స్థానిక కాలమాన ప్రకారం ఉదయం 10:27 గంటలకు ప్రకంపనలు సంభవించినట్లు మొదట నివేదికలు వెలువడ్డాయి. దాదాపు 4 లక్షల జనాభా ఉన్న పాలు, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లోని బహిరంగ ప్రదేశాల్లోకి ఈ ప్రకంపనలు ప్రజలను పరుగులు పెట్టించాయి. పైకప్పులు కూలిపోవడం, గోడలు బద్దలవడం, శిథిలాలు వీధులపై చెల్లాచెదురుగా పడటంతో భారీ నష్టం వాటిల్లింది. నష్టం, నిరాశ్రయులైన ప్రజల గురించిన సమాచారం ఇంకా సేకరిస్తున్నట్లు ఇండోనేషియాలోని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. భూకంప కేంద్రం 43 కిలోమీటర్ల ఎత్తులో, సుమారు 10 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు సమాచారం. ఆ తర్వాత అనేక ప్రకంపనలు సంభవించాయి, వాటిలో అత్యంత బలమైనది 5.2 తీవ్రతతో నమోదైంది. ఇండోనేషియాలో మాదిరిగానే, క్వింగ్‌హైలో కూడా 4.9 తీవ్రతతో సహా అనేక ప్రకంపనలు సంభవించాయి.

## రెండు ట్రక్కులు ఢీ
# ఇద్దరు డ్రైవర్లు సజీవ దహనం

**భువనేశ్వర్, జూన్ 16:** ఒడిశాలో దారుణం జరిగింది. రెండు ట్రక్కులు ఢీకొన్న ఘటనలో వాటిలోని ఇద్దరు డ్రైవర్లు సజీవ దహనమయ్యారు. ఈ ఘటన మంగళవారం ఉదయం ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లా, భస్మా పోలీస్ స్టేషన్ పరిధిలో కైంత్రా వద్ద, పదో నెంబర్ జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైవేపై ఝూర్సుగూడ నుంచి సుందర్‌గఢ్ వెళ్తున్న ట్రక్కు అతివేగం కారణంగా అదుపు తప్పింది. వేగాన్ని డ్రైవర్ నియంత్రించలేకపోవడంతో డివైడర్‌ను దాటిన ట్రక్కు ఒకవైపు నుంచి మరోవైపు రోడ్డు మీదికి వెళ్లిపోయింది. దీంతో అటువైపు నుంచి వస్తున్న ట్రక్కును ఢీకొంది. ఇలా రెండు ట్రక్కులు ఢీకొనడంతో వెంటనే మంటలు చెలరేగాయి. అవి పెద్ద ఎత్తున వ్యాపించి, పూర్తిగా అంటుకున్నాయి. ఈ ఘటనలో రెండు ట్రక్కుల్లోని డ్రైవర్లు మంటల్లో సజీవదహనమయ్యారు. మంటల తీవ్రత కారణంగా డ్రైవర్ల మృతదేహాలు తీవ్రంగా కాలిపోయాయి. ఇంకా డ్రైవర్లను గుర్తించాల్సి ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# డాక్టర్ చీటీ ఉంటేనే దగ్గు సిరప్

## కేంద్రం కఠిన ఆదేశాలు

**న్యూఢిల్లీ, జూన్ 16:** దగ్గు మందు విక్రయాల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. దగ్గు సిరప్‌లను కొనేందుకు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి అని కేంద్రం పేర్కొన్నది. ఈ నేపథ్యంలో కాఫ్‌సిరప్ విక్రయాలకు డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌ను తప్పనిసరి చేస్తూ డ్రగ్స్ రూల్స్ 1945 కింద నోటిఫికేషన్ విడుదల చేసింది. గతంలో కాఫ్ సిరప్‌లు షెడ్యూల్ కే డ్రగ్స్ జాబితాలోని క్లాస్ ఆఫ్ డ్రగ్స్ సెక్షన్‌లో 7వ ఎంట్రీగా ఉండేవి. దీంతో, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకపోయినా మెడికల్ షాపులు వినియోగదారులకు కాఫ్‌సిరప్‌లను విక్రయించే అవకాశం ఉండేది. ఈ షెడ్యూల్‌కు కేంద్రం తాజాగా మార్పులు చేసింది. కాఫ్ సిరప్‌లను షెడ్యూల్‌కేలోని మినహాయింపు జాబితా నుంచి తొలగిస్తున్నట్టు తెలిపింది. ఈ కొత్త రూల్‌కు సంబంధించిన ముసాయిదా నిబంధనలను కేంద్రం గతేడాది డిసెంబర్‌లోనే విడుదల చేసింది. ప్రజల అభిప్రాయాన్ని సేకరించింది. అనంతరం, తుది మార్గదర్శకాలను కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ తాజాగా జారీ చేశారు. ఈ నేపథ్యం లో దేశవ్యాప్తంగా మెడికల్ షాపులన్నీ ఇకపై మెడికల్ ప్రిస్క్రిప్షన్ ఉన్న వారికే సిరప్‌లను విక్రయించాల్సి ఉంటుంది. తమిళనాడుకు చెందిన శ్రీసన్ కంపెనీ ఉత్పత్తి చేస్తున్న కోల్డ్రిఫ్ దగ్గు సిరప్ తాగి సుమారు 20 మంది చిన్నారులు మృతి చెందారు. అయితే ఆ ఘటన పట్ల ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. భారత్ తయారీకి చెందిన దగ్గు మందుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డబ్ల్యూహెచ్‌వో తన హెచ్చరికల్లో పేర్కొన్న విషయం తెలిసిందే.

# అయోధ్య రాముడికి ఖరీదైన ప్రసాదం

**ప్రయాగ్‌రాజ్, జూన్ 16:** ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన మామిడి పండును అయోధ్య బాల రాముడికి నైవేద్యంగా పెట్టారు. జపాన్‌కు చెందిన మియాజాకీ అనే ప్రత్యేకమైన మామిడిపళ్లు కిలో రూ.2.5 నుంచి రూ.3 లక్షల వరకు ఉంటాయి. ఒక్కో పండు ధర దాదాపు రూ.లక్షకు పైగానే ఉంటుంది. ఓం ప్రకాశ్ సింగ్ అనే రైతు వీటిని పండించగా.. అతడి నుంచి కొనుగోలు చేసిన సీజన్‌లోని మొట్టమొదటిగా పండిన పండును స్థానిక సంప్రదాయాలకు అనుగుణంగా తులసి ఆకుల్లో పెట్టి బాలరాముడికి నైవేద్యంగా సమర్పించారు.

# అమెరికా విమాన ప్రమాదంలో కోసిగి యువకుడు మృతి

- ప్యారాచ్యూట్‌తో విన్యాసం.. విమానంలో సాంకేతిక లోపం
- పైలట్‌తో సహా 12 మృతి... అందులో కోసిగి వాసి

**కోసిగి, జూన్ 16 ప్రభాతవార్త:** అమెరికాలోని మిస్సోరిలో జరిగిన విమాన ప్రమాదంలో కర్నూలు జిల్లా కోసిగి మండలం తుమ్మిగనూరు గ్రామానికి చెందిన సాయి కార్తీక్ వర్మ(28) అనే యువకుడు మృతి చెందాడు. కోసిగి మండలం తుమ్మిగనూరు గ్రామానికి చెందిన సుబ్రమణ్యం రాజు కుమారుడు గత 10 సంవత్సరాల నుండి అమెరికాలోని మిస్సోరిలో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కాగా తన క్లాస్‌మెట్‌తో కలసి విమానంలో నుండి కిందికి ప్యారాచ్యూట్ ద్వారా దిగే విన్యాసాలు చేసేవారు. ఇలాగే గతంలో కూడా పలు మార్లు ఈ విన్యాసాలు చేసినట్లు తెలిపారు. మరోసారి ఈ విన్యాసాలు చేయాలని సంకల్పించి ఆదివారం వారికి సెలవు కావడంతో తన స్నేహితులతో కలసి విమానంలో విహారం చేసేవారని వారి తల్లిదండ్రులు తెలిపారు. కాగా తన కుమారుడితో పాటు అమెరికా దేశానికి చెందిన వారు కూడా ఈ విన్యాసం చేస్తుండడంతో వారి తల్లిదండ్రులు ఈ విన్యాసాన్ని చూసేందుకు వెళ్లారు. కాగా విమానం 300 మీటర్ల ఎత్తుకు వెళ్లింది. వెంటనే విమానంలో సాంకేతిక లోపం రావడంతో ఆ యువకుల తల్లిదండ్రుల ఎదుటే ఆ విమానం కుప్పకూలిపోయినట్లు చెప్పారు. దీంతో తమ కళ్లెదుటే ఈ సంఘటన జరగడంతో వారు పడిన వేదన వర్ణింపరానిదని అక్కడి వారు తెలిపినట్లు కోసిగి యువకుడి తండ్రి తెలిపారు. కాగా తుమ్మిగనూరు గ్రామానికి చెందిన సుబ్రమణ్యం రాజు, దాట్ల పద్మావతిలకు ఒకే కుమారుడు వందల కొద్ది పొలాలు ఉన్నాయి. అబ్బాయిని బాగా అమెరికాలోనే చదివించారు. ఎంతో కష్టపడ్డారు. తుమ్మిగనూరు నుండి రాజానగర్‌కు మకాం మార్చారు. అక్కడే డైరీఫాం ఏర్పాటు చేసుకుని అప్పుడప్పుడు తుమ్మిగనూరుకు వచ్చి తమ పొలాలను చూసుకునేవాడు. అయితే తన కుమారుడు సాయి కార్తీక వర్మ స్థిర పడితే ఇక్కడి ఆస్తులన్ని విక్రయించి తాము కూడా అమెరికాకు వెళ్లి తన కుమారుడితోనే ఉండాలని ప్రణాళికను సిద్దం చేసుకునా న్నరు. అంతలోనే ఇలా విమానం రూపంలో మృత్యువు తన కుమారుడిని కబలించిందని తల్లిదండ్రులు వాపోయారు. తుమ్మిగనూరు రాజుగా పిలువబడే సుబ్రమణ్యం రాజు గతంలో నుండే తెలుగుదేశం పార్టీలో కొనసాగేవాడు. తన కుమారుడి దుర్ఘటన జరిగిన విషయాన్ని తెలుసుకున్న పలువురు టిడిపి నాయకులు ఆయనకు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసారు.

# ఆక్వా ఫీడ్ ధరలను తగ్గించండి

- వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్
- జులై 1 లేదా 2న రైతులతో కలిసి ఆందోళన



ఆక్వా రైతులతో మాజీ సిఎం జగన్

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** దారుణంగా పెరిగిన ఆక్వా ఫీడ్ ధరలను ఈనెలాఖరులోగా తగ్గించాలని, లేని పక్షంలో వచ్చే నెల 1 లేదా 2వ తేదీన రైతులతో కలిసి ఆందోళన చేస్తామని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సిపి అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి హెచ్చరించారు. 2019-24 మధ్య ఆక్వా రంగానికి తమ ప్రభుత్వం పూర్తి అండగా నిల్చిందన్నారు. ఆక్వా రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న పరిస్థితుల మధ్య వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఆక్వా రైతులతో పాటు, ఎపి ప్రాన్ ఫెడరేషన్ ప్రతినిధులు వైయస్సార్‌సిపి కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి తమ సమస్యలు వివరించారు. వారి సమస్యలు సావధానంగా విన్న వైయస్ జగన్, ఆక్వా రైతులకు పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే ఇస్తామని ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నామని, 57 నెలల్లో ఆ మేరకు విద్యుత్ సబ్సిడీ కింద రూ.3,306 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. 2014-19 మధ్య అదే యూనిట్ విద్యుత్‌కు రూ.3.85వసూలు చేసిన నాటి సీఎం చంద్రబాబు, 2019లో ఎన్నికలకు 6 నెలల ముందు ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ రూ.2కే అంటూ జీఓ జారీ చేసినా అమలు చేయలేదని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా జోన్ లోపల రైతులకు సబ్సిడీ కత్తిరింపులపై బెదిరిస్తున్నారని, ఆ దిశలోనే వారం క్రితం జీఓ ఆర్‌టీ:169 జారీ చేశారని, అందులో క్లాజ్ నెం:4లో పవర్ ఫ్యాక్టర్ (పీఎఫ్) నిర్వహణపై రూల్ పెట్టారని చెప్పారు. అది ఆక్వా రైతులు వాడే మోటార్లకు చాలా కష్టం అన్న ఆయన, ఆ విధంగా ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ కట్ చేసే కుట్ర జరుగుతోందని ఆక్షేపించారు. తాము అప్పుడైనా, ఇప్పుడైనా ఎప్పుడూ ఆక్వా రంగానికి పూర్తి అండగా ఉంటామని స్పష్టం చేశారు.

మృతిచెందిన బాలుడిని పట్టుకుని రోదిస్తున్న తల్లి

## బస్సు ఢీకొని బాలుడు మృతి

**మంత్రాలయం, జూన్ 16, ప్రభాతవార్త:** మంత్రాలయంలో కర్ణాటక బస్సు ఢీకొని ఓ బాలుడు మృతిచెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. మైసూర్‌కు చెందిన ఒరిస్సా అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో మంత్రాలయం వచ్చారు. అభయాంజనేయస్వామి దర్శనం ముగించుకుని రోడ్డు దాటుతుండగా కర్ణాటక బస్సు నుంచి యాత్రికులతో వచ్చిన బస్సు కార్తీక్(4) అనే బాలుడిని ఢీకొంది. దీంతో బాలుడికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కుమారుడు తమ కళ్లముందే మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ మల్లికార్జున ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎర్రచందనం స్మగ్లరుకు ఐదేళ్ల జైలు

తిరుపతి, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి: ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6 లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఎడిజె కోర్టు న్యాయమూర్తి నరసింహామూర్తి మంగళవారం తీర్పునిచ్చారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎఎస్పీ జె. కులశేఖర్ పర్యవేక్షణలో కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ద తీసుకున్నారు. 74/2018 కేసులో ముద్దాయి వేలూరు జిల్లా పెరియపట్టికి చెందిన ముత్తు ఏలుమలైపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

# కాంట్రాక్టు పారామెడికల్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న డైరెక్ట్ కాంట్రాక్టు పారామెడికల్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని, గ్రాస్ శాలరీ చెల్లించాలని పారామెడికల్ సిబ్బంది రేపు నిర్వహిస్తున్న రాష్ట్ర ధర్నాకు ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ టీచర్స్ జెఎసి రాష్ట్ర కమిటి మద్దతు తెలిపింది. వీరి డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, డైరెక్ట్ కాంట్రాక్ట్ సిబ్బందికి చెల్లించాల్సిన వేతన బకాయిలను కూడా వెంటనే చెల్లించాలని జెఎసి డిమాండ్ చేసింది. ఈ మేరకు పత్రికా ప్రకటను విడుదల చేసింది. 'వైద్య, ఆరోగ్య శాఖలో, ఇతర శాఖలలో, వివిధ ప్రభుత్వ పథకాలు, సంస్థలలో కాంట్రాక్ట్ సిబ్బంది ఏళ్ళ తరబడి పనిచేయించుకోవడం సరైందికాదదంది. కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీసం పిఎఫ్, ఇఎసఐలు కూడా అమలు చెయ్యకుండా రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయించుకుంటున్నాయి. ఉద్యోగులు చనిపోతే వారి కుటుంబాలు ఎటువంటి ఆధారం లేకుండా రోడ్డున పడుతున్నాయి. దాదాపు 3 లక్షల మంది ఆప్కాస్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులది ఇదే పరిస్థితి. అందరికీ ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. ఈఅంశాలను దృష్టిలో పెట్టుకొని ఉద్యోగులను రెగ్యులరైజ్ చెయ్యాలని, ఈలోగా గ్రాస్ శాలరీ చెల్లించాలని, సర్వీసులో ఉండగా మరణించిన వారికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, కాంపాషినేట్ అపాయింట్‌మెంట్లు ఇవ్వాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్‌లు అమలు చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐలు అమలు చేయాలని, 8 గంటల పనివిధానం వర్తింపచేయాలని" రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ టీచర్స్ జెఎసి రాష్ట్ర కమిటి డిమాండ్ చేసింది.

## అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం

**తిరుమల, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలకు వస్తున్న భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా అన్నప్రసాదాలు వితరణ చేస్తున్న ట్రస్ట్‌కు విరాళాలు అందుతున్నాయి. మంగళవారం ఉదయం ఒంగోలుకు చెందిన విజన్ ఆటోమొబైల్స్ సంస్థ వెంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందించింది. ఆ సంస్థ ప్రతినిధులు తిరుమలలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి విరాళం డిడిని అందజేశారు.

## రైల్వే సిగ్నల్ వ్యవస్థ ట్యాంపరింగ్

# కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌లో దోపిడి

తురకపల్లి రైల్వేస్టేషన్ (ఫైల్‌ఫోటో)

**గుత్తి, జూన్ 16 ప్రభాతవార్త:** అనంతపురం జిల్లా గుత్తి రైల్వే జిఆర్‌పి పరిధిలో గుత్తి - కల్లూరు రైలేస్టేషన్ల నడుమ తురకపల్లి రైల్వే హాల్టింగ్ స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని అగంతకులు తమ సాంకేతిక నైపుణ్యంతో రైల్వే సిగ్నల్ సిస్టంను ట్యాంపరింగ్ చేసి రైలు ఆగేలా చేసి దోపిడికి పాల్పడ్డారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మైసూర్ నుండి కాచిగూడ వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు (12786)ను ఆధునిక పరిజ్ఞానంతో తురకపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఆగేలా చేశారు. అనంతరం ముసుగు ధరించిన వ్యక్తులు ఎస్-2, ఎస్-4, ఎస్-6, ఎస్-7 నెంబర్ల కంపార్ట్‌మెంట్లలో యధేచ్ఛగా దోపిడీకి పాల్పడ్డారు. రైలులో ప్రయాణిస్తున్న రేణుక అనే మహిళా ప్రయాణికురాలి వద్ద 37 గ్రాముల విలువైన బంగారు ఆభరణం, అనంతపురంకు చెందిన యశోదమ్మ వద్ద 4.2 గ్రాముల విలువైన నల్లపూసల దండ, మైసూర్‌కు చెందిన వైష్ణవి వద్ద ఐఫోన్-15, మైసూర్ నుండి మహబూబ్‌నగర్ వెళుతున్న సుచిత్ర వద్ద ఐదు తులాల బంగారం ఆభరణాన్ని అపహరించారు. అంబికా అనే ప్రయాణికురాలి వద్ద చోరికి విఫలయత్నం చేశారు. గతంలోనూ ఈ ప్రాంతంలో దోపిడీలు జరిగాయి. ఈ సంఘటనపై ఐఆర్‌పి సిఐ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గుత్తి రైల్వే జిఆర్‌పి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## సర్దార్ పాపన్న గౌడ్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

**కాకినాడ, జూన్ 16 ప్రభాతవార్త ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రతినిధి:** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర గౌడ సంఘం ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ తాతా కృష్ణారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం డాక్టర్ బిఆర్ అంబెద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లిలో జరిగిన గౌడ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 18న పాపయ్య గౌడ్ జయంతి జరగనుందని రాజధానిలో 10 ఎకరాలు సర్దార్ పాపయ్య గౌడ్ స్మృతివనం భవనాన్ని నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి జిల్లా హెడ్ క్వార్టర్‌లో గౌడ భవనాలు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. గౌడ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి అనేక ఇబ్బందులు పడుతున్న గౌడ కులస్తులను అభివృద్ధికి కృషి చేయాలన్నారు. గౌడలు ఐక్యతతో ముందుకు సాగాలని విజ్ఞప్తి చేశారు. రాబోవు ఎన్నికలలో తమకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన పార్టీల వెంట తాము ఉంటామని గౌడ సామాజిక వర్గాన్ని నిరక్ష్యం చేయరాదని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మట్ట వీరబాబు గౌడ్ తెలిపారు జిల్లా, మండల స్థాయిలో గౌడలు తరచూ సమావేశాలు ఏర్పాటు చేసి తమ సమస్యలను పరిష్కరించుకుంటూ అభివృద్ధి పథంలో పైనించాలన్నారు.

## మంత్రి సంధ్యారాణికి అస్వస్థత

**సాలూరు, జూన్ 16 ప్రభాతవార్త:** రాష్ట్ర మహిళ, శిశు గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే పార్వతీపురం మన్యం జిల్లాలో ఒక కార్యక్రమంలో మంత్రి సంధ్యారాణి పాల్గొనేందుకు వెళ్తున్న క్రమంలో మార్గ మధ్యలో స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది హుటాహుటిన విజయనగరం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అనంతరం ఆమె ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉందని తెలుస్తుంది. కోలుకున్న తర్వాత డిశ్చార్జ్ చేస్తారని మంత్రి క్యాంపు కార్యాలయం నుండి సమాచారం.

## తిరుమల సమాచారం

## పెరియాళ్వార్ ఉత్సవాలు ప్రారంభం

**తిరుమల, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న లక్షీ ్మనారాయణస్వామి ఆల యంలో వైష్ణవ సంప్రదాయ మహామహుడు, శ్రీమహా విష్ణువు పరమభక్తుడు పెరియాళ్వార్ ఉత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా ఆరంభమయ్యాయి. ఈ ఉత్సవాలు జూన్ 25వ తేదీ వరకు భక్తిశ్రద్ధలతో కొనసాగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పెద్ద జీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి తమ శిష్యబృందంతో కలిసి పెరియాళ్వార్ సన్నిధిలో దివ్యప్రబంధ పాశురాలను భక్తిపూర్వకంగా నివేదించి ఆధ్యాత్మిక సౌరభాన్ని వెదజల్లారు. ఉత్సవాల చివరిరోజైన జూన్ 25న ఉదయం పెరియాళ్వార్‌కు తిరుమంజనం నిర్వహించనున్నారు. సాయంత్రం గోవిందరాజస్వామి గరుడ వాహనంపై, పెరియాళ్వార్ గజవాహనంపై ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దివ్యమంగళ దర్శనం ప్రసాదించనున్నారు. ఈకార్యక్రమంలో సూపరింటెండెంట్ చిరంజీవి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ, ఇతర అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# తిరుమలలో పెరిగిపోతున్న వాహనాలు

- కాలుష్య నియంత్రణ దిశగా అడుగులు
- తిరుపతి అలిపిరి వద్దే పార్కింగ్ ఏర్పాట్లు

**తిరుమల, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్యతోబాటు వాహనాలు పెరిగిపోతుండటంతో కొండపై పార్కింగ్ సమస్య తీవ్రమవుతోంది. తిరుమలలో సుమారు నాలుగువేల వరకు వాహనాలకు మాత్రమే పార్కింగ్ సదుపాయం ఉంది. ఆ తరువాత వాహనాలు వస్తే ఎక్కడ పార్కింగ్ చేయాలనేది తీవ్రమైన సమస్యగా మారింది. దీన్ని పరిష్కరించాలని ఎప్పటి నుండో టిటిడి అధికారులు ప్రతిపాదనలు రూపొందించినా కార్యాచరణలో అమలుకు నోచుకోవడం లేదు. దీంతో చాలావరకు యాత్రికుల వాహనాలు అలిపిరి టోల్‌గేట్ దాటడానికి దాదాపు 40నిమిషాలు సమయం పడుతోంది. అదేగాక తిరుమలలో ఉన్న 7,900వరకు గదులు కూడా 40వేల మంది భక్తులకు మాత్రమే వసతి కల్పించే వీలుంది. ఆ పై భక్తులు తిరుమలకు వచ్చినా ఎక్కడ విశ్రాంతి తీసుకోవాలి, ఎక్కడ ఉండాలనేది కూడా తలనొప్పి సమస్య. దీన్ని కొంతవరకు నియంత్రించడానికి టిటిడి అధికారులు తిరుమల కొండ క్రిందనే అలిపిరి సమీపంలో శాశ్వత పార్కింగ్ సమస్య పరిష్కారానికి ఆలోచన చేస్తున్నారు. ఇందుకోసం అలిపిరి సమీపంలోని జూ పార్క్ రోడ్డులో సుమారు 300 ఎకరాల అటవీ స్థలం ఉండటంతో వారికి ప్రత్యామ్నాయంగా టిటిడి స్థలాలు కేటాయించి, ఆ స్థలంలో విస్తృతమైన విశాల పార్కింగ్ వసతి, స్కానింగ్ హాబ్ ఏర్పాటు దిశగా టిటిడి అధికారులు ఆలోచన చేస్తున్నారు.

ఇప్పటికే సాధారణ రోజుల్లోనూ తిరుమలకు దేశం నలుమూలల నుండి లక్షమందివరకు భక్తులు వస్తున్నారు. 4వేల వరకు వాహనాలు తిరుమలకు చేరుతున్నట్లు టిటిడి అధికారుల అంచనా. ఈ లెక్కన వాహనాలు సంఖ్య పెరిగితే దీనివల్ల ఘాట్‌రోడ్లపై వాతావరణం కాలుష్యం కూడా ఎక్కువవుతోందని శాస్త్రవేత్తల ఆవేదన.

సామాన్యభక్తుల దర్శనాలకు, వసతికి ప్రాధాన్యతనిస్తున్న టిటిడి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని తిరుపతిలోనే పార్కింగ్ సదుపాయం కల్పించాలని ఆలోచన చేస్తున్నారు. దేశం నలుమూలల నుండి వచ్చే యాత్రికుల వాహనాలను కొండ క్రిందే పార్కింగ్ చేయించాలని చూస్తున్నారు. భక్తుల సదుపాయాలపైన కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా అవసరమైన మార్పులు చేస్తోంది. తిరుమల కొండ పైన వాహనాల రద్దీ నివారణ కోసం కొత్త ప్రణాళికలు సిద్దం చేస్తోంది. ప్రస్తుతం వాహనాల రద్దీ కారణంగా కాలుష్యం కూడా పెరిగిపోతోంది. కొత్త ప్రతిపాదనల మేరకు కొండ కిందే పార్కింగ్ సౌకర్యం కల్పించాలని నిర్ణయించారు.

తిరుపతిలోని పార్కింగ్ ప్రాంతం నుండి విద్యుత్ బస్సుల్లో యాత్రికులు తిరుమలకు చేరుకునే విధంగా ప్రణాళికలు సిద్దమవుతున్నాయి. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సాధారణ రోజుల్లో తిరుమలకు గంటకు ఎన్ని వాహనాలు వస్తున్నాయి, ఎన్ని వాహనాలు తిరుగు ప్రయాణమవుతున్నాయి. వీటి పార్కింగ్ ఎక్కడ అనేది ఏఐ ద్వారా పరిశీలిస్తున్నారు.

ఒక్కోరోజు గంటకు 400వరకు వాహనాలు తిరుమలకు వస్తుండటం విశేషం. మరీ రోజంతా ఉదయం నుండి సాయంత్రంలోపు నాలుగువేల వరకు వాహనాలు చేరుతుండటంతో పార్కింగ్ సమస్య జఠిలమవుతోంది. అలిపిరి వద్ద అధునాతన విశ్రాంత భవనం మెగా టౌన్‌షిప్ ఏర్పాటు కూడా ప్రతిపాదనలు సిద్దమయ్యాయి. ఇవన్నీ రానున్న సెప్టెంబర్ బ్రహ్మోత్సవాల లోపు కార్యరూపం దాల్చి సిఎం చేతుల మీదుగా పనులు ప్రారంభించాలని ఆలోచన చేస్తున్నారు.

## గంగమ్మకు భక్తిశ్రద్ధలతో మరుపొంగళ్లు

**తిరుపతి, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి ప్రజల ఆరాధ్య దైవమైన తాతయ్యగుంట గంగమ్మకి నిర్వహించే ఐదవ మరు పొంగళ్ళు కార్యక్రమం మంగళవారం భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక ఉత్సాహంతో వైభవంగా జరిగింది. గంగమ్మ జాతర అనంతరం ఐదు మంగళవారాల పాటు కొనసాగుతున్న మరు పొంగళ్ళు సంప్రదాయంలో చివరి మంగళవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకార సేవలు నిర్వహించారు. భక్తులు పొంగళ్ళు సమర్పించి కుటుంబ శ్రేయస్సు, సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు. ఆలయ ప్రాంగణం భక్తుల గోవింద నామస్మరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో కళాకారులు వివిధ పురాణ, జానపద, దైవిక పాత్రల వేషధారణలతో పాల్గొని భక్తులను ఆకట్టుకున్నారు. నేరేళ్లమ్మ ఆలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర గంగమ్మ ఆలయం వరకు భక్తి పారవశ్యంతో కొనసాగింది. డప్పుల మోతలు, భక్తి గీతాలు, జై గంగమ్మ నినాదాల మధ్య కళాకారులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా మాజీ గంగమ్మ గుడి చైర్మన్, మాజీ డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ, రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి గంగమ్మ పై తిరుపతి ప్రజలకు ఉన్న అపారమైన భక్తి, విశ్వాసానికి మరు పొంగళ్ళు కార్యక్రమాలు ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. ఇటువంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలు సమాజంలో ఐక్యతను పెంపొందించి భారతీయ సంస్కృతిని భావితరాలకు చేరవేస్తాయని పేర్కొన్నారు. రాష్టంలో సకాలంలో వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం కలగాలని, లోకక్షేమం చేకూరాలని గంగమ్మ తల్లిని ప్రార్థించినట్లు తెలిపారు. దర్శనం అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

## కురుక్షేత్రలో 25 నుండి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



**తిరుమల, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** హర్యానా రాష్ట్రంలో పుణ్యక్షేత్రమైన కురుక్షేత్ర వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 25 నుండి జులై 3వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలకు ముందుగా జూన్ 24న సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలకు సన్నాహకంగా జూన్ 19న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వ హిస్తారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పులు, పూజా సామగ్రిని పవిత్ర జలాలతో శుద్ధి చేసి, నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి, పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం, కుంకుమ, కిచిలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలతో తయారు చేసిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. జూన్ 25న ధ్వజారోహణం, పెద్దశేష వాహనం ఉత్సవాలకు శ్రీకారం చుడుతూ ధ్వజారోహణం నిర్వహించి, సాయంత్రం పెద్దశేష వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. 26న చిన్నశేష వాహనం, హంస వాహనంపై స్వామివారి దివ్య విహారం జరుగుతుంది. 27న ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహన సేవలు నిర్వహిస్తారు. 28 నకల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం సేవలు జరుగుతాయి. 29న ఉదయం మోహినీ అవతారం, కల్యాణోత్సవం, రాత్రి గరుడ వాహనం సేవ జరుగుతుంది. 30న హనుమంత వాహనం, గజ వాహనం, జూలై 1న సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం పైదివ్య దర్శనం కల్పిస్తారు. 2న రథోత్సవం, అశ్వవాహనం. భక్తుల గోవింద నామ స్మరణల మధ్య రథోత్సవం నిర్వహించి, రాత్రి అశ్వవాహనంపై స్వామివారు విహరిస్తారు. 3న చక్రస్నానం, ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలను ముగి స్తారు. బ్రహ్మోత్సవాల అనంతరం 4న సాయంత్రం పుష్పయాగం వైభవంగా నిర్వహి స్తారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం 8 నుండి 9 గంటల వరకు, రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు వాహనసేవలు జరుగనున్నాయి.

# రికార్డు స్థాయిలో భక్తుల లగేజీ డిపాజిట్ సేవలు

- అర కోటి మందికి పైగా భక్తులకు లగేజీ సురక్షంగా జమ బట్వాడా

**తిరుమల, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** వేంకటేశ్వర స్వామివారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసే లక్షలాది మంది భక్తులకు సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు టిటిడి విస్తృత స్థాయిలో లగేజీ డిపాజిట్, డెలివరీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహిస్తోంది. భక్తులు శ్రీవారి దర్శనం, కాలినడక యాత్ర సమయంలో తమతో తీసుకువచ్చే లగేజీ, బ్యాగులు, సెల్ ఫోన్లను భద్రంగా ఉంచుకునేందుకు తిరుమలలో కాలినడక మార్గాల్లో కలిపి మొత్తం 65 కౌంటర్లు ఏర్పాటు చేసి 345 మంది సిబ్బంది మూడు షిఫ్టుల్లో నిరంతరంగా సేవలందిస్తున్నారు. టిటిడి కల్పించిన ఈ సేవలను భక్తులు పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో రికార్డు స్థాయిలో 51,38,976 మంది భక్తులు తమ లగేజీని డిపాజిట్ చేసుకున్నారు. గత ఏడాది ఏప్రిల్ లో 20,75,481 మంది భక్తులు తమ లగేజీని భద్రపరచుకోగా, ఈ ఏడాది ఏప్రిల్ నెలలో 23,15,279 మంది భక్తులు తమ లగేజీని భద్రత పరచుకున్నారు. గత ఏడాది మే నెలలో 23,82,622 తమ లగేజీని భద్రపరచుకోగా, ఈ ఏడాది 28,23,697 మంది భక్తులు తమ లగేజీని భద్రపరచుకున్నారు. అంటే గత ఏడాది ఏప్రిల్ నెలతో పోల్చితే 2,39,798 లగేజీ డిపాజిట్లు, మే నెలతో పోల్చితే 4,41,075 లగేజీ డిపాజిట్లు అత్యధికంగా నమోదు కావడం విశేషం. తిరుమలలో రద్దీ పెరిగిన నేపథ్యంలో గత మూడు రోజుల్లో 3,41,742 మంది ఉచిత లగేజీ సేవలు వినియోగించుకున్నారు. అలిపిరి, శ్రీవారి మెట్టు కాలినడక మార్గాల ద్వారా తిరుమలకు చేరుకునే భక్తుల కోసం ప్రత్యేక డిపాజిట్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలిపిరి కాలినడక మార్గం లగేజీ కేంద్రం లో 5 కౌంటర్లు, 45 మంది సిబ్బంది (ప్రతి షిఫ్ట్‌లో 15 మంది). 10,194 లగేజీ డిపాజిట్ల సామర్థం. శ్రీవారి మెట్టు లగేజీ కేంద్రంలో 2 కౌంటర్లు, 10 మంది సిబ్బంది (ప్రతి షిఫ్ట్‌లో 5 మంది), 3,025 లగేజీ డిపాజిట్ల సామర్థం ఉంది. ఈ కేంద్రాల్లో లగేజీ డిపాజిట్ చేసిన భక్తులు తిరుమలలోని డెలివరీ కేంద్రాల్లో సులభంగా తిరిగి పొందే సౌకర్యాన్ని టిటిడి కల్పించింది. తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో భక్తుల కోసం లగేజీ, సెల్ ఫోన్ డిపాజిట్ సౌకర్యం అందుబాటులో ఉంది. ఫ్రీ హాల్‌లో 8 కౌంటర్లు, వైకుంఠం క్యూకాంప్లెక్స్- 1, 2 కౌంటర్లు, నారాయణగిరి షెడ్ - 5 కౌంటర్లు, డిడి హాల్- 3 కౌంటర్లు, 300 రూపాయలు హాల్ 4 కౌంటర్లు, వైకుంఠం క్యూకాంప్లెక్స్ అప్ స్కానింగ్ (కంపార్ట్‌మెంట్03) - 2 కౌంటర్లు, డెలివరీ కేంద్రాలు తలనీలాలు సమర్పించే భక్తుల సౌకర్యార్థం కల్యాణకట్ట సమీపంలో కూడా ప్రత్యేక కేంద్రాలను టిటిడి ఏర్పాటు చేసింది.

## ముత్యాలదండల అలంకరణలో గంగమ్మ

అత్యంత మహిమాన్వితమైన తిరుపత తాతయ్యగుంట గంగమ్మ జాతర చివరి మంగళవారం ముత్యాల అలంకరణలో దర్శనమిచ్చారు. ముత్యాలు తెల్లనివి.. చల్లదనాన్నినిస్తాయి. అంతటి ముత్యాలను తానే ఆలయంలో అలంకరించుకుని భక్తులకు దర్శనమివ్వడం విశేషం. మంగళవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకము చేసిన అనంతరము దాతలు కవిత, శివకుమార్, లీలాచంద్ర సహకారంతో ముత్యాల పూసలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండి ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్, ఇఒ ఎ.జయకుమార్ దర్శన ఏర్పాట్లు చేయించారు.

విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
26
వార్త
బుధవారం 17, జూన్ 2026

### వినియోగదారుల సమస్యల పరిష్కారంలో
# నిర్లక్ష్యానికి తావులేదు

**ప్రతి కాల్‌కు స్పందించాలి.. ప్రతి ఫిర్యాదును సకాలంలో పరిష్కరించాలి : ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్**

విశాఖపట్నం, జూన్ 16, ప్రభాతవార్త

విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడంలో భాగంగా ఏపీఈపీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి సంస్థ కాల్ సెంటర్‌ను ఆకస్మికంగా మంగళవారం 8వ పేజీలో

### నర్సీపట్నం నియోజకవర్గం నుంచి ట్రిపుల్ ఐటీకి
# 40 మంది ఎంపిక కావడం హర్షణీయం

**విద్యార్థులకు త్వరలోనే ప్రత్యేక సత్కారం -అభినందనలు తెలిపిన శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు**

నర్సీపట్నం, జూన్ 16, ప్రభాతవార్త

ఇటీవల విడుదలైన ఫలితాల్లో ట్రిపుల్ ఐటీ (ఆర్జీయూకేటీ)లో సీట్లు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా నర్సీపట్నం నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి ఏకంగా 40 మంది విద్యార్థులు ఎంపిక కావడం చాలా సంతోషకరం అన్నారు. తన రాజకీయ జీవితంలో ఒకే నియోజకవర్గం నుంచి ఇంత మంది ఎంపిక కావడం ఇదే తొలిసారి అని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ విజయం వెనుక విద్యా ర్థుల కృషితో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. నియోజక వర్గంలోని నర్సీపట్నం మండలం నుంచి 30 మంది, నాతవరం నుంచి ఏడుగురు, గొలుగొండ నుంచి ఇద్దరు, మాకవరపాలెం నుంచి ఒకరు ఎంపికయ్యారని ఆయన వివరించారు. వీరందరూ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి పది మందికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. త్వరలోనే ఈ 40 మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సత్కరిస్తామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతం నుంచి మరింత మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

### మధురవాడకు
# మహార్దశ



**రూ.725 కోట్లతో తాగునీటి ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్**

**24 గంటల తాగునీటి సరఫరా దిశగా కీలక అడుగు.. లక్షలాది మందికి ప్రయోజనం**

(ప్రభాతవార్త-విశాఖపట్నం)

విశాఖ నగర పరిధిలో వేగంగా అభివృద్ధి చెందుతున్న మధురవాడ (జోన్-2), పరిసర ప్రాంతాల ప్రజలకు శాశ్వత తాగునీటి భద్రత కల్పించేందుకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం భారీ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాంతానికి 24 గంటల పాటు నిరంతరాయంగా తాగునీటిని సరఫరా చేసే లక్ష్యంతో రూపొందించిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 725.18 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. దీంతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఆధునిక తాగునీటి వ్యవస్థకు మార్గం సుగమమైంది. మధురవాడ, కొమ్మాది, ఎండాడ, కారాపాక, పరిసర ప్రాంతాల్లో జనాభా వేగంగా పెరుగుతుండటంతో తాగునీటి అవసరాలు కూడా గణనీయంగా పెరిగాయి. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరా అంతరాయాలు, తక్కువ ఒత్తిడితో నీటి పంపిణీ వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. కొత్త ప్రాజెక్టు అమలులోకి వస్తే ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. అంతేకాకుండా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక సాంకేతికతతో నీటి నిల్వ, శుద్ధి, పంపిణీ వ్యవస్థలను అభివృద్ధి చేయనున్నారు. ఈ మెగా ప్రాజెక్టు కోసం నిధులను మూడు వేర్వేరు వనరుల ద్వారా సమీకరించనున్నారు. కేంద్ర ప్రభుత్వ అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) నుంచి రూ. 172.37 కోట్లు అందనున్నాయి. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) తన వాటాగా రూ. 190.21 కోట్లు భరిస్తుంది. మిగిలిన రూ. 362.60 కోట్లను గ్రేటర్ విశాఖపట్నం స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ (జీవీఎస్‌సీసీఎల్) టర్మ్ లోన్ రూపంలో సమకూర్చనుంది. ఈ ప్రాజెక్టు అమలుతో మధురవాడ ప్రాంత 8వ పేజీలో

### ఘనంగా కూటమి ప్రభుత్వ
# రెండేళ్ల విజయోత్సవాలు

నర్సీపట్నం, ప్రభాతవార్త

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నర్సీపట్నం ధర్మసాగరం స్టార్ హోమ్స్ లో విజయోత్సవ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. మార్కెట్ కమిటీ ఛైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ సభను కూటమి నాయకులు ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు హాజరుకాగా, నర్సీపట్నం టీడీపీ పట్టణ అధ్యక్షులు చింత కాయల రాజేష్, ప్రధాన కార్యదర్శి లాలం మురళి, బీజేపీ రాష్ట్ర కన్వీనర్ గాదె శ్రీనివాస్, జనసేన నియోజక వర్గం ఇంచార్జ్ సూర్యచంద్ర, జడ్పీటీసీ రమణమ్మ తది తర నాయకులు పాల్గొని ప్రసంగించారు. గత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి, పరిశ్రమలు లేక రాష్ట్రం తీవ్రం గా వెనుకబడిందని, ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదు ర్కొన్నారని ఈ సందర్భంగా నాయకులు గుర్తుచేశారు. కానీ, 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన కేవలం రెండేళ్ల వ్యవధిలోనే కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని హర్షం వ్యక్తం చేశారు. పదిహేడేళ్ల పాటు పార్టీ కోసం కష్టపడిన చింతకాయల విజయ్ సేవలను అధిష్టానం గుర్తించి రాజ్యసభ పదవిని కట్టబెట్టడం, కష్టపడే ప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీలో తగిన గౌరవం దక్కుతుందనడానికి ప్రతీక అని లాలం కాశి నాయుడు అన్నారు. సమావేశంలో చింతకాయల రాజేష్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే రాష్ట్రం అభివృద్ధి బాటలో దూసుకువెళ్తోందని అన్నారు. సూపర్-6 పథకాల్లో భాగంగా 'తల్లికి వందనం' కింద 67 లక్షల మంది విద్యార్థులకు రూ. 10 వేల కోట్లు ఖర్చు చేశామని, 'స్త్రీ శక్తి' పథకం ద్వారా మహిళలకు ఉచితంగా ఏపీఎస్ఆర్టీసీ బస్సు ప్రయాణం, 'దీపం' పథకం ద్వారా సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. సామాజిక పించన్లను రూ. 4 వేలకు పెంచడంతో పాటు, మత్స్యకారులకు ఏటా రూ. 20 వేలు, ఆటో డ్రైవర్లకు రూ. 15 వేల చొప్పున 8వ పేజీలో

# రేరా ట్రైబ్యునల్ టెక్నికల్ సభ్యురాలిగా విద్యుల్లత!

**ప్రతిభకు పట్టంకట్టనున్న ప్రభుత్వం -పట్టణాభివృద్ధి రంగ అనుభవానికి మరో గౌరవమే..**

(ప్రభాతవార్త-విశాఖపట్నం)

పట్టణ ప్రణాళిక, నగరాభివృద్ధి రంగాల్లో విశేష అనుభవం కలిగిన సీనియర్ అధికారి విద్యుల్లతకు రాష్ట్ర ప్రభుత్వం మరో 8వ పేజీలో

# పర్యాటక హబ్‌గా కైలాసగిరి

**మరిన్ని ఆకర్షణీయ ప్రాజెక్టులకు ప్రతిపాదనలు : వీఎంఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్**

8లో

### పర్యాటక రంగ విశిష్టతను తెలుపుతూ..
# యోగా ప్రాముఖ్యతను చాటుతూ..

**ముడసర్లోవ ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్‌లో భారీ యోగా కార్యక్రమం -భాగస్వామ్యమైన ఎంపీ, జిల్లా కలెక్టర్, ఇతర ఐఏఎస్ అధికారులు, అసోసియేషన్ల ప్రతినిధులు**

8లో

# ముస్సోరీ హోమ్‌స్టేలో యువతి మృతి

**విశాఖకు చెందిన ఐటీ ఉద్యోగిని గాయత్రి -గదిలో రక్తపు మరకలు, మద్యం సీసాలు -పోస్టుమార్టం నివేదికపై ఉత్కంఠ -అనుమానాస్పద మృతిపై పోలీసుల దర్యాప్తు**

విశాఖపట్నం, జూన్ 16 ప్రభాతవార్త

వివాహం జరిగిన నూతన జంట హనీమూన్‌లో విషాదం చోటు చేసుకుంది. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ముస్సోరీలో ఓ హోమ్‌స్టేలో విశాఖకు చెందిన ఐటీ ఉద్యోగిని అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన కలకలం రేపింది. మృతురాలు పి. రాధా గాయత్రి (27)గా గుర్తించారు. ఆమె గురుగ్రామ్‌లోని ఓ ఐటీ సంస్థలో పనిచేస్తుండగా, ప్రస్తుతం ఢిల్లీలోని కిద్వాయి నగర్ ఈస్ట్‌లో నివసిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గాయత్రి తన భర్త సౌమ్య శ్రీచరణ్‌తో కలిసి విహారయాత్ర నిమిత్తం ముస్సోరీకి వెళ్లింది. శ్రీచరణ్ పుణెలోని ఓ ఐటీ సంస్థలో 12వ పేజీలో

### క్షణం క్షణం భయం..
# గమ్యం చేరడం గగనం!

**గాజువాకలో 'ట్రాఫిక్' నరకం! -గమ్యం చేరాలంటే గంటల కొద్దీ నిరీక్షణ -జింక్ ప్రధాన ద్వారం, వంటిల్లు జంక్షన్లలో నిలిచిపోతున్న వాహనాలు -రోడ్లపైనే వ్యాపారాలు.. కేటాయించిన పార్కింగ్ స్థలాల్లో తోపుడు బండ్లు -చలానాలు, డ్రంక్ అండ్ డ్రైవ్‌లపైనే పోలీసుల శ్రద్ధ.. -రెగ్యులేషన్ గాలికొదిలేశారు! -నిలదీస్తున్న స్థానికులు, ప్రజా సంఘాలు**

8లో

### అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతిబింబిస్తూ
# రెండేళ్ల ప్రభుత్వ విజయోత్సవ వేడుకలు

**19న ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో పెట్టుబడులు, పారిశ్రామికాభివృద్ధిపై జిల్లా స్థాయి కార్యక్రమాలు -ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్**

8లో

### భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు
# అంతర్జాతీయ కనెక్టివిటీ కల్పించాలి

**ఫ్రాంక్‌ఫర్ట్, లండన్, దుబాయ్, కౌలాలంపూర్, బ్యాంకాక్‌లకు నేరుగా విమానాలు ప్రారంభించాలి -సీఎం చంద్రబాబుకు ఏపీ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ వినతి**

విశాఖపట్నం, మే 25, ప్రభాతవార్త :

ఉత్తరాంధ్ర భవిష్యత్ ఆర్థికాభివృద్ధికి కీలకంగా మారనున్న భోగాపురం అంతర్జాతీయ విమానా శ్రయాన్ని ప్రపంచ స్థాయి అంతర్జాతీయ గేట్‌వేగా తీర్చిదిద్దాలని ఆంధ్రప్రదేశ్ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ ఛైర్మన్‌కు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రికి సంఘం ప్రతినిధులు విన్నవించారు. ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా 8వ పేజీలో

# అగనంపూడి జోన్‌లో పరిపాలన గాడి తప్పిందా..?

**బయోమెట్రిక్ లేకుండా సిబ్బంది ఇష్టారాజ్యం.. పెండింగ్ ఫైళ్లతో ప్రజల అవస్థలు -జీవీఎంసీ కమిషనర్ జోక్యం చేసుకోవాలంటూ స్థానికుల విజ్ఞప్తి**

8లో

## వినియోగదారుల సమస్యల పరిష్కారంలో ..

7వ పేజీ తరువాయి ..

తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాల్ సెంటర్ పనితీరు, వినియోగదారుల నుంచి అందుతున్న ఫిర్యాదులు, వాటి పరిష్కారంలో చేపడుతున్న చర్యలను సమీక్షించారు. ఫిర్యాదుల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో ఏఈ లు వ్యవహరిస్తున్న తీరును ప్రత్యేకంగా పరిశీలించారు. పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న కొన్ని ఫిర్యాదులపై కాల్ సెంటర్ నుంచే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వివరణ కోరారు. వినియోగదారుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ, కాల్ సెంటర్ ఎగ్జిక్యూటివ్‌లు 24x7 అందుబాటులో ఉండి కాల్ సెంటర్ నెంబర్ 1912 కు వచ్చే ప్రతి కాల్‌కు తప్పనిసరిగా స్పందించాలని ఆదేశించారు. కాల్స్‌కు స్పందించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించినా, వినియోగదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడంలో విఫలమైనా బాధ్యులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అలాగే క్షేత్రస్థాయిలో ఏఈలు అందిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని, అలస్యం లేదా నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని వేగంగా పరిష్కరించి వినియోగదారుల సంతృప్తిని సాధించాలని సూచించారు. కాల్ సెంటర్ ఎగ్జిక్యూటివ్‌లు వినియోగదారులతో మాట్లాడుతున్న తీరును సీఎండీ స్వయంగా పరిశీలించారు. పలువురు వినియోగదారులతో జరిగిన కాల్ రికార్డులను విని స్పందించిన ఆయన, మరింత మర్యాదపూర్వకంగా, సహనంతో మాట్లాడాలని సూచించారు. వినియోగదారుల సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని సరైన సమాచారం అందించడంతో పాటు, సంస్థ ప్రతిష్ఠను పెంపొందించే విధంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రస్తుత వర్షాలు, బలమైన గాలుల కారణంగా విద్యుత్ సరఫరాలో మరిన్ని అంతరాయాలు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సీఎండీ ఆదేశించారు. ఎలాంటి ఫిర్యాదు వచ్చినా వెంటనే స్పందించి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ తనిఖీలో ఆపరేషన్స్ డైరెక్టర్ టి.వి. సూర్యప్రకాశ్, సీజీఎం పి. సోమనా రాజు తదితరులు పాల్గొన్నారు.

## మధురవాడకు ..

7వ పేజీ తరువాయి ..

ప్రజలకు రోజంతా స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రానుంది. నీటి కోసం నిల్వ చేసుకోవాల్సిన అవసరం తగ్గడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడనున్నాయి. అలాగే వేగంగా విస్తరిస్తున్న నివాస కాలనీలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల అవసరాలకు కూడా ఈ ప్రాజెక్టు అండగా నిలవనుంది. నగర అభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపడుతున్న కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో ఇది ఒకటిగా నిలవనుంది. విశాఖను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక నగరంగా తీర్చిదిద్దే క్రమంలో ఈ తాగునీటి ప్రాజెక్టు ముఖ్యమైన మైలురాయిగా భావిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత లక్షలాది మంది ప్రజలు నాణ్యమైన తాగునీటి సేవలను నిరంతరాయంగా పొందే అవకాశం కలగనుంది.

## భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు ..

7వ పేజీ తరువాయి ..

ప్రాంతాలకు కలిపి 1.7 కోట్లకు పైగా జనాభాకు భోగాపురం విమానాశ్రయం తొలి అంతర్జాతీయ ద్వారంగా నిలవనుందని సంఘం పేర్కొంది. విమానాశ్రయం విజయవంతం కావాలంటే ప్రారంభం నుంచే అంతర్జాతీయ ప్రయాణికుల మరియు కార్గో సేవలు అందుబాటులో ఉండాలని స్పష్టం చేసింది. సంఘం అధ్యక్షులు డాక్టర్ కె. కుమార్ రాజా, ఉపాధ్యక్షులు డీఎస్ వర్మ, డాక్టర్ ఓ. నరేష్ కుమార్ సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. విశాఖపట్నం దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న డేటా సెంటర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) హబ్‌గా రూపుదిద్దుకుంటోందని తెలిపారు. గూగుల్, మెటా, రిలయన్స్ జియో, అదానీ, సిఫీ, ఆర్సెలార్‌మిట్టల్ గ్రూప్, ఎయిర్‌టెల్ వంటి ప్రముఖ సంస్థలు భారీ పెట్టుబడులతో డేటా సెంటర్లు, ఏఐ కంప్యూటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా ఆర్సెలార్ మిట్టల్ ప్రతిపాదించిన భారీ ఉక్కు పరిశ్రమ, పూడిమడకలో ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు, అనకాపల్లి–శ్రీకాకుళం ప్రాంతాల్లో ఫార్మా, బల్క్ డ్రగ్ పార్కులు, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ రంగాల్లో వస్తున్న పెట్టుబడులు, బ్యాటరీ స్టోరేజ్, ఐటీ పరిశ్రమల అభివృద్ధి వల్ల అంతర్జాతీయ వ్యాపార ప్రయాణాలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో భోగాపురం నుంచి నేరుగా అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మూడు సంవత్సరాలపాటు వైబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) అందించాలని కోరారు. మొదటి దశలో ఫ్రాంక్‌ఫర్ట్ (జర్మనీ), లండన్ (యూకే), దుబాయ్ (యూఏఈ), కౌలాలంపూర్ (మలేషియా), బ్యాంకాక్ (థాయ్‌లాండ్), కొలంబో (శ్రీలంక) నగరాలకు నేరుగా విమాన సర్వీసులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. యూరప్‌లో లక్షలాది తెలుగు ప్రజలు నివసిస్తున్నారని, లండన్, ఫ్రాంక్‌ఫర్ట్ మార్గాలు ఐటీ, ఫైనాన్స్, విద్య, ఫార్మా, పారిశ్రామిక రంగాలకు కీలకమని తెలిపారు. దుబాయ్‌కు ఉత్తరాంధ్ర, ఒడిశా ప్రాంతాల నుంచి భారీ గల్ఫ్ ప్రయాణికుల డిమాండ్ ఉందని, కౌలాలంపూర్, బ్యాంకాక్ మార్గాలు దక్షిణాసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ప్రాంతాలకు అనుసంధాన కేంద్రాలుగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రయాణికుల సేవలతో పాటు కార్గో విమాన సేవలు కూడా అత్యవసరమని అసోసియేషన్ అభిప్రాయపడింది. డేటా సెంటర్లు, ఫార్మా, సెమీకండక్టర్లు, గ్రీన్ హైడ్రోజన్, ఇంజినీరింగ్ రంగాలకు సంబంధించిన అత్యవసర పరికరాలు, విడిభాగాలు, నమూనాల రవాణాకు ఫ్రాంక్‌ఫర్ట్, దుబాయ్, కౌలాలంపూర్, బ్యాంకాక్ నగరాలకు ప్రత్యేక కార్గో విమానాలు అవసరమని తెలిపింది. భోగాపురం విమానాశ్రయం పూర్తి స్థాయిలో ప్రయోజనం చేకూరాలంటే అనుబంధ రహదారి మౌలిక సదుపాయాలు కూడా వేగంగా పూర్తికావాలని కోరింది. విశాఖపట్నం–భోగాపురం–శ్రీకాకుళం ఆరు లేన్ల కోస్టల్ కారిడార్‌ను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, గాజువాక నుంచి మధురవాడ వరకు పెండింగ్‌లో ఉన్న ఫ్లైఓవర్లను త్వరితగతిన నిర్మించాలని విజ్ఞప్తి చేసింది. అంతర్జాతీయ వ్యాపార ప్రయాణికులు, పెట్టుబడిదారులు, ఐటీ, డేటా సెంటర్ నిపుణులు గంటల్లో విమానాశ్రయానికి చేరుకునేలా రవాణా సదుపాయాలు ఉండాలని సూచించింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, విశాఖలో వేగంగా అభివృద్ధి చెందుతున్న డేటా సెంటర్లు, ఏ ఐ , గ్రీన్ హైడ్రోజన్, ఫార్మా, పారిశ్రామిక రంగాలు కలిసి ఉత్తరాంధ్రను దేశంలోనే ప్రముఖ ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దగలవని అసోసియేషన్ అభిప్రాయపడింది. అంతర్జాతీయ కనెక్టివిటీ కల్పించడం ద్వారా విదేశీ పెట్టుబడులు, పర్యాటకం, ఉద్యోగావకాశాలు, ఎగుమతులు గణనీయంగా పెరుగుతాయని పేర్కొంది. భోగాపురం విమానాశ్రయ ప్రారంభానికి ముందే రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర పౌర విమానయాన శాఖ, జీఎంఆర్ సంస్థలు కలిసి ప్రముఖ అంతర్జాతీయ విమానయాన సంస్థలతో చర్చలు ప్రారంభించాలని, భోగాపురాన్ని ప్రధాన విమానయాన పటంలో నిలిపే దిశగా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది.

## పర్యాటక హబ్‌గా కైలాసగిరి

విశాఖపట్నం జూన్ 16,ప్రభాతవార్త

విశాఖ పర్యాటక మణిహారమైన కైలాసగిరిని పర్యటక హబ్‌గా తీర్చిదిద్దేటుకు తగిన ప్రతిపాదనలు చేయాలని జిల్లాధికారి వీఎంఆర్ డి ఏ చైర్మన్ ఎమ్.ప్రణవ్ గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం అదనపు కమిషనర్ దాట్ల కీర్తి, ఓఎస్‌డి శ్రీ కృష్ణ నాయక్ కార్యదర్శి శ్రీ మురళీ కృష్ణతో కలిసి కైలాసగిరిని సందర్శించారు. ఈ సందర్భంగా కైలాసగిరిపై జరుగుతున్న అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న నిర్మాణాలను పరిశీలించారు. ఇప్పుడు దుకాణ సముదాయం నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు చేయాలని సూచించారు. త్రిశూల్ వరకు వెళ్లేందుకు వీలుగా బ్యాటరీ కారులను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అలానే పర్యాటకులను ఆకట్టుకునేలా ప్రపంచ ప్రఖ్యాత చెందిన నమూనాలను ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం అనువైన ప్రదేశాలను ఏ మేరకు వినియోగించుకోవాలో ప్రతిపాదనలు సిద్ధం చేసి నిర్మాణ కార్యక్రమ స్థలాన్ని వ్యాపారులతో సమావేశమయ్యారు. గ్లాస్ బ్రిడ్జి, త్రిశూల్ ఏర్పాటుతో కైలాసగిరి కింద పైకి వచ్చే సందర్శకుల సంఖ్య పెరిగిందని, అదేవిధంగా పర్యాటకులను విశేషంగా ఆకర్షించేలా మరిన్ని ప్రాజెక్టులు రానున్నాయని పేర్కొన్నారు. అందువల్ల కైలాసగిరికి మంచి పేరు తీసుకువచ్చేలా వ్యాపారులు వ్యవహరించాలని సూచించారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈఈ జేసి పి సింగ్, డిఈ శంకర్రావు, శ్రీ మురళీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవాలు

7వ పేజీ తరువాయి ..

ఆర్థిక సాయం అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఆయన ఉద్ఘాటించారు. యువతకు ఉపాధి కల్పనలో భాగంగా మెగా డీఎస్సీ ద్వారా 15,941 టీచర్ పోస్టులు, 5,757 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ చేపట్టామని రాజేష్ వివరించారు. అమరావతి రాజధాని పనులను వేగవంతం చేయడంతో పాటు, రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు తీసుకొచ్చామన్నారు. అనకాపల్లి జిల్లాలో రూ.5,400 కోట్లతో రెన్యూ ఎనర్జీ సంస్థ, భారీ పెట్టుబడితో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. అలాగే, మాకవరపాలెంలో రూ.1,500 కోట్లతో జేసీబీ విడి భాగాల తయారీ రోబోక్స్ కంపెనీ, రూ.10 కోట్లతో కాఫీ పుడ్ ప్రాసెసింగ్ యూనిట్ పరిశ్రమలు రావడం ద్వారా స్థానికంగా వందలాది మందికి ఉపాధి కలుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నర్సీపట్నం నియోజకవర్గ అభివృద్ధిపై శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రత్యేక దృష్టి సారించారని రాజేష్ కొనియాడారు. అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలోనే నియోజకవర్గంలో రూ.532 కోట్ల అంచనాతో పలు అభివృద్ధి పనులు మొమ్మరంగా చేపట్టారన్నారు. ఈ విజయోత్సవ కార్యక్రమంలో వివిధ మండలాల నాయకులు, బీజేపీ, జనసేన, తెలుగుదేశం పార్టీల కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రేరా ట్రైబ్యునల్ టెక్నికల్ సభ్యురాలిగా విద్యుల్లత!

7వ పేజీ తరువాయి ..

కీలక బాధ్యత అప్పగించింది. రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రేరా) ట్రైబ్యునల్ టెక్నికల్ సభ్యురాలిగా ఆమెను నియమించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాలు వెలువడ్డాయి. ప్రస్తుతం డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ)గా పనిచేస్తున్న విద్యుల్లత స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) తీసుకొంది. తన సుదీర్ఘ ప్రభుత్వ సేవా కాలంలో ఆమె పట్టణాభివృద్ధి, నగర ప్రణాళిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి కీలక విభాగాల్లో వివిధ హోదాల్లో పనిచేసి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా రాజకీయాలకు అతీతంగా విధి నిర్వహణలో నిబద్ధత, పనితీరు, ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారించే అధికారిగా విద్యుల్లతకు మంచి పేరుంది. క్లిష్టమైన పట్టణాభివృద్ధి ప్రాజెక్టులు, ప్రణాళికా అంశాల్లో ఆమె చూపిన నైపుణ్యం ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు అందుకుంది. రేరా ట్రైబ్యునల్‌లో టెక్నికల్ సభ్యురాలిగా ఆమె నియామకం జరిగితే, రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించిన వివాదాల పరిష్కారం, సాంకేతిక అంశాల పరిశీలన, పట్టణ ప్రణాళికకు సంబంధించిన కేసుల్లో ఆమె అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ పరిపాలనలో సుదీర్ఘ అనుభవం, పారదర్శకత, వృత్తిపరమైన నైపుణ్యానికి ప్రతీకగా నిలిచిన విద్యుల్లతకు ఈ అదనపు బాధ్యత ఆమె సేవలకు లభించిన మరో గౌరవంగా భావిస్తున్నారు. రేరా ట్రైబ్యునల్ పనితీరు మరింత సమర్థవంతంగా మారడంలో ఆమె పాత్ర కీలకంగా ఉండనుందని అధికార వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## తమలపాకుల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

(ఎస్. రాయవరం, జూన్ 16, ప్రభాత వార్త)

మండలం లోని పెనుగొల్లు గ్రామంలో ఇటీవల అకస్మాత్తుగా వచ్చిన ఈదురు గాలులకు నష్టపోయిన తమలపాకుల విషయం తెలుసుకున్న జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు మంగళవారం బాధిత రైతులతో కలిసి పరిశీలించారు.ఇంత పెద్ద ఎత్తున నేలమట్టం అయి నష్టపోయిన తమలపాకుల తోటలను పరిశీలించి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎం.అప్పలరాజు మాట్లాడుతూ రైతులు ఎకరానికి రెండున్నర లక్షల రూపాయలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి,పంట ఫలసాయం చేతికి వచ్చే సమయంలో ఈవిధంగా తోటలు నేలమట్టం అవ్వడం చాలా బాధాకరం అన్నారు. తమలపాకుల తోటలను చిన్న పిల్లలను చూసే నట్టు అత్యంత జాగ్రత్తగా పెంచాలని, మిగతా పంటలు మీద పోల్చితే పెట్టుబడులు ఎక్కువగా అవుతున్నాయని తెలిపారు. ఈ విధంగా నష్టపోయిన తమలపాకుల రైతులను ప్రభుత్వం ఆదుకోకపోతే తీవ్రంగా నష్టపోయి భవిష్యత్తులో తమలపాకుల తోటలు పెంచలేరని తెలిపారు, ప్రస్తుతం పెట్టిన పెట్టుబడి పోయి, ఫలసాయం రాక, భూమి గల రైతులకు కౌలు కట్టలేక తమలపాకుల రైతులు వ్యవసాయం నుండి దూరం అయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు.వెంటనే ప్రభుత్వం స్పందించి క్షేత్ర స్థాయిలో ఏ రైతుకు, ఎంత పంట నష్టపోయిందో గుర్తించి నష్టపరిహారం ఎకరాకు యాభై వేల రూపాయలు చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.తమలపాకుల తోటలు కు ఉచిత పంటల భీమా సౌకర్యం, రైతులకు రుణ సౌకర్యం, ఎరువులు సబ్సిడీ అందించాలన్నారు. కార్యక్రమంలో రైతులు ఏ.తాతాజీ, జీ.సూరిబాబు, కె.గోవింద్,బి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక రంగ విశిష్టతను తెలుపుతూ..

విశాఖపట్నం, జూన్ 16, ప్రభాతవార్త

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించు కుని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగా వేడుకల్లో భాగంగా మంగళవారం ముడసర్లోవలోని ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్‌లో భారీ యోగా కార్యక్రమం నిర్వహించారు. పర్యాటక రంగ విశిష్టతను తెలుపుతూ.. యోగా ప్రాముఖ్యతను చాటి చెబుతూ జిల్లా యంత్రాంగం ఇప్పటికే రుషికొండ బీచ్, నావెల్ డాక్ యార్డ్ పరిధిలో కార్యక్రమాలు నిర్వహించింది. మంగళవారం గోల్ఫ్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమానికి అన్ని వర్గాల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో విశాఖపట్నం ఎంపీ శ్రీ భరత్, జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఏపీ ఆయిల్ అండ్ సీడ్స్ గ్రోవర్స్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సతీష్ కుమార్, జిల్లా అధికారులు, హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు, గోల్ఫ్ క్లబ్ ప్రతినిధులు, పర్యాటక రంగానికి చెందిన ప్రముఖులు, విద్యార్థులు పాల్గొని యోగాసనాలు వేశారు. అనంతరం యోగా గురువులు, ప్రజ్ఞ యోగా ప్రదర్శించిన చిన్నారులకు ఎంపీ, జిల్లా కలెక్టర్, ఇతర ప్రముఖుల చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేసి అభినందించారు.

### గతేడాది స్ఫూర్తితో 21న జరిగే కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలి : జిల్లా కలెక్టర్

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న అతికొద్ది గోల్ఫ్ కోర్సులలో ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ ఒకటని, ప్రస్తుతం దేశంలోనే ప్రముఖ గోల్ఫ్ కోర్సులలో ఒకటిగా గుర్తింపు పొందుతోందని గుర్తు చేశారు. అద్భుతమైన ఈ పర్యాటక ప్రదేశాన్ని మరింతగా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో యోగాంధ్ర కార్యక్రమాన్ని ఇక్కడ నిర్వహించామని స్పష్టం చేశారు. గత ఏడాది ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో లక్షల మంది పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. ఈ ఏడాది కూడా యోగా వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 21న విశాఖ బీచ్ రోడ్డులో వేలాది మంది ప్రజల భాగస్వామ్యంతో భారీ యోగా ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. యోగా ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవడంతో పాటు విశాఖలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా యంత్రాంగం తరఫున పిలుపునిచ్చారు.

### యోగా ప్రయోజనాలను, పర్యాటక విశిష్టతలను తెలియజేయాలి :ఎంపీ శ్రీ భరత్

విశాఖపట్నం ఎంపీ శ్రీ భరత్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ వంటి అద్భుతమైన వేదికలో యోగా నిర్వహించడం ఆనందదాయకమన్నారు. యోగా ప్రాముఖ్యతను ప్రజల్లో చాటడంతో పాటు విశాఖపట్నంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలను ప్రపంచానికి పరిచయం చేసే లక్ష్యంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ దేశంలోనే అత్యుత్తమ 18 హోల్ గోల్ఫ్ కోర్సుల్లో ఒకటిగా అభివృద్ధి చెందిందని, అంతర్జాతీయ ప్రమాణాలతో క్లబ్ హౌస్ నిర్మాణం పూర్తయిందని పేర్కొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి గోల్ఫ్ క్రీడాకారులు ఇక్కడికి వస్తున్నారని, విశాఖపట్నం పర్యాటక ఆకర్షణలను మరింత పెంచే సామర్థ్యం ఈ గోల్ఫ్ క్లబ్‌కు ఉందన్నారు. యోగా ప్రయోజనాలతో పాటు విశాఖలోని అందమైన పర్యాటక ప్రాంతాలను కూడా ప్రజలకు విస్తృతంగా పరిచయం చేయడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని ఎంపీ కోరారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ సెక్రటరీ ఎస్.వి.ఆర్.రాజు, వైస్ ప్రెసిడెంట్ టి.ఎస్. వర్మ, జనరల్ మేనేజర్ బ్రిగేడియర్ సత్య, లివింగ్ హార్ట్ స్కూల్‌కు చెందిన అరుణ కుమారి, డీఆర్డీఏ పీడీ, టూరిజం అధికారిణి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతిబింబిస్తూ...

విశాఖపట్నం, జూన్ 16 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా, అలాగే కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న "రెండేళ్ల నమ్మకం– అభివృద్ధి, సంక్షేమం" జిల్లా స్థాయి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 19న వీఎంఆర్‌డీఏ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించనున్న జిల్లా స్థాయి కార్యక్రమ ఏర్పాట్లపై కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో సమీక్ష నిర్వహించారు. విశాఖ రీజియనల్ కేటాయించిన "పెట్టుబడులు & పారిశ్రామిక వృద్ధి" అంశంపై ఈ కార్యక్రమం జరుగుతున్నందున, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేసేలా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. వేదిక వద్ద ప్రోటోకాల్ నిబంధనలకు అనుగుణంగా డయాస్, సీటింగ్ ఏర్పాట్లు, వీఐపీ, వీవీఐపీ గ్యాలరీలు, స్వాగత ఏర్పాట్లు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. "పెట్టుబడులు & పారిశ్రామిక వృద్ధి" అంశాన్ని ప్రతిబింబించేలా వివిధ శాఖల స్టాల్స్ ఏర్పాటు చేయాలని, జిల్లాలో గత రెండేళ్లలో జరిగిన పారిశ్రామిక అభివృద్ధి, ఆకర్షించిన పెట్టుబడులు, కల్పించిన ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ విజయాలను ఆకర్షణీయంగా ప్రదర్శించాలని సూచించారు. వేదిక వద్ద పారిశుద్ధ్యం, తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్లు, వైద్య సేవలు, అగ్నిమాపక భద్రత, నిరంతర విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. గత రెండేళ్లలో ప్రభుత్వం సాధించిన ప్రధాన విజయాలు, విశాఖపట్నం జిల్లాలో అమలైన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ఫలితాలపై సమగ్ర సమాచారాన్ని సిద్ధం చేసి కార్యక్రమంలో ప్రదర్శించాలని చెప్పారు. కార్యక్రమానికి సంబంధించిన ప్రతి ఏర్పాటును ముందుగానే పూర్తి చేసి, శాఖల మధ్య సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీసీపీలు మేరీ ప్రశాంతి, మణికంఠ, ఇన్చార్జి డీఆర్వో టి. గోవిందు, ఆర్డీవో దిలీప్ చక్రవర్తి, ఇతర శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## అగనంపూడి జోన్‌లో పరిపాలన గాడి తప్పిందా..?

అగనంపూడి, ప్రభాతవార్త



ప్రజలకు మరింత చేరువగా పాలన అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన అగనంపూడి జోనల్ కార్యాలయం ప్రస్తుతం తీవ్ర విమర్శల పాలవుతోంది. జోన్ ఏర్పాటు వల్ల అభివృద్ధి వేగవంతమవుతుందని, ప్రజా సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురవుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కార్యాలయంలో బయోమెట్రిక్ హాజరు వ్యవస్థ లేకపోవడంతో కొంతమంది సిబ్బంది విధులకు క్రమం తప్పకుండా హాజరుకావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు ఎప్పుడు వస్తున్నారు, ఎప్పుడు వెళ్తున్నారు అన్నదానిపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల కార్యాలయ పనితీరు దెబ్బతింటోందని స్థానికులు చెబుతున్నారు. జోనల్ కమిషనర్ స్థాయిలో పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన ఫైళ్లు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. టౌన్ ప్లానింగ్ విభాగంలో పూర్తిస్థాయి సిబ్బంది లేకపోవడం, ఇతర జోన్లలోనూ బాధ్యతలు నిర్వహించే అధికారులు ఇక్కడి పనులకు సరైన సమయం కేటాయించకపోవడంతో పలు దరఖాస్తులు నిలిచిపోతున్నాయి. అనధికార నిర్మాణాలపై సమగ్ర పర్యవేక్షణ లేకపోవడంతో సమస్యలు పెరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. అక్కడ పోస్టింగ్ పొందిన కొంతమంది అధికారులు తమ సొంత పనులకే ప్రాధాన్యత ఇస్తున్నారని, ఇక్కడ ఉన్న తక్కువ మంది సిబ్బంది... ప్రజలు పలుమార్లు కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. అగనంపూడి ప్రధాన రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణ వంటి ప్రాథమిక సమస్యల పరిష్కారంలోనూ అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వార్డు స్థాయిలో పర్యటనలు లేకపోవడం, సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించకపోవడం వల్ల ప్రజా సమస్యలు పేరుకుపోతున్నాయని అంటున్నారు. జీవీఎంసీ ఆదాయానికి కీలకమైన రెవెన్యూ విభాగం పనితీరుపైనా అనేక విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సిబ్బంది పనితీరుపై సమీక్షలు, గడువులోగా పెండింగ్ ఫైళ్ల పరిష్కారంపై దృష్టి లేకపోవడం, దీంతో పరిపాలనా వ్యవస్థపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ కమిషనర్ అగనంపూడి జోనల్ కార్యాలయాన్ని సందర్శించి, వార్డుల్లో పర్యటించి ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రజా సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే జోనల్ కార్యాలయ పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

## పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

### అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎంపీ సీఎం రమేష్



పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎంపీ సీఎం రమేష్

అనకాపల్లి జూన్ 16 :(ప్రభాత వార్త) పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసు రావాలని అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సీఎం రమేష్ అధికారులకు సూచించారు. అనకాపల్లి ఎంపీ క్యాంపు కార్యాలయంలో రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డా. సీఎం రమేష్ మంగళవారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో వరుస సమీక్ష సమావేశాలు నిర్వహించారు.జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్ ప్రాజెక్టులు, భవిష్యత్ మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై బీఎస్ఎన్ఎల్, రైల్వే, రెవెన్యూ, ఎన్‌హెచ్ఏఐ తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ల ఏర్పాటు, నెట్‌వర్క్ విస్తరణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఏటువంటి అంతరాయం లేకుండా పూర్తి స్థాయి మొబైల్ నెట్‌వర్క్ అందుబాటులోకి వచ్చేలా అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని అధికారులను సూచించారు. అనకాపల్లి నుంచి రాజమండ్రి దివాన్ చెరువు వరకు ప్రతిపాదిత సిక్స్– లైన్ జాతీయ రహదారి ప్రాజెక్టుపై ఎన్‌హెచ్ఏఐ అధికారులు , ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు.

## క్రీడల మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

### ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

ఎలమంచిలి, జూన్ 16, ప్రభాతవార్త:

నియోజకవర్గంలో 28.50 కోట్ల క్రీడ మౌలిక సదుపాయాల ఏర్పాటుకు సానుకూలంగా చర్యలు తీసుకోవాలని భారత క్రీడా ప్రాధికార సంస్థ డీజీని కోరిన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్. నియోజకవర్గంలోని యువతలో దాగివున్న క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు గ్రామీణ, తీర ప్రాంత క్రీడాకారులకు అంతర్జాతీయ ప్రమాణాల క్రీడా సదుపాయాలు అందుబాటులో తీసుకురావాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ న్యూఢిల్లీలో భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయి) డైరెక్టర్ జనరల్ హరిరంజన్ రావు ఐఏఎస్ కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నియోజకవర్గంలోని అచ్యుతాపురం మండలం వెల్చు పాలెం గ్రామంలో క్రీడా మౌలిక సదుపాయాల కొరత కారణంగా స్థానిక క్రీడాకారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. క్రీడలను ప్రోత్సహించడం, యువతను ఆరోగ్యవంతమైన జీవన శైలి వైపు మళ్ళించడం, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు ఆధునిక క్రీడా వసతులు అవసరమని అన్నారు. ఈ నేపథ్యంలో క్రీడా ప్రాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ ద్వారా కే లో ఇండియా పథకం కింద ఆన్లైన్ ఎంఐఎస్ పోర్టల్ లో సమర్పించిన నాలుగు ప్రధాన క్రీడా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు మొత్తం 28.50 కోట్ల అంచనా కి కేంద్ర ప్రభుత్వ తక్షణ పరిపాలన అనుమతులు మంజూరు చేసి అవసరమైన నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టులు అమలులోకి వస్తే నియోజకవర్గంతో పాటు మొత్తం అనకాపల్లి జిల్లా సమగ్ర క్రీడా కేంద్రం గా అభివృద్ధి చెందుతుందని వేలాది మంది యువ క్రీడాకారులకు అత్యాధిక శిక్షణ సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని సుందరపు విజయకుమార్ తెలిపారు. వినతిపత్రాన్ని స్వీకరించిన భారత క్రీడా ప్రాధికార సంస్థ డైరెక్టర్ జనరల్ హరిరంజన్ రావు ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## కేంద్రమంత్రి చంద్రశేఖర్‌ను కలిసిన ఎమ్మెల్యే సుందరపు

ఎలమంచిలి, జూన్ 16, ప్రభాతవార్త:

ఢిల్లీలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను మంగళవారం ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో గల పెండింగ్ సమస్యలపై కేంద్ర మంత్రిత్వ చర్చించారు. దీనిపై కేంద్రమంత్రి నియోజకవర్గంలోని పెండింగ్ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

## శిథిలమైన 'ఎర్రిగెడ్డ' వంతెన.. ప్రాణాలు పోయాకే అధికారులు కళ్లు తెరుస్తారా?

### ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది..? అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

బుచ్చయ్యపేట, జూన్ 16, ప్రభాతవార్త:

బుచ్చయ్యపేట మండలంలోని సీతయ్యపేట నుండి పెదపూడికి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న ఎర్రిగెడ్డ వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. సీతయ్యపేట –తోటకూరపాలెం – కన్నూరుపాలెం మీదుగా పెదపూడికి వెళ్లే ఈ మార్గం నిత్యం వందలాది మంది ప్రజలు, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు వినియోగించే కీలక రహదారి. అయితే ప్రస్తుతం వంతెన పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారడంతో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.వంతెనపై అనేక చోట్ల పగుళ్లు ఏర్పడటంతో పాటు కాంక్రీట్ పెచ్చులు ఊడిపోవడం, రక్షణ గోడలు దెబ్బతినడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో వంతెన మరింత బలహీనపడే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.ఈ మార్గంలో ప్రతిరోజూ ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రి వేళల్లో వంతెన పరిస్థితి స్పష్టంగా కనిపించక ప్రమాదాలకు ఆస్కారం మరింత పెరుగుతోంది. ఇప్పటికే పలుమార్లు స్థానికులు సంబంధిత అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు."ప్రమాదం జరిగి ప్రాణాలు పోయిన తర్వాత స్పందిస్తారా..? లేక ముందుగానే చర్యలు తీసుకుంటారా ..?" అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. భారీ ప్రమాదం జరిగేలోపు అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టాలని, అవసరమైతే కొత్త వంతెన నిర్మాణానికి చర్యలు ప్రారంభించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ శిథిల వంతెనపై సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. లేకపోతే ఏ క్షణమైనా జరిగే ప్రమాదానికి బాధ్యత ఎవరిదనే ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

## అనితకు క్షమాపణ చెప్పాలంటూ గుడివాడ ఫ్లెక్సీపై కోడిగుడ్లు దాడి

చోడవరం, జూన్ 16, ప్రభాతవార్త:



రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత పై, రాష్ట్ర మాజీ మంత్రి వైసిపి నాయకుడు గుడివాడ అమర్నాథ్ చేసిన అనుచితమైన వ్యాఖ్యలను ఖండిస్తూ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సాయంత్రం చోడవరంలో తెలుగుదేశం శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కొత్తూరు జంక్షన్ లో అమర్నాథ్ ఫ్లెక్సీ పై కోడిగుడ్లుతో దాడి చేశారు. అమర్నాథ్ బహిరంగ క్షమాపణ చెప్పకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని దేశం శ్రేణులు హెచ్చరించారు. చోడవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు మండల పార్టీ అధ్యక్షులు కురచేటి మధుగాలు, టౌన్ పార్టీ అధ్యక్షులు చిన్ని, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ నాగ గంగాధర్, పెద్ద అచ్చిబాబు, ఎంపీటీసీ కొట్యాడ రూపా దేవి చిన్న, టిడిపి యువసేన సకురు కోటేశ్వరరావు, గర్ల్స్ హై స్కూల్ చైర్మన్ సత్య సత్తిబాబు, ఉద్దె శ్రీనివాస్, నాయ్డు సుధాకర్, వరప్రసాద్, టిడిపి యువసేన అధ్యక్షులు గూనూరు ఎర్ర అప్పలనాయుడు, ప్రదీప్, నాయక్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హోం మంత్రికు అమర్నాథ్ తక్షణమే క్షమాపణ చెప్పాలి

( ఎస్. రాయవరం, ప్రభాతవార్త)

మండలంలోని తిమ్మాపురం శివారు కోనవానిపాలెం గ్రామంలో మంగళవారం తెలుగు మహిళలుహోంమంత్రి అనితపై వైసీపీ నేత గుడివాడ అమరనాథ్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ,అమరనాథ్ ఫ్లెక్సీని కోడిగుడ్లతో కొట్టి నిరసన వ్యక్తం చేసిన అమరనాథ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.గుడివాడ అమర్నాథ్ తక్షణమే క్షమాపణలు చెప్పాలన్నారు. కార్యక్రమం లో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మల్లపరెడ్డి నాగలక్ష్మి, మాజీ ఎంపీపీ కే.వెంకటలక్ష్మి, మండల మహిళా అధ్యక్షురాలు మున్నిసాహేబం, కొమ్మిరెడ్డి నాగలక్ష్మి, జిల్లా టీడీపీ సెక్రటరీ రుద్రారెడ్డి సంజీవని, మాజీ సర్పంచ్ దుబాసి జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌కు వాటర్ ఫిల్టర్, రేడియం స్టిక్కర్స్ అందజేసిన "హెటిరో"

(నక్కపల్లి, ప్రభాతవార్త )

సి ఎస్ ఆర్ నిధుల్లో భాగంగా సర్కిల్ పోలీస్ స్టేషన్ అవసరాలు గుర్తించి వాటర్ డిస్పెన్సర్ తో పాటు 20 బండిల్స్ రేడియం స్టిక్కర్స్ రోడ్డు భద్రత లో భాగంగా ఉపయోగపడేటట్టు హెటిరో డ్రగ్స్ డాక్టర్ బండి పార్థసారథి రెడ్డి ఆదేశాల మేరకు సీఐ జూరెడ్డి మురళికి సంస్థ ప్రతినిధులు మంగళవారం అందజేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం వాహనదారులు గ్రహించే విధంగా ఈ రేడియం స్టిక్కర్లు ఉపయోగపడతాయని అదే విధంగా వాటర్ ఫిల్టర్ స్టేషన్ కి వచ్చే ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని అటువంటి సహకారాన్ని అందించిన యాజమాన్యానికి స్టేషన్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు సన్ని బాబు , సాహెబా అంజుమ్, హెడ్ కానిస్టేబుల్ వెంకట్రావు ,పలువురు కానిస్టేబుల్ లు ఉన్నారు.

## గాజువాకలో 339 ముసాయిదా పోలింగ్ కేంద్రాలు సిద్ధం

గాజువాక, జూన్ 16,(ప్రభాతవార్త

గాజువాక నియోజకవర్గంలో 339 ముసాయిదా పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసినట్లు ఓటరు నమోదు అధికారి దయానిధి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. గతంలో 309 బూత్‌లు ఉండగా, 1200 కంటే ఎక్కువ ఓట్లు ఉన్న 107 రద్దీ బూత్‌లను గుర్తించామన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం.. ఓటర్లకు 2 కిలోమీటర్ల పరిధిలోనే అందుబాటులో ఉండేలా మరో 30 కొత్త బూత్‌లను ప్రతిపాదిస్తూ ముసాయిదా రూపొందించినట్లు చెప్పారు. జూలై 21 తర్వాత ఈ జాబితాను విడుదల చేస్తామన్నారు. ఇప్పటికే బిఎల్‌ఓల ద్వారా 10 వేల మందికి పైగా ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేశారని తెలిపారు. సమావేశంలో ఏఈఆర్ఓ త్రినాథ్, డిప్యూటీ తహసీల్దార్ రవికాంత్ బిజేపి తరపున కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, టిడిపి తరపున సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు,జనసేన తరపున రౌతు గోవింద్,పల్లా రమణ,పప్పు రాజారావు,లక్కరాజు సోమరాజు(సోంబాబు) కాంగ్రెస్ తరపున జెర్రిపోతుల ముత్యాలు, ఎలక్షన్ డిటి సూర్యకళ,ధనలక్ష్మి,వైసీపీ, బియస్పి, సిపియం,తదితర పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ ఓటరు ఫారాల పంపిణీ

గాజువాక, జూన్ 16,(ప్రభాతవార్త

గాజువాక అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్ల ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా బాలచెరువు ప్రాంతంలోని 291వ నెంబర్ పోలింగ్ బూత్ పరిధిలో మంగళవారం ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. బీజేపీ గాజువాక అసెంబ్లీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, కో-కన్వీనర్, సదరు బూత్ బీఎల్ఏ-2 జిలకర్ర భువనేశ్వరి దేవి కలిసి స్థానిక బూత్ లెవెల్ అధికారి నూర్‌తో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సరిచూస్తూ ఫారాలను అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించారు.

## పరదేశమ్మ అమ్మవారిని దర్శించుకున్న తిప్పల దేవాన్‌రెడ్డి

గాజువాక, జూన్ 16,(ప్రభాతవార్త

జీవీఎంసీ 76వ వార్డు స్వతంత్ర నగర్‌లో అత్యంత వైభవంగా జరుగుతున్న శ్రీశ్రీశ్రీ పరదేశమ్మ గ్రామ దేవత పండుగ మహోత్సవాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస్ దేవాన్‌రెడ్డి పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 76వ వార్డు అధ్యక్షులు మంత్రి శంకర్ నారాయణ, పార్టీ నాయకులు గాలి బాబురావు, మిరియాల కామేష్, దాసరి రమణ, కటారి అప్పారావు, అప్పలనాయుడు, అచ్యుత్ రెడ్డి, ఎండా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 12వ వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

ఆరిలోవ జూన్ 16 ప్రభాతవార్త

తూర్పు నియోజకవర్గం స్థానిక 12వ వార్డు ఆరిలోవలో మంగళ వారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబుతో పాటు జోనల్ కమిషనర్ శివప్రసాద్ కలిసి పూజా కార్యక్రమాలతో శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు నడుస్తుందని ఇందులో భాగంగా ఆరిలోవ దుర్గా నగర్ లో సిసి రోడ్లు తో పాటు బిటిఆర్ నగర్‌లో రిటైనింగ్ వాల్ నిర్మాణం కొరకు 80 లక్షల పైనే జీవీఎంసీ నిధులతో పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఒమ్మి సన్యాసిరావు, వార్డు అధ్యక్షులు ఒమ్మి అప్పలరాజు, వార్డ్ ఇంచార్జ్ గాడి సత్యం, వార్డ్ ప్రధాన కార్యదర్శి పోతిన భరత్, దువ్వి సంతోష్ కుమార్, పరదేశి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## 13వ వార్డు సాయినగర్‌లో మహా అన్నదానం

ఆరిలోవ, జూన్ 16, ప్రభాతవార్త

తూర్పు నియోజకవర్గం స్థానిక 13వ వార్డు, సెక్టర్ - 4 సాయి నగర్ లో వెలసియున్న శ్రీ విఘ్నేశ్వర, దత్తాత్రేయ సహిత శ్రీ సమర్థ సద్గురు సాయినాథ్ దేవాలయం యొక్క 8వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా టిడిపి యువ నాయకులు వెలగపూడి ప్రతాపరుద్ర హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘనస్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహా అన్నదానం కార్యక్రమం ఆయన చేతులు మీదుగా ప్రారంభించి భక్తులకు ప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు శ్రీ మహాలక్ష్మి, విశాఖ పార్లమెంట్ అధికార ప్రతినిధి పొత్రకండ ధర్మారావు, వార్డు మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి, సువ్వాడ శ్రీదేవి, ఎస్ ఆర్ వి వి ప్రసాద్, మాసాబత్తుల శ్రీను, కల్లూరి వెంకటేష్, కనకల శ్రీను, బొమ్మిడి వెంకటరమణ, ఆలయ కమిటీ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్ మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల సాయం

గాజువాక, జూన్ 16,(ప్రభాతవార్త

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాదంలో మరణించిన కాంట్రాక్టు కార్మికుడు, టీడీపీ కార్యకర్త గోక్యాడ సూరిబాబు (52) కుటుంబానికి పార్టీ సంక్షేమ నిధి నుంచి రూ.5 లక్షల ప్రమాద బీమా అందజేశారు. సీతానగరంలోని సూరిబాబు నివాసానికి మంగళవారం స్థానిక కూటమి నాయకులు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ డైరెక్టర్ మొల్లి పెంటిరాజు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో దేశ చరిత్రలోనే తొలిసారిగా మృతుడి కుటుంబంలో ఒకరికి 'పర్మినెంట్ ఉద్యోగం' ఇచ్చేలా నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో 90 రోజుల్లోనే ఉద్యోగ నియామకం పూర్తి చేసి, 45 రోజుల్లో బీమా నగదు అందజేస్తామని వార్డు నాయకులు నమ్మి అప్పారావు, ములకలపల్లి పెంటయ్య తదితరులు పేర్కొన్నారు.

## విద్యార్థులను శిక్షించొద్దు : గుప్తేశ్వరరావు

గాజువాక,జూన్ 16,(ప్రభాతవార్త

అధ్యాపకులు విద్యార్థులను శిక్షించకుండా, వారి మనసు మార్చి స్వీయ ప్రేరణతో చదువుకునేలా చేయాలని ప్రముఖ విద్యావేత్త గుప్తేశ్వరరావు అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాలలో అధ్యాపకులకు రెండు రోజులుగా నిర్వహించిన శిక్షణా కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ.. విలియం గ్లాసర్ 'ఎంపిక సిద్ధాంతం' ప్రకారం విద్యార్థులకు క్లాస్‌రూమ్‌లో తగినంత ప్రేమ, గుర్తింపు, స్వేచ్ఛ లభించినప్పుడే వారిలో అంతర్గత ప్రేరణ కలిగి చదువులో రాణిస్తారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జూనియర్, డిగ్రీ, నర్సింగ్ కళాశాలల ప్రిన్సిపల్స్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి, సిస్టర్ క్యాస్లిన్ 80 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుప్తేశ్వరరావును కళాశాల యాజమాన్యం సత్కరించింది.

## సురేశ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ భరత్

గాజువాక,జూన్ 16,(ప్రభాతవార్త

ఒమన్ తీరంలో భారతీయ నౌకపై జరిగిన దాడిలో మృతి చెందిన పట్నాల సురేశ్ కుటుంబాన్ని ఎంపీ భరత్ మంగళవారం పరామర్శించారు. సురేశ్ భార్య భార్గవిని కలసి వివరాలు అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. మృతదేహాన్ని స్వదేశానికి వేగంగా తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోం దని, ప్రభుత్వ పరంగా అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా చూస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే గణబాబు కుమారుడు మౌర్య కూడా ఉన్నారు.

## 21న యోగా వేడుకలకు అందరూ ఆహ్వానితులే..

### జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్

విశాఖపట్టణం జూన్ 15 ప్రభాత వార్త

ఈ నెల 21వ తేదీ ఉదయం 6.00 నుంచి 7.00 గంటల వరకు విశాఖపట్టణం ఆర్కేబీచ్ వేదికగా జరిగే 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు అందరూ ఆహ్వానితులేనని తప్పక విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ విజ్ఞప్తి చేశారు. మీడియా ప్రతినిధులు, జిల్లాలో ఉండే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో పని చేసే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, రక్షణ దళాల్లో సేవలందించే ఉన్నతాధికారులు, ఉద్యోగులు, పోర్టు, రైల్వే, పోస్టల్ విభాగాల్లో పని చేసే ఉద్యోగులు, విద్యా సంస్థల నిర్వాహకులు, బోధకులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, సీనియర్ సిటిజన్లు, యోగా నిపుణులు, స్వయం సహాయ సంఘాల మహిళలు, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలు కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిస్తూ మంగళవారం ఆయన ఆహ్వానం పలికారు.

## అమర్నాథ్ గౌడ్‌కు ఘన నివాళి

గాజువాక,జూన్ 16,(ప్రభాతవార్త

వైకాపా నాయకుల పెట్రోల్ దాడిలో బలైన బాలుడు అమర్నాథ్ గౌడ్‌కు గాజువాక నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘన నివాళులర్పించారు. పార్టీ కార్యాలయంలో బీసీ సెల్ అధ్యక్షుడు తమీర శివప్రసాద్ అధ్యక్షతన అమర్నాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత ఐదేళ్ల వైకాపా పాలనలో మహిళలు, వెనుకబడిన వర్గాలు, ఎస్సీ, ఎస్టీలపై అనేక అరాచకాలు, హత్యలు జరిగాయని మండిపడ్డారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఆ పార్టీ నాయకులు బలహీన వర్గాలను వేధిస్తూనే ఉన్నారని, వారికి రాజకీయంగా భూస్థాపితం చేయాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దొడ్డి సత్యారావు, సింగూర్ అనంత్, వియ్యపు కొండబాబు, పోతిన వెంకట్రావు, సింగంపల్లి దేవుడు, దువ్వి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి

### 21న ఆర్కేబీచ్ వేదికగా నిర్వహించే కార్యక్రమానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలి- సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలి కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్

విశాఖపట్నం జూన్ 16 ప్రభాతవార్త

12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం-2026 సంద ర్భంగా జిల్లాలో నిర్వహించ తలపెట్టిన యోగాంధ్ర వేడుకలను విజయ వంతంగా జరిపించేందుకు అన్ని శాఖలు సమన్వయం తో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో పలు థీమాటిక్ యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొంటూ ఇప్పటికే జూన్ 11న నావల్ డాక్‌యార్డ్‌లో మాజీ సైనికులు, రక్షణ సిబ్బంది కోసం యోగా కార్యక్రమం, జూన్ 12న రుషికొండ బీచ్‌లో పర్యాటక యోగా, జూన్ 16న ముడసర్లోవ ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్‌లో మరో యోగా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామని గుర్తు చేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రధాన కార్యక్రమాన్ని జూన్ 21న ఆర్కే బీచ్‌లో కాళీమాత ఆలయం నుంచి విక్టరీ ఎట్ సీ వరకు ఉదయం 6.00 నుంచి 7.00 గంటల మధ్యలో భారీ స్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిలో పెద్ద సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొనేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి నోడల్ అధికారులు, వేదిక ఇన్‌చార్జ్‌లు వారి బాధ్యతలను పక్కాగా నిర్వర్తించాలని చెప్పారు. సమీకరణ, ప్రచారం, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రత, వైద్య సేవలు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత శాఖలకు సూచించారు. యోగాను ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగంగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాల్లో జిల్లావాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీసీపీలు మేరీ ప్రశాంతి, మణికంఠ, ఇన్చార్జి డీఆర్వో టి. గోవిందు, ఆర్డీవో దిలీప్ చక్రవర్తి ఇతర శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల ఎన్నికలు

పద్మనాభం,జూన్16,(ప్రభాతవార్త

మండలంలో వెంకటాపురం, రేవిడి, చిన్నాపురం, విజయానందపురం గ్రామాలలో ఉన్న గొర్రెల పెంపకం దారుల సహకార సంఘాల ఎన్నికలు మంగళవారం ఏకగ్రీవం అయ్యాయని మండల పశువైద్య అధికారి భాస్కరరావు చెప్పారు. చిన్నాపురం సంఘానికి అధ్యక్షునిగా ఎన్ అప్పలరాము, ఉపాధ్యక్షుడుగా పి ఆదినారాయణ, కార్యదర్శిగా కె పెంటయ్య, రేవిడి సంఘానికి అధ్యక్షుడిగా ఎ రాము, ఉపాధ్యక్షుడుగా జి.సన్యాసి, కార్యదర్శిగా పి.రాజారావు, వెంకటాపురం సంఘానికి అధ్యక్షుడిగా జి బంగారరాములు, ఉపాధ్యక్షుడుగా పి సన్నిబాబు, కార్యదర్శిగా ఎన్ శ్రీను, విజయానందపురం అధ్యక్షుడిగా పి అప్పలనాయుడు, ఉపాధ్యక్షుడుగా ఎస్ పరదేశి, కార్యదర్శిగా పి సన్యాసిరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని చెప్పారు. ఈ మేరకు వారికి పత్రాలు అందజేసారు.

## గ్రామాభివృద్ధికి అధికారులు పక్కా ప్రణాళిక రూపొందించాలి..

పద్మనాభం, జూన్ 16,(ప్రభాతవార్త

మండలంలో ఉన్న గ్రామ పంచాయతీల అభివృద్ధికి పక్కా ప్రణాళకలను రూపొందించాలని ఎంపీపీ కె.రాంబాబు అధికారులను కోరారు. మం గళవారం మండల పరిషత్ సమావేశ మంది రంలో జిపిడిపి అభివృద్ధి ప్రణాళిక ముసాయిదాపై ఏర్పాటు చేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. గ్రామ రాబడిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు పక్కా ప్రణాళికలను తయారు చేసుకోవాలని ఆయన అన్నారు. అనంతరం గ్రామాభివృద్ధి ప్రణాళికపై గ్రామ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎండిఒ బి.చిన్నారావు, ఈఒఆర్డి బివి రమణ పాల్గొన్నారు.

## సంక్షేమం...ప్రగతిలో ఏపీ సరికొత్త చరిత్ర

గాజువాక,జూన్ 16 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వ రెండేళ్ల నమ్మకమైన పాలనతో దేశంలో ఏపీ బ్రాండ్ విలువ మళ్లీ పెరిగిందని ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పీలా గణబాబు అన్నారు. శ్రీహరిపురంలో నిర్వహించిన '2 ఏళ్ల నమ్మకం- అభివృద్ధి-సంక్షేమం' కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 16,525 మందికి ప్రతి నెలా రూ.7.32 కోట్ల పెన్షన్లు, 'తల్లికి వందనం' కింద 23,250 మంది తల్లుల ఖాతాల్లో రూ.30.25 కోట్లు జమ చేశామన్నారు. గోపాలపట్నం, ములగాడ పరిధిలోని 8,000 మందికి ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలు సిద్ధం చేశామని, త్వరలోనే సీఎం చేతుల మీదుగా అందిస్తామని చెప్పారు. కూటమి చొరవతో గూగుల్, టీసీఎస్ వంటి ఐటీ దిగ్గజాలు విశాఖకు వచ్చాయని, తాత్కాలిక భవనంలో రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

## వేధింపులపై విద్యార్థినులకు అవగాహన

గాజువాక,జూన్ 16,(ప్రభాతవార్త

మల్కాపురంలోని సెయింట్ ఆన్స్ మహిళా జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థినులకు హార్బర్ సబ్ డివిజన్ 'శక్తి' బృందం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ డా. శంఖ బ్రత బాగ్చి ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది విద్యార్థినులకు సైబర్ నేరాలు, పోక్సో, యాంటీ ర్యాగింగ్ చట్టాలు, ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా వేధింపులపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో 'శక్తి యాప్' ద్వారా పోలీసుల సహాయం ఎలా పొందాలో వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ పి. శ్రీను, శక్తి టీమ్ ఇన్‌ఛార్జ్ కె. ఇంద్రావతి పాల్గొన్నారు.

## పద్మనాభం మండలంలో రైతుసేవా కేంద్రాలకు చేరిన వరి విత్తనాలు

పద్మనాభం,జూన్ 16, ప్రభాతవార్త

పద్మనాభం మండలంలో పలు గ్రామాలలో ఉన్న రైతు సేవా కేంద్రాలకి పలు రకాల వరి విత్తనాలు చేరుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం వరి విత్తనాలను రైతులకు అందు బాటులో ఉంచడం ముందుస్తుగా ఉంది.దీంతో రైతులు కూడా నారు మడులను దుక్కులు దున్ని సిద్ధం చేస్తున్నారు. అయితే వరి విత్తనాలు ధరలు త్వరలోనే ప్రకటిస్తారని మండల వ్యవసాయ అధికారి సింహాచలం చెప్పారు. అలాగే భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అనుమతితో త్వరలోనే విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఆయన అన్నారు. అయితే ప్రైవేటు దుకాణ దారులు కూడా మండలంలో పలు గ్రామాలలో విక్రయాలు విత్తనాలను సిద్ధం చేసారు.

## మహిళా మంత్రిని కించపర్చిన మాజీ మంత్రి అమరనాథ్‌పై చర్యలు తీసుకోవాలి..

పద్మనాభం, జూన్ 16,(ప్రభావార్త

రాష్ట్ర హోంమంత్రి వి అనితను అసభ్యకరమైన పదజాలం తో స్త్రీ జాతిని అవమానించే విధంగా మాట్లాడిన మాజీ మంత్రి గుడివాడ అమరనాథ్ పై కేసునమోదు చేయాలని రాష్ట్ర కాపు కార్పోరేషన్ డైరెక్టర్ కె.లీలావతి, భీమిలి ఎఎంసి డైరెక్టర్ వి.నందిని,కృష్ణాపురం ఎంపిటీసీ కె లక్ష్మి మంగళవారం పద్మనాభం సిఐ శ్రీధర్‌కి ఫిర్యాదు అందజేసారు. దళిత మహిళా మంత్రి అనితను అవమా నించడం నైతికంగా తప్పుని,మేకప్ వేసుకొని, వాడేసిన కార్లపై తిరుగుతున్నారని వ్యక్తిగతంగా హేళనచేసి మాట్లాడటం సరైనది కాదని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ట్రస్ట్ సభ్యులు కె.దామోదరరావు,నాయకులు ఎర్రినాయుడు, గంగరాజు, పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ విఘ్నేశ్వర, దత్తాత్రేయ,శ్రీ సద్గురు సాయినాథ్ ఆలయ వార్షిక వేడుకలు

ఆరిలోవ, జూన్ 16, ప్రభాతవార్త

స్థానిక 13వ వార్డు ఆరిలోవ సాయి నగర్ ఉన్న శ్రీ విఘ్నేశ్వర,శ్రీ దత్తాత్రేయ,శ్రీ సద్గురు సాయినాథ్ ఆలయ వార్షిక వేడుకలు వైభవంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మహోత్సవాలకు విశిష్ట అతిథిగా తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావుతో పాటు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.వి.నారాయణ హాజరయ్యారు. వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్ కమిటీ సభ్యులు మేళతాలాలతో సాధర స్వాగతం పలికారు. వారికి ఆలయ పూజారి గోత్రనామాలతో పూజ నిర్వహించారు.రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి వానపల్లి ఈశ్వరరావు,రాష్ట్ర బిసి విభాగం కార్యదర్శి సత్యాల సాగరిక,వానపల్లి మంగరాజు, బేతా దుర్గారావు,సురేష్,ప్రసంగి వాసు, బీబీ, కొండమ్మ సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం జయప్రదం చేయండి

### విశాఖ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, అరుణ కుమారి

విశాఖపట్నం, జూన్ 16, ప్రభాతవార్త

అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం జయప్రదం చేయండి అని విశాఖపట్నం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ అరుణ కుమారి పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం అల్లిపురం చేరువలో పి భూపేష్ నగర్‌లో యాక్షన్ ఎయిడ్ సంస్థ కమ్యూనిటీ ఆర్గనైజర్ నేతృత్వంలో గృహ కార్మికుల నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా జూన్ 16న గృహ కార్మికుల దినోత్సవం నిర్వహించాలని ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ప్రకటించింది అన్నారు. గృహ కార్మికుల సమస్యలు ఏమి ఉన్నా పరిష్కారించడానికి చట్టాలు ఉన్నాయి అని వివరించారు. గృహ కార్మికు లందరూ ఈశ్రమ్ కార్డులు పొందాలని కోరారు. కార్మికులకు రక్షణగా లేబర్ డిపార్ట్మెంట్ ఉందని ఆమె వివ రించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పాల్గొని మాట్లాడారు.

## 23న శ్రీకుంచుమాంబ అమ్మవారి పండుగ

విశాఖపట్నం, జూన్ 16, ప్రభాతవార్త

23న జరగనున్న శ్రీ కుంచుమాంబ అమ్మవారి పండుగ నిర్వాహణ ఏర్పాట్లు, తద్వారా ఏర్పడే శాంతిభద్రతల సమస్యలను తెలుసుకోవడానికి ఎయిర్పోర్ట్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ శంకర నారాయణ, సబ్ ఇన్స్పెక్టర్ కార్తీక్ మాధవదార గ్రామాన్ని సందర్శించి పరిశీలించారు. మాధవదార పండుగ ఊరేగింపు రూట్, సమయాలను పండగ కమిటీ చైర్మన్ పోలీసులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ కంచరాన రమేష్, సనపల ఉమాపతి, పూజారి ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

ఆనందపురం, జూన్ 16, ప్రభాతవార్త

విశాఖపట్నం జిల్లా ఆనంద పురం మండలం బోని గ్రామపం చాయతీ పరిధిలోని రాముని పేట గ్రామంలో వెలసిన శ్రీ అభయాం జనేయ స్వామి ఆలయ 16వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. వేడుకల సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పురోహితుల ఆధ్వర్యంలో బోని శ్యామ్, జయశ్రీ దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడగా, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. బోని అప్పలనాయుడు, బోని సన్నాసినాయుడు, సురాల సత్యవర ప్రసాద్, హేమంత్ కుమార్, రామునిపేట గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, పాల్గొన్నారు.

## విశాఖ జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ

### ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్ అభిశిక్త్ కిషోర్ -డిఈవోలు, ఎంఈవోలకు స్పష్టమైన ఆదేశాలు -కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేసిన జర్నలిస్ట్ సంఘాల నేతలు

విశాఖపట్నం, జూన్ 16 ప్రభాత వార్త

విశాఖ జిల్లాలో ఉన్న అర్హులైన జర్నలిస్టుల పిల్లలందరికి 50 శాతం పీజు రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు మంగళవారం రాత్రి జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పేరిట ఈ ఉత్తర్వులను విడుదల చేశారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రతీ ఏటా ప్రయివేటు స్కూల్స్‌తో పాటు పలు కళాశాలల్లోనూ ఫీజు రాయితీ కల్పిస్తున్నారు. ప్రత్యేకంగా ప్రయివేటు స్కూల్స్ యాజమాన్యాలు జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుంది. ప్రతీ ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు స్కూలు ఫీజులో 50శాతం రాయితీ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ , ఏపి స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ లుజిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్‌ను కలిసి విజ్ఞప్తి చేయడం జరిగింది. దీంతో జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను విడుదల చేశారు. ఈ మేరకు అన్ని ప్రయివేటు స్కూల్స్ విధిగా జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ కల్పించాలని స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఇందుకు సంబంధించి డిఇవోలు, ఎంఈవోలకు కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తాజాగా జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు ప్రకారం అన్ని ప్రయివేట్ స్కూల్స్ యదాతథంగా జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ కల్పించాలని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి , ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు కోరారు. అలాగే తాము కోరిన వెంటనే ఉత్తర్వులు జారీ చేసినందుకు జిల్లా కలెక్టర్‌కు వీరు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు వీరికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ కార్యదర్శి జి శ్రీనివాస్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి రవికుమార్,ఉపాధ్యక్షులు శివప్రసాద్ నగేష్, కృష్ణమూర్తి బ్రాడ్ కాస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరరావు, మదన్, స్మాల్ పేపర్స్ అధ్యక్ష, కార్యదర్శులు జగన్మోహన్, శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు బొబ్బర్ ప్రసాద్, ఆనంద్, అరుణ్ భాస్కర్, రాజశేఖర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

vsp10:vsp10.qxd 16-06-2026 21:11 Page 1

## విజయభేరి సభ ఏర్పాట్లను పరిశీలించిన కూటమి నేతలు

**అనకాపల్లి, జూన్ 16 ,(ప్రభాత వార్త):**

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం రెండేళ్ల విజయవంతమైన పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా జూన్ 17 బుధవారం ఉదయం 10 గంటలకు అనకాపల్లి ఎన్టీఆర్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న విజయభేరి జిల్లా స్థాయి భారీ బహిరంగ సభ ఏర్పాట్లను మంగళవారం కూటమి నేతలు పరిశీలించారు. జనసేన పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ భీమరశెట్టి రామ్కీ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు పరిశీలించారు. మాజీ మంత్రివర్యులు, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు సభా ప్రాంగణాన్ని సందర్శించి సభకు హాజరయ్యే ప్రజలకు అవసర రమైన సౌకర్యాలపై అధికారులు, నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పార్కింగ్, భోజన వసతులు, తాగునీటి సదుపాయాలు, ప్రజల రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి తగిన సూచనలు చేశారు. పట్టణ కూటమి ఇంచార్జులు, నాయకులు పాల్గొని సభ విజయవంతానికి అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు.

## గ్రామాల్లో ఓటర్ల జాబితా పరిశీలన.!

**(నక్కపల్లి, ప్రభాతవార్త):**

మండలంలోని తాసిల్దార్ చిన్ని కృష్ణ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో ఓటర్ల జాబితా పరిశీలన ఆయా బిఎల్ఓ లు ఇంటింటికి వెళ్లి పరిశీలిస్తున్నారు. ఈ మేరకు పెద్ద తీనార్ల, రాజయ్యపేట గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో ఈ కార్యక్రమం మంగళవారం మొదలుపెట్టారు. ముందుగా బిఎల్వోలు సమక్షంలో పరిశీలన చేసిన అనంతరం ఇంటింటికి ఓటర్ల జాబితా ఆధారంగా వెళ్తున్నారు. కార్యక్రమంలో భాగంగా రాజయ్యపేట గ్రామంలోని 188 బూత్ నెంబర్ పరిధిలో ఇంటింటికి ఓటర్ పరిశీలన నిర్వహించారు. పెద్ద తీనార్ల గ్రామంలో రెవెన్యూ కార్యదర్శి సమక్షంలో ఓటర్ల జాబితా క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం రాజకీయ పక్షాల ప్రజలు పలు సూచనలు చేశారు. ఇంటింటి పరిశీలనలో వీఎల్వోలు పిక్కి బుజ్జి, శివాజీ, పిక్కి శ్రీను, పిక్కి చిన్నారి , యజ్ఞల అప్పలరాజు ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మెరుగు నాగేశ్వరరావు, గోసల చిన్న తాతారావు, దేవుడు, పిక్కి గంగరాజు, గ్రామ శాఖ అధ్యక్షులు, దైపల్లి శ్రీను, తదితరులు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటు హక్కు కాపాడుకోవాలంటే బిఎల్ఓలకు సహకరించాలని ప్రజలను కోరారు.

## అమర్నాథ్ పై విమర్శనలు మానుకోవాలి : వైసీపీ

**అనకాపల్లి , జూన్ 16 (ప్రభాత వార్త) :**

తాతల నాటి నుంచి రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన నాయకుడు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ పై విమర్శనలు మానుకోవాలని టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు కు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీకి వైసిపి నాయకులు తీవ్రంగా హెచ్చరించారు. స్థానిక రింగ్ రోడ్డు పార్టీ కార్యాలయంలో మంగళవారం వైసీపీ పట్టణ శాఖ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గుడివాడ అమర్నాథ్ మంత్రిగా ఉన్న సమయంలో అనకాపల్లి ని అందాలపల్లిగా తీర్చిదిద్ది అనేక అభివృద్ధి పనులు చేపట్టారని అన్నారు. మంత్రి అనిత ప్రతిపక్ష నాయకులపై వ్యాఖ్యలు చేయకుండా తమ మంత్రి హోదాతో గౌరవంగా మాట్లాడి లాన్‌ఆర్డర్ ను కాపాడాలని సూచించారు. ఒక గ్రామ స్థాయిలో సర్పంచ్‌గా గెలవలేని గల్లి నాయకుడు కోట్ని బాలాజీ కి అమర్నాథ్ ను విమర్శించే స్థాయి లేదన్నారు. చంద్రబాబు వద్ద మార్కులు కొట్టడానికి ఇటువంటి నీచ విమర్శనలు చేయడం తగదన్నారు. అమర్నాథ్‌పై విమర్శనలు వెనక్కి తీసుకోకపోతే పరిస్థితులు చాలా తీవ్రంగా ఉంటాయని డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీకి హెచ్చరించారు. వైసీపీ పట్టణ శాఖ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, వైసిపి నాయకులు గొర్లి సూరిబాబు, కొణతాల మురలీకృష్ణ, దంతులూరి శ్రీధర్ రాజు, జాజుల రమేష్, కెఎం నాయుడు, బొడ్డేటి శివ, గొల్లవెల్లి శ్రీనివాసరావు, పెద్దిరెడ్డి గోవింద పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న పూర్వ విద్యార్థికి ఆర్థిక సహాయం

**అగనంపూడి, ప్రభాత వార్త :**

మానవత్వం చాటుకున్న 1993-94 పదో తరగతి బ్యాచ్ కి చెందిన పూర్వ విద్యార్థులు. పరవాడ :జూన్ 16:అనకాపల్లి జిల్లా పరవాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1993-94 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు తమ స్నేహ బంధాన్ని మరోసారి చాటుకున్నారు. అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమ సహ విద్యార్థి గుర్రం బాబూరావుకు ఆర్థిక చేయూత అందించి మానవత్వాన్ని చాటారు. 1993-94 బ్యాచ్‌కు చెందిన గుర్రం బాబూరావు ఇటీవల అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు స్పందించారు. బ్యాచ్ మిత్రులు అంతా కలిసి విరాళాలు సేకరించి మొత్తం రూ. 35,000 నగదును బాబూరావుకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా స్నేహితులు మాట్లాడుతూ, కష్టకాలంలో స్నేహితుడికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావించామని తెలిపారు. భవిష్యత్తులో కూడా అవసరమైతే మరింత సహాయం అందిస్తామని పేర్కొన్నారు. ఆర్థిక సహాయం అందుకున్న గుర్రం బాబూరావు, తనకు అండగా నిలిచిన సహ విద్యార్థులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో సంవత్సరాల తర్వాత కూడా తమ స్నేహాన్ని గుర్తు చేసుకుంటూ సహాయం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. స్కూల్ రోజుల్లో ఏర్పడిన స్నేహం కాలగమనంలోనూ చెదరిపోకుండా, ఆపదలో ఉన్న మిత్రుడికి అండగా నిలిచిన 1993-94 బ్యాచ్ విద్యార్థుల సేవా భావం అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. ఈ కార్యక్రమంలో బుగిడి రామ గోవిందరావు, చిరికి లోకేష్, పైలా రాము, రెడ్డి గోపి, కూతా తిరుపతి అప్పన్నరెడ్డి, బండారు జోగినాయుడు, బండారు సోమునాయుడు, మైలపల్లి నరసింహరాజు, అనకాపల్లి నారాయణరావు, మోటూరు వీరునాయుడు పాల్గొన్నారు.

## అమర్నాథ్ మాట్లాడితే హుందాగా ఉండాలి : ఎంపిటిసి మధు



**( నక్కపల్లి రూరల్ ,అడ్డురోడ్డు, ప్రభాతవార్త ) :**

ఒక రాష్ట్రానికి మంత్రిగా పనిచేసిన వ్యక్తి దిగజారుడు రాజకీయాలకు వెళ్లి దిగజారుడు వ్యాఖ్యానాలు చేయడం తన హుందాతనానికి మంచిది కాదని ,మహిళలను గౌరవించడం నేర్చుకోవాలని మండలంలోని వేంపాడు ఎంపీటీసీ , న్యాయవాది కుంచె మధు అన్నారు. మంగళవారం వేంపాడు గ్రామంలో రాష్ట్ర హోం మంత్రి అనిత పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ తీరు మార్చుకోవాలని కోరుతూ నిరసన తెలిపారు. మధు మాట్లాడుతూ మహిళల పట్ల కనీస గౌరవం లేకుండా,బహిరంగంగా చేతిలో మైకు ఉంది కదా అని ఏది పడితే అది మాట్లాడితే రాష్ట్రంలో మహిళలు చూస్తూ ఊరుకోరని అన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి ని చూడలేక ఇటువంటి దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని, దమ్ముంటే అనిత పై రాజకీయంగా ఎదుర్కోవాలి కానీ హుందా లేని వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తక్షణమే హోమ్ మంత్రి అనితకు అమర్నాథ్ బహిరం గంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. టీడీపీ నక్కపల్లి మండల ఉపాధ్యక్షుడు అయినంపూడి అప్పలరాజు, మండల తెలుగు యువత అధ్యక్షుడు కమ్మిళ శివరామకృష్ణన్ రాజు,గ్రామ శాఖ అధ్యక్షుడు కల్లేపల్లి వెంకటపతి రాజు,పల్లా రాంబాబు, డైరెక్టర్ దారబాల బుజ్జి,పల్లా నాగరాజు,సబ్బు రాజు,కాంద్రకోట చిన్న అప్పన్న,కమిడి వెంకటరమణ,ఇసరపు పాపారావు,కమిడి బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

## అనధికారిక మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి

**ఎలమంచిలి, జూన్ 16, ప్రభాతవార్త:**

పట్టణంలోని పింజేరువు వద్ద అనధికారిక మట్టి తవ్వకాలపై ఇరిగేషన్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలంటూ మంగళవారం శ్రీ కనకమహాలక్ష్మి పింజేరువు ఆయు కట్టు రైతుసేవా సంఘం సభ్యులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కమిటీ అనుమతులు లేకుండా ధర్మవరం గ్రామానికి చెందిన కొందరు మట్టిని అనధికారకంగా తవ్వుతున్నారని వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## గత వైసీపీ పాలనలో బీసీలపై అన్యాయాలు జరిగాయి

### టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు

**(నక్కపల్లి, ప్రభాతవార్త )జూన్ 16:**

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో శాంతి భద్రతలు దెబ్బతిన్నాయని, ప్రశ్నించిన వారిపై దాడులు చేయడంతో పాటు అక్రమ కేసులు నమోదు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారని జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు ఆరోపించారు. మంగళవారం రాష్ట్ర హోంమంత్రి క్యాంప్ కార్యాల యం వద్ద బీసీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు విషయాలు చర్చించారు. సభలు, సమావేశాల్లో నా బీసీలు, ఎస్సీలు, ఎస్టీల సంక్షేమం గురించి మాట్లాడినప్పటికీ, ఆ వర్గాలకు న్యాయం చేయడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రేపల్లె నియోజకవర్గానికి చెందిన అమర్నాథ్ గౌడ్ అనే పదో తరగతి విద్యార్థి హత్య ఘటనను ప్రస్తావిస్తూ, ఆ సంఘటన జరిగి మూడేళ్లు పూర్తయ్యాయని గుర్తు చేశారు. అలాగే మాజీ ఎమ్మెల్సీ అనంతబాబుకు డ్రైవర్‌గా పనిచేసిన సుబ్రహ్మణ్యం హత్య ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిందన్నారు. బీసీ వర్గాలకు చెందిన ప్రముఖ నాయకులు అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడు వంటి వారిని రాజకీయంగా ఇబ్బందులకు గురిచేసేందుకు అప్పటి ప్రభుత్వం ప్రయత్నించిందన్నారు. గత పాలనలో అనేక దారుణ ఘటనలు చోటుచేసుకున్నాయని, ప్రజలు వాటిని మరచిపోలేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. పలువురు బీసీ నాయకులు కురం దాసు నూకరాజు, దేవర సత్యనారాయణ, గింజల లక్ష్మణరావు ,వైబోయిన వెంకటరమణ, గోసల శ్రీకాంత్, తాతారావు ,మునిషా బేగం, కాశీ విశ్వనాథ్, లింగం నాయుడు, మెరుగు నాగేశ్వరరావు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విమర్శలు చేయడానికి హద్దు ఉండాలి

### వ్యక్తిగతంగా విమర్శలు చేస్తే సహించేది లేదు : మాజీ ఎంపీపీ బోదుపు గోవిందు

**ఎలమంచిలి, జూన్ 16, ప్రభాతవార్త:**

పట్టణంలోని వైఎస్ఆర్సిపి కార్యాలయంలో మంగళవారం మాజీ ఎంపీపీ, వైఎస్ఆర్సిపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ నెంబర్ బోదుపు గోవింద్ పత్రికా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గోవిందు మాట్లాడుతూ రాష్ట్ర హోం మంత్రి అనిత మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని వ్యక్తిగతంగా విమర్శించడం తీవ్రంగా ఖండిస్తున్నామని ఇలాంటివి రాజకీయంలో చేయడం చాలా దురదృష్టకరమని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండు సంవత్సరాల్లో ప్రజలకు చేసిందేమీ లేదని కనీసం ఉపాధి అవకాశాలు కూడా కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేర్చలేదని, వాటిని అమలు చేసే దిశగా చర్యలు చేపట్టాలని ప్రతిపక్ష నాయకుల మీద ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం ఎంతవరకు సబమని అన్నారు. ఎంతో రాజకీయ అనుభవం గల కుటుంబం నుండి వచ్చిన మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ పట్ల హోం మంత్రి అనిత మాట్లాడదాం దురదృష్టకరమని అన్నారు. వ్యక్తిగత విమర్శలు మానుకుని రాష్ట్ర అభివృద్ధికి మీరు ఏం చేస్తున్నారో దానిని దృష్టిలో పెట్టుకోవాలని, ప్రతిదీ ప్రజలు గమనిస్తున్నారని త్వరలోనే మీకు బుద్ధి చెప్పే రోజులు వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, గుప్త, వైఎస్ఆర్సిపి జాయింట్ సెక్రెటరీ బొద్దపు ఎర్రయ్య దొర, వైఎస్ఆర్సిపి మండల పార్టీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, నాయకులు డాక్టర్ త్రినాథ్, మండల యూత్ అధ్యక్షులు వర్మ, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రానికి స్టేషనరీ వితరణ

**అనకాపల్లి జూన్ 16 (ప్రభాత వార్త):**

గరపాలెం శతకం పట్టు శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయ శాశ్వత చైర్మన్, ప్రముఖ నిర్మాత కాండ్రేగుల నాయుడు భాగ్యలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో తమ సొంత నిధులతో ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా జీవీఎంసీ అప్పర్ ప్రైమరీ స్కూల్, పల్లపు వీధి అంగన్వాడి కేంద్రం 50 మంది విద్యార్థిని విద్యార్థులకు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు పునర్ ప్రారంభించిన సందర్భంగా విద్య సంవత్సరం సరిపడ్డ పలకలు, పుస్తకలు, పెన్నులు, పెన్సిల్లు, స్కేలు, అన్నదానం, మొదలు వాటిని మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కనకదుర్గ అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు, శ్రీ గౌరీ పరమేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు, శ్రీ మరిడిమాంబ అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

**ఎలమంచిలి, జూన్ 16, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని ఏపీ సి ఎన్ఎఫ్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో జిల్లా డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ లచ్చన్న ఆధ్వర్యంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అధ్యక్షులు రాజాన సూర్యచంద్ర శేషగిరిరావు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిస్టిక్ ప్రాజెక్ట్ మేనేజర్ లచ్చన్న పకృతి వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత, పి ఎం డి ఎస్ వినియోగం ద్వారా కలిగే ప్రయోజనాలు, కషాయ ద్రావణాల తయారీ, వినియోగం, బయో రిసోర్స్ సెంటర్లు పాత్ర ఉపయోగాలు గురించి రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల ఆరోగ్య పరిరక్షణతో పాటు భూమి సారవంతం అవుతుందని, పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని తెలియజేసి రైతులందరూ ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ గోపి,వ్యవసాయ శాఖ, ఎంపీడీవో, ఏవో మోహన్ రావు, ప్రకృతి వ్యవసాయ శాఖ, వెలుగు శాఖ, ఉపాధి హామీ పథకం సిబ్బంది మండల నాయకులు జనసేన పార్టీ అధ్యక్షులు అన్నం బాబ్జి, లాలం సోమినాయుడు, కొలగాని భాస్కర్, ఏపీ సీ ఎన్ ఎఫ్ సిబ్బంది, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

## గుడివాడ అమర్నాథ్ ఫొటోపై కోడిగుడ్లతో దాడి

**అనకాపల్లి , జూన్ 16, (ప్రభాత వార్త):**

అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర గల పొలమాంబ గుడి జంక్షన్ లో టిడిపి మహిళ రాష్ట్ర కార్యదర్శి కొణతాల రత్నకుమారి ఆధ్వర్యంలో స్థానిక తెలుగు మహిళానాయకులు,కార్యకర్తలతో మాజీమంత్రి అమర్నాథ్ ఫొటోపై గుడ్లుతో దాడి చేశారు. ఈ సందర్భంగా రత్నకుమారి మాట్లాడుతూ హోమ్ మంత్రి వంగలపూడి అనిత మీద అనుచిత వ్యాఖ్యలు చేసి స్త్రీ జాతి తల దించుకునేట్టు చోడవరం మీటింగ్‌లో పేబ్యాచ్‌తో చప్పట్లు కొట్టించుకొని వెకిలి గా నవ్వుతూ ప్రగల్బాలు పలికారు. దళిత మహిళ, హోమ్ మినిస్టర్, విపత్తుల నిర్వహణ శాఖ మేనేజమెంట్ తెలుగుదేశం పార్టీ నాయకురాలుగా, పాయకరావుపేట శాసనసభ్యురాలుగా మహిళా లోకం గర్వించదగ్గ స్త్రీ శక్తి గా కొనసాగుతున్నటువంటి ఆమె పై ఒక ఫెయిల్యూర్ మినిస్టర్ కేవలం పానీపూరి షాప్ నూడిల్స్ కొట్టు ఓపెనింగ్ లకు మాత్రమే ప్రారంభించిన చేతకాని అమర్నాథ్ నోరుంది కదా అని ఆడవాళ్ల మేకప్ గురించి మట్లాడుతూ కిలోల కొలది పుట్టిలు వేసుకుని మీటింగ్ లకు వస్తున్నారని అసభ్యకరమైన వాఖ్యలు చేసినందుకు మహిళలు కి వెంటనే క్షమాపణ చెప్పాలి అని డిమాండ్ చేశారు. భారతీయ సాంప్రదాయం పండుగలు, ఫంక్షన్‌లకి వేసుకొని కాళీకామాతకి ఇష్టమైన అలంకరణ ను ప్రతి మహిళా అలంకరణ చేసుకొని అమ్మ వారి కృప కి పాత్రులు కావాలి అని ప్రతి మహిళ ఇష్టపడుతుంది అని రత్నకుమారి తెలిపారు.

## యువత భవిష్యత్తుకు డ్రగ్స్ శాపం

### అనకాపల్లిలో భారీ 'మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన ర్యాలీ

**అనకాపల్లి , జూన్ 16 (ప్రభాత వార్త):**

సమాజంలో మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించి, యువతను వ్యసనాలకు దూరం చేయడమే లక్ష్యంగా అనకాపల్లి జిల్లా పోలీసు యంత్రాంగం , జిల్లా ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా , అనకాపల్లి డి.ఎస్.పి ఎం.శ్రావణి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వద్ద ప్రారంభమైన ఈ భారీ ర్యాలీ, పట్టణ ప్రధాన వీధుల గుండా సాగుతూ ఫోర్ రోడ్ జంక్షన్ వరకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో అనకాపల్లి మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, టౌన్ సీఐ ప్రేమ కుమార్, సీఐలు వెంకట నారాయణ, అశోక్ కుమార్, గోవింద రావు ఎస్సై శ్రీనివాస రావు లతో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ మత్తు పదార్థాల బారిన పడి బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని యువతకు పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని కోరారు. వ్యసనాల నుంచి విముక్తి పొందడానికి జిల్లా ఆసుపత్రిలోని విముక్తి కేంద్రాన్ని (టోల్ ఫ్రీ నెంబర్: 1972) సంప్రదించవచ్చని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

## నేడు ఉపమాకలో యోగాంధ్ర

### హోం మంత్రి అనిత, ఎంపీ, కలెక్టర్ రాక ..వెంకన్న ఆలయ ప్రాంగణంలో విస్తృత ఏర్పాట్లు

**(నక్కపల్లి/అడ్డు రోడ్డు, ప్రభాతవార్త) జూన్ 16 :**

మండలంలోని ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో యోగాంధ్రలో భాగంగా బుధవారం ఉదయం సామూహిక యోగాసనాల ప్రదర్శన కార్యక్రమానికి అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపడుతోంది. బుధవారం ఉదయం 5-30 గంటల నుంచి 7 గంటల వరకూ 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలకు పురస్కరించుకుని ప్రొటోకాల్ యోగాసనాలుంటాయని అధికారులు చెప్పారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఎస్పీ తుహీన్ సిన్హా, ఆయుష్ ఆర్డీడీ కె.శ్రీనివాసులు తదితరులు హాజరుకానున్నారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఉపమాక ఆలయం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను డీఆర్డీఏ ఇన్ఛార్జి పీడీ డైజీ, డీఎల్పీవో కొండలరావు, నియోజకవర్గం టీడీపీ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, ఎంపీడీవో కె.చలపతిరావు, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, పీఏసీఎస్ చైర్ పర్సన్లు కొప్పిశెట్టి బుజ్జి, వెలగా శ్రీను, ఆయుష్ వైద్యాధికారులు డాక్టర్ కె.రఘు, సుజాత, అనూష తదితరులు పరిశీలించారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కొప్పిశెట్టి వెంకటేష్ నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు.

## అల్లూరి పార్కులో యోగా డే ఏర్పాట్లు

**గొలుగొండ జూన్ 16, ప్రభాతవార్త**

యోగాంధ్ర కార్యక్రమం ఈనెల 20న శనివారం అల్లూరు పార్కులో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు, తహసిల్దార్ వి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం అల్లూరు పార్కును సందర్శించి యోగ డే నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించారు. 500 మందితో యోగా డే నిర్వహిస్తామని అన్నారు. ఇందుకు తగిన ఏర్పాట్లు వసతి సౌకర్యాలపై పార్కులో అన్ని ప్రదేశాలను పరిశీలించారు. మండల స్థాయిలో జరిగే యోగ డేకు జిల్లా అధికారులు హాజరయ్యే అవకాశం ఉందని అందుకు తగిన తగిన విధంగానే అన్ని సౌకర్యాలు సమకూర్చి ఘనంగా నిర్వహించేందుకు సన్నద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

## ఇండియన్ స్టాటిస్టికల్ ప్రవేశ పరీక్షలో సత్తా చాటిన శ్రీ ప్రకాష్ విద్యార్థి మోనిష్ కుమార్

**పాయకరావుపేట రూరల్, జూన్ 16, ప్రభాతవార్త :**

మంగళవారం ప్రకటించిన ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్ (×ూ×) జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలో శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థి జె మోనిష్ కుమార్ అల్ ఇండియా లెవెల్ ఓబీసీ క్యాటగిరీలో 15 వ ర్యాంక్ ఓపెన్ క్యాటగిరీలో 107 వ ర్యాంక్ సాధించాడని కళాశాల ప్రిన్సిపాల్ వి.వి.ఎస్.ఎస్ భానుమూర్తి తెలిపారు. తమ కళాశాలలో 6 వ తరగతి నుండి 12 వ తరగతి వరకు ఇస్తున్న 7 సంవత్సరాల క్లాస్ రూమ్ ప్రోగ్రాంతో పాటుగా వివిధ జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ఇస్తున్న శిక్షణ ద్వారా తమ విద్యార్థులు ఈ విజయాలను సాధిస్తున్నారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

## పాయకరావుపేటలో బిజెపి బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం

**పాయకరావుపేట రూరల్, జూన్ 16, ప్రభాతవార్త :**

భారతీయ జనతా పార్టీ పాయకరావుపేట మండల ప్రత్యేక సమగ్ర సవరణ బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల అధ్యక్షులు మంచాల గాంధీ, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి బి రత్న భరత్, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు శ్రీరంగ రమేష్, యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు సురేంద్ర, సీనియర్ నాయకులు గెడ్డం గాంధీ, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కలిగట్ల మూలస్వామి, కిసాన్ మోర్చా సెక్రటరీ దాడి శ్రీను, ఓబిసి మోర్చా సెక్రెటరీ పిల్లి రాంబాబు, పాయకరావుపేట మండలంలోని 18 గ్రామాలకు చెందిన బిఎల్ఓలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్‌కు సంబంధించిన వివరాలు తెలుసుకోవడం జరిగింది. ఎస్ఐఆర్ కార్యక్రమం వల్ల దేశ భవిష్యత్తు ఏరకంగా మారిపోతుందో జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి రత్న భరత్ వివరించారు. బిజెపి పార్టీ కార్యకర్తలందరూ కార్యక్రమంలో పాల్గొని స్పష్టమైన ఓటు జాబితా తయారు అయ్యేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## యోగాంధ్ర విజయోత్సవ సభలను విజయవంతం చేయాలి : కూటమి నేతల పిలుపు.!

**(నక్కపల్లి, ప్రభాతవార్త)**

యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఉదయం ఉపమాకలో నిర్వహించనున్న సామూహిక యోగా ప్రదర్శనను, కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించే విజయోత్సవ సభలను విజయవంతం చేయాలని కూటమి నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం ఉపమాకలో జరిగే సామూహిక యోగా కార్యక్రమానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ హాజరుకానున్నారు. ఈ కార్యక్రమాలు విజయవంతం పై పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయ కమిటీ నాయకత్వం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ , జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి లాలం కాసినాయుడు ల సమక్షంలో ప్రత్యేక సమావేశం మంగళవారం మంత్రి క్యాంప కార్యాలయం వద్ద జరిగింది. ఈ సమావేశంలో అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించే కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన విజయోత్సవ సభతో పాటు ఈ నెల 19న పాయకరావుపేట నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్న విజయోత్సవ సభలను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ పాలనలో అనకాపల్లి జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. రెండేళ్ల పాలనలో సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, గ్రామ స్థాయిలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా వివరించాలని సూచించారు. హోం మంత్రి వంగలపూడి అనిత నాయకత్వంలో పాయకరావుపేట నియోజకవర్గం గణనీయమైన అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రెండేళ్ల విజయోత్సవ సభలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. హోం మంత్రి అనిత సారథ్యంలో నియోజకవర్గం ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి చెందుతోందన్నారు. కూటమిలోని మూడు పార్టీల నాయకులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవి రాజు మాట్లాడుతూ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని విజయోత్సవ సభల నిర్వహణపై చర్చించారు. మండల పార్టీ అధ్యక్షులు చించెలపు పద్దు, గింజల లక్ష్మణరావు, కమల కంటి అబద్ధం, గుర్రం రామకృష్ణ, కొప్పిశెట్టి బుజ్జి, ప్రగడ వీరబాబు, నానేపల్లి రాఘవులు, కురుందాసు నూకరాజు, వైబోయిన వెంకటరమణ, మెరుగు నాగేశ్వరరావు, పేర్ల శ్రీను, గోసల తాతారావు, శ్రీకాంత్, అయినంపూడి అప్పలరాజు, గొట్టివాడ బాబ్జి, కొప్పిశెట్టి వాసు, జగదీష్, శ్రీను, ఏళ్ల వరహాలు, విలియం కేరి, మల్లపురెడ్డి రమాకుమారి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మున్నిషాబేగం, నక్కపల్లి మహిళా అధ్యక్షురాలు కొమ్మిరెడ్డి నాగలక్ష్మి, ఎస్.రాయవరం మండలం మహిళా అధ్యక్షురాలు, ఎస్.రాయవరం ఎం.పి.పి వెంకటలక్ష్మి , జిల్లా టీడీపీ కార్యదర్శి గుడబంటి శాంతమ్మ, దుబాసి జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## అతిసార వ్యాధి నివారణ .. అవగాహన

**గొలుగొండ జూన్ 16, ప్రభాతవార్త:**

అతి సార వ్యాధి నివారణ అవగాహనతోనే సాధ్యమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్యామ్ కుమార్ అన్నారు. అవగాహన కార్యక్రమం గొలుగొండ అంగన్వాడి కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అతిశారవ్యాధి లక్షణాలు,వ్యాధి ప్రబలే విధానం పై వివరించారు. జులై 31 వరకు అవగాహన కార్యక్రమం అన్ని అంగన్వాడి కేంద్రంలో అవగాహన కార్యక్రమాలు కొనసాగితేయని అన్నారు. వ్యాధి లక్షణాలు తరచూ జ్వరం రావడం,వంటి వేడి తగ్గిపోవడం, నీళ్ల విరోచనాలు, అకస్మాత్తుగా స్మారక స్థితి కోల్పోవడం తోపాటు కొన్ని రకాలు లక్షణాలు కనిపిస్తాయి అన్నారు. వ్యాధి నివారణను తెలుసుకోండి అంటూ ప్రచారం చేస్తూ అటువంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్య సదుపాయం కల్పించడమే లక్ష్యంగా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఫకీర్ నాయుడు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న విశాఖ జిల్లా జడ్జి నాయుడు కుటుంబ సభ్యులు

**పాడేరు,జూన్17,ప్రభాతవార్త:**

మన్యం ఆరాధ్య దేవత పాడేరు శ్రీ మోదకొండమ్మ వారిని విశాఖ జిల్లా జడ్జి ఎస్. నాయుడు కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. జిల్లా జడ్జికి ఆలయ మర్యాదలతో కమిటీ సభ్యుడు రామకృష్ణ ఘనస్వాగతం పలికారు. జిల్లా జడ్జి పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. జడ్జికి అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి దేవా కప్పు ఘనంగా సత్కరించారు. పాడేరు సిఐ దీనబంధు, ఆలయ కమిటీ సభ్యులు రామకృష్ణ,వంజంగి కాంతమ్మ, లకే రత్నాబాయి పాల్గొన్నారు.

## ఫిన్లాండ్ అంతర్జాతీయ శిక్షణకు సత్యారావు ఎంపిక

పాడేరు,జూన్17, ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయులకు అందించే అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమానికి హుకుంపేట మండలం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మత్స్యపురం ఉపాధ్యాయుడు మొష్య సత్యారావు ఎంపికయ్యారు. విజయవాడలో ప్రారంభమైన ఇంటర్నేషనల్ ప్రొఫెషనల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో సత్యారావు పాల్గొన్నారు. సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం ఈ శిక్షణ మూడు దశల్లో సాగుతుంది. మొదటి దశలో విజయవాడలో తూర్కు విశ్వవిద్యాలయ సాంకేతిక నిపుణులతో శిక్షణ ఇప్పిస్తున్నారు. రెండోదశలో భాగంగా ఆగస్టు 17 నుంచి 26 వరకు ఉపాధ్యాయులు రోమా నగరంలో పర్యటించి అక్కడి విద్యా విధానాలను పరిశీలిస్తారు. మూడో దశలో ప్రాజెక్టు పనులు అమలు కోసం విదేశీ ప్రొఫెసర్లు ఆన్లైన్ ద్వారా మార్గదర్శకత్వం వహిస్తారు.తనకు ఈ అరుదైన అవకాశం కల్పించిన విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కి ఉపాధ్యాయుడు సత్యారావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు శిక్షణ లక్ష్యాలు సాధనకు నూరు శాతం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. సాల్ట్ కోఆర్డినేషన్ వి. సతీష్ రెడ్డి సమగ్ర శిక్ష సిబ్బంది పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలల్లో 5-10వ తరగతుల్లో సీట్లు పెంచాలి

పాడేరు,జూన్17,ప్రభాతవార్త:

గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 5-10వ తరగతులు సీట్లు పెంచాలని, గిరిజన సంక్షేమ స్కూల్లో విద్యార్థి, విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ అల్లూరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జీవన్, కార్తీక్ డిమాండ్ చేసారు. ఏజెన్సీ 11 మండలాల్లో గల ప్రతి స్కూలు 5 నుండి 10 తరగతిలో సీట్లు పెంచాలని, గురుకుల కళాశాలలో, కేజీబీవీ లో, గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో ప్రతి గ్రూపుకి సీట్లు పెంచాలంటూ మంగళవారం పాడేరు గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ పరిమళ కు అల్లూరి జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు విద్యార్థి సమస్యలను పరిష్కరించాలంటూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అల్లూరి జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు జీవన్, కార్తీక్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సునందిని, భూషణం, అనిల్ కుమార్, ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు చందు, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు

పాడేరు,జూన్17,ప్రభాతవార్త:

గిరిజన హారతి ౘైవం కోరికలు తీర్చే కొంగుబంగారంగా పేరుగాంచిన పాడేరు మోదకొండమ్మ వారి సన్నిధిలో ఆలయ కమిటీ ఛైర్మన్ , పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు మంగళవారం పాడేరు ఐటిడిఏ రిటైర్డ్ ఉద్యోగి బాదం విశ్వనాథం, సత్యవతి దంపతుల ఆర్థిక సహాయంతో అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సుధీర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పి చైర్పర్సన్ వంజంగి కాంతమ్మ, మాజీ జెడ్పిటిసి రొబ్బా ఉషారాణి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లుకోటిబాబు నాయుడు,ఆలయ కమిటీ సభ్యులు ,తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మణిద్వీప వర్ణన పూజ

అరకులోయ, జూన్ 16, ప్రభాతవార్త :

అరకులోయలో నివాసముంటున్న కాపుగంటి హరిబాబు, రాజ్యలక్ష్మి దంపతుల ఇంటి వద్ద మంగళవారం భక్తిశ్రద్ధలతో మణి ద్వీప వర్ణన పూజ వైభవోపేతంగా జరిగింది. అష్టైశ్వర్యాలు మనశ్శాంతి తో పాటు లక్ష్మీదేవి, శ్రీ లలిత దేవి అమ్మవార్ల కరుణాకటాక్షాలు ఉండాలని కోరుతూ భక్తిశ్రద్ధలతో జరిపిన మణిద్వీప వర్ణన పూజా కార్యక్రమంలో అరకులోయ యండపల్లి వలస గ్రామానికి చెందిన ఆర్యవైశ్య మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. దీనిలో భాగంగా మణిద్వీప వర్ణన శ్లోకాలను ఆర్యవైశ్య మహిళలు భక్తితో పఠనం చేశారు. సుమారు మూడు గంటలకు పైగా మణి ద్వీప వర్ణన పూజా కార్యక్రమం జరిగింది. ముందుగా శ్రీ లలితా దేవి చిత్రపటానికి, లక్ష్మీదేవి విగ్రహానికి పుష్పాలతో అలంకరణ చేసి, పసుపుతో వినాయకుని తయారుచేసి భక్తితో పూజలు జరిపి మణిద్వీప వర్ణన ను తొమ్మిది సార్లు పఠనం చేశారు.

## పీఎం జన్మన్ బిల్లులు చెల్లించాలని ర్యాలీ

దుంబ్రిగూడ, జూన్ 16 ప్రభాతవార్త:

పీఎం జన్మన్ పథకంలో భాగంగా గృహ నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు అదనంగా ప్రభుత్వం పెంచిన రూ లక్ష బిల్లులను చెల్లించాలని, పీఎం జన్మన్ 2.0 ద్వారా గృహ నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్థానిక గిరిజన సంఘం ఆధ్వర్యంలో పివిటిజి గిరిజనులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రం మూడు రోడ్ల జంక్షన్ నుంచి హౌసింగ్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి అనంతరం హౌసింగ్ ఏఈఈ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ మాట్లాడుతూ పీఎం జన్మన్ గృహ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనంగా రూలక్ష బిల్లులు పెంచిందన్నారు. ప్రసంగం జిల్లా ఉపాధ్యక్షుడు పి సూర్యనారాయణ, మండల అధ్యక్షుడు పి సురేష్ కుమార్, పి సత్యనారాయణ, పివిటిజి గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.

## రణజల్లడ జలపాతం నుంచి మాలివలస వరకు కొత్త నీటి మళ్లింపు నిర్మాణం

అరకురూరల్, జూన్ 16, ప్రభాతవార్త:

జలధార--జలహారతి కార్యక్రమంలో భాగంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చినలబుడు గ్రామపంచాయతీ పరిధిలోని మాలివలస గ్రామంలో రణజిల్లడ వాటర్ ఫాల్ నుండి మాలివలస వరకు సుమారు 2 వేల మీటర్ల పొడవున కొత్త నీటి మళ్లింపు కాలువ (ఫీల్డ్ ఛానల్) నిర్మాణం చేపట్టడం జరిగింది. ఈ పనికి సుమారు 5 లక్షల 40 వేల రూపాయలు అంచనా వ్యయం కేటాయించబడింది.మాలివలస గ్రామానికి చెందిన వేతనదారుల ద్వారా ఈ పనులను విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని. ఈ కాలువ నిర్మాణంతో గ్రామ ప్రజల ఎన్నో సంవత్సరాల కల నెరవేరడమే కాకుండా, సుమారు 2 వందల యాభై ఎకరాల వ్యవసాయ భూమికి సాగునీరు అందే అవకాశం ఏర్పడింది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి వీసం ప్రసాద్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ జె. జగదీశ్వరరావు, ఎం జి ఎన్ ఆర్ ఈ జి ఎస్ సి హెచ్ జగదీష్, ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ బి. మహేష్, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్స్ మరియు ఉపాధి కార్మికులు వేతనదారులు గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## చెరువును కబ్జా చేసి.. అధికారుల ఆదేశాలు బేఖాతరు చేసి..!

### ఉన్నతాధికారులకు మీకోసంలో తాజా మాజీ సర్పంచ్ ఫిర్యాదు

కొయ్యూరు జూన్ 16 ప్రభాతవార్త

గత కొన్నేళ్లుగా వ్యవసాయ చెరువును కబ్జా చేయడమే కాక, ఆ భూమిని లీజుకు ఇచ్చిన ఒక ఘరానా ఘనుడిపై మీకోసం లో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు మండలంలోని చీడిపాలెం తాజామాజీ సర్పంచ్ నత్తూరు సోమన్న దొర ఒక ప్రకటనలో తెలిపారు. చీడిపాలెం పంచాయితీ సింగవరం రెవెన్యూ గ్రామంలో 37/5 సర్వేనెంబర్ లో ప్రభుత్వ పోరంబోకు రెండు ఎకరాల ఐదు సెంట్లు భూమిలోఉన్న చెరువును సింగవరం గ్రామానికి చెందిన జలుమూరి రాజేశ్వరమ్మ తనయుడైన జలుమూరి గోవిందరావు గత ఎన్నో సంవత్సరాలుగా వేరే వ్యక్తులకు కౌలుకిస్తూ వ్యవసాయం చేయిస్తున్నారని,దీనిపై పాడేరు మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేసానన్నారు.ఫిర్యాదును కొయ్యూరు తాసిల్దార్ పరిశీలించి చెరువుగా పరిగణించి అది చెరువు అని ఎండార్స్ మెంట్ ద్వారా తెలియజేసారన్నారు .కానీ ఆ భూమిలో మళ్లీ వ్యవసాయం చేయడానికి దుక్కి దున్నించడం జరిగిందన్నారు.ప్రభుత్వ భూమిని కబ్జా చేయడమే కాకుండా లీజుకిస్తూ వ్యవసాయం చేయించటం నేరంగా పరిగణించబడుతుందని, గత తాసిల్దారు తెలియజేసారన్నారు. ప్రభుత్వ చెరువును కాపాడాలని, చెరువును అభివృద్ధి చేసే విధంగా ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి ఈ ప్రభుత్వ చెరువుని కాపాడాలని సోమవారం నాడు స్థానిక మండల తాసిల్దారు ఆధ్వర్యంలో జరిగిన గ్రీవెన్స్ నందు మరలా ఫిర్యాదు చేశానని సోమన్న దొర వివరించారు.

## మహిళలను తలదించుకునేలా ముందు వ్యాఖ్యానించింది ఎవరు..!

### హోం మంత్రి అనితను ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి

పాడేరు,జూన్17,ప్రభాతవార్త:

రాష్ట్రంలో మహిళా లోకాన్ని , ముఖ్యంగా ఎస్సీ సామాజిక వర్గ మహిళలను తలదించుకునేలా ముందు వ్యాఖ్యానించింది ఎవరని..హోం మంత్రి అనిత ని పాడేరు మాజీ ఎమ్మెల్యే , వైఎస్ఆర్సిపి ఎస్టీ సెల్ అధ్యక్షులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ప్రశ్నించారు.మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ పై అనిత చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించారు. పాడేరులోని ఆమె క్యాంపు కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వ్యక్తులు సమాజ విలువలతో కట్టుబడి మర్యాదపూర్వకంగా సమాజం గౌరవించేలా మాట్లాడాలనే విజ్ఞతను మరిచి అనిత వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారన్నారు. ఈరోజు మహిళా లోకం తలదించుకునేలా గుడివాడ అమర్నాథ్ మాట్లాడా రని టిడిపి సోకాల్డ్ నేతలు అంతా మాట్లాడుతున్నారని వాస్తవానికి మహిళ లోకం తలదించుకునేలా మొదట మాట్లాడింది ఎవరన్నది ఒకసారి గుర్తు చేసుకోవాలన్నారు. ఓ మాజీమంత్రి, ఉత్తరాంధ్రలోనే అత్యంత ప్రభావంతమైన నాయకుడు, రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి పట్ల అమర్యాదగా , వ్యక్తిత్వ హననం చేయడం ఎంతవరకు సరైన పద్ధతిని ఆమె ప్రశ్నించారు. కనీసం మర్యాద లేకుండా అమర్నాథ్ ను వాడు వీడు అంటూ సంబోధించడం వలన మహిళలోకానికి గౌరవం పెరుగుతుందా? అని అన్నారు. ఐదేళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్మోహన్ రెడ్డి ని గౌరవించరు... ఆయన పార్టీలో ఉన్న వారినీ గౌరవించరు ...మీరు ఎవరినైనా వ్యక్తిగత దూషణలు చేయొచ్చు కానీ మిమ్మల్ని ఒక మాట అనేసరికి మహిళా లోకం, ఎస్సీ కార్డు గుర్తు వచ్చిందా? అని ఆమె అన్నారు.

## ఆధార్, రేషన్ కార్డు లేక నిలిచిపోయిన వృద్ధాప్య పెన్షన్

అరకు రూరల్ జూన్ 16: ప్రభాతవార్త:

ఆధునిక డిజిటల్ యుగంలో ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతున్నాయని చెప్పినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం కొందరి పరిస్థితి అత్యంత దయనయంగా మారింది. లోతేరు పంచాయతీ పరిధిలో నివసిస్తున్న స్వాభి. పెంటమ్మ, వయస్సు(65) భర్త. (మోస్య, లేటు)ఒంటరి మహిళ పరిస్థితి దీనికి ప్రత్యేక ఉదాహరణగా నిలుస్తుంది. ఆమెకు అండగా నిలిచి కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో పూర్తిగా ఒంటరిగా జీవిస్తుంది. వయస్సు పై బడటంతో కనీసం శ్రమించి పనిచేసుకునే శక్తి కూడా లేదు. ఇటువంటి పరిస్థితులలో ప్రభుత్వ పింఛనే ఆమెకు ఏకైక జీవనాధారం కావాలి. కానీ, విధి వచించిన ఆమెను ప్రభుత్వ నిబంధనలు కుంగదీస్తున్నాయి. ఆమెకు కనీస గుర్తింపు కార్డు లేని ఆధార్ కార్డు కానీ, రేషన్ కార్డు, కానీ లేవు. ఈ సాంకేతిక కార్ల వల్ల ఆమెకు రావాల్సిన ప్రభుత్వం ఒంటరి మహిళ పెన్షన్ పూర్తిగా నిలిచిపోయింది. కడుపు నింపుకోవడానికి రేషన్ సరుకులు లేక చేతులు పింఛన్ డబ్బులు లేక ఆదరించే వారు కరువై ఆమె ప్రతిరోజు ఆకలితో అలమటిస్తుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి, మానవత దృక్పథంతో ప్రత్యేక చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. తక్షణమే సదరు ఒంటరి మహిళక ఆధార్, రేషన్ కార్డులు మంజూరు చేసి, పింఛన్ వచ్చేలా చూడాలని, ఆమెను ఆకలి కోరల నుండి కాపాడాలని పంచాయతీ ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఉనికి కోసమే వైసీపీ నేతల వ్యక్తిగత విమర్శలు

### హోం మంత్రి అనిత పై గుడివాడ విమర్శలను ఖండించిన జిసిసి మాజీ చైర్మన్ ఎంవివి

కొయ్యూరు, జూన్ 16 ప్రభాతవార్త :

చెప్పుకుందామంటే గతంలో చేసిన అభివృద్ధి పనులు లేక, ఇకపై చేస్తామని చెబుదామంటే భవిష్యత్తుపై అవగాహన లేక ఇక ఏదోలా ఉనికి చాటుకునే దురుద్దేశంతోనే కొంతమంది వైసీపీ నేతలు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని జిసిసి మాజీ చైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎంవివి ప్రసాద్ ఎద్దేవా చేశారు . మం గళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ హోం మంత్రి అనిత పై మాజీ మంత్రి వైసిపి నేత గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యక్తిగత విమర్శలపై సభ్య సమాజం తలదించుకునే పరిస్థితి ఏర్పడింద న్నారు.రాజకీయాల్లో విమర్శలు విధానాలపైనే ఉండాలని,వ్యక్తిగత దూషణలకు తావుండకూడదన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ నాయకుల మధ్య భిన్నాభిప్రాయాలు సహజమేనని,. ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలు, ప్రజా సమస్యలపై విమర్శలు చేయడం ప్రతి రాజకీయ నాయకుడి హక్కు అని,అయితే ఆ విమర్శలు వ్యక్తుల వ్యక్తిత్వం, కుటుంబం లేదా మహిళల కట్టుబొట్టు వంటి వ్యక్తిగత అంశా లపై కాకుండా, పరిపాలన విధానాలు, ప్రజాప్రయోజనాలపైనే కేంద్రీకృతం కావాలన్నారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి అనితపై మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు, రాజకీయ హుందాతనానికి విరుద్ధంగా కనిపిస్తున్నాయన్నారు. ముఖ్యంగా మహిళల కట్టుబొట్టు, వేషధారణ వంటి అంశాలను ప్రస్తావిస్తూ వ్యాఖ్యలు చేయడం కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాదు, సమాజంలోని మహిళల గౌరవాన్ని కూడా కించపరచే చర్యగా భావించాల్సి ఉంటుందన్నారు. నేటి సమాజంలో ప్రజలు రాజకీయ నాయకుల ప్రతి మాటను, ప్రతి ప్రవర్తనను నిశితంగా గమనిస్తున్నారని, ప్రజా జీవితంలో ఉన్న నాయకులు తమ వ్యాఖ్యల ద్వారా సమాజానికి మంచి సందేశం ఇవ్వాల్సిన బాధ్యత కలిగి ఉండాలే తప్పా ఇలా చిల్లరగా మాట్లాడటం మంచి పద్దతి కాదన్నారు. రాజకీయ విభేదాలు ఎంత ఉన్నా పరస్పర గౌరవం, సంస్కారం, హుందాతనం పాటించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి అవసరమన్నారు. అయితే వైసిపి నేతలు మాత్రం వ్యక్తిగత విమర్శల పైనే ఆధారపడుతూ తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడు అనంతరావు మాస్టారుకు మదర్ థెరిస్సా సేవారత్న అవార్డు

ముంచంగిపుట్టు, జూన్ 16(ప్రభాతవార్త):

విశాఖపట్నంలో మధర్ థెరిస్సా ట్రస్టు ఆధ్వర్యంలో శెట్టి అనంతరావు మాస్టారు మధర్ థెరిస్సా సేవా రత్న రాష్ట్ర స్థాయి అవార్డును అందుకున్నారు. ఈ అవార్డు బిజెపి యువ మోర్చా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. గత ఏడాది ధారపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు ఫ్రీ కోచింగ్ ఉదయం, రాత్రి పూట ఇవ్వటం, చక్కటి విద్యను అందించడంతో ఏకలవ్య పాఠశాల నుండి 8 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాస్తే ఏడుగురు విద్యార్థులు ఏకలవ్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సీట్లు సాధించారు. అదేవిధంగా ఏపీ ఆర్ గురుకుల పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు పరీక్షలు రాస్తే ఇద్దరు విద్యార్థులు సీట్లు సంపాదించారు. విద్యార్థులను ఉత్తములుగా తీర్చి దిద్దిన అనంతరావు మాస్టర్ కు అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గత ఏడది అందించారు. పిల్లలను ఉత్తములుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయుని గుర్తించి మధర్ థెరిస్సా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వారు అనంతరావు మాస్టర్ ను విశాఖపట్నంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో మధర్ థెరిస్సా సేవా రత్న రాష్ట్ర అవార్డును అందజేశారు. గతంలో దొడిపుట్టు, సుజనపేట, మేభ తదితర పాఠశాలలో విధులు నిర్వహించినప్పుడు విద్యార్థులకు చక్కటి విద్యా బోధ చేశారు. ప్రస్తుతం దారాపల్లి మోడల్ ప్రైమరీ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తనను గుర్తించి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందజేయడం, అలాగే విశాఖలో మధర్ థెరిస్సా ట్రస్ట్ వారి ద్వారా రాష్ట్ర సేవా రత్న అవార్డు అందుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. దీంతో విధులు పట్ల మరింత బాధ్యత పెరిగిందని, విద్యార్థులకు చక్కటి విద్యా బోధన చేసి విద్యార్థులు పైచదువులకై ఉన్నత విద్య అందజేస్తానని అనంతరావు మాస్టారు అన్నారు. అవార్డు గ్రహీతకు పాఠశాల తోటి ఉపాధ్యాయులు, కుటుంబీకులు, బంధువులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

## మానవత్వానికి మారుపేరు అరుకు : సీఐ హిమగిరి



దుంబ్రిగూడ, జూన్ 16 ప్రభాతవార్త:

పోలీసు అంటే జనాలకి భయం కాదు తప్పు చేసిన వాడికి భయం. ఆపదలో ఉన్న వాళ్ళకి ఆపద్బాంధవుడు పోలీస్ అని అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్ హిమగిరి నిరూపించారు. మండలంలోని లైగండ పంచాయతీ సిందిపుట్టు గ్రామంలో అరకు సీఐ ఎల్ హిమగిరి దుంబ్రిగూడ ఎస్ఐ ఎల్ సురేష్ మంగళవారం సందర్శించి సిందిపుట్టు గ్రామ గిరిజన ప్రజలతో సమావేశమై వారి బాగోగులు అడిగి తెలుసుకుని గిరిజన యువతి యువకులకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేయడం జరిగింది. అదే గ్రామానికి చెందిన కిల్లో రాంబాబు ఆర్థిక పరిస్థితి చూసి వారి పిల్లలకు అనకాపల్లి లో ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలో జాయినింగ్ చేసి వారికి హాస్టల్ లో చేర్పించడం జరిగింది. వారికి చదువుకోవడానికి పెన్నులు, ప్లాంక్స్ బట్టలు కూడా ఇవ్వడం అలాగే రాంబాబు వారి పెద్దబ్బాయి అర్జున్ పెద్దమ్మాయి మహేశ్వరి కళ్ళ కంటి చూపు అనారోగ్యంతో బాధపడతుండడం చూసి వారికి విశాఖపట్నం ఆసుపత్రి శంకర్ ఫౌండేషన్ లో స్వయంగా సిఐ తీసుకొని వెళ్లి కళ్ళు చూపుకు సంబంధించి, వైద్య పరీక్షలు అందించి ఆరోగ్యం బాగు చేయడం జరిగిందని, వారి ఆర్థిక పరిస్థితులు ఆరోగ్య పరిస్థితులు ఎప్పటికప్పుడు వారి బాగోగులను తెలుసుకుంటూ మానవత్వాన్ని సిఐ చాటుకున్నారు.

## యోగాతో శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత

### రాజేంద్రపాలెం పీహెచ్సీ వైద్యాధికారులు డా. జగదీష్, డా. సందేశ్

కొయ్యూరు, జూన్ 16, ప్రభాతవార్త :

యోగా తోనే శారీరక ఆరోగ్యంతో పాటు, మానసిక ప్రశాంతత చేకూరుతుందని మండలంలోని రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డా. జగదీష్, డా. సందేశ్ అన్నారు. మంగళవారం రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోవైద్యాధికారుల ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ యోగా చేయడం అలవర్చుకొని రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులకు దూరంగా ఉండాలని సూచించారు. సిహెచ్ ఓ ప్రశాంత్ కుమార్, పిహెచ్ ఎన్ భాగ్యవతి, హెచ్ వి లక్ష్మీ. భూలోక, ఏఎన్ఎంలు ఎం ఎల్ హెచ్ పి లు, హెల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## తాజంగి గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం పనులు వేగవంతం చేయాలి

పాడేరు,జూన్16, ప్రభాతవార్త:

అల్లూరి జిల్లా చింతపల్లి మండలం తాజంగిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్గా నిర్మిస్తున్న "గిరిజన స్వాతంత్ర సమరయోధుల మ్యూజియం" నిర్మాణ పనులను కేంద్ర, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖల ఉన్నతాధికారుల బృందం మంగళవారం క్షేత్రస్థాయిలో విస్తృతంగా తనిఖీ చేసింది. ఈ తనిఖీ, సమీక్షా సమావేశంలో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ దీపాలి మాసిర్కర్, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.ఎం. నాయక్, పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ, మిషన్ డైరెక్టర్ డాక్టర్ మంధా రాణి, గిరిజన సంక్షేమ శాఖ చీఫ్ ఇంజనీర్ పాల్గొని పనుల పురోగతిని సమీక్షించారు. భవన నమూనాలు, అంతర్గత లేఅవుట్లను పరిశీలించి, ఇంజనీరింగ్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... మ్యూజియం ప్రధాన ఆకర్షణ అయిన డోమ్ పెయింటింగ్ పనులను అత్యంత జాగ్రత్తగా, భద్రతా ప్రమాణాలతో చేపట్టాలన్నారు. డోమ్ భారీ ఎత్తులో ఉన్నందున, పటిష్టమైన స్కాఫోల్డింగ్ (కింది నుండి బేస్ సపోర్ట్) ఏర్పాటు చేసి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మిగిలి ఉన్న లేఅవుట్ పనులను తాత్కాలిక షెడ్ల సహాయంతో వాతావరణ పరిస్థితులకు ఆటంకం కలగకుండా వేగవంతం చేయాలని, భవన నిర్మాణంలో అక్కడక్కడా ఉన్న చిన్నపాటి లోపాలను, అసమానతలను తక్షణమే సరిదిద్ది నాణ్యతను కాపాడాలని స్పష్టం చేశారు.గిరిజన వీరుల అపూర్వ చరిత్రను, సంస్కృతిని ప్రతిబింబించేలా క్యురేటెడ్ టీమ్ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రదర్శన గ్యాలరీలను తీర్చిదిద్దాలని సూచించారు. ఈ పర్యటనలో భాగంగా చింతపల్లి కాఫీ పల్పింగ్ యూనిట్ పనులు పరిశీలించారు, అలాగే జిమాడుగుల్లో నిర్మించనున్న కాఫీ పల్పింగ్ ప్రదేశాన్ని కూడా పరిశీలించారు. కార్యక్రమంలో ప్రత్యేక బృందం, అరకు, పాడేరు గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చింతపల్లి సబ్-డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్ ,క్యురేటెడ్ టీమ్ సభ్యులు మరియు నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నాటి వైసిపి అరాచకాలకు పరాకాష్ట అమర్నాథ్ గౌడ్ హత్య

### టిడిపి అరకు నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ సియ్యారి దొన్ను దొర

అరకు రూరల్, జూన్ 16, ప్రభాతవార్త :

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అరాచకాలకు నిలువెత్తు సాక్ష్యం పదో తరగతి చదువుతున్న అమర్నాథ్ గౌడ్ హత్యని తెలుగుదేశం పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి , ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం ప్రాంతీయ జోన్ చైర్మన్ డాక్టర్ సియ్యారి దొన్ను దొర పేర్కొన్నారు. 2023 జూలై 16వ తేదీన తన అక్కకు జరిగిన అన్యాయం పై వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు అత్యంత దారుణంగా పెట్రోల్ పోసి హత్య చేసే తన అరాచకత్వాన్ని వైఎస్ఆర్సిపి రాష్ట్రానికి పరిచయం చేసిందని ఆయన పేర్కొన్నారు. అరకులోయ లోని అమర్నాథ్ గౌడ్ వర్ధంతి సందర్భంగా మంగళవారం శ్రద్ధాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమర్నాథ్ జోహార్ అంటూ నినదించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి దొన్ను దొర మాట్లాడుతూ చిన్న పిల్లాడు అయినా తన అక్కకు జరిగిన అన్యాయంపై ప్రశ్నించాడని అలా ప్రశ్నించినందుకు వైసిపి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించి పెట్రోల్ పోసి మరి అత్యంత దారుణంగా హత్య చేసిందన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రశ్నించేందుకు అవకాశం లేదని అధికారం ఉన్నోడిదే రాజ్యమన్న తరహాలో పాలన సాగిందన్నారు. 2023 లో తన అక్కను వేధిస్తున్న వారిని సామాజిక మాధ్యమాల వేదికగా నిలదీసినందుకు అమర్నాథ్ గౌడ్ వైసీపీ అరాచకత్వానికి బలైపోయారన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన ధైర్యాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో హత్యకు గురైన అమర్నాథ్ కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని చెప్పారు. అమర్నాథ్ గౌడ్ అక్క హేమశ్రీ ఉన్నత విద్యకు ప్రభుత్వమే అన్ని విధాలా సహకార అందిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా ప్రకటించి వారికి అండగా నిలిచారన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో బాధితులు అందరికీ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లోకోయి మహాదేవ్, ఏఎంసి చైర్మన్ బొరి బొరి లక్ష్మి, శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు బేతాళ నీరజ లక్ష్మి కుమారి,మాజీ ఎంపీటీసీ కుమార్, మరియు టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన 'ప్రాజెక్ట్ సేఫ్ ఫుడ్' శిక్షణ

### హాజరైన సీనియర్ సివిల్ జడ్జి ఆర్. సన్యాసి నాయుడు, జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ

### ఉచిత హైజీన్ కిట్లు, సర్టిఫికెట్ల పంపిణీ

పాడేరు, జూన్16, ప్రభాతవార్త,;

నేస్లే ఇండియా నేషనల్ స్ట్రీట్ ఫుడ్ వెండర్స్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా చేపట్టిన 'ప్రాజెక్ట్ సేఫ్ ఫుడ్' లో భాగంగా అల్లూరి జిల్లా ఆహార భద్రతా విభాగం సహకారంతో పాడేరులోని కాఫీ హౌస్లో మంగళవారం నాడు వీధి ఆహార వ్యాపారులకు, అంగన్వాడీ వంట మనుషులకు ఐదు రోజుల 'ఫాస్టాక్' శిక్షణా కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. రోజుకు 100 మంది చొప్పున ఐదు రోజుల పాటు ఈ శిక్షణ అందించనున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లీగల్ సర్వీసెస్ సీనియర్ సివిల్ జడ్జి ఆర్. సన్యాసి నాయుడు ,జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీమతి తిరుమాని శ్రీపూజ ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు ఉచిత హైజీన్ కిట్లను, సర్టిఫికేట్లను అందజేశారు.ఆహార భద్రత చట్టాలపై అవగాహన అవసరం: కార్యక్రమంలో జిల్లా జడ్జి ఆర్.సన్యాసి నాయుడు మాట్లాడుతూ ఆహార భద్రత చట్టాలపై ప్రతి ఒక్క వ్యాపారస్తునికి అవగాహన అవసరమని, ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో ఆహార భద్రత పై ఫాస్టాక్ శిక్షణ ఎంతో అవసరం. సంతల్లో జరిగే ఆహార కల్తీల పట్ల, ఎఫ్ఎస్ఎస్ఏఐ చట్టాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడేలా ఆహార కల్తీలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు.ప్రతి వినియోగదారుల నమ్మకమే వ్యాపార అభివృద్ధి, అని జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ పేర్కొన్నారు. అల్లూరి జిల్లా ప్రముఖ పర్యాటక ప్రాంతం, ఇక్కడి బాంబూ బిర్యానీ, బెంబూ చికెన్, అరకు కాఫీలకు ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందని పర్యాటకులకు, వినియోగదారులకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించడం ద్వారా వీధి వ్యాపారులు తమ వ్యాపారాలను మరింత వృద్ధి చేసుకోవచ్చు. ఈ ఫాస్టాక్ సర్టిఫికేషన్ అనేది వినియోగదారులలో నమ్మకాన్ని పెంచేందుకు ఎంతగానో దోహదపడుతుందని ఆమె తెలిపారు. ఈ శిక్షణ తరగతులలో పాల్గొన్న వారిని ఉద్దేశించి మాట్లాడుతూ ఫుడ్ తయారీ లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఫుడ్ సేఫ్టీ ఏఎఫ్సీ అండ్ డీఓ కల్యాణ చక్రవర్తి అన్నారు. ఆహార భద్రత ప్రమాణాల చట్టం-2006 ప్రకారం నిబంధనలు పాటించని ఆహార వ్యాపారులపై భారీ జరిమానాలు, కఠిన చర్యలు ఉంటాయని, ఈ 5 రోజుల శిక్షణలో నేర్చుకున్న అంశాలను వ్యాపారులు తమ దైనందిన జీవితంలో అమలు చేస్తూ ఆహార నాణ్యతను, శుభ్రతను పెంపొందించుకోవాలన్నారు. నేస్లే ఇండియా సీనియర్ మేనేజర్ డాక్టర్ వసీం అహ్మద్, నాస్వి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతినిధి ఎమ్. సత్యనారాయణ, జిల్లా ఆహార భద్రతాధికారి ముత్యాల గ్రీష్మశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

## అమర్ దిష్టిబొమ్మకు గుడ్లు, చెప్పులతో కొట్టి నిరసన

అరకు రూరల్, జూన్ 16, ప్రభాతవార్త :

ఆంధ్రప్రదేశ్ హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ పై అరకు లోయలో తెలుగుదేశం పార్టీ నేతలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జి ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం ప్రాంతీయ జోన్ చైర్మన్ డా. సియ్యారి దొన్ను దొర ఆధ్వర్యంలో బుధవారం అరకు లోయలో మహిళలతో కలిసి వినూత్న నిరసన తెలిపారు. అమర్నాథ్ దిష్టిబొమ్మను చెప్పులు, గుడ్లతో కొట్టి క్షమాపణ చెప్పాలని వెంటనే అరెస్టు చేయాలంటూ డిమాండ్ చేశారు.అమర్నాథ్ దిష్టిబొమ్మను దహనం చేసి మహిళా నేతలు చెప్పులతో కొట్టి అనంతరం గుడ్లు పగలగొట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అమర్నాథ్ డౌన్ డౌన్ అంటూ నినదించారు. అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలపై దొన్ను దొర మాట్లాడుతూ సమాజం తలదించుకునేలా మహిళలు ఒక మహిళా సమాజాన్నీ కించపరిచేలా అమర్నాథ్ వ్యాఖ్యానించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కొడాలి నాని ఈ తరహా వ్యాఖ్యలే చేసే వారిని అందుకే ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. అనిత చేసిన అభివృద్ధి గురించి మాట్లాడకుండా వ్యక్తిత్వహననం చేయడం ఎంతవరకు సరైన పద్ధతిని ప్రశ్నించారు. గుడివాడ అమర్ లా పెత్తందారుల కుటుంబం నుంచి రాలేదని అట్టడుగు ఓ సామాన్య ప్రభుత్వ ఉపాధ్యాయురాలు వృత్తి నుంచి శ్రమించి ఎటువంటి బ్యాగ్రౌండ్ లేకుండా పాయకరావుపేట నియోజకవర్గం నుంచి 47 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో గెలుపొంది ఈరోజు ఆంధ్రప్రదేశ్లో మహిళలకు ఆంధ్రప్రదేశ్ కే ఒక రక్షణ కవచంలా పనిచేస్తున్న మంత్రి పట్ల అనుచిత వ్యాఖ్యలు తగదన్నారు. గుడివాడ అమర్ ఇంట్లో కూడా భార్య, పిల్లలు, తల్లి చెల్లి అందరూ ఉంటారని ఆ విషయాన్ని విస్మరించి అనిత మేకప్ గురించి మాట్లాడటం సరైన పద్ధతి కాదన్నారు. దమ్ముంటే ఆమె చేస్తున్న అభివృద్ధి గురించి ఆమె నియోజకవర్గంలో తీసుకువచ్చిన మెటల్ స్టీల్ ప్లాంట్ గురించి శాంతి భద్రతల రక్షించడం గురించి పోలీస్ డిపార్ట్మెంట్లో తన హయాంలో తీసుకొచ్చిన ఉద్యోగాలు నియామకం గురించి మాట్లాడాలి తప్ప మహిళల అలంకరణ గురించి అనుచితంగా మాట్లాడ్డం సరికాదని సూచించారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లోకోయి మహాదేవ్, ఏఎంసీ చైర్మన్ బోరి బోరి లక్ష్మి, శ్రీ వరహా లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు బేతాళ నీరజ కుమారి మాజీ ఎంపీటీసీ కుమార్ మరియు టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన బలోపేతానికి వంశీకృష్ణ కృషి ఫలితం

## పార్టీలో చేరికలకు ఊతమిచ్చే జాయినింగ్ కమిటీలో విశాఖ దక్షిణ ఎమ్మెల్యేకు చోటు

(ప్రభాతవార్త -విశాఖపట్నం)

జనసేన పార్టీ విస్తరణ, బలోపేతం దిశగా కీలక అడుగులు వేస్తున్న తరుణంలో విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు మరో కీలక బాధ్యత దక్కింది. ఇతర రాజకీయ పార్టీల నేతలు, మేధావులు, సామాజిక వేత్తలు, యువ నాయకులను జనసేనలోకి ఆహ్వానించే లక్ష్యంతో పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నియమించిన 14 మంది సభ్యుల ఆంధ్రప్రదేశ్ జాయినింగ్ కమిటీలో వంశీకృష్ణ శ్రీనివాస్‌కు స్థానం కల్పించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, విశాఖపట్నంలో జనసేన ను మరింత బలోపేతం చేయడంలో వంశీకృష్ణ శ్రీనివాస్ చురుకైన పాత్ర పోషిస్తున్నారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. యువత, మేధావులు, వివిధ రంగాల ప్రముఖులతో ఆయనకు ఉన్న అనుబంధం పార్టీకి కొత్త శక్తిని తీసుకు రావడంలో దోహదపడుతుందని భావిస్తున్నారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి, ప్రజాసేవలపై దృష్టి సారిస్తున్న వంశీకృష్ణ శ్రీనివాస్‌కు ఈ బాధ్యత దక్కడం ఆయన నాయకత్వ సామర్థ్యానికి గుర్తింపుగా పార్టీ శ్రేణులు అభివర్ణిస్తున్నాయి. పార్టీ విస్తరణలో కీలక పాత్ర పోషించే ఈ కమిటీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా జనసేన ప్రభావం మరింత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తమవుతోంది. జన సేన అధినేత పవన్ కళ్యాణ్ నేరుగా నియమించిన ఈ కమిటీలో చోటు దక్కడం వంశీకృష్ణ శ్రీనివాస్‌పై పార్టీ నాయకత్వానికి ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోందని కార్యకర్తలు చెబుతున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో జనసేన ను మరింత బలోపేతం చేసే దిశగా ఆయన సేవలు కీలకంగా నిలుస్తాయని వారు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

# అనకాపల్లి జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణస్వీకారం

## ముఖ్య అతిథిగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు

అనకాపల్లి, ప్రభాతవార్త

అనకాపల్లి జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన జిల్లా కమిటీ ప్రమాణస్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథిగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్ర మాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అసోసియేషన్ సభ్యులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడిగా కర్రి భాస్కరరావు, కార్యదర్శిగా చెన్నా మూర్తి, కోశాధికారిగా పెదపాటి రాజా ప్రమాణస్వీకారం చేశారు. ఈ వేడుకలో రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వి. వి.ఎస్ ప్రసాద్, పోసిన వీరేంద్ర, రాష్ట్ర కార్యదర్శి మద్దాల శేఖర్, రాష్ట్ర కోశాధికారి నాయుడు రాజన్‌లతో పాటు జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన పలువురు ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు. అనంతరం సభను ఉద్దేశించి స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, సమాజంలో ఫోటోగ్రాఫర్ల పాత్ర ఎంతో కీలకమైనదని, మనిషి పుట్టుక నుంచి తుదిశ్వాస వరకు ప్రతి ముఖ్యమైన ఘట్టాన్ని తమ కెమెరాల్లో బంధిస్తారని కొని యాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీ ఎంతగానో అభివృద్ధి చెందిందని, ప్రపంచంలో ఎక్కడ ఏ జరిగినా క్షణాల్లో ఇక్కడ చూసే స్థాయికి సాంకేతికత చేరుకుందని ఆయన గుర్తుచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 70 వేల నుంచి లక్ష మంది వరకు ప్రత్యక్షంగా ఫోటోగ్రఫీ రంగంపై ఆధారపడి జీవిస్తు న్నారని, వీరంతా కలిసికట్టుగా ఒక అసోసియేషన్‌గా ఏర్పడి, ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు నిధిని ఏర్పాటు చేసుకోవడం ఎంతో అభినందనీయమని ఆయన ప్రశంసించారు. మారుతున్న టెక్నాలజీకి అను గుణంగా ఫోటోగ్రాఫర్లకు ఎప్పటికప్పుడు మెరుగైన శిక్షణ అందించాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. ఫోటోగ్రాఫర్ల సంక్షేమం, నైపుణ్యాల అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని స్పీకర్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. రాష్ట్ర రాజధాని ప్రాంతంలో ఫోటోగ్రాఫర్ల కోసం ప్రత్యేక శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయడానికి అవసరమైన స్థలాన్ని కేటాయించేలా తాను బాధ్యత తీసుకుంటానని భరోసా ఇచ్చారు. అలాగే, కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే విగ్రహాన్ని విశాఖ బీచ్ రోడ్డులో ఏర్పాటు చేయడానికి అవసరమైన అనుమతులు ఇప్పించే బాధ్యతను కూడా తాను వ్యక్తిగతంగా తీసుకుంటానని ఆయన స్పష్టం చేశారు. ఈ రంగంలో ఉన్న వారందరూ ఆధునిక సాంకేతికతను ఒడిసిపట్టుకుని, తమ నైపుణ్యాలను మరింత మెరుగు పరచుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆకాంక్షించారు.

# మహానాడు విజయంపై హర్షం వ్యక్తం

మాధవధార, జూన్ 16 ప్రభాతవార్త

మహానాడు విజయవంతంగా జరిగిందని సనపల వరప్రసాద్ విశాఖ ఎంపీ శ్రీ భరత్ తో కలిసి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఎంపీని వరప్రసాద్ ఆయన బృందంతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ మహానాడు ప్రతి ఏడాది ఘనంగా నిర్వహిస్తున్నారని ఈ ఏడాది కూడా విజయవంతంగా నిర్వహించడం కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొందని తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు..

## అధికారులపై జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర ఆగ్రహం -జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశంలో పలు శాఖల పనితీరుపై సుదీర్ఘ సమీక్ష.. -వైద్యం, ఉపాధి, విద్య, గృహ నిర్మాణ అంశాలపై కీలక చర్చ

విశాఖపట్నం, జూన్ 16, ప్రభాతవార్త

ప్రజలకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, జవాబుదారీతనంతో అందేలా అధికారులు పనిచేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్దిష్ట గడువులో పరిష్కరించి పరిపాలనపై విశ్వాసాన్ని పెంపొందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా పరిషత్ 1 నుంచి 7వ స్థాయి సంఘాల (స్టాండింగ్ కమిటీల) సమావేశాలకు ఆమె అధ్యక్షత వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన జెడ్పీటీసీ సభ్యులు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో ఉపాధి హామీ, వైద్య ఆరోగ్య శాఖ, విద్య, గృహ నిర్మాణం, మౌలిక సదుపాయాలపై విస్తృతంగా చర్చ జరిగింది. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలు తీరును జెడ్పీ సీఈఓ పి. నారాయణమూర్తి సభకు వివరించారు.

### ఉపాధి హామీ పనుల్లో సాంకేతిక లోపాలపై ఆందోళన

ఉపాధి హామీ పథకం కింద ఫేస్ రికగ్నిషన్ హాజరు నమోదులో సాంకేతిక సమస్యల కారణంగా కూలీలు పూర్తి రోజులు పనిచేసినా తక్కువ రోజులు మాత్రమే నమోదు అవుతున్నాయని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల వేతనాలు తగ్గిపోతున్నాయని పేర్కొన్నారు. జూలై నుంచి అమలుకానున్న కొత్త మార్గదర్శకాల ప్రకారం గరిష్టంగా 125 పనిదినాలు కల్పిస్తామని అధికారులు వెల్లడించారు. పనిస్థలాల్లో తాగునీరు, ఓఆర్ఎస్, ఫస్ట్ ఎయిడ్ కిట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని చైర్‌పర్సన్ ఆదేశించారు. అదేవిధంగా హుకుంపేట, దుంబ్రిగుడ, పాడేరు ప్రాంతాల్లో పనులు జరగకపోయినా మాస్టర్ రోల్స్ సృష్టించి బిల్లులు చేసిన ఘటనలపై సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ విచారణకు డిమాండ్ చేశారు.

### వైద్య శాఖ అధికారుల గైర్హాజరుపై మండిపాటు

వైద్య, ఆరోగ్య శాఖ సమీక్ష సమావేశానికి సంబంధిత ఉన్నతాధికారులు గైర్హాజరు కావడంపై సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పాడేరు జిల్లా ఆసుపత్రిలో తగిన వైద్య సేవలు లేకపోవడంతో అత్యవసర కేసులను నేరుగా కేజీహెచ్‌కు తరలిస్తున్నారని, అంబులెన్స్ సౌకర్యం లేక ప్రాణనష్టం సంభవించిందనే ఆరోపణలు వినిపించాయి. దీనిపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి కలెక్టర్‌కు పంపాలని నిర్ణయించారు. అనకాపల్లి, నర్సీపట్నం ప్రాంతాల్లో డయాలసిస్ కేంద్రాల నిర్వహణ, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం, మృతదేహాల రవాణాకు మరిన్ని 'మహాప్రస్థానం' వాహనాల ఏర్పాటు, ఆన్‌లైన్ పోస్టుమార్టం ప్రక్రియలో జాప్యం నివారణ వంటి అంశాలపై కూడా చర్చ జరిగింది. నర్సీపట్నం మోడల్ స్కూల్లో సీట్లకు భారీ డిమాండ్ ఉండగా, ఏజెన్సీ ప్రాంతాల్లోని బీసీ, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో సీట్లు భర్తీ కాకపోవడంపై సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. పాతపల్లి మోడల్ స్కూల్ హాస్టల్లో బియ్యం అక్రమ రవాణా వ్యవహారంపై విచారణను వేగవంతం చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. [illegible] విద్యార్థులను సభ అభినందించారు. వారికి ఇళ్ల స్థలాల కేటాయింపుపై కూడా సానుకూల చర్చ జరిగింది. సంపథపురం, కొత్తూరు, దార్లపూడి తదితర జగనన్న కాలనీల్లో రహదారులు, డ్రైనేజీ వంటి కనీస సదుపాయాలు లేకపోవడంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పీఎం జన్మన్ గృహాల బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో నిలిచిపోయాయన్న సభ దృష్టికి తీసుకువచ్చారు. స్థాయి సంఘాల సమావేశాలకు జిల్లా స్థాయి అధికారులు బదులుగా కింది స్థాయి సిబ్బందిని పంపడం వల్ల సమావేశాల ఉద్దేశం దెబ్బతింటోందని సభ్యులు మండిపడ్డారు. భవిష్యత్తులో శాఖాధిపతులు తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేశారు. పాడేరు-అరకు, అనంతగిరి తదితర ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ రహదారులు లేకపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ్యులు పేర్కొన్నారు. టోల్ గేట్లకు సమీపంలోని 12 కిలోమీటర్ల పరిధిలో నివసించే స్థానికులకు టోల్ ట్యాక్స్ నుంచి మినహాయింపు కల్పించాలని కోరుతూ ఎన్‌హెచ్ఏఐ, ఐటీడీఏ అధికారులకు లేఖ రాయాలని సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా పరిషత్ సమావేశం స్పష్టం చేసింది.

# వర్షాకాలానికి ముందే సాగు సన్నాహాలు వెల్లంకిలో 30 ఎకరాల్లో ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్

ఆనందపురం, జూన్ 16, ప్రభాతవార్త :

వర్షాకాలం ప్రారంభానికి ముందే సాగు పనులను వేగవంతం చేస్తూ ఆనందపురం మండలం వెల్లంకి గ్రామంలో రైతులు ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ప్రోత్సాహానికి మరో అడుగుగా నిలిచింది. గ్రామానికి చెందిన రైతులు విష్ణు కుమార్ రాజు, మురళీ మహేశ్వర రాజు, సత్య నారాయణ రాజు తమ 30 ఎకరాల వ్యవసాయ భూమిలో ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ విత్తనాల విత్తకాన్ని ప్రారంభించారు. రైతు సాధికార సంస్థ సిబ్బంది ప్రత్యక్షంగా పొలాల్లో పాల్గొని రైతులకు సాంకేతిక సూచనలు అందిస్తూ విత్తనాల విత్తకాన్ని పర్యవేక్షించారు. వ్యవసాయ నిపుణుల ప్రకారం, ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ పద్ధతిలో వర్షాలు ప్రారంభమయ్యే ముందే విత్తనాలను భూమిలో నాటడం వల్ల తొలి వర్షపు తేమను సమర్థవంతంగా వినియోగించుకునే అవకాశం లభిస్తుంది. దీంతో మొలక శాతం పెరగడంతో పాటు పంట ఎదుగుదల మెరుగుపడుతుంది. వర్షాభావ పరిస్థితులను తట్టుకుని నిలదొక్కుకునే సామర్థ్యం కూడా ఈ విధానంలో ఎక్కువగా ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా రైతు సాధికార సంస్థ సిబ్బంది మాట్లాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు రైతులకు భరోసానిస్తున్నాయని పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించేందుకు, నేల సారాన్ని కాపాడేందుకు మరియు స్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ వంటి పద్ధతులు ఎంతో ఉపయోగకరమని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ రైతు సాధికార సంస్థ సిబ్బంది పాల్గొని ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంపొందించుకున్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతుల్లో పెరుగుతున్న ఆసక్తికి వెల్లంకి గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలిచింది.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో కోర్టు సంచలన తీర్పు: ఒకరికి నెల రోజులు జైలు

గాజువాక, జూన్ 16,ప్రభాతవార్త

మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడటమే కాకుండా, తనిఖీలు చేస్తున్న పోలీసులతో దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించిన ఒక లారీ డ్రైవర్‌కు కోర్టు నెల రోజుల సాధారణ జైలు శిక్ష విధించింది. గాజువాక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మొత్తం ఎనిమిది మంది పట్టుబడ్డారు. వీరిని గాజువాకలోని తృతీయ అదనపు ప్రత్యేక జుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కె. భారతి ఎదుట హాజరుపరిచారు. నిందితుల్లో ఏడుగురికి కోర్టు మొత్తం రూ. 70,000 జరిమానా విధించింది. కాగా, జార్ఖండ్ రాష్ట్రం గర్వా ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ కృష్ణ యాదవ్ (23) మద్యం తాగి పట్టుబడటమే కాకుండా, పోలీసులకు సహకరించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేయడంతో న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న పోలీసులను ఇబ్బంది పెట్టినందుకు గానూ అతనికి 30 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

# నిబంధనలకు వ్యతిరేకంగా వాహనాలు నడిపితే చర్యలు

## పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, జూన్ 16 ప్రభాతవార్త

నగరవాసులను ఇబ్బందులు పెడుతూ ద్విచక్ర వాహనాలు భారీ శబ్దంతో సైలెన్సర్లు పెట్టి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని విశాఖ నగర్ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి హెచ్చరించారు. మంగళవారం ద్విచక్ర వాహన సైలెన్సర్లను రోడ్ రోలర్ కింద పెట్టి క్రషింగ్ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాలను మార్పులు చేస్తూ, ఇతర వాహన చోదకులకు, పాద చారులకు, ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విశాఖ నగర్ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి హెచ్చరించారు. వాహనాలలో వివిధ మార్పులు చేస్తూ భారీ శబ్దాలు కలగజేస్తు ఉండటంవల్ల పిల్లలు, స్త్రీలు ,వృద్ధులు, గుండె జబ్బులు కలిగిన వారు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. హై- బీమ్ లైట్లను, మొబైల్ స్టాండ్లను వాహనాలలో అమర్చి డ్రైవింగ్ చేయడం వలన పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రమాదాల వల్ల వాహనాలు నడిపేవారు మాత్రమే కాకుండా ఎదురుగా ఉన్న వాహనదారులు అలాగే రోడ్డు దాటుతున్న పాదచారులు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలు పాలవుతున్నారని వెల్లడించారు. ఇలా వాహనాలు మార్పులు చేసి నడిపే వారి వలన ఇబ్బందులు పడుతున్న ప్రజలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు స్పందించి ప్రత్యేక పోలీసు బృందాలతో నగరంలోని పలు ప్రాంతాలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టి, అటువంటి వాహనాలను స్వాధీనం చేసుకొని, సదరు వాహనదారులపై కేసులు నమోదు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి నగరంలోని పలు ప్రాంతాలలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ లో నిర్వహించి వాహనాల నుంచి 142 సైలెన్సర్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అలాగే రాత్రి సమయాల్లో ఎదురుగా వచ్చే వాహనాలకు ఇబ్బందిని కలిగించి ప్రమాదాలకు కారణమయ్యే కార్లు, ఆటోలకు అనదికారికంగా అమర్చిన 89 హై-బీమ్ లైట్ లను తొలగించడం జరిగిందన్నారు. అదేవిధంగా ద్విచక్ర వాహనాలకు మొబైల్ స్టాండ్ లను అమర్చడం వలన సదరు వాహనదారుని దృష్టి రోడ్డు పైన ప్రయాణించే వాహనాలపై కాకుండా, మొబైల్ ఫోన్ పై దృష్టి పెట్టడం వలన రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. అటువంటి 270 మొబైల్ స్టాండ్ లను వాహనాలనుండి తొలగించడమైనదని పేర్కొన్నారు. అలాగే ద్విచక్ర వాహనదారులు ఇటీవల బీచ్, ఇతర రోడ్ల పై బైక్ రేసింగ్ చేయగా దఫా దపాలు గా 73 ద్విచక్ర వాహనాలు అదుపులోకి తీసుకొని, వారిపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు.వారి లైసెన్స్ లను సస్పెండ్ చేయమని డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమీషనర్(డిటిసి)కు సిఫార్సు చేసామని వెల్లడించారు. మోడిఫైడ్ సైలెన్సర్లను 190, ఎం.వి.యాక్ట్ 1988 మొదటిసారి ఉల్లంఘనకు 3 నెలల జైలు శిక్ష లేదా రూ.10,000ల జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ జప్తు చేయడం జరుగుతుందన్నారు. రెండవసారి ఉల్లంఘనకు 6 నెలల జైలు శిక్ష లేదా రూ. 10,000 ల జరిమానాతో పాటు వాహనం స్వాధీనం, లైసెన్స్ మరో 3 నెలల పాటు జప్తు చేయడం జరుగుతుందని చెప్పారు. హై-బీమ్ లైట్ 190 ఏం. వి.యాక్ట్ 1988 మొదటిసారి ఉల్లంఘనకు 3 నెలల జైలు శిక్ష లేదా రూ. 10,000 ల జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ జప్తు చేయడం జరుగుతుందని తెలిపారు. రెండవసారి ఉల్లంఘనకు 6 నెలల జైలు శిక్ష లేదా రూ. 10,000 ల జరిమానాతో పాటు వాహనం స్వాధీనం, లైసెన్స్ మరో 3 నెలల పాటు జప్తు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మొబైల్ స్టాండ్ 184 ఎం.వి.యాక్ట్ 1988 ఒక సంవత్సరం జైలు శిక్ష లేదా రూ. 1,000 లనుండి రూ. 10,000 ల వరకు జరిమానా, 3 నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ జప్తు చేయడం జరుగుతుందని తెలియజేశారు. అలాగే బైక్ రేసింగ్ కేసులకు సంబంధించి ఆరు నెలల వరకు పొడిగించగల ఏదైనా ఒక రకమైన కారాగార శిక్షతో గానీ, వెయ్యి రూపాయల వరకు జరిమానాతో గానీ, లేదా ఆ రెండింటితో గానీ శిక్షించబడతారని తెలిపారు.

# జివిఎంసీ అన్ని జోన్లలో జూన్ 18 నుంచి 24 వరకు రెవెన్యూ మేళాలు

విశాఖపట్నం, జూన్ 16, ప్రభాతవార్త

మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ (జీవీఎంసీ) పరిధిలో ఆస్తి పన్ను సంబంధిత సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించేందుకు అన్ని జోన్లలో ప్రత్యేకంగా "రెవెన్యూ (ట్యాక్స్) మేళాలు" పార్లమెంటు సభ్యులు / శాసనసభ్యులు / ప్రజా ప్రతినిధుల సమక్షంలో జూన్ 18 నుండి 24వ తేదీ వరకు జోన్ల వారీగా నిర్వహించనున్నట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఏప్రిల్ 25 నుండి 30వ తేదీ వరకు నిర్వహించిన రెవెన్యూ మేళాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించడంతో పాటు అనేక సమస్యలు నిర్ణీత కాలంలో పరిష్కారమయ్యాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మరోసారి ప్రజలు కొరకు ఈ అవకాశాన్ని కల్పిస్తూ 2026 జూన్ 18 నుండి జూన్ 24 వరకు ఉదయం 11.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు జోన్ల వారీగా రెవెన్యూ (ట్యాక్స్) మేళాలు నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. 18.06.2026 (గురువారం) : మధురవాడ జోన్, నార్త్ జోన్ 19.06.2026 (శుక్రవారం) : భీమిలి జోన్, అగనంపూడి జోన్ 20.06.2026 (శనివారం) : ఈస్ట్ జోన్, అనకాపల్లి జోన్ 23.06.2026 (మంగళవారం) : సౌత్ జోన్,వెస్ట్ జోన్ 24.06.2026 (బుధవారం) : గాజువాక జోన్,పెందుర్తి జోన్ కొత్త ఆస్తి పన్ను అసెస్మెంట్, భవనాల తొలగింపు, చేర్పులు, మార్పులు, ఆస్తి విభజన, రివిజన్ పిటిషన్లు, జనరల్ రివిజన్ పిటిషన్లు, పన్ను మినహాయింపులు, టైటిల్ ట్రాన్స్ఫర్, ఆస్తుల విలీనం, యజమాని పేరు సవరణ, డోర్ నంబర్ సవరణ తదితర సేవలు ఈ మేళాలో అందించబడతాయని కమిషనర్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు, అవసరమైన పత్రాలతో సంబంధిత జోన్లలో నిర్వహించే మేళాలకు హాజరై సేవలను పొందవచ్చని తెలిపారు. అందిన దరఖాస్తులను అదే రోజు నమోదు చేసి, నిర్ణీత సేవా ప్రమాణాల ప్రకారం త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే ప్రజాప్రతినిధులు పాల్గొను ఈ మేళాలకు సంబంధించి .., వార్డు సచివాలయాలు, నివాసిత సంక్షేమ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఈ మేళాలపై విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేయాలని కోరారు. ఆస్తి పన్ను సంబంధిత సమస్యల పరిష్కారానికి జీవీఎంసీ నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక రెవెన్యూ (ట్యాక్స్) మేళాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను సులభంగా పరిష్కరించుకోవాలని జీవీఎంసీ కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# డేటా సెంటర్‌పై దుష్ప్రచారం ఎందుకు?

## అభివృద్ధి జరిగేటప్పుడు చిన్న చిన్న ఇబ్బందులు సహజం: ఎంపీ శ్రీ భరత్ -గూగుల్ డేటా సెంటర్‌కు అన్ని అనుమతులు ఉన్నాయి.. పెట్టుబడులను అడ్డుకునే కుట్రలు జరుగుతున్నాయి



విశాఖపట్నం, జూన్ 16, ప్రభాతవార్త :

అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేటప్పుడు చిన్న చిన్న ఇబ్బందులు రావడం సహజమని, వాటిని భూతద్దంలో చూపిస్తూ ప్రజల్లో అపోహలు సృష్టించడం సరికాదని విశాఖ ఎంపీ శ్రీ భరత్ అన్నారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన ఆయన, డేటా సెంటర్ల వల్ల విశాఖ భవిష్యత్తుకు మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన భరత్, డేటా సెంటర్ల కారణంగా నీటి, విద్యుత్ కొరత ఏర్పడుతుందని ప్రచారం చేయడం పూర్తిగా అసత్యమన్నారు. భవిష్యత్తులో విశాఖలో నీటి, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు ఎంపికైన ప్రాంతాలకు ఇప్పటికే పర్యావరణ అనుమతులు ఉన్నాయని, అనుమతులు లేకుండా పనులు జరుగుతున్నాయంటూ కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు రావడం ఇష్టం లేని వర్గాలే ఈ దుష్ప్రచారానికి పాల్పడుతున్నాయని ఆరోపించారు. డేటా సెంటర్ల వల్ల విశాఖలో ఐటీ, కార్పొరేట్ రంగాలు మరింత విస్తరించే అవకాశం ఉందని, వేలాది ఉద్యోగ అవకాశాలు సృష్టించబడతాయని భరత్ పేర్కొన్నారు. ఒకవైపు పర్యావరణ వేత్తలు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నప్పటికీ, మరోవైపు ఈ ప్రాజెక్టులు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభంపై కూడా ఆయన స్పందించారు. జూలైలో విమానాశ్రయ ప్రారంభోత్సవానికి సంబంధించిన ప్రధానమంత్రి షెడ్యూల్ ఖరారైందని వెల్లడించారు. బీచ్ షాక్ పాలసీపై వస్తున్న విమర్శలను కూడా ఆయన తిప్పికొట్టారు. పర్యాటక అభివృద్ధి లక్ష్యంగానే ప్రభుత్వం ఈ విధానాన్ని తీసుకువచ్చిందని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్ర ఆదాయ వనరుల పెంపు, పర్యాటక రంగ అభివృద్ధి కోసం ఈ విధానం ఉపయోగపడుతుందని వివరించారు. రుషికొండ భవనాల వినియోగంపై కూడా ప్రభుత్వం చర్చలు జరుపుతోందని, వాటి నిర్వహణకు సరైన మార్గాలను అన్వేషిస్తున్నామని తెలిపారు. విశాఖను దేశంలోనే ప్రముఖ పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ శ్రీ భరత్ స్పష్టం చేశారు.

# ముస్సోరీ హోమ్‌స్టేలో యువతి మృతి

7వ తరువాయి ..

ఉద్యోగం చేస్తున్నాడు. జూన్ 14 రాత్రి ఇద్దరూ ముస్సోరీలోని టిప్రిధార్ ప్రాంతంలోని కియానా హోమ్‌స్టేలోని 'బ్లిస్' గదిలో బస చేశారు. భర్త తెలిపిన వివరాల ప్రకారం, ఆ రాత్రి ఇద్దరూ భోజనం అంతరం తెల్లవారుజామున నిద్రపోయారు. ఉదయం లేచినప్పుడు గాయత్రి నగ్నంగా నేలపై అపస్మారక స్థితిలో కనిపించిందని, ముక్కు నుంచి రక్తం కారుతుండగా పడివున్నట్లు గుర్తించినట్లు చెప్పినట్లు తెలుస్తుంది. సమాచారం అందుకున్న ముస్సోరీ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని 108 అంబులెన్స్ సిబ్బందితో పరిశీలించారు. వైద్య సిబ్బంది ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గదిలో రక్తపు మరకలు ఉన్న బెడ్‌షీట్, రెండు ఖాళీ మద్యం సీసాలు, ఆహార పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గత ఏడాది నవంబర్ 8న గాయత్రి, శ్రీచరణ్ వివాహం జరిగినట్లు సమాచారం. ఇద్దరూ ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నానికి చెందిన వారే. మృతదేహాన్ని డెహ్రాడూన్‌లోని కొరోనేషన్ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కేసు స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని వైద్యుల బృందంతో పోస్టుమార్టం నిర్వహించి, మొత్తం ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేయాలని పోలీసులు ఆదేశించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే మృతి కారణాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

# క్షణం క్షణం భయం..

గాజువాక,జూన్ 16,ప్రభాతవార్త

గాజువాకలో ప్రయాణమంటేనే వాహనదారులు వణికిపోతున్నారు. 'క్షణ క్షణం.. భయం భయం' అన్నట్లుగా సాగుతోంది ఇక్కడి ట్రాఫిక్ తంతు. పనులు ముగించుకుని ఇళ్లకు చేరాలంటే గగనమవుతోంది. జింక్ ప్రధాన ద్వారం నుంచి పాత గాజువాక వరకు, అలాగే వంటిల్లు జంక్షన్ నుంచి జగ్గు జంక్షన్, కణితి రోడ్డు మార్గాల్లో రాకపోకలు సాగించాలంటే నరకప్రాయంగా మారుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతుండటంతో తలప్రాణం తోకకు వస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### రోడ్డే మార్కెట్.. తోపుడు బండ్లదే రాజ్యం!...

కొత్త గాజువాక మజీద్ వద్ద తెల్లవారుజాము నుంచే కూరగాయలు, పండ్ల భారీ వాహనాలు తిష్ట వేస్తున్నాయి. వాటిని తరలించే ఆటోల రద్దీకి తోడు, రోడ్డుపైనే ఆకుకూరలు, పూల అమ్మకాలు సాగిస్తుండటంతో అడుగు ముందుకు పడని పరిస్థితి నెలకొంది. ఇక వంటిల్లు నుంచి పాత గాజువాక వెళ్లే రహదారికి ఇరువైపులా ఫాస్ట్ ఫుడ్, ఫ్రూట్ జ్యూస్, బజ్జీల దుకాణాలు వెలిశాయి. వీటికి వచ్చే కస్టమర్లు వాహనాలనురోడ్డుపైనే పార్క్ చేస్తుండటంతో ట్రాఫిక్ 'చాంతాడంత' తయారవుతోంది. కొత్త గాజువాక మార్కెట్‌కు వచ్చే వాహనాల కోసం ట్రాఫిక్ పోలీసులు రహదారి మధ్యలో పార్కింగ్ సదుపాయం కల్పిస్తే.. దాన్ని అరటిపళ్లు, సుగంధి మారేడు, లస్సీ తోపుడు బండ్లు ఆక్రమించేయడం గమనార్హం.

### ఆ సమయాల్లో అరాచకమే..

ఉదయం 4.00 నుంచి 9.00 గంటల వరకు, సాయంత్రం 6.00 నుంచి రాత్రి 9.00 గంటల వరకు, ఈ పీక్ అవర్స్‌లో గాజువాక రోడ్లపై వాహనాల రద్దీ విపరీతంగా ఉంటోంది. కనీసం నడవడానికి కూడా స్థలం లేని పరిస్థితి కనిపిస్తోంది.

### చలానాలపై ఉన్న శ్రద్ధ.. ట్రాఫిక్‌పై లేదా?

ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులు ఆ పనిని గాలికొదిలేశారని వాహనదారులు మండిపడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే సమయాల్లో ట్రాఫిక్ క్లియర్ చేయకుండా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీసుల ఫోకస్ అంతా కేవలం డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, చలానాల వసూళ్లపైనే ఉంటోందని, ఖజానా నింపడంపై ఉన్న శ్రద్ధ వాహనదారుల కష్టాలను తీర్చడంపై లేదని విమర్శిస్తున్నారు. ట్రాఫిక్ వలయంలో చిక్కుకున్న గాజువాకను కాపాడాలని, తక్షణమే ఆక్రమణలు తొలగించి రాకపోకలు సులువు చేయాలని ప్రజా సంఘాలు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# కోడిగుడ్డు అమర్‌నాథ్‌కు గూబ గుయ్యిమనేలా సమాధానం

## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్

విశాఖపట్నం, జూన్ 16,ప్రభాతవార్త

వైసీపీ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితపై మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఏపీ స్టేట్ ఎస్సీ మాల కార్పొరేషన్ డైరెక్టర్ కోండ్రు మరిడయ్య తీవ్రంగా ఖండించారు. నర్సీపట్నంలో మీడియా సమావేశంలో మరిడయ్య మాట్లాడుతూ దళిత మహిళా మంత్రిపై బాడీ షేమింగ్ చేస్తూ కించపరిచేలా మాట్లాడిన అమర్‌నాథ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణమే కస్టడీలోకి తీసుకోవాలని రాష్ట్ర డీజీపీని ఆయన మీడియా ముఖంగా డిమాండ్ చేశారు. గన్‌మెన్లు లేనిదే హోంమంత్రి బయటకు రాలేరన్న అమర్‌నాథ్ వ్యాఖ్యలకు ఆయన ఘాటుగా బదులిచ్చారు. వైసీపీ నాయకులకు గన్‌మెన్లతో పనిలేదని, చేతిలో గొడ్డలి ఉంటే చాలు దాన్ని పట్టుకునే బయటకు వస్తారని ఆయన ఎద్దేవా చేశారు. తాము వాడిన బుల్లెట్ ప్రూఫ్ కార్లనే ఇప్పుడు వాడుతున్నారని అమర్‌నాథ్ అనడం హాస్యాస్పదమని, 2019లో మాత్రమే వైసీపీ అధికారంలోకి వచ్చిందని, అంతకుముందు అనేకసార్లు అధికారంలో ఉన్న టీడీపీ వాడిన కార్లనే వైసీపీ నాయకులు సైతం ఉపయోగించారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. గతంలో నిండు శాసనసభలో నారా భువనేశ్వరిని వైసీపీ నాయకులు అవమానించారని, అలా మహిళల జోలికి వెళ్లిన పాపానికే ఆ పార్టీ కేవలం 11 సీట్లకు పరిమితమైందని ఆయన గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ హోంమంత్రి అనితను బాడీ షేమింగ్ చేసి అదే తప్పు చేస్తున్నారని, ఈ తీరు మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో ఆ 11 సీట్లు కూడా మిగలవని హెచ్చరించారు. మిస్టర్ అమర్‌నాథ్ ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని, లేకపోతే మర్యాద దక్కదని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆడవాళ్లను అవమానించినందుకు చట్టంలో ఉన్న అన్ని సెక్షన్లను ఉపయోగించడంతో పాటు, సుమోటోగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి గుడివాడ అమర్‌నాథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని అనకాపల్లి జిల్లా ఎస్పీని, రాష్ట్ర పోలీసు అధికారులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తుని రైల్వే జెడ్ఆర్‌యూసీ మెంబర్, టీడీపీ దళిత నాయకుడు బోడపాటి శ్రీనివాస్, అనకాపల్లి జిల్లా వెలమ సంఘం సహాయ కార్యదర్శి అనిమిరెడ్డి నాగు తదితరులు పాల్గొన్నారు.

VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, MOHEMMED NASEEM S/O HAFIZULLAH KHAN previously called MOHAMMAED NASIM R/O 44-27-12, RLY NEW COLONY, THATICHETLAPALEM, VISAKHAPATNAM, now changed my name from MOHAMMAED NASIM to MOHEMMED NASEEM. Henceforth I will be called as MOHEMMED NASEEM for all purposes. (Ro.No.10764)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన దళిత నాయకులు

**సంతబొమ్మాళి, జూన్ 16 ప్రభాతవార్త:**

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్‌ని అమరావతిలో టెక్కలి నియోజకవర్గానికి చెందిన దళిత నాయకులు చింతాడ శ్రీనివాస్, చింతాడ చిన్నారావు (రాష్ట్ర దళిత దండోరా అధ్యక్షులు) మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గ పరిధిలో దళితులు ఎదుర్కొంటున్న పలు భూ సమస్యలు, సామాజిక ఇబ్బందులు, ఇతర స్థానిక సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు సమస్యల పరిష్కారం కోరుతూ ఒక సమగ్ర వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా దళిత నాయకులు వినతిపత్రంలో వివరాలు వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లాలోని దళిత వర్గాల హక్కుల రక్షణకు, వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కమిషన్ ప్రత్యేక చొరవ చూపాలని కోరినట్లు తెలిపారు. నియోజకవర్గంలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న దళితుల భూ సమస్యలను పరిష్కరించాలని, అర్హులకు న్యాయం జరిగేలా చూడాలని చైర్మన్‌ను అభ్యర్థించినట్లు పేర్కొన్నారు. దళితులపై జరుగుతున్న అన్యాయాలపై తక్షణమే స్పందించి, బాధితులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. వినతిపత్రంలో పేర్కొన్న ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చైర్మన్ హామీ ఇచ్చారని దళిత నాయకులు వెల్లడించారు.

## టీకాలతోనే పాడి పశువులకు రోగ నిరోధక శక్తి : డాక్టర్ అనిల్

**పాతపట్నం, జూన్ 16 ప్రభాతవార్త:**

టీకాలు వేయించడం ద్వారా పాడి పశువులలో రోగ నిరోధక శక్తి పెరిగి వ్యాధి బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటాయని కొరసవాడ పశుచికిత్సాలయం పశు వైద్యాధికారి అనిల్ తెలియజేశారు. మంగళవారం మండలంలోని బూరగాంలో జబ్బవాపు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాడిపశువులలో వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలను పాడి రైతులకు వివరించారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు నర్సునాయుడు, పశువైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

## ఒకే కుటుంబంలో ముగ్గురు ట్రిపుల్ ఐటీలోకి..

**సంతబొమ్మాళి, జూన్ 16 ప్రభాతవార్త**

కృషి, తపన, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని నిరూపించారు ఒకే కుటుంబంలో ముగ్గురు అక్కా చెల్లెళ్లు. ఈ ముగ్గురు ఒకే పాఠశాల నుంచి వరుసగా ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించి పలువురిని అబ్బురుపరిచారు. ప్రతిభకు పట్టుదల తోడైతే విజయాలు సాధ్యమవుతాయని నిరూపించారు. సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్ర గ్రామానికి చెందిన చక్క రామారావు, లక్ష్మి దంపతులకు ముగ్గురు అమ్మాయిలు. ఈ ముగ్గురు అమ్మాయిలు దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. వీరిలో మొదటి అమ్మాయి చెక్క అనిత 2021-22లో పదో తరగతిలో 560 మార్కులతో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి చదువుతుంది . రెండో కుమార్తె చక్క సమాగ్న గత ఏడాది టెన్త్ లో 584 మార్కులు సాధించి ప్రస్తుతం నూజివీడులో చదువుతుంది. ఈ ఏడాది చిన్న కుమార్తె చక్క శరణ్య పదిలో 577 మార్కులు సాధించి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. వీరు ముగ్గురు దండు గోపాలపురం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదవడం విశేషం. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వరుసగా ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించడంతో ఆ పాఠశాలకు స్థానికులలో మంచి పేరుతో పాటు నమ్మకం కలిగింది. ఒకే కుటుంబం నుంచి ముగ్గురు అమ్మాయిలు ట్రిపుల్ ఐటీలో సీట్లు రావడంతో ఆ విద్యార్థినిలతో పాటు తల్లిదండ్రులను కూడా పలువురు అభినందనలు తెలియజేసారు.

## సెప్టిక్ ట్యాంకర్ ఢీకొని బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులకు గాయాలు

**సీతంపేట, జూన్ 16 ప్రభాతవార్త**

సెప్టిక్ ట్యాంకర్ ఢీకొన్న సంఘటనలో బైక్‌పై వెళున్న ఇద్దరు వ్యక్తులకు గాయాలు తగిలినట్లు సీతంపేట ఎస్సై వై.అమ్మన్నారావు మంగళవారం తెలిపారు. నాయుడు మల్లికి చెందిన పాలక నాగేశ్వరరావు తన కుమారుడు రోహిత్ కలిసి ద్విచక్ర వాహనంపై సీతంపేట వైపు వస్తుండగా కొండపల్లి సమీపంలో సెప్టిక్ వ్యాను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు తగిలాయి. వీరిని సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఎస్ఐఆర్‌లో సమగ్ర వివరాలను అందించాలి

**ఇచ్ఛాపురం, జూన్ 16 ప్రభాతవార్త:**

మున్సిపాలిటీ పరిధిలో సోమవారం ప్రారంభమైన ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియలో భాగంగా మంగళవారం 23వ వార్డు బెల్లుపడ కాలనీలో బీఎల్ఓ తారకేశ్వరరావుతో కలిసి టీడీపీ పట్టణ కార్యదర్శి శాసన శేఖర్, వార్డు ఇన్‌చార్జ్ సంతోష్ రథో, పార్టీ నేత బచ్చు శంకర్ ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఎన్యుమరేషన్ పత్రాలను పంపిణీ చేశారు. వాటిని ఎలా పూరించి ఇవ్వాలో వారికి వివరించారు. ఏమైనా సందేహాలు ఉంటే బూత్ లెవెల్ అధికారులను, తమను సంప్రదించాలని వారికి సూచించారు. ఎన్యుమరేషన్ పత్రాలలో అవసరమైన అన్ని వివరాలను రాసిన అనంతరం తిరిగి వాటిని బీఎల్ఓలకు అందజేయాలని చెప్పారు. ప్రతి ఇంటికి బీఎల్ఓ మూడు సార్లు వస్తారని, ఈలోగా ఎన్యుమరేషన్ పత్రాలను పూరించి ఇవ్వాలని కోరారు.

## ఉపాధ్యాయులకు టెట్ మినహాయించాలి

### ఉపాధ్యాయులు ప్లకార్డుల ప్రదర్శన

**కంచిలి, జూన్ 16 ప్రభాతవార్త**

ఫోర్టో (ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు రాష్ట్ర ఫోర్టో సంయుక్త కార్యదర్శి బృందావన్ దోళాయి అధ్వర్యంలో ఎమ్.ఎస్.పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విరామ సమయంలో ఉపాధ్యాయులు ప్లకార్డు ప్రదర్శన చేసి ప్రభుత్వానికి డిమాండ్ చేసారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయించాలని, 2009 విద్యా హక్కు చట్టంలో సవరణలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ అవసరం లేకుండా చట్టం తెచ్చేలా కృషి చేయాలని ప్లకార్డులతో శాంతియుత ప్రదర్శన చేయడం జరిగింది. కార్యక్రమంలో ప్రమోద్ కుమార్ పాఢి, కే.క్రిష్ణారావు, కే.సురేష్, రమేష్ దొర, అశోక్ కుమార్ ప్రధాన్, బి.గాయత్రి, రాజేశ్వరి పాఢీ, బి.సంతోషి, యశోద దోళాయి, బి.ప్రతాప్, బి.ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించాలి

**ఇచ్ఛాపురం, జూన్ 16, ప్రభాతవార్త:**

పలాస రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్.అప్పలరాజు ఇచ్ఛాపురం తహసీల్దార్ కార్యాలయంలో అగ్రికల్చర్ మరియు ఫర్టిలైజర్స్‌కు సంబంధించిన అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ డైరెక్టర్ అగ్రికల్చర్, నరసింహమూర్తి ఇచ్ఛాపురం, వ్యవసాయ శాఖ అధికారులు, అజయ్ కుమార్ తహసీల్దార్ వెంకటరావు, ఉపాధ్యక్షులు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన పథకాల అమలు, ఎరువుల సరఫరా, రైతులకు అందిస్తున్న సేవలు, వ్యవసాయ శాఖ చేపడుతున్న కార్యక్రమాల పురోగతి తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. రైతులకు అవసరమైన సేవలు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అధికారులు తమ శాఖల పరిధిలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించగా, సంబంధిత అంశాలపై ఆర్డీఓ ఆర్.అప్పలరాజు తగిన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

## రైతులు విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

**వీరఘట్టం, జూన్ 16 ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ సర్పంచ్ ముద్ద వెంకటరమణ అన్నారు. పాలకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని నడిమికెల్లలోని సచివాలయంలో రైతులకు విత్తనాలను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతుని రారాజుగా చూడాలన్నదే కూటమి ప్రభుత్వం ముఖ్య ఉద్దేశం అని ఆయన అన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు రైతులకు సరిపడే వరి విత్తనాలతో పాటు ఎరువులను కూడా అధికారులు సిద్ధం చేశారన్నారు. కార్యక్రమంలో స్థానిక అగ్రికల్చర్ అసిస్టెంట్ దేవి, గ్రామ పెద్దలు శివున్నాయుడు, గౌరీశంకరరావు, దాలి నాయుడు, సాయి గణేష్ మరియు రైతులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

### టీడీపీ మండల అధ్యక్షులు సుగ్గు

**సంతబొమ్మాళి, జూన్ 16 ప్రభాత వార్త**

రైతుల సంక్షేమాన్ని కోరి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తున్న పలు రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకుని లాభసాటి వ్యవసాయం చేసుకోవాలని సంతబొమ్మాళి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుగ్గు స్వరూప్ రెడ్డి రైతులకు సూచించారు. మండల కేంద్రంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ రాయితీ వరి విత్తనాలను పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వ్యవసాయాధికారి రాళ్లపేట అప్పారావు మాట్లాడుతూ మండలంలోని వివిధ రైతుసేవా కేంద్రాల పరిధిలోని రైతులు కోరిన వంటి వివిధ రకాల వరి విత్తనాలు 1125 క్వింటాళ్లు అందుబాటులో ఉంచామని, అవసరమైతే అదనంగా ఆయా రకాల వరివిత్తనాలు రప్పించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి పిఎసియస్ చైర్మన్ కూచెట్టి కాంతారావు, తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త రెడ్డి అప్పన్న, తెదేపా నాయకులు మాజీ ఎం పి పి కర్రి విష్ణుమూర్తి, ఏ ఎం సి డైరెక్టర్ ధనరాజు, చిన్నతుంగామ్, డి జి పురం సర్పంచులు సిమ్మ గోవిందరావు, ఆరంగి వసంతరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు పుక్కళ్ళ శ్రీనివాసరావు, మెండ అప్పారావు, దామోదరరావు, అరుణకుమార్, వ్యవసాయ విస్తరణాధికారి గొండు శ్రీధర్, వి వి ఏ లు శశిభూషణరావు, మోహిని, బాలచంద్ర, ధర్మారావు, భీమారెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

## సాహితీ వేదిక ఆధ్వర్యంలో శ్రీశ్రీ వర్ధంతి సభ

**పాతపట్నం, జూన్ 16 ప్రభాతవార్త:**

మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) 43వ వర్ధంతిని స్థానిక గ్రంథాలయంలో సాహితీ వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముందుగా అధ్యక్షులు శంకర నారాయణ మరియు సభ్యులు పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. అనంతరం అధ్యక్షులు శంకర నారాయణ, కార్యదర్శి ఎల్లెన్ కొల్లి శ్రీశ్రీ రచనా ప్రస్థానంపై ప్రసంగించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు ఈ కార్యక్రమంలో పాల్గొని శ్రీశ్రీ కవితా విధానంపై ఆసక్తికర ప్రసంగం చేశారు. అనంతరం గాయనీ, గాయకులు తూలుగు తిరుపతి రావు, గీతాంజలి, కృష్ణ మరియు క్రాంతి శ్రీశ్రీ రచించిన సినీ గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో కాళ్ల రాజు, యస్.చిరంజీవి, ఎల్.శ్రీనివాసరావు, ఎంఈవో రాంబాబు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ వైకుంఠరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కే.చక్రపతి, పి రామరాజు, వై వీ రమణ, ప్రదీప్, కె.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు బిటివాడ ఫీడర్ పరిధిలో విద్యుత్‌కు అంతరాయం

**వీరఘట్టం, జూన్ 16 ప్రభాతవార్త:**

11కేవీ బిటివాడ ఫీడర్ నందు ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ, చెట్లు తొలగించుట మరియు ఇతర పనుల నిమిత్తం కడకెల్ళ ఫీడర్ పరిధిలో పనులు చేయుట వలన ఈ నెల 17వ తేదీ బుధవారం ఉదయం 8 నుండి 2 గంటల వరకు విద్యుత్తుకు అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.విష్ణుమూర్తి మంగళవారం విలేకరులకు తెలిపారు. దీని పరిధిలో ఉన్నటువంటి చిదిమి యు.వెంకంపేట సి ఎస్ ఆర్ పేట, కొట్టుగుమ్మడ గడగమ్మ తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందన్నారు.

**వీరఘట్టం ఫీడర్ నందు కూడా...**

వీరఘట్టం ఫీడర్ నందు కూడా బుధవారం వీరఘట్టం టౌన్, కనోసా హాస్పిటల్ ,విశాఖ డెయిరీలకు కూడా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ విష్ణుమూర్తి తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమకు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

## నేటి నుంచి గుంజిలోవలో వెంకటేశ్వరస్వామి చతుర్ధ వార్షికోత్సవ వేడుకలు

**కోటబొమ్మాళి, జూన్ 16 ప్రభాతవార్త:**

మండలం గుంజిలోవ గ్రామంలోని శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామి దేవాలయం చతుర్ధ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 17 నుంచి 21వ తేదీవరకు ఘనంగా నిర్వహించబడుతుందని ఆలయ ధర్మకర్త పేడాడ చిరంజీవులు మంగళవారం తెలిపారు. ఈనెల 17న ఉదయం సుప్రభాతం, నిత్యారాధన, అఖండదీపారాధన, అష్టోతర శతకలశ జలాభిషేకము, నూతన వస్త్రాలంకరణ, మహానైవేద్యం, 18వ తేదీన సుప్రభాతం, ద్రావిడ దివ్యప్రబంధ సేవాకాలం బాలభోగం, ధ్వజరోహణము, నిత్యహోమం, బలిప్రధానము, 19వ తేదీన సమూహిక కుంకవ ర్చనలు తీర్థగోష్టి, శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, నిత్యహోమం. 20వ తేదీన శ్రీ స్వామి వారి కళ్యాణం, తీర్థప్రసాదాలు, స్వామివారి నగర తిరువీధి ఊరేగింపు, 21వ తేదీన మండలారాధన , శ్రీపుష్పయాగము, ద్వాదశారాధన, ఊంజలసేవ, దేవతోద్వాసన తదితర ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన అర్చకులు నంబాల కుమార్ బాబు ఆధ్వర్యంలో జరగనున్నాయని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## వైద్యుల పర్యవేక్షణలో నేత్ర పరీక్షలు చేసుకోండి

**రాజాం, జూన్ 16 ప్రభాతవార్త**

వృద్ధులు, 40 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ వైద్యుల పర్యవేక్షణలో నేత్ర పరీక్షలు చేసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బొద్దాం వైద్యాధికారిణి డాక్టర్ సిద్ధేశ్వరీ అన్నారు. జిల్లా అందత్వ నివారణ సంస్థ, విజయనగరం సౌజన్యంతో పుష్పగిరి కంటి ఆసుపత్రి విజయనగరం సహకారంతో వైద్యాధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో ఆమె మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ కంటి ముందు రంగు రంగు వలయాలు, నల్లని మచ్చలు వంటి లక్షణాలు కనిపించినపుడు ఏ మాత్రం నిర్లక్ష్యం చేయరాదని అన్నారు. అంతకు ముందు వైద్యాధికారి లెఫ్టినెంట్ కర్నల్ డాక్టర్ కె.చరణ్ శిబిరాన్ని ప్రారంభించి, నేత్ర వైద్య నిపుణుల పర్యవేక్షణలో సమగ్ర నేత్ర పరీక్షలు చేసుకోవాలని పేషెంట్‌ను కోరారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన స్థానిక టీడీపీ నాయకులు మద్దు హరి మాట్లాడుతూ, ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైద్య సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆప్తలమిక్ ఆఫీసర్ మరియు ఏపీ స్టేట్ అల్లైడ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్ కౌన్సిల్ మెంబర్ ఎస్.వసంతరావు ఈ నేత్ర శిబిరంలో 55 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి 17 మందికి సమగ్ర నేత్ర పరీక్షలు, శస్త్ర చికిత్సల కొరకు పుష్పగిరి కంటి ఆసుపత్రి విజయనగరంనకు తరలించారు. పేషెంట్స్‌కు ప్రభావతి జాగృతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సెస్, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొని సేవలు అందించారు.

## సీతారామ పామాయిల్ మిల్లులో అగ్నిప్రమాదం

**రాజాం, జూన్ 16 ప్రభాతవార్త**

సోపేరు దగ్గర ఉన్న సీతారామ పామాయిల్ మిల్లులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ విధంగా మిల్లులో అగ్ని ప్రమాదం సంభవించడం వలన సుమారుగా 2.0 కోట్లు నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదని తెలిపారు.

## అమర్‌నాథ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన ఎమ్మెల్యే శిరీష

**పలాస, జూన్ 16 ప్రభాతవార్త:**

పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష వైసీపీ నేతలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోషల్ మీడియాలో మహిళలపై అసభ్యకర పోస్టులు పెడితే కఠిన శిక్షలు పడాల్సిందే. వైకాపా నాయకుల వ్యాఖ్యల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడిన గౌతు శిరీష. సోషల్ మీడియా వేదికగా మహిళల గౌరవానికి భంగం కలిగిస్తే సహించేది లేదంటూ ఎమ్మెల్యే శిరీష హెచ్చరించారు. అమర్‌నాథ్ గారు... మీ ఇంట్లో మహిళలు లేరా? అమర్నాథ్ చేసి వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలి. వెంటనే క్షమాపన చెప్పాలి. ప్రధాని మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళలకు గౌరవాన్ని కాపాడే చట్టాన్ని తీసుకురావాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న ప్రతీ ఒక్క మహిళ అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలు ఖండించాలని ఎమ్మెల్యే శిరీష అన్నారు.

## స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర అందరి లక్ష్య సాధన కావాలి : ఎమ్మెల్యే

**పలాస, జూన్ 16 ప్రభాతవార్త**

పలాస మండలంలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన రథాలను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ద్వారా గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా మారడంతో పాటు ప్రజల్లో పరిశుభ్రత పట్ల అవగాహన పెంపొందుతుందని తెలిపారు. స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అని, పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ రథాల ద్వారా గ్రామాల్లో ప్రజలకు పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో స్వర్ణ ఆంధ్ర లక్ష్య సాధన దిశగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, ప్రజలందరూ ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం వార్త

## చర్యలు తీసుకోవాల్సిన ఆక్రమణలకు రెండేళ్లు చాల్లేదా ?.. సామాన్యుని ప్రశ్న

**శ్రీకాకుళం, జూన్ 16, ప్రభాతవార్త:**

రెండేళ్లు విజయవంతంగా పూర్తయ్యిందని విజయోత్సవ సభలు జరుపుకొంటున్న వేళ ఒక సామాన్యునికి అనుమానం వచ్చింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన చెరువులు, కాలువల ఆక్రమణలపై ఈ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నా గణ్యబంధ, కుంకుమసాగరం, మిగిలిపాడు, నెమలివూరు, ఉదయపురం చెరువుల విషయంలో ఎటువంటి చర్యలు కనిపించడం లేదు. ఇది ఒక వైపు అయితే, ఎర్రచెరువు కాలువ, మార్కెట్ యార్డ్ సమీప రహదారి, డబ్బాల చెరువు, కుంకుమసాగరం, శనీశ్వరుడు మెట్ట ప్రాంతం సత్యసాయి హాస్టల్ ఎదురు, జగన్నాథసాగరం వంటి ప్రాంతాల్లో కొత్తగా ఆక్రమణలు, నిర్మాణాలు ఏదేచ్ఛగా కొనసాగుతుండటం మరో వైపు ఆలోచించదగ్గ విషయం. ప్రభుత్వాలకు కాలపరిమితి ఉంటుంది. పదవులకు గడువు ఉంటుంది కానీ కబ్జాలకు మాత్రం ఎలాంటి వాలిడిటీ ఉండదా? ఒక ప్రభుత్వం హయాంలో జరిగిన తప్పును మరో ప్రభుత్వం సరిదిద్దకపోతే ప్రజలు మార్పును ఎందుకు నమ్మాలి అనే భావం రాదా? విచిత్రం ఏమిటంటే, ప్రజా సమస్యల దగ్గర వేర్వేరు జెండాలు కనిపించే రాజకీయపక్షాలు, చెరువులు-కాలువల కబ్జాల దగ్గరకు వచ్చేసరికి మాత్రం ఒకే పక్షంగా మారిపోతున్నాయి. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా కబ్జాల విషయంలో అధికారుల మౌనం అంతా ఒక్కటే అనే సందేశం ఇస్తోంది. చెరువులు ప్రజల ఆస్తి. కాలువలు ప్రజల హక్కు. వాటిని కాపాడటం ప్రభుత్వాల బాధ్యత. ఆక్రమణదారుల ప్రయోజనాల కోసం ప్రకృతిని, ప్రజల భవిష్యత్తును తాకట్టు పెట్టే రాజకీయాలకు ప్రజలు హర్షించరు అని చరిత్ర చెబుతున్న పాఠం.

## జిల్లాలో రెవెన్యూ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

### ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసుల సంఘం

**శ్రీకాకుళం, జూన్ 16 ప్రభాతవార్త**

జిల్లాలోని అన్ని రెవెన్యూ కార్యాలయాలలో ఉద్యోగులందరినీ భాగస్వామ్యం చేస్తూ ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొనే విధంగా జూన్ 20న నిర్వహించనున్న రెవెన్యూ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసుల సంఘం ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్లకు పదోన్నతులు కల్పించడంలో సహకరించినందుకు సంఘం తరపున జిల్లా కలెక్టర్‌ను సత్కరించారు. అనంతరం రెవెన్యూ శాఖకు సంబంధించిన పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా ఉద్యోగులపై పెరుగుతున్న పని భారాన్ని తగ్గించడం, అన్ని పనులను ఏకకాలంలో నిర్వహించాల్సిన పరిస్థితికి బదులుగా ప్రభుత్వ ప్రాధాన్యతా క్రమంలో విధులను అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవడం, రోజువారీ పరిపాలనా కార్యకలాపాల నిర్వహణకు అవసరమైన బడ్జెట్‌ను కేటాయించడం, కోర్టు కేసుల నిర్వహణకు ప్రత్యేక నిధులు మంజూరు చేయడం వంటి అంశాలను ప్రతిపాదించారు. రీ-సర్వే కార్యక్రమం అమలులో ఎదురవుతున్న ఇబ్బందులు, పీజీఆరఎస్ ఫిర్యాదుల పరిష్కారంలో ఎదురయ్యే సమస్యలు, రీ-సర్వే ఉప తహసీల్దార్ పోస్టుల కొనసాగింపునకు ఉత్తర్వులు జారీ చేయడం, జూనియర్ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులకు సర్వే శిక్షణ కల్పించేందుకు ప్రతిపాదనలు పంపడం, ప్రతి నెల ఒకరోజు ఉద్యోగుల గ్రీవెన్స్ సమావేశం నిర్వహించడం, ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఉద్యోగ సంఘాలతో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించడం తదితర అంశాలపై చర్చించారు. ఈ అంశాలన్నింటిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బి.వి.వి.యెన్. రాజు, తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు సరఫరా లేదంటే కదం తొక్కిన మల్లికార్జున కాలనీవాసులు

**రాజాం, జూన్ 16 ప్రభాతవార్త:**

రాజాం పట్టణంలో మల్లికార్జున కాలనీలో కరెంటు లేకపోవడంతో కాలనీవాసులు ఎలక్ట్రికల్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ మధ్యకాలంలో కురిసిన వర్షాలకు చెట్లు విరిగిపోవడంతో అంతరాయం వాటిల్లిందంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విధంగా కరెంటు లేకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని వాపోతున్నారు. తక్షణమే కరెంటు పునరుద్ధరణ పనులు చేపట్టి కరెంటు అంతరాయం లేకుండా చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## సర్వీసులో ఉండే టీచర్లకు టెట్ రద్దు చేయాలి

### ఎ పి టి ఎఫ్ కార్యవర్గ సమావేశంలో ప్రభుత్వానికి విజ్ఞప్తి

**కోటబొమ్మాళి, జూన్ 16, ప్రభాతవార్త:**

స్థానిక ఎం.పి.పి.ఎస్. కోటబొమ్మాళి బీసీ పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపిటిఎఫ్) కోటబొమ్మాళి మండల శాఖ కార్యవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తిరుమలరావు ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయుల సమస్యలు, విద్యా రంగంలో జరుగుతున్న పరిణామాలపై సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే సేవలో ఉన్న (ఇన్-సర్వీస్) ఉపాధ్యాయులకు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) తప్పనిసరి చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కల్పించే విధంగా కేంద్ర ప్రభుత్వం తక్షణమే చట్ట సవరణ (అమెండిమెంట్) తీసుకురావాలని, అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని ఎ పి టి ఎఫ్ తరపున ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం, విద్యా ప్రమాణాల అభివృద్ధి కోసం ఫెడరేషన్ నిరంతరం కృషి చేస్తోందని ఆయన అన్నారు. ఉపాధ్యాయులకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని సూచించారు. సమావేశంలో ఏపిటిఎఫ్ మండల శాఖ కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయ ప్రతినిధులు పాల్గొని పలు అంశాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సమావేశం విజయవంతంగా ముగిసింది.

## 30 కిలోల గంజాయితో ఇద్దరు అరెస్ట్

**ఇచ్ఛాపురం, జూన్ 16 ప్రభాతవార్త:**

ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా టౌన్ ఇన్‌ఛార్జ్ ఎసఐ అర్.జనార్ధనరావు 30.210 కిలోల గంజాయితో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సిఐ ఎం.చిన్నంనాయుడు చెప్పారు. మహారాష్ట్రకి చెందిన విశాల్ యస్వంత్ కంబ్లే, అర్పిత వర్మ అలియాస్ జరా ఫాతిమాలు 30.210 కీలోల గంజాయి తరలిస్తుండగా సీజ్ చేసి కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరి ఆర్థిక పరిస్థితి బాగులేని కారణంగా మహమ్మద్ షరీఫ్ అనే వ్యక్తితో ఒప్పందం కుదుర్చుకుని 10 వేలు రూపాయలు కిరాయికి మాట్లాడి రోషన్ అలియాస్ సాల్మన్ మజ్జి అనే వ్యక్తి వద్ద గంజాయి తీసుకుని తరలిస్తుండగా పట్టుబడినట్లు చెప్పారు.

17 -6Pg9th cheli.qxd:17 -6Pg9th cheli.qxd 1/1/02 7:13 AM Page 1



# సబ్జాతో మిస మిసలు !

చర్మాన్ని లోలోపలి నుంచి మెరిపించే సహజసిద్ధమైన పదార్థాల్లో సబ్జా గింజలు ఒకటి. కాస్త తగి తగిలితే చాలు ఉబ్బిపోయే వీటిని ఆహారంగా తీసుకుంటే జీవక్రియలన్నీ సజావుగా సాగుతాయి. ఈ గింజలను తీసుకోవడం వల్ల ఆరోగ్యపరంగానే కాదు.. సౌందర్యపరంగానూ ఎన్నో ప్రయోజనాలు పొందచ్చుంటున్నారు.

**డివటాక్సిఫికేషన్ ..** వాహనాల నుంచి వెలువడే పొగ, కాలుష్యం కారణంగా.. చర్మం కాంతిని కోల్పోతుంది. దుమ్ము, ధూళి ప్రభావం వల్ల చర్మంపై మొటిమలు వచ్చే అవకాశం ఎక్కువ. అయితే కాలుష్యం ప్రభావాన్ని తగ్గించడానికి చర్మాన్ని లోలోపలి నుంచి శుభ్రం చేయాలంటే సబ్జా గింజలు అందుకు సరైన ఎంపిక అంటున్నారు నిపుణులు. వీటిలో ఉండే సహజ డీటాక్స్ గుణాలు చర్మం లోపలి పొరల్లో చేరిన టాక్సిన్లను బయటకు పంపిస్తాయి. దీనివల్ల సౌందర్య సమస్యలు తగ్గి చర్మం మెరుపును సంతరించుకుంటుంది.

**ఇన్ఫెక్షన్లు రాకుండా..** కొంతమందిలో చర్మ సంబంధిత ఇన్ఫెక్షన్లు వచ్చాయంటే ఓ పట్టాన తగ్గవు. అలాంటివారు క్రమం తప్పకుండా సబ్జా గింజలను ఆహారంగా తీసుకోవడం మంచిది. వీటిలో ఉన్న యాంటీ మైక్రోబియల్, యాంటీ ఫంగల్, యాంటీ బయోటిక్ గుణాలు చర్మానికి ఇన్ఫెక్షన్లు కలిగించే బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మక్రిములను నశింపచేస్తాయి. దీనివల్ల చర్మం ఇన్ఫెక్షన్లను గురవకుండా ఉంటుంది.

**కాంతివంతంగా..** సబ్జా గింజల్లో చర్మానికి మేలు చేసే విటమిన్ 'ఇ' పుష్కలంగా లభిస్తుంది. ఇది చర్మానికి అవసరమైన పోషణనిచ్చి, కాంతివంతంగా మారేలా చేస్తుంది. అలాగే ఈ గింజల్లో విటమిన్ 'ఎ', విటమిన్ 'సి',పొటాషియం,మెగ్నీషియం, కాపర్.. లాంటి పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. ఇవన్నీ చర్మ సౌందర్యాన్ని ద్విగుణీకృతం చేసేవే. దీంతో చర్మానికి తగినంత పోషణ అంది ఆరోగ్యంగా, మృదువుగా మారుతుంది.

**ముడతలు పడకుండా .....** ఇరవైల నుంచి ముప్పైల్లోకి రాగానే మహిళలంతా ఎదుర్కొనే సమస్య చర్మం ముడతలు పడడం, దీనివల్ల చిన్న వయసులోనే వృద్ధాప్య ఛాయలు కనిపిస్తాయి. అయితే ఇలా కనిపించకుండా ఉండటం కోసం చాలామంది యాంటీఏజింగ్ క్రీంలను వాడుతుంటారు. కానీ ఈ సమస్యకు సబ్జా గింజలు మేలైన పరిష్కారం చూపుతాయంటు న్నారు నిపుణులు. వీటితో తయారుచేసిన ఫేస్‌ప్యాక్ వేసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. చెంచా కొబ్బరి నూనెలో సరిపడినంత సబ్జాగింజల పొడిని కలపాలి. ఈ పేస్ట్‌ని ముఖానికి రాసుకొని ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకుంటే సరిపోతుంది.

**కురులు దృఢంగా...** సబ్జా గింజలు చర్మానికే కాదు జుట్టుకు కూడా మేలు చేస్తాయి. దీనిలో విటమిన్ 'కె', బీటా కెరోటిన్, ప్రొటీన్లు అధికంగా ఉంటాయి. ఇవి వెంట్రుకలు, కుదుళ్ల దృఢంగా మారేలా చేస్తాయి. అలాగే ఇవి కురులకు పోషణను అందించి పట్టులా, మృదువుగా మారేలా చేస్తాయి. సబ్జా గింజలను రోజూ ఆహారంలో భాగం చేసుకుంటే జుట్టు రాలే సమస్య నుంచి కూడా విముక్తి పొందచ్చంటున్నారు నిపుణులు. ◻

# కోపానికి అదుపెక్కడ !

ప్రతిఒక్కరికి ఏదో సందర్భంలో కోపం రావడం సహజం కానీ కొందరిలో అది మరీ ఎక్కువగా ఉంటుంది. ఎన్ని ప్రయత్నాలు చేసినా దాన్ని కంట్రోల్ చేసు కోలేరు. దాని కారణంగా పిల్లలు,భర్త ఇలా పక్కవారిని బాధపెట్టడమే కాదు వారి ఆరోగ్యమూ దెబ్బతిం టుంది. దాన్ని అదుపు చేసే చిట్కాలు తెలుసుకుందాం..

- కోపం ఎప్పుడూ మనుషుల మధ్య దూరాన్ని పెంచడమే కాదు,కొన్ని రకాల అనారోగ్య సమస్యలకూ దారితీస్తుంది. కొంతమందిలో తలనొప్పి, హైపర్‌టెన్షన్ అధికంగా ఉంటుంది.అంతేకాదు. ఒత్తిడి స్థాయి పెరుగుతుంది. దీన్ని దూరం చేసేందుకు రోజూ ఉదయాన్నే వాకింగ్‌కు కాస్త సమయాన్ని కేటాయించండి. నడక వల్ల కండరాలకు సాంత్వన లభిస్తుంది. శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడు తుంది. కోపాన్ని అదుపు చేసి.. మీకు ఆలోచించే సమయాన్నిస్తుంది.
- కొన్నిసార్లు కోపంలో వస్తువులను విసిరేయడమో, ఏడవడమో చేస్తుంటారు. కావాలని కాకున్నా ఆవేశంలో అలా చేసేస్తుంటారు. అందుకే ముందు అసలు కోపం దేనివల్ల వస్తోందో గ్రహించాలి. దాని గురించి మీ కుటుంబ సభ్యులతో స్నేహితులతో చర్చించండి. ఇలాచేస్తే మనసు తేలిక పడడమే కాదు. వారిచ్చే సలహాలు మీకు ఉపయోగపడొచ్చు కూడా. లేదా ఓ కాగితంపై రాసుకోండి. ఇలా చేయడం వల్ల మీకు కోపంతెప్పించే పరిస్థితులను ఎలా అధిగ మించాలో ఓ అవగాహన వస్తుంది.
- కోపాన్ని అదుపు చేయడానికి యోగా చక్కటి పరిష్కారం రోజూ నిద్ర లేవగానే అలా పార్కు లేదా ఆరుబయట ఒక పది నిమిషాలు యోగా చేయడం వల్ల ఒత్తిడి, ఆందోళ నలు తగ్గి ప్రశాంతత దొరుకు తుంది. అంతే కాదు, మనసుకు నచ్చిన పాటలు వినడం, డ్యాన్స్, డ్రాయింగ్ వంటివి చేయడం వల్ల కోపం అదుపులో ఉంటుంది. ◻

# పిల్లల్లోనూ డిప్రెషన్

దశాబ్దం కిందటి దాకా పన్నెండేళ్లలోపు పిల్లల్లో మానసిక కుంగుబాటూ, ఆందోళన ల్లాంటివి ఉంటాయంటే వైద్యులు కూడాకొట్టి పారేసేవారు! ఇప్పుడు పరిస్థితి మారింది. తాజాగా కెనడాకి చెందిన క్యాల్‌గరీ విశ్వవిద్యాల యానికి చెందిన పరిశోధకులు..దీనిపైన ఓ పరిశోధన నిర్వహిం చారు. 2020-21 మధ్య వివిధ పరిశోధనా సంస్థలు 80 వేల మంది పిల్లలపైన నిర్వహించిన 29 అధ్యయ నాలని విశ్లేషణకు తీసు కున్నారు. ఈ తాజా విశ్లేషణ ద్వారా పిల్లల్లో మానసిక కుంగుబాటు (డిప్రెషన్) 25 శాతం, ఆందోళన (యాంగ్జైటీ) 20 శాతం వరకూ పెరిగాయని తేల్చారు. చీటికీ మాటికీ కోపం తెచ్చుకోవడం, చిన్న సమస్యలకే ఏడ్చేయడం, ఏకాగ్రతా లోపం, నిద్రలేమి.. ఇవన్నీ ఈ సమస్య లక్షణాలు. కుటుంబం లో ఆర్థికం గానూ, అనుబంధాల పరంగానూ ఏర్పడు తున్న సమస్యలు ఆందోళన పెరుగు దలకి కారణం కావొచ్చం టున్నారు శాస్త్ర వేత్తలు. సామాజిక మాధ్యమాలు కూడా దీనికి కారణమై ఉండొచ్చనీ చెబుతున్నారు. ఈ రెండింటితోపాటూ బడిలో చదువుపరంగా పెరుగుతున్నఒత్తిడీ ఈ సమస్యకి దారితీయొచ్చని భావిస్తున్నారు. ◻

# యువతీ తరుణం !

## 'ఐరన్‌మ్యాన్'గా ఐఐటి విద్యార్థిని !



కృషి పట్టుదల ఉంటే మనుషుల రుషులౌతారన్న స్ఫూర్తిలో ఓ యువతి అరుదైన ఘనత సాధించింది. ఇలాంటి స్ఫూర్తి దాయక ఎంపికను మరికొందరిని అదే దారిలో నడిపిస్తాయి.ఐరన్‌మ్యాన్ అనేది **3.8** కిలో మీటర్ల స్విమ్మింగ్, **180** కిలోమీటర్ల సైక్లింగ్, **42.2** కిలోమీటర్ల మారథాన్‌తో కూడిన అత్యంత కఠినమైన పోటీ.

కేవలం 20 ఏళ్ల వయసులోనే ఐఐటీ మద్రాస్ విద్యార్థిని రేనీ నొరోన్హా 'భారతపు అతి పిన్న వయస్కు రాలైన మహిళా ఐరన్ మ్యాన్'గా ఎంపి కైంది. ఆమె నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. ఇటీవల ఫిలిప్పీన్స్‌లో జరిగిన 'సెంచరీ ట్యూనా ఐరన్‌మ్యాన్' పోటీలో రేనీ తన సత్తా చాటింది. 18-24 ఏళ్ల వయసు కేటగిరీ లో 15 గంటల 55 నిమిషాల 37 సెకన్లలో రేసును పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ విజయం స్ఫూర్తిగా 2026లో హవాయిలో జరగనున్న ప్రతిష్ఠాత్మక ఐరన్‌మ్యాన్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించింది. ఇటీవల ఫిలిప్పీన్స్‌లో జరిగిన 'సెంచరీ ట్యూనా ఐరన్‌మ్యాన్' పోటీలో రేనీ తన సత్తా చాటింది. 18-24 ఏళ్ల వయసు కేటగిరీలో 15 గంటల 55 నిమిషాల 37 సెకన్లలో రేసును పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలి చింది. ఈ విజయం స్ఫూర్తిగా 2026లో హవాయి లో జరగనున్న ప్రతిష్ఠాత్మక ఐరన్‌మ్యాన్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించింది. 2023లో 18 ఏళ్ల 49 రోజుల వయసులోనే న్యూజిలాండ్‌లో ఐరన్‌మ్యాన్ రేసును పూర్తి చేసింది. అందులో అతి పిన్న వయస్కురాలైన భారతీయ మహిళగా రికార్డు సృష్టించింది. ఒకప్పుడు ప్రొఫెష నల్ ఆర్టిస్టిక్ జిమ్నాస్ట్‌గా రాణించిన ఆమె,16 ఏళ్ల వయసులో క్రీడా ప్రస్థానంలోకి అడుగులు వేసింది. ప్రస్తుతం లండన్‌లో ఉంటూనే ఐఐటీ మద్రాస్‌లో బీఎస్సీ డేటా సైన్స్ అండ్ అప్లికేషన్స్ కోర్సును రిమోట్ విధానంలో చదువుకుంటోంది. 21 ఏళ్లు నిండక ముందే ఆరు ఖండాల్లో ఐరన్‌మ్యాన్ పోటీలను పూర్తి చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డు నెలకొల్పడమే తన లక్ష్యమని రేనీ చెబుతోంది. ఆమె ఆశలు, ఆకాంక్షలు తీరాలి. మరికొందరికి స్ఫూర్తి కలిగించాలి. ◻

# పెరటి సిరి !

**ఓ సాయంసంధ్య** వేళ దుర్వాసుడు ఆదమరచి నిద్రపోతున్నాడు. సంధ్యావందన సమయం మించిపోతోందని భార్య కదళి నిద్రలేపింది. ఉలిక్కిపడి లేవడంతో దుర్వాసుడి కళ్లలోంచి కోపాగ్ని వెలువడి ఆమె భస్మమైంది. కొన్నాళ్లకు మామగారు ఇంటి కొచ్చారు. ఆయనకు కోపం రాకుండా తన భార్య కదళిని శుభకార్యాల్లో వినియోగించేలా వరమి చ్చాడు. అప్పటి నుంచి కదళీఫలం శుభసూచక మైంది. మరో కథ ప్రకారం సావిత్రి అనే శక్తిదేవత తన అందానికి గర్వించడం చూసి విరాట్ స్వరూపుడు ఆమెను భూలోకంలో బీజం లేని చెట్టుగా జన్మించమని శపించాడు. తన తప్పు తెలుసుకున్న సావిత్రి శాపవిముక్తి కోసం తపస్సు చేయగా కదళీ ఫలంగా మాధవ సేవలో తరించమని వరమిచ్చాడు. అలా ఆశీర్వదించిన సర్వదినమే మాఘకృష్ణ చతుర్దశి లేదా అరటి చతుర్దశి. అరటిపండు పూర్ణఫలం. అరటి ఎంగిలి విత్తనాలతో కాకుండా పిలకలతో విస్తృత మవుతుంది. అలా దేవుడికి నివేదించే శ్రేష్ఠత పొందింది. అరటాకులో తినడం ఆరోగ్యదాయకం. భోజనంలో విషం ఉంటే ఆకు నల్ల బడుతుంది. రామాయణంలో అరటి ప్రాముఖ్యతను, పూజా విధానాన్ని భరద్వాజుడు సీతారాములకు వివరిం చాడు. ఆ మహర్షి ఇంట భోజనానికి ఉపక్రమించినప్పుడు మారుతికి అరటాకు తక్కువైంది. రాముడు ఆంజనేయుణ్ణి తనకు కుడివైపున కూర్చోమన్నాడు. భరద్వాజుడు కాదనలేక ఒకే ఆకులో ఇద్దరికీ వడ్డించాడు. ఆనాడు రాముడు అరటాకులో అరటిపండ్లను నివేదించిన వారికి మా ఆశీస్సు లు పరిపూర్ణంగా లభిస్తాయి అన్నాడు. అరటిచెట్టును దేవగురువు, బృహస్పతిగా భావిస్తారు. అరటి విష్ణువుకు అత్యంత ప్రీతికరం. గురువారం అరటి చెట్టును పూజించేవారికి విఘ్నేమూర్తి అనుగ్రహం లభిస్తుంది. మాంగళ్యదోష నివారణకు శ్రేష్టం. ఆధ్యాత్మికంగానే కాదు ఆహారానికి, ఔషధానికీ పనికొచ్చే పెరటి సిరి అరటి. ◻

# కొవ్వును కరిగించాలా?

శొంఠిపొడి వేసి టీ కాస్తే.. ఆ రుచి భలే పసందుగా ఉంటుంది. జలుబు, దగ్గు నుంచి ఉపశమనం కూడా. ఇవే కాదు శొంఠితో మరిన్ని ప్రయోజనాలు కూడా ఉన్నాయండోయ్ !

- రోజూ కాసింత శొంఠిపొడిని ఆహారంలో చేర్చుకుంటే నెలసరి సమయంలో అధిక రక్తస్రావంతో బాధపడే వాళ్లకి చక్కని ఉపశమనం దొరుకుతుంది. మొదటి మూడు రోజులు శొంఠిపొడి వేసిన అన్నం తింటే నొప్పి కూడా తగ్గుతుంది.
- కాలి పిక్కలు పట్టేయడం, కండరాల నొప్పులతో బాధపడటం వంటి సమస్యలుంటే ఇది మంచి ఔషధం.
- కొవ్వుని కరిగించడంలో శొంఠి ముందుంటుంది. ట్రైగ్లిజరైడ్స్ సమస్యతో బాధపడే వారు. కొన్ని రోజులు శొంఠి టీ తాగితే చక్కని ఫలితం కనిపిస్తుందట.
- శరీరం లోపలి వాపులకి, కీళ్ల దగ్గర పట్టే సినట్టుగా ఉన్నా ఇది మేలు చేస్తుంది. ◻

# తెర

# 'శ్రీనివాస మంగాపురం' 'గుండె పేలీపోతోందే' సాంగ్ రిలీజ్

'మా మంగళవారం'చిత్రంతో సంచలన విజయం అందుకున్న దర్శకుడు అజయ్ భూపతి'శ్రీనివాస మంగాపురం' తో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రంతో ఘట్టమనేని వారసుడు జయకృష్ణ ఘట్టమనేని తెలుగు సినీ పరిశ్రమకు హీరోగా పరిచయమవుతుండగా, బాలీవుడ్ యువ నటి రాషా తడానీ'ఉయ్ అమ్మ పాటతో దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందిన తర్వాత టాలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది. సీనియర్ నటుడు మోహన్ బాబు ఈ చిత్రంలో పవర్‌ఫుల్ విలన్ పాత్రలో నటిస్తున్నారు. నిర్మాత పి.కిరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని అశ్వినీదత్ సమర్పిస్తు న్నారు. తొలి ప్రేమలో కలిగే మధురమైన భావోద్వేగాలను ఆవిష్కరించే ఈ పాట, ఓ యువకుడు తొలిచూపులోనే ఓ అమ్మాయిపై ప్రేమలో పడిన తర్వాత అతని మనసులో కలిగే ఉత్సాహం, ఆశ్చర్యం, ఆనందాన్ని అందంగా చూపిస్తుంది. సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ ఈ పాటకు క్లాసిక్, మోడరన్ మెలోడీతో మేళవిస్తూ అద్భుతంగా కంపోజ్ చేశారు. ఆలయ నేపథ్యంతో చిత్రీకరించిన ఈ పాట విజువల్‌గా కూడా ఎంతో ఆకట్టుకుంటోంది. కలర్‌ఫుల్ ఫ్రేమ్స్, అందమైన లొకేషన్స్, ఆకర్షణీయమైన విజువల్స్ పాటకు మరింత అందాన్ని చేకూర్చాయి. భాను మాస్టర్ కొరియోగ్రఫీ ప్రేమలో మునిగిపోయిన యువకుడి భావోద్వేగాలను చక్కగా ప్రజెంట్ చేసింది.హీరో జయకృష్ణ ఘట్టమనేని తన నేచురల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకోగా, రాషా తడానీ సంప్రదాయ దుస్తుల్లో ఎంతో అందంగా కనిపించింది. మధురమైన స్వరాలు, ఆకట్టుకునే సాహిత్యం, అందమైన విజువల్స్, మనసుకు హత్తుకునే ప్రేమ భావాలతో గుండె పేలిపోతోందే పాట ఇప్పటికే సంగీత ప్రేమికులను ఆకట్టుకుంటూ రొమాంటిక్ ప్లేలిస్టుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది.

# 'నాగబంధం' విజువలగా మెస్మరైజ్ చేస్తుంది : డీవోపీ ఎస్. సౌందరరాజన్



**నాగబంధం ప్రాజెక్టులోకి ఎలా వచ్చారు?**

నేను ఇంతకుముందు అభిషేక్ గారితో డెవిల్ సినిమా చేశాను. అప్పటి నుంచి ఆయనతో చాలా మంచి అనుబంధం ఉంది.

**ఇందులో మీకు చాలెంజింగ్‌గా అనిపించిన వర్క్ ఏంటి?**

నేను ఇంతకు ముందు ఫాంటసీ సినిమాలు చేశాను. విజువల్స్‌ను గ్లామరైజ్ చేసి, ఎలివేట్ చేసేలా కూడా చేసిన అనుభవం ఉంది. కానీ ఈ సినిమా మాత్రం చాలా ప్రత్యేకం.

**చాలా భారీ బడ్జెట్, వీఎఫ్ఎక్స్‌తో వస్తున్న సినిమా కదా. డీవోపీగా మీకు ఎలాంటి ఛాలెంజ్‌గా అనిపించింది?**

విజువల్ ఎఫెక్ట్స్‌ను మనం రెండు రకాలుగా వాడుతుంటాం. ఒకటి గ్రాండియర్ కోసం, మరొకటి రియల్‌గా అనిపించేందుకు. అయితే ఆ విజువలైజేషన్ సహజంగా కనిపించడం చాలా పెద్ద టాస్క్. చాలామందిని తీసుకెళ్లి హిమాలయాల్లో షూటింగ్ చేయడం ప్రాక్టికల్‌గా సాధ్యం కాదు.

**ఈ సినిమాలో విజువల్స్ అన్నీ చాలా రియల్‌గా కనిపిస్తున్నాయి. మీరు ఎలాంటి గ్రౌండ్ వర్క్ చేశారు?**

నేను, డైరెక్టర్‌గా, ఆర్ట్ డైరెక్టర్ కలిసి చాలా దేవాలయాలు తిరిగాం. తిరువనంతపురంలోని శ్రీ అనంత పద్మనాభస్వామి ఆలయాన్ని సందర్శించాం. అక్కడ ప్రతి అంశాన్ని డీటెయిల్‌గా ఫొటోగ్రాఫ్ చేశాం. అదే ఆలయాన్ని ఆధారంగా చేసుకున్నప్పటికీ సినిమాలో "శ్రీరంగపురం" అనే పేరు పెట్టాం. శ్రీరంగం, తిరువనంతపురం ప్రాంతాల వైభవాన్ని కలిపేలా ఆ పేరు నిర్ణయించాం. ఆ దేవాలయానికి సంబంధించిన అంశాలపై చాలా రీసెర్చ్ చేశాం. అలాగే ఆర్ట్ డైరెక్టర్ అశోక్ గారు అద్భుతమైన సెట్లు వేశారు. ఇంతకుముందు కూడా పెద్ద సినిమాలు చేశాను. కానీ ఇంత భారీ స్థాయిలో సెట్లు ఉన్న సినిమాను నేను ఎప్పుడూ చేయలేదు.

**డైరెక్టర్ అభిషేక్ గురించి?**

ఆయన అద్భుతమైన కథను రాసుకున్నారు. ఆ ఆలోచన మా అందరికీ ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది.

**ఇందులో ఒక ఎపిసోడ్ చేయడానికి 10 కోట్లు అయ్యిందని విన్నాం?**

అవును. మేము ఒక్కో అంశాన్ని ఇంప్రొవైజ్ చేసుకుంటూ వెళ్లాం. ఒక సెట్ డిజైన్ చేసిన తర్వాత ఇంకా గ్రాండ్‌గా ఉంటే బాగుంటుం దనే ఆలోచనతో బడ్జెట్ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా గొప్ప స్థాయిలో సినిమాను తెరకెక్కించాం.

# 'బిచ్చగాడు' కంటే 'వంద దేవుళ్ళు' విజయం సాధించాలి

విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్‌తో కలిసి ఫాతిమా విజయ్ ఆంటోనీ సమర్పణలో సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్‌పై రామంజనేయులు జవ్వాజీ నిర్మించిన చిత్రం'వంద దేవుళ్ళు. విజయ్ ఆంటోని మాట్లాడుతూ.. శశి 20 ఏళ్ల నన్ను మ్యూజిక్ దర్శకుడిగా పరిచయం చేశారు. పదేళ్ల క్రితం శశి బిచ్చగాడు చిత్రంతో హీరోగా నాకు కొత్త జీవితాన్ని ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ'వంద దేవుళ్ళు అంటూ మేం రాబోతోన్నాం. శశి కథ చెప్పిన తరువాత నేను ఎంతో ఏడ్చేశాను. నాకు కన్నీళ్లు మాత్రం ఆగలేదు. నా పాత్ర చాలా డిఫరెంట్‌గా, కొత్తగా ఉంటుంది. నిహారిక కొణిదెల మాట్లా డుతూ.. 'వంద దేవుళ్ళు' మూవీని ఆల్రెడీ నేను చూశాను. శశి తీసిన 'శ్రీను' మూవీ చూసి నేను వెక్కి వెక్కి ఏడ్చాను. ఆయన 'బిచ్చగాడు' లాంటి గొప్ప సినిమాని తీశారు. ప్రతీ ఒక్కరూ హార్ట్ పెట్టి మూవీకి పని చేసినట్టుగా కనిపిస్తోంది. పెళ్లి అయితే, పిల్లల్ని కంటే అమ్మాయి అమ్మగా మారి పోతుంది. అయితే అమ్మలోనూ అమ్మాయి ఉం టుంది. అదే పాయిం ట్‌ను గొప్పగా చూపించారు. త్రినాథరావు నక్కిన మాట్లాడుతూ.. 'విజయ్ ఆంటోని' సినిమా లంటేనే యూనిక్ కంటెంట్ ఉంటుంది. ఆయన ఎలాంటి సబ్జెక్ట్ చేసి ఉంటారా? అని తెలుసు కునేందుకు అయినా సినిమాని చూస్తుంటాను. నిర్మాత ఫాతిమా విజయ్ ఆంటోని మాట్లాడుతూ.. .. 'వంద దేవుళ్ళు' ఈవెంట్‌కు వచ్చిన నిహారికకి, త్రినాథ రావు నక్కినకి థాంక్స్. శశి, విజయ్ ఆంటోని కలిసి చేసిన 'వంద దేవుళ్ళు' అందరినీ ఆకట్టుకుం టుంది. భాగ్యశ్రీమా ఇంట్లోనే స్క్రిప్ట్ డబ్బింగ్ వర్షెన్ కంప్లీట్ చేస్తుంటారు. జూన్ 19న మా సినిమా రిలీజ్ కాబోతోంది. దర్శకుడు శశి మాట్లాడుతూ.. 'బిచ్చగాడు' మూవీతో పదేళ్ల క్రితం ఇక్కడకు వచ్చాను. అప్పుడు మా గురించి ప్రేక్షకులకు ఏమీ తెలియకపోయినా పెద్ద హిట్ చేశారు. ఆ మూమెంట్ నా గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోతుంది. తెలుగు ప్రేక్షకుల్ని నేను ఎప్పటికీ మర్చిపోను. ఇప్పుడు మళ్లీ విజయ్ ఆంటోనితోనే 'వంద దేవుళ్ళు' అని తల్లీకొడుకుల కథతో రాబోతోన్నాను. ఇది 'బిచ్చగాడు'కి పూర్తి భిన్నంగా ఉంటుంది. .నటి కావ్య అనిల్ మాట్లాడుతూ.. 'విజయ్ ఆంటోని'తో పని చేయడం ఆనందంగా ఉంది. శశి ముందు నేను ఒక స్టూడెంట్‌లా ఉండి అంతా నేర్చుకున్నాను.

# 'సూపర్ సుబ్బు' జూలై 2న స్ట్రీమింగ్

సుబ్బు సార్ క్లాస్ అందరికీ స్వాగతం, ఒక అమాయకమైన ప్రశ్నతోనే మొత్తం మాకిపూర్ గ్రామంలో టాక్ అఫ్ ది టౌన్‌గా మారిన ఉపాధ్యాయుడు సుబ్బు! మల్లిక్ రామ్ దర్శకత్వం వహించిన 'సూపర్ సుబ్బు' సిరీస్‌లో సందీప్ కిషన్, మిథిలా పాల్కర్, మురళీశర్మ ప్రధాన పాత్రలు పోషించారు. నెట్‌ఫ్లిక్స్ తొలి తెలుగు ఒరిజినల్ సిరీస్‌గా తెరకెక్కిన సూపర్ సుబ్బు జూలై 2 నుంచి స్ట్రీమింగ్ కానుంది.ఈ కథలో సుబ్రహ్మణ్యం చిల్లుకూరి రావు అలియాస్ సుబ్బు అనే యువకుడు, మాకిపూర్ అనే గ్రామంలో సెక్స్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా ఉద్యోగం పొందు తాడు. ఎలాంటి అనుభవం లేకపోయినా, గ్రామస్తులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో అడుగుపెట్టిన సుబ్బు, అక్కడ అనుకోని సంఘటనలు, విచిత్రమైన ప్రశ్నలు, హాస్యభరిత పరి స్థితులు, జీవితాన్ని మార్చే అనుభవాల మధ్య చిక్కుకుంటాడు. నెట్‌ఫ్లిక్స్ ఇండియా కంటెంట్ వైస్ ప్రెసిడెంట్ మోనికా షెర్గిల్ మాట్లాడుతూ.. సూపర్ సుబ్బు హృదయాన్ని హత్తుకునే కామెడీ సిరీస్. మాకిపూర్ గ్రామం నేపథ్యంగా, సెక్స్ ఎడ్యుకేషన్, సమ్మతి (కన్సెంట్) వంటి అంశాలను వినోదాత్మకంగా, సహజంగా చర్చిస్తుంది. సందీప్ కిషన్, మిథిలా పాల్కర్, మురళీశర్మ, మానస చౌదరి, బ్రహ్మానందం తదితరులు అద్భుతమైన నటనను కనబరిచారు. మా తొలి తెలుగు ఒరిజినల్ సిరీస్‌గా'సూపర్ సుబ్బు ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటుందని నమ్ముతున్నాం". సిరీస్ క్రియేటర్, దర్శకుడు మల్లిక్ రామ్ మాట్లాడుతూ, సెక్స్ ఎడ్యుకేషన్ వంటి అంశాలపై ఉన్న సంకోచాన్ని తగ్గిస్తూ, వినోదంతో కూడిన కథ చెప్పాలని అనుకున్నాం. సిరీస్ క్రియేటర్, దర్శకుడు మల్లిక్ రామ్ మాట్లాడుతూ, సెక్స్ ఎడ్యుకేషన్ వంటి అంశాలపై ఉన్న సంకోచాన్ని తగ్గిస్తూ, వినోదంతో కూడిన కథ చెప్పాలని అనుకున్నాం.

# 19న రాబోతోన్న 'మా ఇంటి బంగారం'

'మా ఇంటి బంగారం' పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటు న్నాను.. ప్రీ రిలీజ్ సెలెబ్రేషన్స్‌లో నిర్మాత డి.సురేష్ బాబు.. ట్రాలాలా పిక్చర్స్ బ్యానర్ మీద సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు సంయుక్తంగా నిర్మించిన సినిమా 'మా ఇంటి బంగారం'. సమంత ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి నందినీ రెడ్డి దర్శకత్వం వహించారు. ఈ మూవీ జూన్ 19న విడుదల కాబోతోంది. . ఈ కార్యక్రమానికి నిర్మాతలు డి.సురేష్ బాబు, స్వప్నా దత్, జాన్వీ నారంగ్, డైరెక్టర్ దేవా కట్టా తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ ఈవెంట్‌లో.. నిర్మాత డి.సురేష్ బాబు మాట్లాడుతూ.. 'మా ఇంటి బంగారం'తో సమంతకి మంచి విజయం దక్కాలి. 'ఓ.. బేబీ'తో సమంత, నందినీ కలిసి నాకు మంచి సక్సెస్ ఇచ్చారు. ఈ చిత్రం కూడా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నారు. సమంత మాట్లాడుతూ.. 'నేను ఇకపై ఏడాదికి రెండు సినిమాలు అభిమానులకు అందించాలని అనుకుంటు న్నాను. ఇప్పుడు అయితే ఓ మంచి చిత్రాన్ని చేశాం. ఇప్పటి వరకు నేను నటిగా ఎంతో ఎంజాయ్ చేశారు. నిర్మాతకు ఉండే కష్టాలు ఇప్పుడు తెలుస్తున్నాయి. గత వారం రోజులుగా మా టీం నిద్రపోవడం లేదు. ప్రతీ ఒక్క డిపార్ట్మెంట్ ప్రాణం పెట్టి పని చేసింది. నిర్మాత రాజ్ నిడిమోరు మాట్లాడుతూ..మా కోసం వచ్చిన సురేష్, స్వప్నా, జాన్వీలకు థాంక్స్. ప్రేమ, పిచ్చి అనేది తెలుగు పరిశ్రమలోనే ఎక్కువగా ఉంటుంది. 'మా ఇంటి బంగారం' చిత్రానికి వసంత్, ధర్మేంద్ర పిల్లర్స్‌లా నిల్చున్నారు. డైరెక్టర్ నందినీ రెడ్డి మాట్లాడుతూ.. 'మా ఇంటి బంగారం' కోసం గత కొన్ని రోజులుగా ఎంతో మంది నిద్ర లేకుండా పని చేస్తున్నాం. అద్భుతమైన టీం నిరంతరం శ్రమించడం వల్లే ఇదంతా సాధ్యమైంది. నిర్మాత జాన్వీ నారంగ్ మాట్లాడుతూ.. 'మా ఇంటి బంగారం' ఈవెంట్‌కు రావడం ఆనందంగా ఉంది. నందినీ మేకింగ్ అంటే నాకు చాలా ఇష్టం. సమంత కోసమే ఈ సినిమా వచ్చినట్టుగా ఉంది..

# 'అరవింద్'తో కొత్త అధ్యాయానికి శ్రీకారం

సంగీత సంచలనం..రాక్‌స్టార్ అనిరుధ్ రవి చందర్ కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. ఆయన తన సొంత ఇండిపెండెంట్ లేబుల్ అల్బు కర్కీ రికార్డ్స్‌తో పాటు యూనివర్సల్ మ్యూజిక్ ఇండియాతో కలిసి చేసిన 'అరవింద్'పాటను రిలీజ్ చేశారు. 2012లో విడుదలైన వైరల్ హిట్ 'వై దిస్ కొలవెరి డి' ద్వారా అనిరుద్ దేశవ్యాప్తంగా పాపులారిటీ పొందిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత దక్షిణాదిన జైలర్, కూలీ, విక్రమ్, లియో, దేవర పార్ట్ వన్ వంటి పలు బ్లాక్‌బస్టర్ చిత్రా లకు సంగీతాన్ని అందించారు. అలాగే 2025లో షారుఖ్ ఖాన్ నటించిన జవాన్ సినిమాతో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చి కూడా సంగీత దర్శకుడిగా అక్కడ కూడా బ్లాక్ బస్టర్ అందుకున్నారు. అనిరుద్..చాలా ఏళ్ల కష్టంతో చిన్న స్థాయి నుంచి అసాధారణ స్థాయికి ఎదిగి అభిమానులతో పాటు సినీ ఇండస్ట్రీ నుంచి కూడా రాక్‌స్టార్ అనే బిరుదుని సంపాదించుకున్నారు. ఈ పాట కథలో కేంద్రంగా నిలిచే పాత్ర పేరు అరవింద్. అనిరుధ్‌కి ప్రతిబింబంలాంటి పాత్ర ఇది. ఈగో, ఎన్నో ఇబ్బందులు, సవాళ్లు ఎదురైనా, సంగీతంపై ఉన్న ప్యాషన్‌తో తన జీవితాన్ని పూర్తిగా దానికి అంకితం చేసిన యువ సంగీతకారుడే అరవింద్. ఇప్పటి డిజిటల్ యుగంలో పాటలను విడుదల చేయటం చాలా సులభం. ఈ సందర్భంగా అనిరుద్ మాట్లాడుతూ 'అరవింద్' అంటే ప్రతి ఒక్కరిలో ఉండే ఓ తరహా వ్యక్తిత్వమే. మన అందరి జీవితాల్లో ఓ అరవింద్ ఉంటాడు. అయితే తన ప్రతిభను చూపించడానికి ఒక్క అవకాశం కోసం ఎదురుచూస్తోన్న ఓ స్వతంత్ర కళాకారుడి కథను ఈ పాట చెబుతుంది. ఈ పాటకు అనిరుధ్‌కు వ్యక్తిగతంగా కనెక్టింగ్‌గా ఉంటుంది. ఎందుకంటే తను కూడా జీవితంలో ఒకప్పుడు అరవింద్ వంటి దశను ఎదుర్కొన్నవాడే. ఈ పాట ద్వారా ఇలాంటి ప్రయాణంలో ఉన్న ఇతర కళా కారులు, క్రియేటివ్ వ్యక్తులతో అనుబంధం ఏర్పరచుకోవాలని ఆయన ఆశిస్తున్నారు.

17vzm15:17vzm15.qxd 16-06-2026 23:07 Page 1



## ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా రామకృష్ణ మాస్టారు ఎన్నిక

నెల్లిమర్ల, జూన్ 16, ప్రభాతవార్త :

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శిగా నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు మాత రామకృష్ణ ఎన్నికయ్యారు. 2002 అక్టోబర్ 17వ తేదీన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా ఉపాధ్యాయ వృత్తి లోకి ప్రవేశించిన రామకృష్ణ మాస్టారు బానాది, పారసాం, పాలవలస తదితర ఉన్నత పాఠశాలల్లో పని చేశారు. ఐదేళ్లపాటు విజయనగరం డైట్ కళాశాలలో కూడా అధ్యాపకు డిగా పనిచేశారు. ప్రస్తుతం ఈయన చింతలపేట ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు. సాంఘిక శాస్త్ర బోధనలో తనదైన శైలిలో సేవలు అందించి అధికారులతోనూ, ప్రజా ప్రతినిధులతో ప్రశంసలు అందుకున్నారు. జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు కూడా అందుకున్నారు. ఉపాధ్యాయ సమూహాల్లో చురుగ్గా వ్యవహరించడంతోపాటు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిర్విరామంగా తన వంతు కృషి చేస్తున్న రామకృష్ణ మాస్టార్‌ని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా తాజాగా ఎన్నుకున్నారు. రామకృష్ణ మాస్టారు ఎన్నిక పట్ల ఆ సంఘం జిల్లా నాయకులు, మండల నాయకులు ఉంద్రు శ్రీనివాసరావు, బాలకృష్ణ, వెంకటరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుని డి. గౌరీదేవి, సహచర ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు,

## సర్ ప్రక్రియను పక్కాగా చేయాలి

నెల్లిమర్ల, జూన్ 16, ప్రభాతవార్త :

'సర్' ప్రక్రియను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కీర్తన సూచించారు. సోమవారం ప్రారంభమైన సర్ ప్రక్రియ పై ఆమె పలు గ్రామాలు పర్యటించి ఖచ్చితమైన ఓటర్ల నమోదు, తొలగింపులు తదితర అంశాలపై ఆరా తీశారు. సర్ ప్రక్రియ నిర్వహిస్తున్న ఉద్యోగులతో మాట్లాడారు. ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబం లోని ఓటర్ల వివరాలు తెలుసుకొని జాబితాను సవరించాలని అన్నారు. మృతి చెందిన, శాశ్విత వలస వెళ్లిన ఓటర్ల పేర్లను తొలగించాలని, కొత్తగా 18 ఏళ్ల వయసు నిండిన యువతి యువకుల పేర్లను నమోదు చేయాలని ఆమె సూచించారు. ఆమె వెంట రెవెన్యూ ఇన్స్పెక్టర్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## పోయిన సెల్ ఫోన్లు బాధితులకు అప్పగించిన సీఐ

శృంగవరపుకోట,జూన్16,ప్రభాతవార్త

పోగొట్టుకున్న సెల్ ఫోన్లలను బాధితులకు సీఐ వివిఎన్.మూర్తి మంగళవారం అప్పగించారు.సెల్ ఫోన్లు పోయినట్లు ఇటీవల ఏడుగురు బాధితులు పిర్యాదు చేశారని ఈమేరకు దర్యాప్తు చేపట్టి వాటిని రికవరీ చేసి బాధితులకు అందజేశామని తెలిపారు.ఎవరివైనా సెల్ ఫోన్లు పోయినట్లు అయితే వెంటనే సియర్ అప్లికేషన్ లో పిర్యాదు నమోదు చేసుకోవాలన్నారు.సదరు ఫోన్ ఆన్ అయిన వెంటనే పోలీసులకు మెసేజ్ వస్తుందని దాని ఆధారంగా సెల్ ఫోన్ రికవరీ చేయడం సులువుగా ఉంటుందని సీఐ మూర్తి తెలిపారు.

## కోటమ్మ ఆలయంలో సేవాహీ స్వచ్ఛత కార్యక్రమం

శృంగవరపుకోట,జూన్16,ప్రభాతవార్త

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న సేవాహీ స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉత్తరాంధ్ర ఇలవేల్పు భక్తులకు కొలువై ఉన్న కోటమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో బీజేపీ నాయకులు దొడ్డి సూర్యారావు మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈమేరకు సూర్యారావు స్వచ్ఛందంగా తన సొంత నిధులుతో నాలుగు వేల రూపాయలు విలువ చేసే 35లీటర్లు అలాగే 50లీటర్ల సామర్థ్యం గల పది డస్ట్ బిన్(బకెట్స్)లను తన కుటుంబ సభ్యులుతో కలిసి ఆలయ అర్చకులు, సిబ్బందికి అందజేశారు.నరేంద్ర మోడీ దేశ ప్రధానమంత్రిగా 12ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన పిలుపు మేరకు సేవాహీ స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బీజేపీ నాయకులు సూర్యారావు తెలిపారు.

## పెరటి తోట పెంపకంపై అవగాహన కల్పించాలి

### ఎంపీడీవో సూర్యనారాయణ

వేపాడ ,జూన్ 16, ప్రభాతవార్త :

మహిళలకు పెరటి తోట పెంపకం పై వెలుగు సిబ్బంది అవగాహన కల్పించాలని ఎంపీడీవో సిహెచ్ సూర్యనారాయణ కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛభారత్ మిషన్ , కిచెన్ గార్డెన్ ( పెరటి తోట) అనే అంశంపై ఎస్ హెచ్ జి సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వెలుగు సిబ్బంది అందరూ గ్రామంలో ఉన్న ప్రతి మహిళకు రెండు అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. వంట గది నుండి , స్నానాల గది నుండి, ఇల్లు శుభ్రపరచినప్పుడు వచ్చిన నీరు ను పెరట్లోకి మళ్లించి మొక్కలకు నీరు అందించడం ద్వారా కూర కాయలు, ఆకుకూరలు, పండ్ల మొక్కలు పెంచుకోవచ్చని తెలియజేయాలని కోరారు . వంటగది నుండి వచ్చే తడి చెత్తను ఎరువుగా మార్చి మొక్కలకు వేస్తే మంచి ఫల సాయం రావడమే కాకుండా ఆర్థికంగా లాభం పొందవచ్చునని తెలిపారు. పొడి చెత్తను స్వచ్ఛరదమ్ నకు ఇవ్వడం ద్వారా ఇంట్లో ఉపయోగపడే నిత్యవసర సరుకులు తీసుకోవడం ద్వారా ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. పెరటి కోళ్లను పెంచడం ద్వారా కలుషితం లేని ఆహారం పొందడమే కాకుండా ఆదాయం వస్తుందని తెలిపారు. బహిరంగ మలవిసర్జన చేయకూడదని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డిప్యూటీ ఎంపీడీవో రవికుమార్, ఎంఎస్‌జీవో శైలజ , ఏపీఎం సూర్యనారాయణ, స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ రాంబాబు,పీడీవో అనిల్ పాల్గొన్నారు.

## చురుకుగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం

గరివిడి, జూన్ 16, ప్రభాత వార్త

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (సర్)కార్యక్రమం మండలం లో చురుకుగా సాగుతోంది. ఎన్యుమరేషన్ ఫారాలు పట్టుకొని ఇంటి ఇంటికి వెళ్లి బి ఎల్ ఓ లు, బి ఎల్ ఏలు ఓటర్లు ని కలుస్తూ ఓటు నమోదు ,మ్యాపింగ్ అంశాలు వారికి వివరిస్తూ సమగ్ర సమాచారం పొందుపరుస్తూ ఉన్నారు. చీపురుపల్లి నియోజకవర్గ ఎలెక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ , ఆర్ డి ఓ సుధారాణి నేతృత్వంలో, సహాయ ఎలెక్ట్రోల్ అధికారి, గరివిడి తహసీల్దార్ చింత బంగార్రాజు పర్యవేక్షణలో ,పది మంది సూపర్ వైజర్‌ల ఆధ్వర్యంలో సర్ కార్యక్రమం చురుకుగా ప్రారంభమైంది.69 వేల ఓటర్లుకి గాను 69 మంది బూత్ లెవెల్ ఆఫీసర్లు కార్యక్రమంలో పాల్గొంటుండగా, టీడీపీ నుండి 69 మంది ,వైకాపా నుండి 69 మంది, జనసేన నుండి 69 మంది బూత్ స్థాయి ఏజెంట్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా వచ్చేనెల 14 వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ప్రతీ ఓటరు సర్ కార్యక్రమం సద్వినియోగ పరచు కోవాలని గరివిడి మండల ఏ ఈ ఓ చింత బంగార్రాజు కోరారు.పారదర్శకంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఓటర్లు ఎటువంటి అపోహలకు పాల్పడవద్దని తహసీల్దార్ పేర్కొన్నారు. ప్రతీ ఓటు నమోదు చేస్తామన్నారు.

## అమర్నాథ్ గౌడ్ హత్యకు మూడేళ్లు

### తీవ్ర నేరాల్లో భాగస్వాములైతేనే వైసీపీ మెంబర్ షిప్

### జగన్ పాలనపై ధ్వజమెత్తిన ఎమ్మెల్యే కోళ్ల

లక్కవరపు కోట, జూన్ 16 ప్రభాత వార్త

వైసీపీ పాలన లో అభం శుభం తెలియని పదవ తరగతి విద్యార్థి అమర్నాథ్ గౌడ్ హత్య జరిగి మూడేళ్లు పూర్తి అయ్యింది అని ఎమ్మెల్యే కోళ్ల అన్నారు మంగళవారం ఎల్ కోటలో ఆమె మాట్లాడుతూ గత ఐదేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అరాచక పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శాంతిభద్రతలు క్షీణించి ఒక రావణ కాష్టంగా మారిందని . ఎక్కడ ఏ సభ పెట్టినా నా బీసీలు, నా ఎస్సీలు, నా ఎస్టీలు అంటూ ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి, అధికారం చేపట్టాక ఆ వర్గాలపైనే దారుణమైన దాడులకు తెగబడ్డారు అని ఎస్.కోట శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎల్.కోటలోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆమె మాట్లాడుతూ.. రేపల్లె నియోజకవర్గంలో తన అక్కను వేధిస్తున్నారని ప్రశ్నించినందుకు పదో తరగతి చదువుతున్న అమర్నాథ్ గౌడ్ అనే బీసీ బాలుడిని వైసీపీ నేతల ప్రోద్బలంతో పెట్రోల్ పోసి దారుణంగా తగులబెట్టి చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దారుణ సంఘటన జరిగి నేటికి మూడేళ్లు పూర్తి కా వస్తున్నా బాధితులు తీరని దుఃఖంలో మునిగిపోతే, బెయిల్‌పై బయటకు వచ్చిన నిందితులు వినాయక చవితి ఉత్సవాల్లో దర్జాగా డాన్సులు వేస్తూ విర్రవీగడమే కాకుండా, బాధితుల ఇంట్లోకి చొరబడి హత్యాప్రయత్నానికి ఒడిగట్టడం ఆ పార్టీ నేతల బరితెగింపునకు పరాకాష్ట అని మండిపడ్డారు. నాడు డ్రైవర్ సుబ్రహ్మణ్యంను చంపి డోర్ డెలివరీ చేసిన మాజీ ఎమ్మెల్సీ అనంతబాబుకు, సొంత చిన్నాన్న వివేకానంద రెడ్డిని హత్య చేసిన నిందితులకు కొమ్ముకాసిన జగన్ రెడ్డి, తీవ్ర నేరాల్లో భాగస్వాములైన వారికే తన పార్టీలో మెంబర్‌షిప్‌లు, పదవులు ఇచ్చి ప్రోత్సహించారని ఆమె విమర్శించారు.

## ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

లక్క వరపు కోట, జూన్ 16 ప్రభాత వార్త

మండలం లోని జమ్మదేవిపేట గ్రామ కేంద్రం గా నడపబడుతున్న బీసీ సంక్షేమ శాఖ కి చెందిన మహాత్మా జ్యోతి భా పూలే బాలికల పాఠశాల ను +ూ మీ చీశీ. 6, తేదీ: 16.06.2026 ప్రకారం రాష్ట్రంలోని అరు సంక్షేమ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయడం జరిగింది.దీనిలో జమ్మదేవి పేట పాఠశాల కూడా ఉందని ప్రిన్సిపాల్ యూ విజయ్ కుమార్ పాత్రో తెలిపారు. దీని ప్రకారం ప్రారంభించిఎంజేపి బీసీ సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ , బైపీసీ గ్రూపుల్లో ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశాలకు అర్హులైన బాలికల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి. అని దీనివల్ల ఈ ప్రాంత బాలికలకు ఎంతో మేలు జరుగుతుంది.అని ప్రిన్సిపాల్ తెలిపారు పదో తరగతి రెగ్యులర్‌గా ఉత్తీర్ణులై ఉండి - కనీసం 500 మార్కులు సాధించిన వారు తేదీ జూన్ 22 లోపు దరఖాస్తు చేసుకోవాలి అని రిజర్వేషన్ ప్రకారం ప్రాధాన్యత కల్పించడం జరుగుతుంది అని తెలిపారు. దరఖాస్తు సమయం లో 10వ తరగతి మార్క్స్ లిస్ట్ కుల ధృవీకరణ పత్రం ఆధార్ కార్డు తెల్ల రేషన్ కార్డు 1 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో తో నేరుగా కళాశాలలో సంప్రదించాలి అని ప్రిన్సిపాల్ తెలిపారు. ఉచిత హాస్టల్ సదుపాయం ఉందని తెలిపారు.

## టౌన్‌లో కుళ్లిన నిల్వ ఉన్న మేక మాంసం విక్రయాలు

సాలూరు, జూన్ 16 ప్రభాతవార్త :

సాలూరు పట్టణ మాంసాహార దుకాణాల్లో నిల్వఉన్న కుళ్ళిన మేక మాంసం జోరుగా అమ్మకాలు జరుగు తుండడంతో మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు సచివాలయ పర్యావరణ కార్యదర్శులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మంగళవారం అందులో భాగంగా పలు మాంసహార దుకాణాలలో పాడైన మాంసం గుర్తించి దుకాణ యజమానులకు ఫైన్ విధించారు.అలాగే ఆ మాంసాన్ని పారిశుధ్య కార్మికులు భూమిలో పాతి పెట్టారు.ఇంకా మాంసాహార దుకాణాలను శుభ్రత పాటించాలని అలాగే మెస్సలు ఏర్పాటు చేసి,బ్లీచింగ్ పౌడర్ చుట్టు పక్కల చల్లలని పలు సూచనలు చేశారు. అంతేకాకుండా నిబంధనలో పాటించని యెడల గట్టి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బ్యాంకు ద్వారా వచ్చే రుణాలు మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

రామభద్రపురం, జూన్ 16, ప్రభాత వార్త:

బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న డ్వాక్రా మహిళలు తప్పనిసరిగా యూనిట్లు నెలకొల్పాలని వెలుగు ఏపీఎం సూరెడ్డి సత్యవతి తెలిపారు. వ ఎండల వెలుగు కార్యాలయంలో సోమవారం ఆమె విలేఖర్లతో మాట్లాడారు. ఈ యూనిట్లు నెలకొల్పడం ద్వారా వారి జీవనోపాధి మెరుగవ్వడమే కాకుండా రుణాలు సక్రమంగా చెల్లించడా నికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఇప్పటికే చాలా మంది డ్వాక్రా మహిళలు, గొర్రెలు, కోళ్లు, ఆవులు పెంపకంతోపాటు విస్తరాకులు, పేపరేట్లు, కూరగాయల అమ్మకాలు ఈ ర ణాలతో వ్యాపారాలు చేస్తున్నారని తెలిపారు. గడిచిన మూడు నెలల్లో బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి కింద రూ.7.11 కోట్లు బ్యాంకు రుణాలు అందించామని తెలిపారు. అలాగే అక్షరాంధ్రలో భాగంగా మండలంలో 2వేల 500 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వీరిలో 1500 మంది డ్వాక్రా మహిళలు ఉపాధిహామీ పథకం కింద వెయ్యి మంది మహిళలను అక్షరాస్యులను చేస్తామని తెలిపారు. దీనిపై గ్రామాల్లో ఇప్పటికే నిరక్షరాస్యుల గుర్తింపు కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ప్రతీ డ్వాక్రా మహిళను అక్షరాస్యులు చేయడమే లక్ష్యంగా చేస్తున్నామని, దీనివలన డ్వాక్రా పథకాలపై డ్వాక్రా మహిళల్లో అవగాహన పెంపొందించుకుంటారని అన్నారు.

## మాజీ మంత్రి అమర్నాథ్ తీరు మార్చుకోవాలి

### టిడిపి రాష్ట్ర కార్యదర్శి సువ్వాడ వనజాక్షి

నెల్లిమర్ల, జూన్ 16, ప్రభాతవార్త

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పై మేకప్ మంత్రి అంటూ వ్యక్తిగత దూషణలకు దిగిన వైసిపి నాయకుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ కు మహిళలు తగిన బుద్ధి చెప్పక తప్పదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి సువ్వాడ వనజాక్షి అన్నారు. అమర్నాథ్ వ్యాఖ్యలకు నిరసనగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వనజాక్షి ఆధ్వర్యంలో తెలుగు మహిళలు స్థానిక రామతీర్థం జంక్షన్లో మంగళవారం సాయంత్రం నిరసన కార్యక్రమం చేపట్టారు. మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ ఫ్లెక్సీ చిత్రపటానికి కోడిగుడ్లు, టమోటా లతో కొట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వనజాక్షి మాట్లాడుతూ వైసీపీ నాయకులు గత ఎన్నికల్లో తీరని పరాభవం చవిచూసినప్పటికీ వారు తీరులో మార్పు రాకపోవడం గమనారామని అన్నారు. మహిళా మంత్రి అనితను వ్యక్తిగతంగా దూషించడం అమర్నాథ్ కు తగదని వనజాక్షి విమర్శించారు. అమర్నాథ్ కు మహిళలు పట్ల గౌరవం లేదనే విషయం స్పష్టమైందని, రాష్ట్రంలోని మహిళలు ఆయనకు తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని ఆమె ఘాటుగా విమర్శించారు. తన విమర్శలను అమర్నాథ్ తక్షణమే ఉపసహరించుకొని, మంత్రి అనితకు క్షమాపణ చెప్పాలని వనజాక్షి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మహిళా విభాగం నాయకురాలు కాళ్ల సత్యవతి, కింతాడ కళావతి, చీకటి సుహాసిని, చిల్లా పద్మావతి, బొంతు ఉమా, మంగమ్మ, రెడ్డి సంతోషి, సుంకర లక్ష్మి, ఎడ్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు అంగన్వాడిలలో చేర్పించండి : ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి

కురుపాం, జూన్ 16, ప్రభాతవార్త :

అంగన్వాడి కేంద్రాలలో పిల్లలను చేర్పించాలని కురుపాం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి రజినీ దుర్గ అన్నారు రాష్ట్రవ్యాప్తంగా ప్రీ ప్రైమరీ విద్యా విధానంలో భాగంగా కురుపాం ప్రాజెక్టు పరిధిలో ప్రతిరోజు తల్లిదండ్రులకు అవగాహన కలిగే విధంగా ర్యాలీ లు నిర్మిస్తున్నట్లు ఆమె తెలిపారు. అందులో భాగంగా కురుపాం మండలం గుమ్మిడిగూడ పంచాయతీ దండుసూర గ్రామంలో గల అంగన్వాడి కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. మూడు నుంచి నాలుగు సంవత్సరాల పిల్లలకు ప్రీ ప్రైమరీ విద్యా విధానంలో భాగంగా పిల్లలకు చేర్పించాలని సూపర్వైజర్ రమాలక్ష్మి కోరారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు జోగలత , ఆయాలు,పిల్లల తల్లులు పాల్గొన్నారు.


## కోటమ్మ ఆలయంలో సేవాహీ స్వచ్ఛత కార్యక్రమం

శృంగవరపుకోట,జూన్16,ప్రభాతవార్త

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న సేవాహీ స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉత్తరాంధ్ర ఇలవేల్పు భక్తులకు కొలువై ఉన్న కోటమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో బీజేపీ నాయకులు దొడ్డి సూర్యారావు మంగళవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈమేరకు సూర్యారావు స్వచ్ఛందంగా తన సొంత నిధులుతో నాలుగు వేల రూపాయలు విలువ చేసే 35లీటర్లు అలాగే 50లీటర్ల సామర్థ్యం గల పది డస్ట్ బిన్(బకెట్స్)లను తన కుటుంబ సభ్యులుతో కలిసి ఆలయ అర్చకులు, సిబ్బందికి అందజేశారు.నరేంద్ర మోడీ దేశ ప్రధానమంత్రిగా 12ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన పిలుపు మేరకు సేవాహీ స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బీజేపీ నాయకులు సూర్యారావు తెలిపారు.


## గాండ్ల తెలకుల రాష్ట్ర ఉపాధ్యక్షునిగా "మొల్లేటి"

లక్కవరపుకోట, జూన్ 16 (ప్రభాత వార్త) :

రాష్ట్ర గాండ్ల (గానుగ)తెలకుల సంఘ ఉపాధ్యక్షునిగా జిల్లాకు చెందిన కల్లేపల్లి గ్రామస్తుడు మొల్లేటి శ్రీను ను నియమిస్తూ ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు వాకాటి హరికృష్ణ ఓ ప్రకటన విడుదల చేసారు. విజయవాడలో జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. తెలకుల అభ్యున్నతి, అభివృద్ధికి కార్యవర్గ సభ్యులు నిరంతరం కృషి చేస్తారని తెలిపారు. రాష్ట్ర సంఘంలో అన్ని జిల్లాలకు సమాన ప్రాధాన్యత ఇచ్చినట్లు చెప్పారు. విజయనగరం జిల్లాకు చెందిన ఎల్. కోట మండలం కల్లేపల్లి గామస్తుడు మొల్లేటి శ్రీను ని ఎంపిక చేసి జిల్లాకు ప్రాధాన్యత ఇచ్చినట్లు చెప్పారు.కూటమీ ప్రభుత్వం తెలకులకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. శ్రీను నియామకం పట్ల జిల్లా (గానుగ)గాండ్ల తెలకుల కులస్తులంతా అభినందనలు తెలిపారు.

విజయనగరం పార్వతీపురం మన్యం

వార్త

## రెండేళ్లలో సంక్షోభం నుంచి సంక్షేమం, అభివృద్ధి

### మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

పార్వతీపురం, జూన్ 16, ప్రభాతవార్త :

ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు పూర్తయిందని, ఈ రెండేళ్లల్లో రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం సంక్షోభం నుంచి సంక్షేమం, అభివృద్ధి దిశగా అడుగులు వేయిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి , జిల్లా ఇంచార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. రెండు సంవత్సరాల కాలంలో ఊహించని విధంగా అనేక సంక్షేమ పథకాలను అందించడంతో పాటు సమాంతరంగా అభివృద్ధిని కూడా ముందుకు తీసుకువెళ్తున్నామని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన విజయోత్సవ సభ - తల్లికి వందనం కార్యక్రమం మంగళవారం విద్యా శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఇంచార్జి మంత్రి ముఖ్య అతిధిగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జూన్ 12, 2024న తమ ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించే సమయానికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వెంటిలేటర్ మీద ఉందని, చంద్రబాబు నాయుడు సీనియారిటీ, కేంద్ర సహకారంతో ప్రస్తుతం కోలుకుంటూ ఆక్సిజన్ తీసుకునే స్థాయికి చేరిందని అన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో రూ.10.5 లక్షల కోట్ల అప్పులు చేసిందని, ప్రభుత్వ ఆస్తులు సైతం తాకట్టు పెట్టారని విమర్శించారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా, తల్లికి వందనం కింద ఒకే రోజున ఏకంగా ?10,000 కోట్ల రూపాయలను తల్లుల ఖాతాల్లో జమ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. గత ప్రభుత్వం అరకొరగా లబ్ధిచేకూర్చితే ప్రస్తుత ప్రభుత్వం ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా ఇచ్చిన మాట ప్రకారం 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేసి శభాష్ అనిపించుకుందని అన్నారు. గిరిజనులు ఎక్కువగా ఉండే మన్యం జిల్లా, ప్రభుత్వం విద్యా రంగానికి ఇచ్చిన ప్రాధాన్యత వల్ల వరుసగా రెండు సంవత్సరాలు ఉత్తీర్ణతలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని అన్నారు. ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టుల (తోటపల్లి, వంశధార, మడ్డువలస మొదలైనవి) కోసం ?2,500 కోట్లు కేటాయించామని, రాబోయే రెండేళ్లలో వీటిని పూర్తి చేయడానికి స్పష్టమైన టైం టేబుల్ రూపొందించామన్నారు. విజయోత్సవ సభలో స్థానిక ఎమ్మెల్యే విజయ్ చంద్ర, కృప ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ తోక జగదీశ్వరి, జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, ఐటీడిఏ ప్రాజెక్ట్ అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు , వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తల్లులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిర కరపత్రం ఆవిష్కరించిన వాకాడ

గరివిడి, జూన్ 16,ప్రభాత వార్త:

ఈ నెల 19 న గరివిడి లో సహాయ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే స్వచ్ఛంద రక్త దాన శిబిర కరపత్రాన్ని గర్భాము శ్రీ మహాలక్ష్మీ స్మెల్టర్స్ అండ్ అల్లాయిస్ పరిశ్రమ యూనిట్ హెడ్ వాకాడ గోపి ఆవిష్కరించారు. సహాయ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో,ఏ ఎస్ రాజా వాలంటీర్ బ్లడ్ బ్యాంక్ నిర్వహణ లో ఈ నెల 19 న స్వచ్ఛంద రక్త దాన శిబిరం గరివిడి లో నిర్వహిస్తున్నట్లు సహాయ్ అధ్యక్షుడు ఉప్పు శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు రక్త దాన శిబిర కరపత్రాన్ని వాకాడ గోపి ఆవిష్కరించి రక్త దాన శిబిరాన్ని విజయవంతం చేయాలని విన్నవించారు. ప్రతీ ఒక్కరూ ఏడాదికి రెండుసార్లు రక్త దానం చేయాలని ఆయన కోరారు. కరపత్ర ఆవిష్కరణలో అధ్యక్షుడు ఉప్పు శ్రీనుతో పాటు సహాయ్ ప్రతినిధులు బడిగంటి సీతారాం,బమ్మిడి కార్తీక్, ఆలమూరు సత్య శ్రీనివాస్, మేదరమెట్ల వెంకటేశ్వర రావు,తదితరులు పాల్గొన్నారు.

## పెరటి తోటల పెంపకంపై అవగాహన కల్పించాలి

దత్తిరాజేరు జూన్ 16 ప్రభాతవార్త

గ్రామాల్లో డ్వాక్రా గ్రూప్ సభ్యులకు పెరటి తోటల పెంపకం పై అవగాహన కల్పించాలని ఎంపీడీవో కిషోర్ కుమార్ తెలిపారు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛ భారత్ మిషన్ కిచెన్ గార్డెన్ పెరటి తోట అనే అవసరం పై ఎస్ హెచ్ జి సభ్యులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ వంటగది ప్రక్కన ఖాళీ స్థలం పెరట్లో కూరగాయలు ఆకుకూరలు పండ్లు మొక్కలు పువ్వు మొక్కలు పెంచుకోవాలని తెలియజేశారు. తడి చెత్త పొడి చెత్త ఎరువుగా మార్చి మొక్కలకు వేస్తే మంచి పలసయం రావడమే కాకుండా ఆర్థికంగా లాభం పొందవచ్చు అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు తాత రవి ఏ.వో శివాజీ ఎస్ హెచ్ జి గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

## సంక్షోభం నుంచి స్వర్ణాంధ్ర వైపు ప్రభుత్వం అడుగులు

### ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

పార్వతీపురం, జూన్15, ప్రభాతవార్త:

ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల కాలంలో రాష్ట్రం విధ్వంసం నుంచి వికాసం వైపు, సంక్షోభం నుంచి స్వర్ణాంధ్ర నిర్మాణం లోకి అడుగులు వేసిందని స్థానిక శాసనసభ్యులు బోనెల విజయచంద్ర అన్నారు. ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన విజయోత్సవ సభ మరియు 'తల్లికి వందనం' కార్యక్రమంలో ఇంచార్జ్ మంత్రితో పాటు ఆయన పాల్గొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పాఠశాల విద్యార్థులకు 'తల్లికి వందనం' పథకం సరిగ్గా అందని పరిస్థితి ఉండేదన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ పేరుపేరునా రూ. 15 వేలు చొప్పున అందిస్తూ సరికొత్త చరిత్ర సృష్టించిందని కొనియాడారు. తమ ఏజెన్సీ పరిధిలో ఒకే ఇంట్లో ఎనిమిది మంది పిల్లలు ఉన్నా, వారందరికీ ఈ పథకాన్ని వర్తింపజేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుదేనని ఆయన కొనియాడారు. రాష్ట్రానికి రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని, దేశంలోనే పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందని అన్నారు. నారా చంద్రబాబు నాయుడు కేవలం ఒక పేరు మాత్రమే కాదు, అదొక అంతర్జాతీయ బ్రాండ్ అని ప్రశంసించారు. దీపం 2.0' పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలు ప్రయోజనం పొందారని అన్నారు. ప్రతి నెల 1వ తేదీన తెల్లవారక ముందే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎన్.టి.ఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేస్తున్నామని అన్నారు.

## హోం మంత్రిపై గుడివాడ వ్యాఖ్యలు దారుణం

విజయనగరం, జూన్ 16, ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనితపై వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి గుడివాడ అమరనాథ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై జనసేన పార్టీ విజయనగరం నాయకురాలు గురాన రాధిక తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరనాథ్ తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, హోం మంత్రికి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.ఈ మేరకు గురాన రాధిక ఒక ప్రకటన విడుదల చేస్తూ, బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఒక మహిళా మంత్రిని లక్ష్యంగా చేసుకుని, వ్యక్తిగత విమర్శలు , వ్యంగ్యాస్త్రాలు సంధించడం అత్యంత దారుణమని మండిపడ్డారు. రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు సహజమే అయినప్పటికీ, ఒక మహిళను వ్యక్తిగతంగా అవమానించేలా మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేసేటప్పుడు మీ ఇంట్లో ఉన్న మహిళలు కానీ, మీ సొంత పార్టీలోని మహిళా నాయకులు కానీ మీకు గుర్తుకు రాలేదా అని ఆమె నిలదీశారు.

## భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి

విజయనగరం, జూన్ 16: ప్రభాతవార్త

జిల్లాలో ప్రాజెక్టుల స్థాపనకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లాలో వివిధ ప్రాజెక్టుల కొరకు చేపట్టిన భూసేకరణ పురోగతిపై మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవిన్యూ , ఎ పి ఐ ఐ సి, సర్వే, రైల్వే, పంచాయతీ రాజ్, ఉద్యానవన శాఖ, అటవీ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలోని రైల్వే, రహదారులు, పారిశ్రామిక పార్కులు, సాగునీటి ప్రాజెక్టులు మరియు ఇతర ప్రభుత్వ ప్రాధాన్యతా ప్రాజెక్టులకు అవసరమైన భూముల సేకరణ స్థితిగతులను శాఖల వారీగా సమీక్షించారు. సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ, ఒబేరాయ్ గ్రూప్ ఉ మేఫైర్ హోటల్స్, గిగా ఎఐ డేటా సెంటర్ నిర్మాణం, తారకరామ తీర్థసాగర్, తోటపల్లి సాగునీటి ప్రాజెక్టులు, జాతీయ రహదారి 130సిడి, విజయనగరం - కుర్ధా రోడ్డు, విజయనగరం - సంబల్ పూర్ మూడో రైల్వే లైన్, కొత్తవలస-- విజయనగరం నాలుగో రైల్వే లైన్ ,వివిధ రైల్వే ప్రాజెక్టులు,ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్, మా మహా మాయ ఇండస్ట్రీస్ లిమిటెడ్ తదితర ప్రాజెక్టుల భూసేకరణ పురోగతిని కలెక్టర్ సమీక్షించారు.

**అల్జీరియాతో అర్జెంటీనా ఢీ**

**నేటి ఉదయం 6.30గంటలకు**

**భారత్‌లోనూ మెస్సీ మానియా**

# వరల్డ్ ఛాంపియన్లకు తొలి పరీక్ష

**కాన్సాస్ సిటీ, జూన్ 16**

సాకర్ ప్రపంచకప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా తొలి పోరుకు సిద్ధమైంది. గ్రూప్-జేలో ఉన్న అర్జెంటీనా.. అల్జీరియాతో తలపడనుంది. భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయం ఆరున్నర గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. స్టార్‌ప్లేయర్ లియోనెల్ మెస్సీ చేసే మ్యాజిక్ కోసం ప్రపంచం మొత్తం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ప్రపంచ చాంపియన్ అర్జెంటీనా తన వరల్డ్ కప్ యాత్రను విజయంతో ప్రారంభించాలని చూస్తుండగా.. చరిత్ర సృష్టించే అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని అండర్‌డాగ్ అల్జీరియా ఆశిస్తోంది. మెస్సీ మాయాజాలం, మహ్రెజ్ ప్రతిభ మధ్య జరిగే ఈ పోరు ఉత్కంఠ రేపుతోంది.

**హాట్ ఫేవరెట్‌గా మెస్సీ సేన**

లియోనెల్ మెస్సీ నాయకత్వంలోని అర్జెంటీనా హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. అయితే మెస్సీ ఫిట్‌నెస్ కాస్త ఆందోళన పరుస్తోంది. అతను ఈ మ్యాచ్‌కు అందుబాటులో ఉండే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి. గోల్ కీపర్ ఎమిలియానో మార్టినెజ్ కూడా అందుబాటులో ఉండడం అర్జెంటీనాకు ఊరటనిచ్చే అంశం. మెస్సీని ఎంతవరకు నిలువరిస్తారన్న అంశంపైనే అల్జీరియా విజయావకాశాలు ఉంటాయి. డ్రాగా ముగించినా గొప్పగానే భావించవచ్చు. అయితే ప్రత్యర్థిని తక్కువ అంచనా వేయకూడదని అర్జెంటీనా కోచ్ లియోనెల్ స్కలోనీ హెచ్చరిస్తున్నాడు. 2022 ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో ఎదురైన అనుభవాన్ని గుర్తుచేస్తే... అల్జీరియా నైపుణ్యమైన జట్టని పేర్కొన్నారు. రియాద్ మహ్రెజ్ నాయకత్వంలోని అల్జీరియా మెరుపు దాడులతో ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని ఆటగాళ్లకు కోచ్ స్కలోనీ సూచించాడు.

**భారత్‌లోనూ మెస్సీ మానియా**

ఫిఫా ప్రపంచకప్ మానియా ఇప్పుడు భారత్‌లో కూడా టాప్ గేర్‌కు చేరుకుంది. లియోనెల్ మెస్సీ ఆడుతుండడంతో ఈ మ్యాచ్‌పై భారత్‌లో కూడా ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా కేరళ, గోవా, బెంగాల్‌లో ఫిఫా కళ వచ్చేసింది. ఆపై డిఫెండింగ్ చాంపియన్స్ హోదాలో అర్జెంటీనా బరిలోకి దిగుతుండడంతో కేరళలో సాకర్ ఫీవర్ ఊపేస్తోంది. ఇక కేరళలో అయితే మెస్సీతో పాటు రొనాల్డో, నెయ్‌మర్, ఎంబాపె, సాలా, లామినే యమాల్ వంటి ఆటగాళ్లకు కూడా విపరీతమైన ఆదరణ ఉంది. అక్కడి ఇళ్లకు కూడా ప్రజలు తమ కిష్టమైన జట్ల రంగులను పెయింటింగ్ వేసుకున్నారు. ఇక బుధవారం ఒక్కరోజే ముగ్గురు బిగ్‌స్టార్స్ మ్యాచ్‌లు ఆడనుండడంతో ఫిఫాలో అసలు సమరం మొదలుకానుంది.

బుధవారం తెల్లవారుజామున ఫ్రాన్స్, సెనెగల్ మధ్య పోరు జరగనుంది. ఈ మ్యాచ్‌లో ఫ్రాన్స్ స్టార్ ప్లేయర్ ఎంబాపె బరిలోకి దిగనున్నాడు. ఆ తర్వాత ఉదయం 6.30 గంటలకు మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనా.. అల్జీరియాతో తలపడనుంది. ఇక రాత్రి 10.30 గంటలకు పోర్చుగల్... కాంగో రిపబ్లిక్‌తో తలపడనుంది. ఇలా త్రిమూర్తులు ఒకే రోజు మ్యాచ్ ఆడనుండడంతో ఫుట్‌బాల్ అభిమానుల్లో ఫుల్ జోష్ నెలకొంది.



# అరౌజో గోల్‌తో గట్టెక్కిన ఉరుగ్వే

**మియామి:** సాకర్ ప్రపంచకప్‌లో చిన్న జట్లు పెద్ద ఆటతో మేటి జట్లకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. కబొవెర్దెతో మ్యాచ్‌ను గోల్ లెస్‌గా స్పెయిన్ ముగించగా... బెల్జియం, ఈజిప్ట్ మ్యాచ్ 1-1తో డ్రా అయింది. ఇక రెండుసార్లు చాంపియన్స్ ఉరుగ్వే తృటిలో ఓటమి నుంచి తప్పించుకుంది. గ్రూప్ హెచ్‌లో భాగంగా సౌదీ అరేబియాతో జరిగిన మ్యాచ్‌ను ఉరుగ్వే 1-1తో డ్రా ముగించి ఊపిరి పీల్చుకుంది. గత ప్రపంచకప్‌లో అర్జెంటీనాను ఓడించిన సౌదీ.. ఈ మ్యాచ్‌లోనూ సంచలనం సృష్టించే ఊపులో కనిపించింది. 41వ నిమిషంలో అబ్దులేలాహ్ అల్ అమ్రి గోల్ చేసి సౌదీకి ఆధిక్యం అందించాడు. ఈ ఆదిక్యం 80వ నిమిషం వరకు కొనసాగింది. చివరకు మాక్సీ అరౌజో చేసిన గోల్‌తో ఉరుగ్వే గోల్స్ సమం చేసింది. డ్రాతో గటెక్కింది. అయితే ఉరుగ్వేకు పలు అవకాశాలు వచ్చాయి. 5వ నిమిషంలో బాక్స్ అంచు నుంచి మాక్సీ అరౌజో కొట్టిన కిక్‌ను సౌదీ గోల్ కీపర్ మొహమ్మద్ అలోవైస్ సమర్థంగా అడ్డుకున్నాడు. ఆ తర్వాత ఉరుగ్వేకు కార్నర్ లభించినా, గోల్ చేయడంలో విఫలమైంది. 18వ నిమిషంలోనూ ఉరుగ్వే కొట్టిన షాట్ గోల్‌పోస్టు తగులుకుంటూ వెళ్లింది.

**ఈజిప్ట్‌ను ముంచిన సెల్ఫ్ గోల్: 1-1 గోల్స్‌తో బెల్జియం మ్యాచ్ డ్రా**

సియాటెల్‌లో జరిగిన మరో గ్రూప్-జి పోరులో బెల్జియం, ఈజిప్ట్ 1-1తో డ్రా అయ్యాయి. సలాహ్ పాస్‌ను అందుకున్న ఎమామ్ అషూర్ 19వ నిమిషంలో గోల్ చేసి ఈజిప్ట్‌కు ఆధిక్యం అందించాడు. మ్యాచ్ అంతా బెల్జియం ఆధిపత్యం ప్రదర్శించినా గోల్స్‌గా మలచలేకపోయింది. 65వ నిమిషంలో రొమెలు లుకా మైదానంలోకి అడుగుపెట్టిన 22 సెకన్లకే ప్రభావం చూపించాడు. థామస్ ఇచ్చిన క్రాస్‌ను అడ్డుకునే క్రమంలో ఈజిప్ట్ ఆటగాడు మహ్మద్ హానీ సెల్ఫ్ గోల్ చేయ డంతో బెల్జియం సమం చేసింది. దీంతో ప్రపంచకప్‌లో తొలి విజయాన్ని అందుకోవాలన్న ఈజిప్ట్ కల మరోసారి నెరవేరలేదు.

# హాకీ సెమీస్‌లోకి దూసుకెళ్లిన భారత్

**ఆక్లాండ్, జూన్ 16:** నేషన్స్ కప్ మహిళల హాకీ టోర్నీలో భారత్ సెమీస్‌కు దూసుకెళ్లింది. ఆక్లాండ్‌లోని నార్త్ హార్బర్ నేషనల్ హాకీ సెంటర్‌లో జరిగిన పూల్-ఎ రెండో మ్యాచ్‌లో భారత్ మహిళలు 2-1 గోల్స్‌తో జపాన్‌పై కంగుతినిపించింది. పూల్-ఎలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలుపొందిన భారత్.. సెమీస్ బెర్త్ ఖాయం చేసుకుంది. భారత్ తరఫున కెప్టెన్ సలీమా టెటే 33వ నిమిషంలో, ఫార్వర్డ్ లాల్‌రెమ్ సియామి 49వ నిమిషంలో గోల్స్ చేశారు. జపాన్‌కు లభించిన ఏకైక గోల్‌ను 35వ నిమిషంలో హిరామిత్సు అందించింది. వందో అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన మిడ్‌ఫీల్డర్ జ్యోతికి ఇది చిరస్మరణీయ గేమ్‌గా మారింది.

మొదటి అర్ధభాగంలో ఇరుజట్లకు గోల్స్ అవకాశాలు వచ్చినా సద్వినియోగం చేసుకోలేకపోయాయి. 33వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను భారత్ గోల్‌గా మలిచింది. నవనీత్ కౌర్ ఇచ్చిన పాస్‌ను నిక్కీ ప్రధాన్ అద్భుతంగా సలీమా వైపు మళ్లించింది. కెప్టెన్ దాన్ని విజయవంతంగా గోల్‌పోస్ట్‌లోకి నెట్టింది. రెండు నిమిషాల తర్వాత హిరామిత్సు పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి జపాన్‌ను 1-1తో సమవుజ్జీగా నిలిపింది. ఇక 49వ నిమిషంలో సుశీల చాను.. సర్కిల్ అంచు నుండి గోల్ వైపు అందించిన అద్భుత పాస్‌ను అందుకున్న లాల్‌రెమ్ సియామి బంతిని నెట్‌లోకి మళ్లించి భారత్‌కు విజయాన్ని అందించింది. 18న జరిగే పూల్-ఎ చివరి లీగ్ మ్యాచ్‌లో ఉరుగ్వేతో భారత్ తలపడనుంది. పూల్-ఎ నుండి రెండో సెమీఫైనల్ స్థానం కోసం జపాన్-అమెరికా తలపడతాయి.

# ఇరాన్ గేమ్ భళా: న్యూజిలాండ్‌తో డ్రా

**కాలిఫోర్నియా, జూన్ 16:** ఫిఫా ప్రపంచకప్‌లో మేటి జట్లు ఉన్నా అందరి చూపు ఇరాన్‌పైనే. సాకర్ వరల్డ్ కప్‌లో పాల్గొంటుందా? లేదా? అన్న సందిగ్ధం నుంచి అమెరికాకు వచ్చిన ఇరాన్ అదిరే ఎంట్రీ ఇచ్చింది. గ్రూప్-జిలో భాగంగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌ను 2-2తో డ్రా చేసి ఆశ్చర్యపరిచింది. ఆరంభంలో న్యూజిలాండ్ ఆధిక్యం కనబరిచింది. ఆట ప్రారంభమైన ఏడో నిమిషంలోనే గోల్ చేసి ఆధిక్యంలో నిలిచింది. క్రిస్ వుడ్ అందించిన పాస్‌ను ఎలిజా జస్ట్ గోల్‌గా మలిచాడు. అటు తర్వాత ఎటాక్‌కు దిగిన ఇరాన్ చివరకు 31వ నిమిషంలో గోల్ చేసింది. రామిన్ రెజాయియన్ గోల్ సాధించి ఇరాన్‌ను సమవుజ్జీగా నిలిపాడు. రెండో అర్ధ భాగం 54వ నిమిషంలో ఎలిజా జస్ట్ మరోసారి గోల్ చేయడంతో న్యూజిలాండ్ 2-1తో ఆధిక్యం పొందింది. పది నిమిషాలకే ఇరాన్ మరో గోల్ చేసింది. 64వ నిమిషంలో రెజాయియన్ అందించిన క్రాస్‌ను ఈసారి మహమ్మద్ మొహెబ్బి గాల్లోకి ఎగిరి హెడర్‌తో గోల్‌గా మలచడంతో మ్యాచ్ 2-2తో సమంగా ముగిసింది.

**అమెరికా విడిచి వెళ్లాలన్నారు: ఇరాన్ కోచ్**

ఈ మ్యాచ్ ముగిసిన వెంటనే అమెరికా విడిచి వెళ్లిపోవాలంటూ తమకు ఆదేశాలు వచ్చాయని ఇరాన్ కోచ్ అమీర్ ఘలేనోయి అన్నారు. ఈ టోర్నీలో తాము అణచివేతకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మ్యాచ్ ఆడిన తర్వాత విశ్రాంతి తీసుకునేందుకు ఇరాన్ జట్టు రాత్రి కాలిఫోర్నియాలో ఉండాలనుకుంది. కానీ, మెక్సికోకు వెళ్లాలని ఆదేశాలు వచ్చాయన్నారు. లాస్‌ఏంజిల్స్‌లోనే ఇరాన్ తదుపరి మ్యాచ్ 22న బెల్జియంతో ఆడాల్సి ఉంది. అయితే అమెరికాలోనే మ్యాచ్‌లు ఆడాల్సి ఉన్నా... మెక్సికోలోని టిజువానాలో ఇరాన్ జట్టుకు బస ఏర్పాటు చేశారు. మ్యాచ్ జరిగే రోజు అక్కడి ఉంచి మ్యాచ్ ఆడే వేదికకు ఇరాన్ జట్టును విమానంలో తరలిస్తారు. అమెరికా వీసాలు నిరాకరించడంతో కోచింగ్ సహాయక సిబ్బంది జట్టుతో లేకపోవడాన్ని ఇరాన్ కెప్టెన్ మెహ్దీ తరేమీ, కోచ్ అమీర్ ఘలేనోయి తీవ్రంగా తప్పుబట్టారు. ఈ పరిస్థితి జట్టు సన్నద్ధతను మరింత క్లిష్టతరం చేసిందన్నారు.

## పెట్టుబడుల ఉపసంహారణతో భారీ ఆదాయం

# తొలి త్రైమాసికంలో 15వేల కోట్లకు పైగా వసూళ్లు

**న్యూఢిల్లీ, జూన్ 16:** కేంద్ర ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో పెట్టుబడుల ఉపసంహారణ (డిస్‌ఇన్వెస్ట్‌మెంట్) ద్వారా రూ.15వేల కోట్లకు పైగా ఆదాయం సమీకరించనున్నది. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) లావాదేవీల ద్వారా ఈ ఆదాయం పెరిగి, ప్రభుత్వ పన్నేతర రాబడులకు ఊతం ఇస్తోంది. కోల్ ఇండియా, ఎన్‌హెచ్‌పీసీ, ఎన్‌ఎల్‌సీ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థల్లో వాటాల విక్రయాల ద్వారా ఈ వృద్ధి నమోదైంది. ప్రస్తుత త్రైమాసికంలోనే కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.14,000 కోట్లను సమీకరించింది. ఇంకా లెక్కల్లో చేరాల్సిన ఆదాయంతో ఈ మొత్తం మరింత పెరిగే అవకాశం ఉంది. ఆర్థిక వ్యయ భారం పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ఆర్థిక వ్యవస్థకు నాన్‌ట్యాక్స్ క్యాపిటల్ రిసీట్స్ కీలక ఆధారంగా మారుతున్నాయి.

పెట్టుబడుల ఉపసంహారణ, ఆస్తుల మోనిటైజేషన్ ద్వారా అధిక ఆదాయం సమకూరితే ఆర్థిక లోటు నియంత్రణకు తోడ్పడటంతో పాటు 2027 ఆర్థికసంవత్సరంలో లక్ష్యాలను చేరుకోవడంలో ప్రభుత్వానికి సహాయ పడుతుందని అంచనా. ముఖ్యంగా ఎరువులు, పెట్రోలియం ఉత్పత్తులపై సబ్సిడీ వ్యయం పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ ఆదాయం ప్రాధాన్యం సంతరించుకుంది. 2027 ఆర్థికసంవత్సరంలో లో కేంద్ర ప్రభుత్వం రూ.80వేల కోట్ల విలువైన ఆస్తుల మోనిటైజేషన్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందులో ఐడిబిఐ బ్యాంక్ వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహారణతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో మైనారిటీ వాటాల విక్రయాలు కూడా ఉన్నాయి. భవిష్యత్తులో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో మరింత వాటా విక్రయించే అవకాశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది.

అధికారిక గణాంకాల ప్రకారం ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం నాన్‌ట్యాక్స్ క్యాపిటల్ రిసీట్స్ రూపంలో మొత్తం రూ.21,732.23 కోట్లను సమీకరించింది. ఇందులో పెట్టుబడులు విత్‌డ్రా ద్వారా రూ.13,389.42 కోట్లు, ఆస్తుల మోనిటైజేషన్ ద్వారా రూ.6,367 కోట్లు, డివిడెండ్ ఆదాయం ద్వారా రూ.1,976 కోట్లు లభించాయి.

## కాసులు కురిపిస్తున్న

# గోల్డ్ బాండ్స్

**ముంబయి, జూన్ 16:** సావరిన్ గోల్డ్ బాండ్ (ఎస్‌జీబీ) 202021 సిరీస్‌లో పెట్టుబడి పెట్టిన ఇన్వెస్టర్లకు కనకవర్షం కురుస్తోంది. ఐదేళ్ల కాలపరిమితి పూర్తి కావడంతో, ఈ బాండ్లను గడువుకు ముందే అమ్ముకునేందుకు ఆర్‌బీఐ అవకాశం కల్పించింది. ఇందుకు సంబంధించిన విమోచన ధరను కూడా ప్రకటించడంతో ఇన్వెస్టర్ల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. రూ. 4,627 పెట్టుబడిపై రూ. 14,774 రాబడి ఎస్‌జీబీ 202021 సిరీస్ బాండ్లను 2020 జూన్ 16న జారీ చేశారు. ఆ సమయంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి గ్రాముకు రూ. 4,627 ధరకు, ఇతర మార్గాల ద్వారా కొన్నవారికి రూ. 4,677 ధరకు బాండ్లను కేటాయించారు. ఇప్పుడు ఐదేళ్ల తర్వాత, ఆర్బీఐ ఈ బాండ్ల ముందస్తు విమోచన ధరను యూనిట్‌కు (ఒక గ్రాముకు) రూ. 14,774గా నిర్ణయించింది.

అప్పట్లో ఆన్‌లైన్‌లో గ్రాముకు రూ. 4,627 పెట్టి కొన్నవారికి ఇప్పుడు గ్రాముపై రూ. 10,147 లాభం వస్తుంది. దీనిని శాతాల్లో లెక్కిస్తే, రాబడి 219.30 శాతంగా ఉంటుంది. ఎవరైనా ఆ సమయంలో రూ. 1 లక్ష పెట్టుబడి పెట్టి ఉంటే, వారికి ఇప్పుడు వడ్డీ ఆదాయం కాకుండానే సుమారు రూ. 3.19 లక్షలు చేతికి వస్తాయి. ఈ ఐదేళ్ల పాటు ఏటా 2.5 శాతం చొప్పున వడ్డీ కూడా ఇన్వెస్టర్ల ఖాతాల్లో జమ అయింది. ఎస్‌జీబీ నిబంధనల ప్రకారం బాండ్ల జారీ తేదీ నుంచి 8 ఏళ్ల మెచ్యూరిటీ పీరియడ్ ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో నిధులు అవసరమైన వారి కోసం, ఐదేళ్ల తర్వాత గడువుకు ముందే అమ్ముకునే వెసులుబాటును ఆర్బీఐ కల్పిస్తుంది. ఈ బాండ్లను 2020 జూన్ 16న జారీ చేయడంతో, 2026 జూన్ 16 నాటికి ఐదేళ్ల లాక్ ఇన్ పీరియడ్ పూర్తయింది.

దీంతో ముందస్తు ఉపసంహారణకు మార్గం సుగమమైంది. ఆర్బీఐ ఈ విమోచన ధరను యాదృచ్ఛికంగా నిర్ణయించదు. ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) ప్రచురించే ధరల ఆధారంగా, విమోచన తేదీకి ముందున్న మూడు పనిదినాల్లోని 999 స్వచ్ఛత కలిగిన బంగారం ముగింపు ధరల సగటును లెక్కించి ఈ ధరను ఖరారు చేస్తుంది. 219 శాతం లాభాలు ఆకర్షణీయంగా కనిపిస్తున్నప్పటికీ, బాండ్లను అమ్ముకోవాలా లేక మెచ్యూరిటీ వరకు ఉంచుకోవాలా అనేది ఇన్వెస్టర్ల వ్యక్తిగత ఆర్థిక లక్ష్యాలపై ఆధారపడి ఉంది.

# వార్ ఒప్పందంతో ఈక్విటీల ర్యాలీ

**ముంబై, జూన్ 16:** అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలు, ముడి చమురు ధరలు తగ్గడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు మళ్లీ కొనుగోళ్లకు దిగడం వంటి అంశాల ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం వరుసగా మూడో రోజు లాభాల్లో ముగిశాయి. అమెరికా-ఇరాన్ మధ్య హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి ఒప్పందం కుదిరిందన్న వార్తలు ఇంధన సరఫరాపై ఉన్న ఆందోళనలను తగ్గించడంతో బ్రెంట్‌క్రూడ్ ధర బ్యారెల్‌కు 83 డాలర్ల కంటే దిగువకు చేరింది. ఐటీ షేర్లలో బలమైన కొనుగోళ్లు సూచీలకు మద్దతుగా నిలిచాయి. మెటల్స్, హెల్త్‌కేర్, ఫార్మా రంగాల షేర్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 544.15 పాయింట్లు పెరిగి 76,808.48 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 135.25 పాయింట్లు శాతం లాభపడి 23,989.15 వద్ద స్థిరపడింది. గత మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 4.03 శాతం, నిఫ్టీ 3.57 శాతం మేర ర్యాలీ తీశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.33 శాతం, స్మాల్ క్యాప్ సూచీ 0.48 శాతం పెరిగాయి. బీఎస్ఈలో 2,293 షేర్లు లాభపడగా, 1,967 షేర్లు నష్టపోయాయి. 169షేర్లు మార్పులేకుండా ముగిశాయి. రూపాయి కూడా డాలర్‌తో పోలిస్తే బలపడగా, 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ యీల్డ్ స్వల్పంగా తగ్గింది. బంగారం ఫ్యూచర్స్ ధరలు స్వల్ప లాభాల్లో ట్రేడ్ అయ్యాయి. రిటైల్ అమ్మకాలు తగ్గగా, పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి అంచనాలను మించి నమోదైంది. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ షేరు 3.68 శాతం ఎగిసింది. బెంగళూరుకు చెందిన ఏఐ స్టార్టప్ సర్వమ్ ఏఐలో రూ.1,427 కోట్ల వ్యూహాత్మక పెట్టుబడి పెట్టనున్నట్లు కంపెనీ ప్రకటించింది.

# లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

సుజ్లాన్ ఎనర్జీ షేరు 4.25 శాతం లాభపడింది. దేశంలో విండ్ ఎనర్జీ సామర్థ్యాన్ని భారీగా పెంచే అవకాశాలు ఉన్నాయని కేంద్ర మంత్రి పేర్కొనడం ఇందుకు కారణమైంది. 1500 మెగావాట్ల విండ్ టర్బైన్‌ల సరఫరా కోసం ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రకటించడంతో షేరు లాభపడింది. ఇతర ప్రధాన షేర్లుఆదాని పోర్టులు ప్రత్యేక ఆర్థిక జోన్ 0.90 పెరిగింది. గోదావరి బయో రిఫైనరీస్ 5.56జంప్ చేసింది. క్యాన్సర్ చికిత్సకు ఉపయోగపడే ఆవిష్కరణకు జపాన్ పేటెంట్ లభించింది. బంధన్ బ్యాంకు 2.78 లాభపడింది. రూ.303.74 కోట్ల ఎన్‌పీఏలను విక్రయించేందుకు బోర్డు ఆమోదంతెలిపింది. మిని డైమండ్స్ ఇండియాషేరు9.77 పెరిగింది. 16.25 కోట్ల వజ్రాల సరఫరా ఆర్డర్ వచ్చిందన్న ప్రకటన షేర్లనుపెంచింది. ధనలక్ష్మిబ్యాంకు 1.77 నష్టపోయింది. మొత్తంగా, అంతర్జాతీయ పరిస్థితులు అనుకూలంగా మారడం, ఎఫ్ఐఐలు మళ్లీ కొనుగోళ్లకు రావడం, రూపాయి బలపడడం వంటి అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌ను బలోపేతం చేశాయి. దీంతో సూచీలు వరుసగా మూడో రోజు కూడా లాభాల్లో ముగిశాయి.



# కిమ్స్ క్యూఐపి ఇష్యూ ఓపెన్

**ముంబయి, జూన్ 16:** కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(కిమ్స్) మంగళవారం తన క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ క్యూఐపి ఇష్యూను ప్రారంభించింది. ఈ సందర్భంగా ఒక్కో ఈక్విటీ షేర్‌కు ఫ్లోర్ ప్రైస్‌ను రూ.771.73గా నిర్ణయించినట్లు స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు సమర్పించిన వివరాల్లో తెలిపింది. కంపెనీ ఫైనాన్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిటీ 16న ఇష్యూ ప్రారంభానికి ఆమోదం తెలిపి, నిధుల సమీకరణకు సంబంధించిన ప్రాథమిక ప్లేస్‌మెంట్ డాక్యుమెంట్స్‌ను ఆమోదించింది. అలాగే సంస్థాగత పెట్టుబడిదారులకు ఫ్లోర్ ప్రైస్‌పై గరిష్ఠంగా 5 శాతం వరకు డిస్కౌంట్ ఇవ్వడానికి కూడా కంపెనీకి అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి 2026 ఏప్రిల్ 15న పోస్టల్ బ్యాలెట్ ద్వారా వాటాదారుల ప్రత్యేక తీర్మానం ఆమోదం పొందింది. ఈ నేపథ్యంలో గరిష్ఠ డిస్కౌంట్‌ను అమలు చేస్తే ఒక్కో షేర్ ధర రూ.733.14 వరకు ఉండే అవకాశం ఉంది. తుది ఇష్యూ ధరను క్యూఐపికు నియమించిన బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లతో సంప్రదించి నిర్ణయిస్తామని కిమ్స్ పేర్కొంది. ఈ ఇష్యూకు సంబంధించి 2026 జూన్ 16ను రిలెవెంట్ డేట్‌గా ఫైనాన్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిటీ నిర్ణయించింది. ఈ క్యూఐపికి సంబంధించి కిమ్స్ డైరెక్టర్ల బోర్డు 2026 మార్చి 11న జరిగిన సమావేశంలో ఆమోదం తెలిపింది. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ద్వారా వాటాదారుల అనుమతి కూడా లభించింది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ అనేది లిస్టెడ్ కంపెనీలు దీర్ఘకాలిక పబ్లిక్ ఇష్యూ ప్రక్రియ లేకుండానే సంస్థాగత పెట్టుబడిదారుల నుంచి మూలధనం సమీకరించేందుకు ఉపయోగించే మార్గం. విస్తరణ ప్రణాళికలు, కొనుగోళ్లు, వ్యాపార వృద్ధి లేదా బ్యాలెన్స్ షీట్ బలోపేతం కోసం కంపెనీలు ఈ విధానాన్ని తరచుగా వినియోగిస్తుంటాయి.

# ఇంధన ఎగుమతులపై ఎక్సైజ్ సుంకం పెంపు

**న్యూఢిల్లీ, జూన్ 16:** పెట్రోల్, డీజిల్, విమానఇంధన (ఏటీఎఫ్) ఎగుమతులపై కేంద్రం ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకాన్ని (విండ్‌ఫాల్ ట్యాక్స్) పెంచింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరల హెచ్చుతగ్గుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. దేశీయ ఇంధన నిల్వలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడడంతో పాటు, ఎగుమతుల ద్వారా లభిస్తున్న అదనపు లాభాలపై నియంత్రణ సాధించడమే లక్ష్యంగా ఈ చర్య చేపట్టినట్లు తెలుస్తోంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం డీజిల్ ఎగుమతులపై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ.13.50 నుంచి రూ.14కు పెంచారు. విమాన ఇంధనం (ఏటీఎఫ్) ఎగుమతులపై సుంకాన్ని 9.50 నుంచి రూ.12.50కు పెంచారు. పెట్రోల్ ఎగుమతులపై ప్రస్తుతం అమల్లో ఉన్న లీటరుకు రూ.1.50 సుంకంలో ఎలాంటి మార్పు చేయలేదు. కొత్త రేట్లు జూన్ 16 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ నిర్ణయం దేశీయ వినియోగదారులపై తక్షణ ప్రభావం చూపదని కేంద్రం స్పష్టం చేసింది. దేశీయ మార్కెట్‌కు సరఫరా చేసే పెట్రోల్, డీజిల్‌పై ఉన్న ఎక్సైజ్ సుంకాల్లో ఎలాంటి మార్పులు చేయలేదని తెలిపింది. ఇజ్రాయెల్ఇరాన్ ఘర్షణల నేపథ్యంలో మార్చి 26న కేంద్రం విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను తిరిగి అమల్లోకి తీసుకొచ్చింది. అప్పటి నుంచి అంతర్జాతీయ ముడిచమురు ధరలు, రిఫైనరీల లాభాల పరిస్థితిని బట్టి ప్రతి రెండు వారాలకు ఒకసారి సుంకాలను సమీక్షిస్తోంది.

## టిసిఎస్‌కు అమెరికా కోర్టులో షాక్

# రూ.1986 కోట్ల పరిహారం

**న్యూయార్క్, జూన్ 16:** భారత ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌టీసీఎస్ కు అమెరికాలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దశాబ్దాలుగా నడుస్తున్న ట్రేడ్ సీక్రెట్స్ వ్యాపార రహస్యాలు చౌర్యం కేసులో అమెరికా సుప్రీంకోర్టులో ఆ సంస్థకు షాక్ తగిలింది. ఈ కేసులో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించడంతో టీసీఎస్‌పై దాదాపు 220 మిలియన్ డాలర్ల భారత కరెన్సీలో సుమారు రూ.1,986 కోట్లు ఆర్థిక భారం పడుతుందని అంచనా. ఈ వివాదం మూలాలు అమెరికాలోని లైఫ్ ఇన్సూరెన్స్ సాఫ్ట్‌వేర్ వ్యాపారంలో ఉన్నాయి. డీఎక్స్‌సీ టెక్నాలజీ అనే సంస్థకు చెందిన పూర్వ కంపెనీ అయిన కంప్యూటర్ సైన్సెస్ కార్పొరేషన్ (సీఎస్‌సీ), 1990లలో తమ యాజమాన్యంలోని ఒక ప్రత్యేకమైన లైఫ్ ఇన్సూరెన్స్ సాఫ్ట్‌వేర్‌ను ట్రాన్స్‌అమెరికా అనే బీమా సంస్థకు లైసెన్స్ ఇచ్చింది. కొన్నేళ్ల తర్వాత ట్రాన్స్‌అమెరికాకు చెందిన 2,200 మందికి పైగా ఉద్యోగులను టీసీఎస్ నియమించుకుంది. ఈ ఉద్యోగుల ద్వారా సీఎస్‌సీకి చెందిన రహస్య సాఫ్ట్‌వేర్ సమాచారాన్ని, దాని పనితీరును తెలుసుకుని, దానికి పోటీగా ఒక కొత్త ఇన్సూరెన్స్ ప్లాట్‌ఫామ్‌ను టీసీఎస్ అభివృద్ధి చేసిందని డీఎక్స్‌సీ ఆరోపించింది. ఈ ఆరోపణలతో డీఎక్స్‌సీ, 2019లో డల్లాస్‌లోని ఫెడరల్ కోర్టులో టీసీఎస్‌పై దావా వేసింది. టీసీఎస్ తమ వ్యాపార రహస్యాలను దుర్వినియోగం చేసిందని, గోప్యమైన సమాచారంతో లబ్ధి పొందిందని ఆరోపించింది. టీసీఎస్ మొదటి నుంచి ఈ ఆరోపణలను ఖండిస్తూ వచ్చింది. తాము పొందిన సమాచారం రహస్యమైనది కాదని, చట్టబద్ధంగానే సాఫ్ట్‌వేర్‌ను యాక్సెస్ చేశామని వాదించింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.